

ఈనాడు



విజయవాడ 31-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 352

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఫామ్‌హౌస్‌లో మద్యం నోట్ల కట్టలు

12 అట్టపెట్టెల్లో రూ.11 కోట్లు లభ్యం • ఇదంతా ముడుపుల సొమ్మే

హైదరాబాద్ శివారులోని డెన్‌లో భద్రపరిచిన రాజ్ కెసిరెడ్డి

వరుణ్‌కుమార్ వాంగ్మూలంతో గుట్టురట్టు

అర్ధరాత్రి సోదాలు జరిపి, స్వాధీనం చేసుకున్న సిట్

మద్యం కుంభకోణంలో కీలక పరిణామం

ఈనాడు – అమరావతి
న్యూస్‌టుడే– శంషాబాద్

మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైకాపా మద్యం ముఠా కొల్లగొట్టిన ముడుపుల సొత్తులో రూ.11 కోట్లను సిట్ అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ మండలం కాచారంలోని సులోచన ఫామ్‌హౌస్‌లో ఈ అక్రమ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో భారీ ఎత్తున నగదు పట్టుబడటం ఇదే మొదటిసారి. అప్పట్లో వైకాపా ప్రభుత్వ పెద్దల తరఫున ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ నడిపిన రాజ్ కెసిరెడ్డి (ఏ1), అతని ప్రధాన అనుచరుడు బూనేటి చాణక్య (ఏ8).. వారి ముఠా సభ్యుడైన పురుషోత్తం వరుణ్‌కుమార్‌తో (ఏ40) ఈ సొత్తును ఫామ్‌హౌస్‌కు తరలించి అక్కడ భద్రపరిచినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. కొన్ని నెలల కిందట దుబాయ్‌కు పారిపోయిన వరుణ్‌కుమార్ రెండు రోజుల కిందట భారత్‌కు తిరిగొచ్చి సిట్ ఎదుట హాజరయ్యారు. మద్యం ముడుపుల సొమ్ము ఎలా వసూలు చేసేవారు? ఎవరికి చేర్చేవారు అనే అంశాలతో పాటు ఆ సొత్తును భద్రపరిచిన డెన్ గురించి వాంగ్మూలమిచ్చారు. దాని ఆధారంగా మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ప్రత్యేక బృందాలు వరుణ్‌ను వెంటబెట్టుకుని హైదరాబాద్‌లోని ఆ డెన్‌కు వెళ్లి సొత్తు స్వాధీనం చేసుకున్నాయి.

ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే వేరే డెన్‌లకు తరలింపు

అత్యధికంగా ఆర్డర్లు పొందిన డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి రూ.3,500 కోట్లకు పైగా ముడుపులు వసూలు చేసిన వైకాపా ముఠా.. ఆ అక్రమ సొత్తంతా తొలుత హైదరాబాద్, తాడేపల్లిలోని 7 డెన్‌లలో భద్రపరిచి వివిధ మార్గాల్లో అంతిమ లబ్ధిదారుకు చేర్చింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఓడిపోవటంతో.. ఈ ముఠా ఆయా డెన్‌లలోని కొంత డబ్బును దర్యాప్తు సంస్థలకు ఊహకు అందని, ఉనికి కనిపెట్టలేని స్థావరాలకు తరలించింది. అందులో భాగంగా రాజ్ కెసిరెడ్డి (మిగతా 10లో)

పాత సామగ్రి, చెక్క బీరువాల మధ్య..

సులోచన ఫామ్‌హౌస్‌లో సోదాలకు వెళ్లిన సిట్ అధికారులు గోదాములో పాత సామగ్రి, చెక్క బీరువాల మధ్య ఖాళీగా ఉన్న కొన్ని అట్టపెట్టెలను గుర్తించారు. వాటిని తొలగించగా.. కింద నగదుతో కూడిన అట్ట పెట్టెలు బయటపడ్డాయి. ఎవరైనా ఆ అట్టపెట్టెలను చూస్తే అందులో కాగితాలో, ఫైళ్లో ఉన్నాయనుకుని వాటి జోలికే వెళ్లరు. అందుకే మద్యం ముఠా వాటిని అక్కడ భద్రపరిచింది.



ఫామ్ హౌస్‌లో నోట్ల కట్టలు లెక్కపెడుతున్న సిట్ సిబ్బంది

భారత్‌పై 25% సుంకాలు

జరిమానాలు వీటికి అదనం ● ఆగస్టు 1 నుంచి అమల్లోకి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన ● రష్యాతో వాణిజ్య సంబంధాలపై తీవ్ర ఆక్షేపణ

దేశ ప్రయోజనాలు కాపాడుకుంటాం: భారత ప్రభుత్వం



వాషింగ్టన్: రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యకరమైన రీతిలో భారత్‌పై భారీ సుంకాల భారం మోపారు. భారత్ తమకు మిత్ర దేశమంటూనే అక్కడి నుంచి వచ్చే అన్ని రకాల వస్తువులపై 25 శాతం పన్నులు విధించారు. దీనికి అదనంగా జరిమానాలూ(పెనాల్టీలు) ఉంటాయని బుధవారం ప్రకటించారు. ఆగస్టు 1 నుంచి ఈ నిర్ణయం (మిగతా 10లో)

ఏపీ ప్రణాళికల్లో భాగస్వాములు కండి

సింగపూర్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు చర్చలు

మీ పెట్టుబడులు భద్రమని భరోసా

ఈనాడు, అమరావతి: సింగపూర్‌లో నాలుగో రోజు పర్యటన సందర్భంగా బుధవారం పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. 'ఏపీలో అపార వనరులున్నాయి. పెట్టుబడులతో వచ్చి రాష్ట్ర ప్రణాళికల్లో భాగస్వాములు కండి. మీ పెట్టుబడులకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది' అని వారికి భరోసా ఇచ్చారు.

స్థిరాస్తి రంగంలో అవకాశాలు

ఏపీలో పారిశ్రామిక, రియల్‌ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కేపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ఆసక్తి వ్యక్తం చేసింది. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లు, హరిత భవనాలు, డిజిటల్ టౌన్‌షిప్‌లలో పెట్టుబడులకు ఆ సంస్థ ప్రతినిధులు సంజీవ్ దాస్‌గుప్తా, (మిగతా 2లో)



కేపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) సీఈఓ సంజీవ్ దాస్‌గుప్తాతో సీఎం చంద్రబాబు

4 రోజులు.. 26 కార్యక్రమాలు

సింగపూర్‌లో బిజీగా గడిపిన చంద్రబాబు

పలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు

రాష్ట్రానికి చేరుకున్న సీఎం

2లో

ప్రతిష్ఠాత్మక కంపెనీలకు భూములు కేటాయిస్తే తప్పేంటి?

ప్రోత్సాహకాలివ్వకపోతే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయి?

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా లభ్యమవుతాయి?

పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

రాష్ట్రాభివృద్ధి ఆదిలోనే ఉన్నందున భూములు ఎంతకు ఇస్తున్నారో చూడకూడదు

టీసీఎస్ ఏర్పాటుతో 12 వేల ఉద్యోగ అవకాశాలు

ఆ సంస్థకు భూకేటాయింపు నిలిపివేసేలా ఇప్పుడు ఉత్తర్వులివ్వలేం



తేల్చిచెప్పిన ధర్మాసనం

ఈనాడు, అమరావతి: ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలు ఎలా వస్తాయని పిటిషనర్‌ను హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. ఏపీ అభివృద్ధి ప్రారంభ దశలో ఉందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో భూములు ఎంత ధరకు ఇస్తున్నారనే విషయాన్ని చూడకూడదంది. పరిశ్రమలను, పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు నామమాత్రపు ధరకు భూములు కేటాయిస్తున్నాయని, ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని వెల్లడించింది. ఐటీ అభివృద్ధితో బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలు ఎలా అభివృద్ధి చెందాయో చూస్తున్నాం కదా అని వ్యాఖ్యానించింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రతిష్ఠాత్మక కంపెనీలకు నామమాత్రపు ధరకు భూములు కేటాయిస్తే తప్పేంటని ప్రశ్నించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కంపెనీకి భూమి కేటాయించి ఉండొచ్చని తెలిపింది. విశాఖలో రూ.1,370 కోట్లతో టీసీఎస్ సంస్థ ఏర్పాటు చేయడం ద్వారా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గుర్తుచేసింది. టీసీఎస్‌కు లీజు విధానంలో భూమిని కేటాయిస్తున్నామని, ఆ భూమిని విక్రయించడం లేదని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఈ దశలో ప్రక్రియ నిలుపుదలపై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. టీసీఎస్‌కు భూకేటాయింపు వ్యవహారం ప్రస్తుత పిల్‌లో తాము ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని (మిగతా 10లో)

జంటగా తొలి విజయం

జీఎస్ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగం సక్సెస్

నిర్దేశిత కక్ష్యలోకి నైసార్ ఉపగ్రహం



నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్‌వీ వాహకనౌక

శ్రీహరికోట, న్యూస్‌టుడే: అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన తొలి అంతరిక్ష ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో, నాసా సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నైసార్) ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టామని, ఇది తిరుగులేని విజయమని ఇస్రో బుధవారం ప్రకటించింది. 27:30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి సాయంత్రం 5:40కి నైసార్‌ను తీసుకుని జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 19 నిమిషాల తర్వాత ప్రణాళిక ప్రకారం 745 కి.మీ. ఎత్తులో ఉన్న (మిగతా 10లో)



రష్యాలోని సఖాలిన్ ప్రాంతం సెవిరో కురిల్స్క్‌లో బుధవారం సునామీ అలలు చెలరేగి అల్లకల్లోలంగా మారిన సముద్ర తీరం

వణికించిన సునామీ

10లో

రష్యాలో భారీ భూకంపంతో ఎగసిపడ్డ రాకాసి అలలు

భూకంప తీవ్రత 8.8 ● జపాన్, అమెరికా సహా పలు దేశాలకు సునామీ హెచ్చరికలు

భయంతో పరుగులు పెట్టిన జనం ● ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న దేశాలు

లోపలి పేజీల్లో

ఏరోజుకారోజే శ్రీవాణి దర్శనం



ఆగస్టు 1 నుంచి ప్రయోగాత్మకంగా అమలు

3 జిల్లాల్లో పేద, బలహీనవర్గాలకు

ఇళ్ల స్థలాలు

విశాఖ, విజయనగరం, అనకాపల్లిల్లో 1,941 ఎకరాల భూ సమీకరణకు అనుమతి

తదుపరి చర్యలకు ఆదేశాలిచ్చిన పురపాలకశాఖ

ఆంక్షలు బేఖాతర్!

భారీ జన సమీకరణతో బల ప్రదర్శనకు వైకాపా సిద్ధం


నేడు నెల్లూరులో జగన్ పర్యటన

జైలులో కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్

మరో 7 నగరాల్లో స్మార్ట్ వీధి మార్కెట్లు

2లో

ఇదీ సంగతి!




యువ మెదడుకు ఉప్పెన చేటు!


బ్రెయిన్ స్ట్రోక్ అంటే...

మెదడుకు ఆక్సిజన్, పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం లేదా చిట్లడం వల్ల మెదడులోని కొంతభాగం దెబ్బతింటుంది. దీన్నే స్ట్రోక్‌గా పరిగణిస్తారు.

ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువకుడు హఠాత్తుగా ఆఫీసులో కుప్పకూలిపోయాడు. వైద్యులు ఇస్కీమిక్ బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించారు. గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్పించడం వల్ల ఆ యువకుడి ప్రాణాలు దక్కాయి. వేళాపాళా లేని పనిగంటలు, వృత్తిపరమైన ఒత్తిడి, నిద్రలేమి, జంక్‌ఫుడ్స్, మద్యం, ధూమపానం వల్ల చిన్న వయసులోనే స్ట్రోక్‌కు గురైనట్లు వైద్యులు తేల్చారు.

- ఒకప్పుడు పక్షవాతం అంటే...50-60 ఏళ్లు దాటిన వారిలో కనిపించే సమస్య. ప్రస్తుతం యువతలో పెరుగుతోంది.
- దేశంలో ఏటా 18 లక్షల (మిగతా 10లో)





(c) eenadu

మరో ఏడు నగరాల్లో స్మార్ట్ వీధి మార్కెట్లు

ప్రతిచోటా 20 నుంచి 200 దుకాణాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మరో ఏడు నగరాల్లో స్మార్ట్ వీధి వ్యాపార మార్కెట్లు ఏర్పాటు కానున్నాయి. ప్రతిచోటా 20 నుంచి 200 దుకాణాలను, డిజైన్ చేసిన కంటెయినర్లలో ఏర్పాటు చేయనున్నారు. వీటిల్లో సోలార్ ప్యానెళ్లు, ఉచిత వైఫై, డిజిటల్ లావాదేవీల వంటి ఆధునిక సదుపాయాలు ఉంటాయి. నెల్లూరులోని మైపాడు రోడ్డులో స్మార్ట్ వీధి వ్యాపార మార్కెట్‌ను ప్రారంభించేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తాజాగా అనంతపురం, కర్నూలు, తాడేపల్లి-మంగళగిరి, ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, కడపలలో కూడా మార్కెట్ల ఏర్పాటుకు పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు అనుమతిస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఒక్కో మార్కెట్‌కు రూ.1.80 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. దరఖాస్తులు స్వీకరించి అర్హులకు షాపులు కేటాయిస్తారు.

రేపటి నుంచి మలేసియాలో మంత్రి నారాయణ పర్యటన

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబుతో కలిసి సింగపూర్ పర్యటనకు వెళ్లిన పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ గురువారం కూడా అక్కడే ఉండనున్నారు. సింగపూర్ నుంచి శుక్రవారం బయలుదేరి మలేసియా పర్యటనకు వెళతారని మంత్రి కార్యాలయం బుధవారం తెలిపింది. ఆగస్టు 1, 2 తేదీల్లో మలేసియా ఆర్థిక రాజధాని పుత్రజయతోపాటు కౌలాలంపూర్‌లోని పలు ప్రాంతాల్లో మంత్రి పర్యటించనున్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై నారాయణ అధ్యయనం చేశారు. బుధవారం సింగపూర్‌లోని ఎస్‌జే సంస్థ కార్యాలయాన్ని సందర్శించి, అమరావతిలో పచ్చదనం పెంపు ప్రణాళికపై చర్చించారు. అనంతరం సింగపూర్‌లో శాండ్స్ ఎక్స్‌పో, కన్వెన్షన్ సెంటర్‌ను మంత్రి పరిశీలించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
నెం.32 నుండి 68/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 24.07.2025.
గ్రా.నీ.స & పా. విభాగము, నరసరావుపేట, పల్నాడు జిల్లా పరిధిలోని పి.ఎఫ్.సి.సి.ఎస్.ఆర్. ఫండ్స్ 75% గ్రాంట్ నందు మంజూరు కాబడిన 37 పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఆ పనుల అంచనా విలువ: రూ. 249.615 లక్షలు. టెండర్లు 04.08.2025 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
DIPR No.17142/CL/ADVT/1/1/2021-22 గ్రా.నీ.స. & పారిశుద్ధ్య విభాగము, నరసరావుపేట

ANDHRA PRADESH POWER DEVELOPMENT COMPANY LIMITED
E-PROCUREMENT NOTIFICATION
APPDCL invites Tenders for the following supplies at SDSTPS through AP e-procurement platform.

1.	M100028308	Supply of "BHEL"/"ABB"/"SIEMENS"/"KIRLOSKAR"/"MARATHON" make 3 Phase, 50Hz, SQUIRREL CAGE INDUCTION MOTOR (CEP MOTOR) for Stage-II of SDSTPS".
2.	M100027055	Supply of Electrolyzer for Electro Chlorination plant.
3.	M100028399	Supply of Orbinox make knife gate valves for AHP/Stg-II

For Further details, please visit: www.apgenco.gov.in OR https://tender.apeprocurement.gov.in
DIPR No. 4301PP/CL/Advt/1/1/2021-22 CHIEF ENGINEER/O&M/SDSTPS

తణుకు పురపాలక సంఘం
టెండరు నోటీసు
ఆర్.ఓ.సి.నెం. TNK Mplty/1684/32/2025/ఇ1 తేది: 30-07-2025
తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలుపబడుచున్నవి.

		ఇ.సి.వి (రూ. లక్షలలో)
1) రోడ్డు పనులు	3 నెం.లు	149.42
2) వాటర్ సప్లయి పనులు	1 నెం.	8.46
3) బిల్డింగ్ పనులు	1 నెం.	8.01
4) ఆట స్థలములు ఏర్పాటు	3 నెం.	52.71

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైటు నందు ది. 01-08-2025వ తేది నుండి చూడవచ్చును.
సం/- కమిషనరు, తణుకు పురపాలక సంఘం

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (APIIC)
(ఆం.ప్ర. ప్రభుత్వ రంగ సంస్థ)
ఎపిఐఐసి టవర్స్, 9వ మరియు 10వ అంతస్తులు, ప్లాటు నం-1, ఐటి పార్క్, మంగళగిరి, గుంటూరు (జిల్లా), ఏపీ-522503.
"ప్రతిపాదనలకు విజ్ఞప్తి"
ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ప్రాతిపదికన ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వాడల అభివృద్ధి, కార్యకలాపాలు మరియు నిర్వహణ కొరకు అభివృద్ధిదారుల ఎంపిక
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (APIIC), ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలలో ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వాడల (100 ఎకరాల వరకు గలవి)ను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ప్రాతిపదికన అభివృద్ధి, కార్యకలాపాలు మరియు నిర్వహణ కొరకు అభివృద్ధిదారుల ఎంపిక చేయాలని భావిస్తున్నది.
ఎపిఐఐసి, ఎంకంబరెన్సులు లేని భూమిని ఎంపిక చేయబడిన అభివృద్ధిదారులకు అందిస్తుంది మరియు ప్రాజెక్టు హద్దుల వరకు బయటి మౌలికసదుపాయాలకు హామీ ఇస్తుంది. ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వాడల సమగ్ర అభివృద్ధి, కార్యకలాపాలు, నిర్వహణలకు ఎంపిక చేయబడిన అభివృద్ధిదారులు బాధ్యత వహించాలి.
ఆయా ప్రతిపాదనల విజ్ఞప్తి (ఆర్ఎఫ్‌పి) డాక్యుమెంట్లలో తెలిపిన షెడ్యూలు ప్రకారం ప్రి-బిడ్ సమావేశాలకు హాజరు కావలసిందిగా ఆసక్తి గల బిడ్డర్లు ప్రోత్సహించబడుతున్నారు. ప్రతి ప్రాంతానికి వేరు వేరుగా ఆర్ఎఫ్‌పి జారీ చేయబడుతుంది మరియు వాటిని www.apeprocurement.gov.in or https://apiic.in/downloads-tenders/. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆర్ఎఫ్‌పి డాక్యుమెంట్‌లో సూచించిన ప్రతిపాదన ఆఖరి తేదీలోగా, సూచించిన నమూనాలో తమ ప్రతిపాదనలను బిడ్డర్లు విధిగా సమర్పించాలి. సం/- వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఎపిఐఐసి లిమిటెడ్
ఆర్ఎఫ్‌పి సంబంధ విచారణలు మరియు నిర్దేశనలకు దయచేసి ce-south@apiic.in ను చూడండి.

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Regd. Office: 10-152/1, 4th Floor, Sri Sai Towers, Besides SIRIS company, Bandar road, Vijayawada-520007
Tender No.PDS/QRs/Fine Rice/2025-26 Dated:30.07.2025
SHORT TERM TENDER NOTIFICATION
Empanelment and Appointment of suppliers for supply of "QR Code printed Security Seals (Zip Tags)" with packing @ 5000 to 10000 pieces per carton for tracking the rice filled in 50 Kg gunny bags and rice filled in 25 kg PP Bags to be supplied under the Schemes of Mid Day Meal (MDM), Hostels & Other Welfare Institutions of Government of Andhra Pradesh.
Interested tenderers may visit website www.apscscl.in or www.neml.in to view and download tender documents at free of cost.
Those who are interested to participate in tender can contact the Customer Service Group on phone numbers (+91-22) - 48810500 / 9962059599 / 9032429420 or Email: askus@neml.in. Last date for online registration and completion of formalities for submitting the online tenders shall be up to 05.08.2025 by 5.00 PM.
Sd/-
VC & MANAGING DIRECTOR

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (APIIC)
(ఆం.ప్ర. ప్రభుత్వ రంగ సంస్థ)
ఎపిఐఐసి టవర్స్, 9వ మరియు 10 అంతస్తులు, ప్లాటు నం-1, ఐటి పార్క్, మంగళగిరి, గుంటూరు (జిల్లా), ఏపీ-522503.
"ప్రతిపాదనలకు విజ్ఞప్తి"
ఆంధ్రప్రదేశ్‌లోని 15 ప్రాంతాలలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ప్రాతిపదికన పెద్ద పారిశ్రామిక వాడలను అభివృద్ధి, కార్యకలాపాలు మరియు నిర్వహణ కొరకు అభివృద్ధిదారుల ఎంపిక.
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ (APIIC), ఆంధ్రప్రదేశ్ అంతటా 15 (పదిహేను) ప్రాంతాలలో పెద్ద పారిశ్రామిక వాడలు (100 నుండి 500 ఎకరాల వరకు గలవి)ను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ప్రాతిపదికన అభివృద్ధి, కార్యకలాపాలు మరియు నిర్వహణ కొరకు అభివృద్ధిదారుల ఎంపిక చేయాలని భావిస్తున్నది.
ఎపిఐఐసి, ఎంకంబరెన్సులు లేని భూమిని ఎంపిక చేయబడిన అభివృద్ధిదారులకు అందిస్తుంది మరియు ప్రాజెక్టు హద్దుల వరకు బయటి మౌలికసదుపాయాలకు హామీ ఇస్తుంది. పెద్ద పారిశ్రామిక వాడల సమగ్ర అభివృద్ధి, కార్యకలాపాలు, నిర్వహణలకు ఎంపిక చేయబడిన అభివృద్ధిదారులు బాధ్యత వహించాలి.
ఆయా ప్రతిపాదనల విజ్ఞప్తి (ఆర్ఎఫ్‌పి) డాక్యుమెంట్లలో తెలిపిన షెడ్యూలు ప్రకారం ప్రి-బిడ్ సమావేశాలకు హాజరు కావలసిందిగా ఆసక్తి గల బిడ్డర్లు ప్రోత్సహించబడుతున్నారు. ప్రతి ప్రాంతానికి వేరు వేరుగా ఆర్ఎఫ్‌పి జారీ చేయబడుతుంది మరియు వాటిని www.apeprocurement.gov.in or https://apiic.in/downloads-tenders/. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆర్ఎఫ్‌పి డాక్యుమెంట్‌లో సూచించిన ప్రతిపాదన ఆఖరి తేదీలోగా, సూచించిన నమూనాలో తమ ప్రతిపాదనలను బిడ్డర్లు విధిగా సమర్పించాలి. సం/- వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, ఎపిఐఐసి లిమిటెడ్
ఆర్ఎఫ్‌పి సంబంధ విచారణలు మరియు నిర్దేశనలకు దయచేసి ce-south@apiic.in ను చూడండి.

GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
MACHILIPATNAM MUNICIPAL CORPORATION
'e'- PROCUREMENT NOTICE
Tender Notice No. 09/MMC/MGF/2025-26; Dt.29-07-2025

Number of works	Value of Works (Est)
Sl. No: 01 to 15	Rs. 1,20,25,000.00/-
Bid document Download starting Date	31.07.2025 @ 08:00 PM
Bid document Download End Date	08.08.2025 @ 10:00 AM
Last Date & time for Receipt of Bids	08.08.2025 @ 10:30 AM
Technical Bid opening date	08.08.2025 @ 11:00 AM

Name and Address: Municipal Commissioner, Machilipatnam Municipal Corporation Pin code No. 521 001. FAX: 08672-222856. Further details can be seen @ 'apeprocurement' market place www.apeprocurement.gov.in
Sd/- (CH.V.V.S.BAPIRAJU)
Municipal Commissioner
Machilipatnam Municipal Corporation

విశాఖ, విజయవాడల్లో ఐటీ, సాఫ్ట్‌వేర్ పార్కులు పెట్టండి

క్యాపిటాల్యాండ్ సీఈఓ దాస్ గుప్తాతో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, విజయవాడల్లో ఐటీ, సాఫ్ట్‌వేర్ పార్కులను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. సింగపూర్‌లో క్యాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ సంజీవ్‌దాస్ గుప్తాతో ఆయన భేటీ అయ్యారు. 'రాష్ట్రంలో గిడ్డంగులు, పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయండి. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించండి' అని అన్నారు. సంజీవ్‌దాస్ గుప్తా స్పందిస్తూ.. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

★ విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుకు పలు అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయని లోకేశ్ తెలిపారు. సింగపూర్‌లో ఆటోమ్ కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యానో టొమోకాజుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయండి. ఆటోమ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలకు విశాఖను ప్రాంతీయ కేంద్రంగా ఎంచుకోండి' అని సూచించారు. యానో టొమోకాజు స్పందిస్తూ.. భారత్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సహా పలు సేవలను అందించడంపై దృష్టి సారిస్తున్నామని, ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.



సింగపూర్‌లోని మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో మంత్రి నారా లోకేశ్

సెమీకండక్టర్, చిప్ డిజైన్ కేంద్రాలను పెట్టండి

సింగపూర్ షాంగ్రిలా హోటల్‌లో ఐవీపీ సెమీకండక్టర్ ఫౌండర్ రాజా మాణిక్కంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో సెమీకండక్టర్ పరికరాల తయారీ కేంద్రం, చిప్ డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. 'ఏపీలో సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ నిర్మాణ నైపుణ్యాన్ని ఉపయోగించి పరికరాల తయారీకి భాగస్వామ్య సరఫరాదారులుగా ఏపీ ఎంఎస్ఎంఈలకు సహకరించండి' అని అన్నారు. సహకార ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాజా మాణిక్కం చెప్పారు.

★ టీడీఎస్ గ్రూప్ సీఈఓ బీఎస్ చక్రవర్తితో లోకేశ్ భేటీ అయ్యారు. టీడీఎస్ పర్యావరణ వ్యవస్థ నిర్మాణ నైపుణ్యాన్ని ఉపయోగించి పరికరాల తయారీకి ఏపీ ఎంఎస్ఎంఈలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నెలకొల్పండి

ఏపీలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్/టెక్నాలజీ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. సింగపూర్ సెసిల్ స్ట్రీట్‌లోని మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను మంత్రి బృందం సందర్శించింది. మైక్రోసాఫ్ట్ ప్రభుత్వ వ్యవహారాల హెడ్ మార్కస్ లోహ్, సెలా హెడ్ జాస్మిన్ బేగం, మార్క్ సౌజాలతో లోకేశ్ భేటీ అయ్యారు. 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్కులో... మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఆధ్వర్యంలో 2026లో హ్యాకథాన్ నిర్వహించండి. మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ భాగస్వామ్యంతో జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ ఉత్పత్తుల్లో నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయడానికి ఏపీలోని టాలెంట్ పూల్‌ను ఉపయోగించుకోండి' అని సూచించారు. అనంతరం ఇన్ఫినియన్ సెమీకండక్టర్స్ ఉత్పత్తి యూనిట్‌ను లోకేశ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఇన్ఫినియన్ ప్రెసిడెంట్, ఎండీ సిహెచ్ చువాతో ఆయన భేటీ అయ్యారు. ఏపీలో పారిశ్రామిక పార్కుల్లో సెమీకండక్టర్ తయారీకి అనుబంధంగా ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు.

4 రోజులు.. 26 కార్యక్రమాలు

- సింగపూర్‌లో బిజీగా గడిపిన చంద్రబాబు
- సింగపూర్ ప్రభుత్వంతో చర్చలు
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం
- రాష్ట్రానికి బయలుదేరిన సీఎంకు తెలుగు ప్రజల వీడ్కోలు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు నాలుగు రోజుల సింగపూర్ పర్యటనలో 26 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను సందర్శించి.. రాష్ట్రంలో అమలుచేసేందుకు వీలుగా అధ్యయనం చేశారు. పెట్టుబడుల ఆకర్షణ.. ఏపీ బ్రాండ్ పెంచడమే లక్ష్యంగా సీఎం నాలుగు రోజుల సింగపూర్ పర్యటన బుధవారం రాత్రితో ముగిసింది. సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే సీఎం బృందానికి సహకరించారు. పర్యటనలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు.

పెట్టుబడుల కోసం పలు సమావేశాలు

★ సుర్బానా జురాంగ్, సెంబ్ కార్ప్, ఎస్ఐఏ ఇంజినీరింగ్, ఏఐ సింగపూర్, కెప్పెల్ కార్పొరేషన్, జీఐసీ, ఎస్ఎంబీసీ, కేపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, ఎవర్సెండై ఇంజినీరింగ్, టెమాసెక్, విల్మర్, టీవీఎస్ మోటార్స్, మండాయ్ వైల్డ్‌లైఫ్, అదానీ పోర్ట్స్ ప్రతినిధులతో సీఎం సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, పారిశ్రామిక అనుకూల విధానాల గురించి వివరించారు.

★ పట్టణాభివృద్ధి, ఐటీ, ఏఐ, ఫిన్‌టెక్, మారిటైం, పోర్టులు, మౌలిక సదుపాయాలపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొని.. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలను కోరారు.

★ సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక హౌసింగ్ ప్రాజెక్టు బిడదారి ఎస్టేట్, జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్, టువాస్ పోర్ట్, సింగపూర్ స్పోర్ట్స్‌స్కూల్‌ను సీఎం బృందం సందర్శించింది. వాటిలో అమలుచేస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేసింది.

సంబంధాల పునరుద్ధరణ కోసం..

సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మాజీ ప్రధాని, ప్రస్తుత సీనియర్ మంత్రి లీ సైన్ లూంగ్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి టాన్ సీ లాంగ్, భద్రత, హోం వ్యవహారాల మంత్రి కె.షణ్ముగంతో సమాలోచనలు జరిపి.. రాష్ట్రంతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడంలో సఫలీకృతం అయ్యారు. ఈ ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు రావాలని సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధుల్ని సీఎం ఆహ్వానించారు.

సీఎం బృందానికి తెలుగువారి ప్రేమాభిమానాలు

సింగపూర్ పర్యటన తొలిరోజు తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్‌ఈస్ట్ ఏషియా నిర్వహించిన సమావేశం విశేషంగా నిలిచింది. సీఎం బృందానికి తెలుగు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. బుధవారం పర్యటన ముగించుకుని రాష్ట్రానికి బయల్దేరిన సీఎంకు తెలుగు ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. తెలుగు ప్రజలు చూపిన ఆత్మీయత, ప్రేమాభిమానాలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

★ చంద్రబాబు బుధవారం రాత్రి 11.25 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు.



తనకు వీడ్కోలు పలకడానికి హోటల్‌కు వచ్చిన ప్రవాసాంధ్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



సమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్ తదితరులు

ఏపీ ప్రణాళికల్లో భాగస్వాములు కండి

(మొదటి పేజీ తరువాయి)

గౌరీశంకర్ నాగభూషణంలతో సీఎం చర్చించారు.

ఎకో పర్యాటకంలో మండాయ్ వైల్డ్‌లైఫ్ గ్రూప్ పెట్టుబడులు: విశాఖలో డాల్ఫిన్ సిటీ, అమరావతిలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు ప్రతిపాదనల్లో భాగస్వామి కావాలని మండాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సంస్థను సీఎం చంద్రబాబు కోరారు. వైల్డ్‌లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, జీవవైవిధ్య ప్రాంగణాలు, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ల ఏర్పాటుపై ఆ సంస్థ సీఈఓ మైక్ బార్క్లేతో చంద్రబాబు చర్చించారు.

శుద్ధ ఇంధన ప్రాజెక్టులపై ఎస్ఎంబీసీ ఆసక్తి: పరిశ్రమలు, మౌలిక వసతులు, హరిత విద్యుత్తు, నగరాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులపై జపాన్‌కు చెందిన సమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) మేనేజింగ్ ఈఓ రాజీవ్ కన్నన్‌తో సీఎం చర్చించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, శుద్ధ ఇంధన రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని రాజీవ్ కన్నన్ తెలిపారు.

ఏపీఐఐసీతో కలిపి పనిచేసేందుకు టెమాసెక్ ఆసక్తి: ఎంఎస్ఎంఈ రంగంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు టెమాసెక్ హోల్డింగ్స్ ఆసక్తి వ్యక్తం చేసింది. ఆ సంస్థ పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ విభాగం హెడ్ దినేష్ ఖన్నాతో సీఎం కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యారోగ్యం, సాంకేతిక, మౌలిక వసతుల కల్పన రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయి' అని తెలిపారు. ఒప్పందాలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామని ఖన్నా తెలిపారు.

ఎస్సీ ఎట్రాసిటీ కేసుల్లో పోలీసుల తీవ్ర నిర్లక్ష్యం

- మా దృష్టికి మూడు నెలల్లో 135 ఫిర్యాదులు
- వాటిలో ఎఫ్ఐఆర్ నమోదయింది 40 కేసుల్లోనే
- ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ అసహనం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో, ప్రస్తుత కూటమి హయాంలో ఎస్సీలపై వేధింపుల ఘటనలకు సంబంధించి గడిచిన మూడు నెలల్లో 135 ఫిర్యాదులు కమిషన్ దృష్టికి వచ్చాయని, ఇందులో పోలీసులు 40 ఘటనల్లోనే కేసులు నమోదు చేశారని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 13 ఫిర్యాదులొస్తే మూడింటి విషయంలోనే కేసులు నమోదు చేశారు. దీనికి జిల్లా స్థాయి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో దళితులు ఎలా ఇబ్బందిపడుతున్నారనే దానికి ఇదే నిదర్శనమన్నారు. 'సమసమాజ నిర్మాణమనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా కొంతమంది అడ్డుపడుతున్నారు. కొంతమంది పోలీసు అధికారులు కమిషన్‌ను తేలిగ్గా తీసుకుంటున్నారు. మా హక్కులను వినియోగించడం మొదలుపెడితే ఇబ్బందిపడతారు. ఏ ఫిర్యాదు వచ్చినా స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. కమిషన్ నుంచి పంపే వాటికి సవివర నివేదిక ఇవ్వాలి. ఎట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తప్పుడు సమాచారమిచ్చినా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం' అని స్పష్టం చేశారు. విజయవాడలోని కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. 'ఫిర్యాదుదారు తప్పుడు ఫిర్యాదు చేస్తే విచారించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలి. అంతే కానీ అసలు కేసులే పెట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించం. ఈ విషయంలో పోలీసులపై ఒత్తిడి చేసే నేతలపై కూడా ఎలా ముందుకెళ్లాలనే దానిపై కమిషన్ ఆలోచిస్తుంది' అని పేర్కొన్నారు.

లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైద్య పరీక్షలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య సంరక్షణ కోసం ఏడాది వ్యవధిలో లక్ష మందికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రముఖ డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ 'ఈ-వైద్య'తో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ హెల్త్ స్క్రీనింగ్ శిబిరాలు, టెలీ మెడిసిన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన బుధవారం ఓ ప్రకటనలో వివరించారు. 'వైద్య పరీక్షల అనంతరం సభ్యుల వారీగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను (ఈహెచ్ఆర్) క్లౌడ్-బేస్డ్ హెల్త్ డేటాతో అనుసంధానం చేస్తాం. రక్త హీనత, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్, మధుమేహం, థైరాయిడ్, కార్డియాలజీతోపాటు మానసిక సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే మహిళలను ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ ద్వారా స్పెషలిస్ట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించడంతోపాటు ఏడాది పాటు వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండేలా ఏర్పాట్లు చేస్తాం' అని పేర్కొన్నారు.

విజేందర్‌రెడ్డి, రాజ్ కెసిరెడ్డి.. విడదీయలేని బంధం

- ఇద్దరి మధ్య వ్యాపార, ఆర్థిక సంబంధాలు
- మద్యం ముడుపులు భద్రపరిచేందుకు వారి ఫామ్‌హౌస్ ఎంచుకున్నది అందుకే
- యూవీ పేరుతో డిస్టిలరీ ఏర్పాటు చేయించిన రాజ్ రెండేళ్లలో దానికి రూ.224 కోట్ల ఆర్డర్లు

ఈనాడు, అమరావతి: వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ తీగల విజేందర్‌రెడ్డి, కార్యదర్శి తీగల ఉపేందర్‌రెడ్డి.. మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి మధ్య విడదీయలేనంత వ్యాపార, ఆర్థిక సంబంధాలు పెనవేసుకుని ఉన్నాయి. ఈ సన్నిహిత సంబంధాల నేపథ్యంలోనే మద్యం ముడుపుల సొత్తును రాజ్ కెసిరెడ్డి వారి ఫామ్‌హౌస్‌లో భద్రపరిచారు. వైకాపా ప్రభుత్వ పెద్దల ప్రతినిధిగా మద్యం సరఫరా ఆర్డర్ల జారీ ప్రక్రియను తన గుప్పిట్లో పెట్టుకున్న రాజ్ కెసిరెడ్డి 2021 జూన్‌లో ఉపేందర్‌రెడ్డి (యూ), విజేందర్‌రెడ్డి (వీ)లతో యూవీ డిస్టిలరీస్ పేరిట ఓ మద్యం సరఫరా కంపెనీ పెట్టించారు. దీనికి సొంత డిస్టిలరీలు లేవు. అయినా ఇతర డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని వాటిలో యూవీ డిస్టిలరీస్ పేరుతో బ్రాండ్లు తయారు చేయించారు. ఈ కంపెనీ పూర్తిగా రాజ్ కెసిరెడ్డి చెప్పుచేతల్లో ఉండేది. ఆయన తరఫున బూనేటి చాణక్య ఆ కంపెనీ రోజువారీ కార్యకలాపాలన్నీ పర్యవేక్షించేవారు. 2021-23 మధ్య ఈ కంపెనీకి ఏపీఎస్‌బీసీఎల్ ఏకంగా రూ.224 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టింది. మిగతా కంపెనీల మాదిరిగానే ఈ డిస్టిలరీ కూడా నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులుగా రూ.29 కోట్లు చెల్లించింది.

విజేందర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఆసుపత్రిలో.. రాజ్ కెసిరెడ్డి భార్య పెట్టుబడులు

తీగల విజేందర్‌రెడ్డి ప్రముఖ వైద్యుడు. శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలకు ఛైర్మన్‌గా, గచ్చిబౌలిలోని అరేట్ ఆసుపత్రిలో పూర్తికాలపు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. రాజ్ కెసిరెడ్డి భార్య పైరెడ్డి దివ్యారెడ్డి ఈ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టారు. 2022 జూన్ నుంచి ఆమె అందులో డైరెక్టర్‌గా ఉన్నారు. రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు, మద్యం కుంభకోణం కేసు నిందితుడైన బూనేటి చాణక్యతో కలిసి హైదరాబాద్‌లో టీ గ్రిల్స్ రెస్టారెంట్ వీరు నిర్వహిస్తున్నారు. రాజ్ కెసిరెడ్డి, విజేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డిలు కలిసి ఇంకా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సిట్ అధికారులు గతంలో పలుమార్లు అరేట్ ఆసుపత్రిలో, టీ గ్రిల్స్ రెస్టారెంట్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించడం గమనార్హం.

ప్రకాశం బ్యారేజీకి 1.38 లక్షల క్యూసెక్కుల వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎగువ నుంచి వరద పోటెత్తుతుండటంతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ కళకళలాడుతోంది. బుధవారం రాత్రి 10 గంటలకు 1,38,554 క్యూసెక్కుల వరద రాగా 35 గేట్లను మూడు అడుగులు, మిగతా 35 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,21,625 క్యూసెక్కులు విడుదల చేశారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.



విశ్రాంతి అంటే ఖాళీగా ఉండటం కాదు

సమస్యలను పరిష్కరించినప్పుడు, ఏదైనా లక్ష్యాన్ని సాధించినప్పుడు, కుటుంబంతో గడుపుతున్నప్పుడు నా అలసట మొత్తం మాయమవుతుంది. అందుకే ప్రత్యేకంగా విశ్రాంతి తీసుకోవాలని అనిపించదు. చాలా మంది విశ్రాంతి అంటే ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండటమని అనుకుంటారు. ఆ తప్పుడు భావనను వదిలిపెట్టండి. సమయాన్ని వృథా చేసుకోకుండా మీలో నూతనోత్తేజం కలిగించే అంశాలపై దృష్టిపెట్టండి.

– జెన్సెన్ హువాంగ్, వ్యాపారవేత్త

'చివర్లో హడావుడి పడితే ప్రాజెక్టులు పూర్తికావు'

ఈనాడు, అమరావతి: 'మొదట్లో సమయం వృథా చేసుకుని చివర్లో హడావుడి పడితే ప్రాజెక్టులు పూర్తికావు. డయాఫ్రం వాల్ పనుల్లో లక్ష్యానికి ఎంత తక్కువలో ఉన్నామో. . ఆ పనంతా ఆగస్టులో పూర్తి చేయాలి. డిసెంబరు చివరి నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి చేయాల్సిందే' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. 'ఏ రోజుకు ఆ రోజు లక్ష్యం ప్రకారం పనులు చేయాలి. జులైలో సరిగా పనులు చేయకుండా సమయాన్ని వృథా చేశారు. వారం రోజుల్లో నేను పోలవరం వస్తా. . అప్పటికి అంతా సరిదిద్దాలి' అని అధికారులతో జరిగిన సమీక్షలో స్పష్టం చేశారు.

జైలులో కెసిరెడ్డి వంట పిటిషన్ డిస్మిస్

ఈనాడు, అమరావతి: తాను రిమాండ్‌లో ఉన్న విజయవాడ జిల్లా జైలులో వంట చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలనే రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. నిందితుడు ఈ మేరకు విజయవాడలోని అనిశా కోర్టులో గత వారం పిటిషన్ దాఖలుచేసిన సంగతి తెలిసిందే. ఇది బుధవారం విచారణకు వచ్చింది. దీనిని డిస్మిస్ చేస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు తీర్పు వెలువరించారు.

గ్రహం అనుగ్రహం

31-7-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
సప్తమి: తె. 3-53 తదుపరి అష్టమి
చిత్త: రా. 12-51 తదుపరి స్వాతి
వర్జ్యం: ఉ. 7-19 నుంచి 9-04 వరకు
అమృత ఘడియలు: సా. 5-50 నుంచి 7-35 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-58 నుంచి 10-49 వరకు తిరిగి మ. 3-05 నుంచి 3-57 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.42; సూర్యాస్తమయం: సా.6.31

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.5	26.0
నెల్లూరు	37.4	29.0
తిరుపతి	36.2	27.0
గుంటూరు	36.0	28.0
తాడేపల్లిగూడెం	35.7	27.6
విజయవాడ	35.5	26.4
ఒంగోలు	35.4	27.8
విశాఖపట్నం	35.0	27.6
విజయనగరం	35.0	27.0
కడప	35.0	26.0
నరసాపురం	34.3	24.2
ఆదిలాబాద్	33.8	22.7
అనంతపురం	33.1	24.3
శ్రీకాకుళం	32.0	28.0
కర్నూలు	31.8	24.6
హైదరాబాద్	29.7	22.5

ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో భారీగా సీట్లు ఖాళీ

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా), కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లో పెద్దమొత్తంలో సీట్లు మిగిలిపోయాయి. ఐఐటీలు సహా మొత్తం 127 సంస్థల్లో కలిపి 62,853 సీట్లకు ఇటీవల జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆరు విడతల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐఐటీలు మినహా మిగిలిన సంస్థల్లో పెద్దఎత్తున సీట్లు ఖాళీగా మిగిలాయి. వాటిని భర్తీ చేసేందుకు సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డు పేరిట ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. ఈ విద్యాసంవత్సరానికి ఎన్ఐటీ రూర్కెలా ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఖాళీల వివరాలను బుధవారం వెల్లడించారు. దేశవ్యాప్తంగా 4 వేల సీట్ల వరకు మిగిలిపోయినట్లు అంచనా. వరంగల్ ఎన్ఐటీలో హోం, ఓపెన్ కోటాలో 141 సీట్లు మిగిలిపోయాయి.



కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ టీసీడీ శేఖర్ (ఎడమ నుంచి కుడికి)

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ

ఈనాడు, అమరావతి: వివాహ, వ్యాపార సంబంధ వివాదాలకు మధ్యవర్తిత్వం మంచి పరిష్కార మార్గమని ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ పేర్కొన్నారు. మధ్యవర్తి సమక్షంలో జరిగే చర్చలు గోప్యంగా ఉంటాయని, తద్వారా లభించే పరిష్కారం శాశ్వతమైనదని తెలిపారు. దేశ వ్యాప్తంగా 90 రోజులుగా కొనసాగుతున్న మీడియేషన్ ఫర్ నేషన్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన హైకోర్టు న్యాయవాదులకు బుధవారం ఒకరోజు దిశానిర్దేశం (ఓరియంటేషన్) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మధ్యవర్తిత్వంలో మెలకువలు నేర్చుకుని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో సాయపడాలని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయ సేవల కమిటీ అధ్యక్షుడు, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, కోర్టు ఫీజులను తిరిగి పొందొచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ టీసీడీ శేఖర్, సీనియర్ ట్రైనర్లు అనుజా సక్సేనా, ఎస్.అరుణాచలం పాల్గొన్నారని ఏపీ హైకోర్టు న్యాయ సేవల కమిటీ డైరెక్టర్ జి. మాలతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనులకు రగ్గులు పంపిన పవన్‌కల్యాణ్



డిప్యూటీ సీఎం పంపించిన రగ్గులతో గిరిజనులు

పార్వతీపురం, మక్కువ, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెయ్యి రగ్గులను పంపినట్లు జిల్లా [illegible] తెలిపారు. మక్కువ మండలంలో గతంలో పల్లె పండగ కార్యక్రమానికి వచ్చిన పవన్‌కల్యాణ్.. పలు గ్రామాల ప్రజలతో మాట్లాడి, వారి అవసరాలు తెలుసుకొని, ఆ మేరకు ప్రస్తుతం రగ్గులను పంపించారన్నారు. వీటిని బుధవారం సిరివర, బాగుజోల, చిలకమెండంగి, బందమెండంగి, డొయివర, తాడిపుట్టి గ్రామాల్లోని 222 కుటుంబాలకు పంపిణీ చేసినట్లు వివరించారు.

సీమలో కోటలు, దేవాలయాలకు గుర్తింపు తెస్తాం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవీఎన్ మాధవ్. చిత్రంలో పార్టీ నాయకులు చిరంజీవిరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, రాజేశ్ తదితరులు

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: రాయలసీమ జిల్లాల అభివృద్ధికి 2007లో తీర్మానించిన 26 అంశాలను త్రికరణ శుద్ధిగా అమలు చేస్తే సస్యశ్యామలంగా మారుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో బుధవారం భాజపా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యక్షుడయ్యాక తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఆయన పార్టీ బలోపేతానికి పలు సూచనలు, సలహాలు చేశారు. రాయలసీమ జిల్లాల సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అభివృద్ధి చేస్తామని వివరించారు. గుత్తి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, పెనుకొండ, కదిరి, లేపాక్షి, తాడిపత్రి ప్రాంతాల్లో ఉన్న కోటలు, దేవాలయాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే విషయమై కేంద్రంతో చర్చిస్తామన్నారు. ప్రతి పంచాయతీకీ రూ.10 కోట్ల కేంద్ర నిధులను ఇచ్చి ప్రగతికి బాటలు వేసిన ఘనత భాజపాకే దక్కుతుందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... కమలం వికాసానికి నాంది పలకాలన్న లక్ష్యంతోనే మాధవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారన్నారు.

తమిళనాడు భాజపా ఉపాధ్యక్షురాలిగా ఖుష్బూ



సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు భాజపా ఉపాధ్యక్షురాలిగా ప్రముఖ సినీ నటి ఖుష్బూ నియమితులైనట్లు బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ ప్రకటించారు. 2020లో ఆమె భాజపాలో చేరారు. పార్టీ పనుల్లో చురుగ్గా పాల్గొనేందుకు జాతీయ మహిళ కమిషన్ పదవికి గతేడాది ఆగస్టులో రాజీనామా చేశారు.



వ్యాయామంతో ఆ నష్టాన్ని భర్తీ చేయలేం

పొద్దున జిమ్‌కు వెళ్లి ఆ తర్వాత రోజంతా కూర్చుంటే అది చురుకైన జీవనశైలి కాదు. గంటల తరబడి కూర్చోవడం వల్ల కలిగే నష్టాన్ని ఉదయం గంట సేపు చేసే వ్యాయామంతో భర్తీ చేయలేం. మిగిలిన సమయంలోనూ శరీరాన్ని చురుగ్గా కదిలిస్తుంటేనే ఫలితం ఉంటుంది.

– మెకెంజీ స్మిత్, ఫిట్‌నెస్ కోచ్

ఆంక్షలు బేఖాతర్!

ఈనాడు, నెల్లూరు: జగన్ పర్యటన అంటేనే అటు అధికారులు... ఇటు స్థానికులు వణికిపోతున్నారు. పోలీసుల ఆంక్షలను పట్టించుకోకపోవడం.. భారీగా జనాన్ని తరలించి బల ప్రదర్శన చేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికే అనంతపురం జిల్లా రాప్తాడు, ప్రకాశం జిల్లా పొదిలి, పల్నాడు జిల్లా రెంటపాళ్ల, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనల్లో ఆంక్షలను ధిక్కరించారు. నెల్లూరు పర్యటనలోనూ గురువారం అదే పునరావృతం చేస్తున్నారు. జగన్ పర్యటనకు ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్ ఆంక్షలతో కూడిన అనుమతినిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హెలిప్యాడ్ వద్ద 10 మంది, జైలు దగ్గర ములాఖత్‌కు ముగ్గురు, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి దగ్గర 100 మందికి మించి అనుమతించకూడదని స్పష్టంచేశారు. నిబంధనల్ని ఉల్లంఘించే వారిపై చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ జగన్ పర్యటనల్లో చోటుచేసుకున్న అలజడుల నేపథ్యంలో ముందస్తు నియంత్రణ చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

నాడు వద్దని ఇప్పుడక్కడే హెలిప్యాడ్

జైలులో ఉన్న గోవర్ధన్‌రెడ్డిని కలిసేందుకు, తర్వాత ఆయన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు ఈ నెల 3నే నెల్లూరుకు జగన్ రావాల్సి ఉంది. అప్పుడు చెముడుగుంటలో హెలిప్యాడ్ ఏర్పాటుకు పోలీసులు స్థలం చూపించారు. అది జైలుకు దగ్గరగా ఉండటంతో.. బల ప్రదర్శనకు అవకాశం ఉండదని వైకాపా నాయకులు భావించారు. చుట్టూ ముళ్లపొదలు, రెండువైపులా హైటెన్షన్ తీగలున్నాయని, అప్రోచ్‌రోడ్డు లేని స్థలాన్ని చూపారంటూ అభ్యంతరం తెలిపారు. వేరేచోట స్థలాన్ని ఇవ్వాలని కోరగా పోలీసులు అనుమతించలేదు. దీంతో జగన్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అప్పట్లో పోలీసులు చూపిన స్థలంలోనే ప్రస్తుతం హెలిప్యాడ్ ఏర్పాటుకు వైకాపా నాయకులు ఒప్పుకోవడం గమనార్హం. బల ప్రదర్శనకు అనువుగా ఉంటుందని ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆయన ఇంటికే వెళ్లి పరామర్శించేలా పర్యటనను జగన్ సిద్ధం చేసుకున్నారు. జైలు నుంచి బయల్దేరి నెల్లూరులో సుమారు 8 కి.మీ. రోడ్డుమార్గంలో జగన్ ప్రయాణించనున్నారు.



భారీ జన సమీకరణకు ఏర్పాట్లు

నెల్లూరులోని ఒక్కో వార్డు నుంచి 200-300 మందిని సమీకరించేందుకు వైకాపా నాయకులు ఏర్పాట్లు చేశారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల నుంచీ జనాల్ని తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. వీరందరినీ గురువారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరు రూరల్ పరిధిలోని కరెంటు ఆఫీసు సెంటర్‌కు చేరుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఇంకోవైపు కావలి, ఉదయగిరి, ఆత్మకూరుల నుంచీ జనాన్ని తీసుకురావాలని నాయకులకు ఆదేశాలందాయి.

అక్కడ భక్తులకు ఇబ్బందులు తప్పవా?

గురువారం ఉదయం 10-10.30 మధ్య చెముడుగుంట సమీపంలోని హెలిప్యాడ్‌కు జగన్ చేరుకోనున్నారు. అక్కడి నుంచి జైలుకెళ్లి కాకాణిని కలవనున్నారు. తర్వాత బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి సెంటర్, కరెంటాఫీసు సెంటర్, జీజీహెచ్ మీదుగా సుజాతనగర్‌లోని ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుంటారు. ఈ మార్గంలో రాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో రెండు రోజులుగా పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్నాయి. 11.25 గంటలకు మహాకుంభాషేకం జరగనుంది. జగన్ పర్యటనకు భారీగా జనాన్ని సమీకరిస్తే... ఈ ప్రాంతంలో భక్తులకు నరకం తప్పదు. పక్కనే ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఉంది. నిత్యం రోగులు, అత్యవసర చికిత్స కోసం క్షతగాత్రులు వస్తుంటారు. పెద్దఎత్తున ట్రాఫిక్ పెరిగితే వారికీ ఇబ్బందులు తప్పవు.

బ్యాంకింగ్ పరీక్షలపై ఉచిత వెబినార్

ఐబీపీఎస్/బ్యాంకు నియామక పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం ఈనాడు-చదువు, T.I.M.E. సంస్థల ఆధ్వర్యంలో ఆగస్టు 3న (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్ జూమ్ ప్లాట్‌ఫామ్‌పై జరుగుతుంది.

బ్యాంకు పరీక్షల కోచింగ్‌లో అనుభవమున్న అధ్యాపకులు, సంబంధిత నిపుణులు దీనిలో పాల్గొంటారు.

T.I.M.E.
Triumphant Institute of Management Education Pvt. Ltd.

ఐబీపీఎస్/బ్యాంకు పరీక్షల్లో కీలక అంశాలు, ప్రిపరేషన్ మెలకువలు, బ్యాంకింగ్ కెరియర్ ప్రత్యేకతలు, విభిన్న అవకాశాలు తదితర అంశాలపై నిపుణులు సలహా సూచనలు అందిస్తారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఐబీపీఎస్/బ్యాంకు పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు బ్యాంకింగ్ కెరియర్‌పై అవగాహన పెంపొందించుకోవాలనుకునే వారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే..

03.08.2025 (ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా
● https://bit.ly/ibpsbankwebinar వెబ్‌లింకు ఓపెన్ చేయండి.
● zoom id - 964 3525 4688
passcode - 072703 తో జాయిన్ కావచ్చు.

అమరావతిలో రెండో విడత భూ సమీకరణపై త్వరలో చర్చావేదిక

సీఎఫ్‌డీ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత అధికారి నిమ్మగడ్డ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణపై సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ (సీఎఫ్‌డీ) ఆధ్వర్యంలో త్వరలో చర్చావేదిక ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తెలిపారు. 'రాజధాని నిర్మాణం అత్యంత ప్రాధాన్యమైన అంశమే. ఇందులో రెండో అభిప్రాయానికి తావులేదు. అయితే రెండో విడత భూ సమీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎఫ్‌డీ తరఫున దీనిపై చర్చావేదిక పెట్టాలని భావిస్తున్నాం. ఇదే విషయాన్ని పురపాలకశాఖ మంత్రి నారాయణ దృష్టికి కూడా తీసుకెళ్లాం' అని ఆయన బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. 'గతంలో పెద్దఎత్తున సమీకరించిన భూమి ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉండగా.. ఏ అవసరాలకు మళ్లీ భూ సమీకరణ అవసరమనే అంశంపై సమగ్ర సమాచారం, వివరణ కొరవడింది. గతంలో సమీకరించిన భూమిని అభివృద్ధి చేసి ఆ ఫలితాలు లబ్ధిదారులకు అందజేసిన తరవాతే రెండో విడత సేకరణ చేయవచ్చన్న భావనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రాలేదు' అని రమేశ్‌కుమార్ అన్నారు. 'రెండో విడత భూ సమీకరణపై ఏర్పాటు చేసే చర్చావేదిక ద్వారా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడానికి, ఏకాభిప్రాయ సాధనకు మార్గం సుగమం అవుతుందని విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఏదైనా గుర్తింపు కార్డుతో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు

- ఆర్టీసీ ఛైర్మన్ నారాయణ

గుంటూరు (పట్నంబజారు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని మహిళలు తమ ఆధార్, ఓటరు, పాన్ కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ తెలిపారు. బుధవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ ద్వారకా తిరుమలరావుతో కలిసి మాట్లాడారు. కొత్త బస్సులు వచ్చే వరకు ప్రస్తుతం ఉన్నవాటితే ఉచిత ప్రయాణ పథకాన్ని విజయవంతం చేస్తాం. బస్సు టైమింగ్స్, సిబ్బంది డ్యూటీ సమయంలో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. 'జోన్-3 పరిధిలోని గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల డిపో మేనేజర్లు, అధికారులతో సమావేశమై మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాం. ఈ పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయొచ్చు. వచ్చే క్యాబినెట్ సమావేశం తర్వాత విధివిధానాలపై పూర్తి స్పష్టత వస్తుంది.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు. చిత్రంలో ఛైర్మన్ నారాయణ, జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

త్వరలో 1,050 కొత్త బస్సులు రానున్నాయి. ప్రతి ఏడాది కొత్త ఎలక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకం అమలు కోసం ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని బస్‌స్టేషన్లనూ ఆధునికీకరించాం. మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి వసతులపై దృష్టి పెట్టాం. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చు' అని పేర్కొన్నారు. సమావేశంలో జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, ఆర్టీసీ ఇన్‌ఛార్జి ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం, ఈడీ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'అల్‌ఖైదా'కు ఆమె వెన్నుదన్ను

బెంగళూరులో అరెస్టు.. అహ్మదాబాద్ తరలింపు

బెంగళూరు/గ్రామీణం, న్యూస్‌టుడే: అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద గ్రూపునకు సూత్రధారి, కీలక కుట్రదారులిగా భావిస్తున్న షామా పర్వీన్ (30) అనే మహిళను గుజరాత్ 'యాంటీ టెర్రరిజం స్క్వాడ్' బెంగళూరులో అరెస్టు చేసింది. నిందితురాలిని బుధవారం అహ్మదాబాద్ తరలించారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారిని గుర్తించేందుకు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఆమె ఆనుపానులు తెలుసుకున్నట్లు సమాచారం. జులై 23న ఈ గ్రూప్‌తో సంబంధమున్న మహమ్మద్ ఫర్దీన్, సెపుల్లా ఖురేషి, జీషన్ అలీ, మహమ్మద్ ఫైక్‌లను గుజరాత్, దిల్లీ, నోయిడాలలో అరెస్టు చేశారు. వీరంతా సామాజిక మాధ్యమంలోని ఓ రహస్య యాప్ ద్వారా సంప్రదింపులు చేస్తున్నట్లు గుర్తించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ గ్రూప్ సభ్యులున్నారని, వీరందరికీ షామా పర్వీన్ నాయకత్వం వహిస్తున్నట్లు విచారణలో తేలింది. పలు రాష్ట్రాల్లో వీరు ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించినట్లు తెలిసింది. ఈ గ్రూపునకు చెందిన ఇతర మద్దతుదారుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఝార్ఖండ్‌కు చెందిన షామా పర్వీన్ నాలుగేళ్లుగా బెంగళూరులో ఉంటోందని, అంతకు ముందు హైదరాబాద్‌లోనూ నివసించిందని అధికారులు తెలిపారు. అల్‌ఖైదా ఆపరేటివ్ వీడియోను కూడా ఆమె షేర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఇంటర్వ్యూల కోసం ప్రకటన

సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను

కింది అర్హతలు కలిగిన నైపుణ్యవంతులైన సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం మేము ఎదురు చూస్తున్నాము:
- సేల్స్ విభాగంలో 3-4 సంవత్సరాల అనుభవం
- మార్కెటింగ్‌లో బలమైన అనుభవం
- ENT లేదా మెడికల్ పరికరాల ఫీల్డ్‌లో ముందస్తు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం

31.07.2025 నుండి 03.08.2025 వరకు
10 AM నుండి 7 PM వరకు

బ్లాక్ నం. 18. STS No. 1144
ఏలూరు రోడ్డు, విజయా టాకీస్ దగ్గర
సూర్యారావుపేట, విజయవాడ 520 002
82705 92705
Email ID: hr.hezap@gmail.com

ఏరోజుకారోజే శ్రీవాణి దర్శనం

- ఆగస్టు 1 నుంచి ప్రయోగాత్మకంగా అమలు
- తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవాణి దర్శన టికెట్లను ఆఫ్‌లైన్‌లో పొందిన భక్తుల సౌకర్యార్థం దర్శన సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. శ్రీవాణి దర్శనాలపై స్థానిక గోకులం సమావేశ మందిరంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఆగస్టు 1 నుంచి 15 వరకు ఏరోజుకారోజు శ్రీవాణి దర్శనం టికెట్లను ఆఫ్‌లైన్‌లో జారీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానంలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో 1,500 టికెట్లు ఇస్తుండగా... శ్రీవాణి దర్శనానికి 3 రోజుల సమయం పడుతోంది. కొత్త పద్ధతిలో టికెట్ల సంఖ్యలో మార్పు ఉండదు కానీ.. దర్శన వేళలను మారుస్తారు. వచ్చిన రోజే శ్రీవారిని దర్శించుకునే వెసులుబాటు భక్తులకు కలుగుతుంది. తిరుమలలోని శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన 800 టికెట్లిస్తారు. రేణిగుంట విమానాశ్రయంలో ఉదయం 7 గంటల నుంచి దర్శన టికెట్ల కోటా ఉన్నంత వరకు 200 జారీ చేస్తారు. ఈ వెయ్యి టికెట్లను పొందిన వారికి స్థానిక వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు రిపోర్టింగ్ సమయం కేటాయిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి. చిత్రంలో అధికారులు

వీటికి అదనంగా ఆన్‌లైన్‌లో యథావిధిగా రోజుకు 500 టికెట్లు ఇస్తారు. ఇలా అడ్వాన్స్ బుకింగ్‌లో అక్టోబరు 31 వరకు ఆన్‌లైన్ టికెట్లు పొందిన భక్తులను ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతిస్తారు. నవంబరు 1 నుంచి ఆఫ్‌లైన్‌లోనూ, ఆన్‌లైన్‌లోనూ శ్రీవాణి టికెట్లను పొందిన భక్తులను సాయంత్రం 4.30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 ద్వారా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.



3 జిల్లాల్లో పేద, బలహీనవర్గాలకు ఇళ్ల స్థలాలు

ఈనాడు, అమరావతి: పేదలు, బలహీనవర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో భూ సమీకరణ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మూడు జిల్లాల్లో మొత్తం 1,941.19 ఎకరాలు సమీకరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) పరిధిలో భూ సమీకరణ కోసం విశాఖ కలెక్టర్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించిన కమిటీ ఇటీవల నివేదిక ఇచ్చింది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని ఆరు మండలాల్లో అందుబాటులో ఉన్న భూముల వివరాలను నివేదికలో పేర్కొంది. పరిశీలించిన ప్రభుత్వం తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు అనుమతిస్తూ విశాఖపట్నం జిల్లాలో భూ సమీకరణకు భీమునిపట్నం ఆర్డీవోకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. విజయనగరం, అనకాపల్లిలో ఆయా జిల్లాల ఆర్డీవోలకు అధికారాలు కల్పించారు.

భూ సమీకరణ ఎక్కడెక్కడ అంటే..

✦ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలో గిడిజాల, శొంఠ్యాం, బీడీపాలెం, పద్మనాభం మండలం కొవ్వాడలో మొత్తం 1,132.09 ఎకరాలు
✦ విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస, భోగాపురం మండలం రావాడలో 25.41 ఎకరాలు
✦ అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలో అంతకాపల్లి, బాటజంగాలపాలెం, ఎ.శిరసపల్లి, నల్లరేగుడుపాలెం, పైడివాడ అగ్రహారం, అనకాపల్లి మండలం తగరంపూడిలో మొత్తం 783.69 ఎకరాలు
✦ భూ సమీకరణ పథకంలో సేకరించిన భూములు అభివృద్ధి చేశాక ఎసైన్డ్ భూములపై ఎకరాకు 900 చదరపు గజాల ప్లాట్ కేటాయిస్తారు.
✦ పదేళ్లకుపైగా ఆక్రమణలో ఉన్న భూములపై ఎకరాకు 450 చదరపు గజాల ప్లాట్ ఇస్తారు.

క్వార్ట్జ కంపెనీ ఏర్పాటును విరమించుకుంటున్నా

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటన
- మంచి చేద్దామనుకుంటే.. దోచుకున్నానని వేధిస్తున్నారంటూ ఆవేదన

ఈనాడు, నెల్లూరు: 'నెల్లూరు జిల్లాలో పరిశ్రమ నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పిద్దామనే ఉద్దేశంతో క్వార్ట్జ్‌కు సంబంధించిన ఫ్యాక్టరీ ఏర్పాటు చేశా. రూ.400 కోట్ల పెట్టుబడితో నెలకొల్పే ఈ పరిశ్రమ పూర్తయితే 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించేవి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లా. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. దాంతో ప్రత్యేక బృందాన్ని చైనాకు పంపించడంతో పాటు సైదాపురం, పొదలకూరుల్లో లభ్యమయ్యే ఖనిజాన్ని కొంతమేర పరీక్షల నిమిత్తం చైనాకు పంపించాం. నేను క్వార్ట్జ్‌లో దోచుకున్నానని కొందరు వ్యక్తులు నాపై ఉద్దేశపూర్వకంగా పదేపదే నిందలు వేస్తున్నారు. అందుకే పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకుంటున్నా' అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడారు. 'నెల్లూరు జిల్లాలో లభ్యమయ్యే క్వార్ట్జ్‌ను చైనాలో హైప్యూరిటీ క్వార్ట్జ్ శాండ్‌గా మారుస్తారు. సోలార్, క్రూజబుల్స్ తయారీకి వినియోగిస్తారు. మన దగ్గర అలాంటి కంపెనీలు లేవు. ఆ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఇక్కడివారికి ఉపాధి దొరుకుతుందని భావించా. లక్ష్మీ క్వార్ట్జ్, ఫిని క్వార్ట్జ్ పేరుతో రెండు కంపెనీలు పెట్టా. గత ఏడాదిలో చెన్నై నుంచి చైనాకు 1.60 లక్షల టన్నులు ఎగుమతి చేస్తే.. అందులో మేం చేసింది 19,689 టన్నులే. కానీ కొందరు వ్యక్తులు మేం రూ.కోట్లు దోచుకున్నామని ఆరోపిస్తున్నారు. అసలు ఏడాదికి నా టర్నోవర్ ఎంత? క్వార్ట్జ్‌పై వచ్చే డబ్బులు నాకు ఏపాటివి? ఇప్పుడు నన్ను విమర్శిస్తున్నవారే 2023-24లో 9.67 లక్షల టన్నుల క్వార్ట్జ్‌ను చైనాకు ఎగుమతి చేశారు. ఇదంతా ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే చెబుతున్నాను' అని పేర్కొన్నారు.

బెట్టింగ్ యాప్ కోసం ఎందుకు ప్రచారం చేశారు?

- పారితోషికం ఎంత తీసుకున్నారు..
- ప్రకాష్‌రాజ్‌ను విచారించిన ఈడీ

ఈనాడు, హైదరాబాద్: సినీ నటుడు ప్రకాష్‌రాజ్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చిన ఆయనను ఈడీ అధికారులు సుమారు 5 గంటలపాటు విచారించారు. ఆర్థిక లావాదేవీల గురించి ఆరా తీశారు. బెట్టింగ్ యాప్ కోసం ఎప్పుడు, ఎందుకు ప్రచారం చేయాల్సి వచ్చిందని ప్రశ్నించగా.. 2016లో ప్రచారం చేశానని, అలా చేయడం తప్పని తెలియదని ప్రకాష్‌రాజ్ చెప్పినట్లు సమాచారం. ఐదేళ్ల కాలపరిమితి తర్వాత మరోసారి ప్రచారం చేయాలని నిర్వాహకులు అడిగినా అంగీకరించలేదని చెప్పినట్లు తెలిసింది. ప్రచారం చేసినందుకు ఎంత డబ్బు సమకూరిందని ఈడీ అధికారులు ప్రశ్నించగా.. పారితోషికం తీసుకోలేదని చెప్పినట్లు సమాచారం. అయితే పారితోషికం తీసుకోకుండా ప్రచారం చేయాల్సిన అవసరమేంటనే ప్రశ్నకు ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది.



ఈడీ కార్యాలయానికి వచ్చిన ప్రకాష్‌రాజ్

ఈ క్రమంలోనే ప్రకాష్‌రాజ్ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. విచారణ ముగిసిన అనంతరం ఈడీ కార్యాలయం ఆవరణలో ప్రకాష్‌రాజ్ మీడియాతో మాట్లాడారు. 'బెట్టింగ్ యాప్ ప్రచారానికి పారితోషికం తీసుకోలేదని ఈడీ అధికారులకు చెప్పాను. బ్యాంకు ఖాతాలను వారు పరిశీలించారు. పౌరుడిగా దర్యాప్తునకు సహకరించాను. మరోసారి విచారణకు రావాలని అడగలేదు. దయచేసి ఎవరూ బెట్టింగ్ ఆడొద్దు' అని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేయడం ద్వారా ప్రముఖులు సొమ్ము ఆర్జించిన వ్యవహారంలో హవాలా లావాదేవీలు, మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది.

పలువురు రెవెన్యూ సిబ్బందిపై అభియోగాలు నమోదు

ఈనాడు, అమరావతి: విధుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడి, అలసత్వంగా వ్యవహరించిన ఉమ్మడి గుంటూరు, చిత్తూరు, కడప, ఇతర జిల్లాల్లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లు, ఇతర ఉద్యోగులపై శాఖాపరమైన చర్యల నిమిత్తం ఒకేసారి 22 ఉత్తర్వులు బుధవారం వెలువడ్డాయి. గతంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, గుర్తించిన అవకతవకలపై అందచేసిన నివేదికలను అనుసరించి ఈ ఉత్తర్వులను రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి జారీచేశారు.

రాజమహేంద్రవరం జైలు ఆవరణలో డ్రోన్ల చక్కర్లు

ఈనాడు, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం ఆవరణలో డ్రోన్‌లు ఎగురుతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. మంగళవారం రాత్రి సుమారు 8.40 గంటల సమయంలో డ్రోన్ రావడాన్ని గుర్తించి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ నరసింహ కిశోర్ ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించారు. బుధవారం రాత్రి సైతం 9 గంటల సమయంలో డ్రోన్ రావడంతో అప్రమత్తమైన జైలు, పోలీసు అధికారులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమీపంలోని ఓ అపార్టుమెంట్ నుంచి డ్రోన్‌ను వినియోగిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించామని జైలు పర్యవేక్షణాధికారి రాహుల్ తెలిపారు. రెండు రోజుల క్రితం కూడా ఓ డ్రోన్ ఎగరగా, విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి ఈ కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా డ్రోన్ ఎగర వేస్తున్నారా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది.



సి. వి. నాగేష్ అసోసియేట్స్ న్యాయవాదులు

హెచ్చరిక నోటీసు

మా క్లయింట్లు మెస్సర్స్. పీఐ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ ఎల్‌ఎల్‌పి (సంస్థ) శ్రీ అజీమ్ హాషమ్ ప్రేమ్‌జీ కుటుంబ కార్యాలయం చేసిన పెట్టుబడులకు వ్యాపార పేరు అయిన ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ పెట్టుబడులను నిర్వహిస్తుంది.

'ప్రేమ్‌జీ ఇన్వెస్ట్' ఖ్యాతిని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యక్తులు నకిలీ వెబ్‌సైట్‌లు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా మరియు మొబైల్ అప్లికేషన్‌లను సృష్టించి, కొన్ని ప్రచార సామగ్రిని ఉపయోగించి, మా క్లయింట్ సంస్థ ప్రతినిధులుగా నటించి, మోసపూరితంగా ప్రజలను వారి నకిలీ సంస్థలు/బ్యాంక్ ఖాతాలలో పెట్టుబడి పెట్టడానికి మరియు చెల్లింపులు చేయడానికి ఆకర్షిస్తున్నారు. మోసగాళ్ళు చేసిన మోసపూరిత చర్యల గురించి తెలుసుకున్న మా క్లయింట్లు వెంటనే నియంత్రణ సంస్థలకు (SEBIతో సహా) సమాచారం అందించారు మరియు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదులు దాఖలు చేశారు. ఆ తర్వాత, జూలై 18, 2025న, మా క్లయింట్లు మోసగాళ్లపై క్రిమినల్ ఫిర్యాదు చేశారు మరియు సమాచార సాంకేతిక చట్టం మరియు ఇతర అనుబంధ నేరాల నిబంధనల కింద బెంగళూరులోని తూర్పు CEN పోలీస్ స్టేషన్ ద్వారా ప్రథమ సమాచార నివేదిక (FIR) నమోదు చేయబడింది మరియు అది దర్యాప్తులో ఉంది.

ఇటువంటి నకిలీ మరియు కల్పిత సంస్థలకు ఎటువంటి చెల్లింపులు/పెట్టుబడి పెట్టవద్దని సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాము మరియు వారు ఇప్పటికే అలాంటి మోసగాడికి బలై ఉంటే, దానిని బెంగళూరులోని తూర్పు CEN పోలీస్ స్టేషన్‌కు నివేదించవచ్చు.

#33, గంగే, పాటలమ్మ టెంపుల్ స్ట్రీట్,
బసవనగుడి, బెంగళూరు- 560 004.
టెలిఫోన్ : 26577424
టెలి. ఫ్యాక్స్: 26578856
ఇ-మెయిల్: admin@cvnlawchambers.com
తేదీ: 23-07-2025


(రాఘవేంద్ర కె)
సి.వి. నగేష్ అసోసియేట్స్,
న్యాయవాదులు,
బెంగళూరు

ఖరీదు కట్టడం సరికాదు!

బడ్డీకొట్లు మొదలు బడా దుకాణాల దాకా ప్రతిచోటా క్యూఆర్ కోడ్ స్కానర్లు అందుబాటులోకి రావడంతో చేతిలో ఫోన్ ఉంటే చాలు, ఎక్కడైనా ఏదైనా కొనుగోలు చేయడానికి వీలు చిక్కుతోంది. అలా దేశార్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కారణమైన యూపీఐ- నగదు రహిత చెల్లింపుల సంఖ్యను అమితంగా పెంచింది. తద్వారా 2023 ఫిబ్రవరి నాటికే అది జనభారతానికి రూ.5.5 లక్షల కోట్లు ఆదా చేసిందని ప్రపంచ ఆర్థిక సంస్థ అంచనా వేసింది. బ్యాంకింగ్ సేవలను సులభతరం చేసి, సామాన్యులను సైతం ప్రధాన ఆర్థిక స్రవంతిలోకి తీసుకొస్తున్న యూపీఐ లావాదేవీలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్త నిబంధనలను ప్రకటించింది. రేపటి నుంచి అమలులోకి వస్తున్న వాటిపై ఎవరికీ అభ్యంతరం లేదు కానీ, ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవలి వ్యాఖ్యలే దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి!

యూపీఐ సత్ఫలితాలను అందిస్తోందంటూనే- దానికి సంబంధించిన సేవారుసుములను సమష్టిగానో, వినియోగదారులు వ్యక్తిగతంగానో చెల్లించక తప్పదని సంజయ్ మల్హోత్రా మొన్న శుక్రవారం వ్యాఖ్యానించారు. ఇకపై ఉచిత యూపీఐ లావాదేవీలు కుదరవని ఆయన అలా అన్యాపదేశంగా చెప్పారనే అభిప్రాయాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. రూ.3వేలకు మించి యూపీఐ ద్వారా చేసే చెల్లింపులపై ఛార్జీల బాదుడుకు రంగం సిద్ధమవుతోందంటూ కిందటి నెలలోనే కథనాలు వెలువడ్డాయి. వాటిని ఖండించిన కేంద్రం- యూపీఐ ద్వారా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టీకరించింది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతున్న యూపీఐకి ఖరీదు కట్టే ఆలోచనేదీ లేదని ప్రభుత్వం గతంలోనూ పేర్కొంది. కానీ, యూపీఐ, రూపే కార్డులతో చేసే చెల్లింపులపై ఛార్జీల విధింపునకు బ్యాంకింగేతర పేమెంట్ వేదికలు కొన్నాళ్లుగా పట్టుబడుతున్నాయి. ఇలాంటి సమయంలో ఆర్‌బీఐ గవర్నర్ సేవారుసుముల గురించి ప్రస్తావించడం కొత్త అనుమానాలకు తావిస్తోంది. యూపీఐ వాడకానికి ఫీజులు విధిస్తే- నగదు చలామణీని వీలైనంత తగ్గించాలన్న డిజిటల్ ఇండియా లక్ష్యాలే దెబ్బతింటాయి!

తొమ్మిదేళ్ల క్రితం యూపీఐ తొలిసారి అందుబాటులోకి వచ్చినప్పుడు సంబంధిత సేవలకు 21 బ్యాంకులే సన్నద్ధత తెలిపాయి. ప్రస్తుతం అలాంటి వాటి సంఖ్య 675కు పెరిగింది. యూపీఐ తమకూ లాభదాయకమవుతోంది కాబట్టే ప్రతి నెలా కొత్త బ్యాంకులు ఈ వ్యవస్థకు జతకలుస్తున్నాయి. భీమ్-యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపు సేవలందించే బ్యాంకులు, యాప్‌లకు నిర్వహణ భారం తగ్గించడానికి కేంద్రం వాటికి ప్రత్యేక ప్రోత్సాహకాలనూ అందిస్తోంది. అలా 2021 నుంచి ఇంతవరకు ఏడున్నర వేల కోట్ల రూపాయలకు పైగా సమకూర్చింది కూడా. కాబట్టి సేవారుసుముల విధింపు అనేది ఏవిధంగానూ సముచిత నిర్ణయం కాబోదు. ప్రస్తుతం దేశీయంగా 49.1 కోట్ల మంది వ్యక్తులు, 6.5 కోట్ల మంది వ్యాపారులు యూపీఐని నిత్యం వినియోగించుకుంటున్నారు. జూన్ 2021లో రూ.5.47 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగితే- ఈ ఏడాది జూన్‌లో అవి రూ.24.03 లక్షల కోట్లకు పెరిగాయి. ఛార్జీలు కట్టమంటే యూపీఐని వాడటం మానేస్తామని ఇటీవల దేశవ్యాప్తంగా 376 జిల్లాల్లో నిర్వహించిన ఓ సర్వేలో పాల్గొన్నవారిలో 73శాతం మంది తేల్చిచెప్పారు. అదే జరిగితే మన ఆర్థిక వ్యవస్థ మళ్లీ నగదు చుట్టూ పరిభ్రమిస్తూ, సమ్మిళిత ప్రగతి సాధనకు ఆటంకమవుతుంది. జనజీవనాన్ని సౌకర్యవంతం చేసే యూపీఐ- డిజిటల్ మౌలిక వసతులకు అత్యున్నత ప్రతీకగా బిల్ గేట్స్ వంటివారి ప్రశంసలూ అందుకుంది. దాన్ని అలాగే కొనసాగించడం జాతి సౌభాగ్యానికి శ్రేయస్కరం!




చరిత్ర అంటే యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనల సమాహారం కాదు. తమ తమ నిత్యావసరాలు తీర్చుకునే క్రమంలో మనుషులు సాగించిన జీవనపోరాటం.

– డీడీ కోశాంబి, ప్రసిద్ధ చరిత్రకారులు

అంతఃకరణ శుద్ధి

మనసును ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేసుకోవాలి. అప్పుడే కోరిక, పగ, ద్వేషం, భయం, అజ్ఞానం వంటి మాలిన్యాలు తొలగిపోతాయి. స్పష్టమైన అవగాహన, ఆలోచన, సత్సంకల్పం, ప్రశాంతతలతో జ్ఞానంవైపు సాగడాన్నే అంతఃకరణ శుద్ధి అంటారు. ఆధ్యాత్మిక జీవితంలో దీనికి చాలా ప్రాధాన్యం ఉంది. అంతఃకరణ శుద్ధి ద్వారానే నిజమైన ఆనందం, శాంతి, జ్ఞాన చింతన లభిస్తాయి. మన దైనందిన జీవితాల్లో దీన్ని అనేక విధాలుగా అభ్యసించవచ్చు. వృద్ధులకు సాయపడటం, పేదల ఆకలి తీర్చడం, అనాథాశ్రమాలలో, విపత్తు సమయాలలో స్వచ్ఛందంగా సేవ చేయడం వంటి వాటి ద్వారా అహంకారం తగ్గి మనసులో దయ, జాలి, కరుణ వృద్ధి చెందుతాయి.

ఇతరుల తప్పులను క్షమించడం, రాగద్వేషాలకు అతీతంగా ఉండటం అలవర్చుకోవాలి. ఎవరి వల్లనైనా బాధ కలిగినప్పుడు వారిని క్షమించి ముందుకు సాగడం వలన మనసులో ప్రతికూల ప్రభావాలు తొలగి సానుకూల దృక్పథం మొదలవుతుంది. సత్యాన్నే పలకడం వల్ల ఆలోచనల్లో, మాటల్లో ప్రక్షాళన జరుగుతుంది. నిజాయతీగా జీవించడం అలవడుతుంది. మాటల ద్వారా కానీ, చేతల ద్వారా కానీ ఎవరికీ హాని



తలపెట్టకుండా ఉండటం సాధన చేయాలి. అప్పుడు సకల జీవుల పట్ల దయాగుణం పెరుగుతుంది. మనకు ఉన్నదాంతో సంతృప్తిపడటం, ఇతరులను చూసి అసూయ చెందకుండా ఉండటం వల్ల ప్రశాంతత నెలకొంటుంది. ధ్యానం అంతర్గత లోపాలను తెలుసుకోవడానికి, సరిదిద్దుకోవడానికి సహాయపడుతుంది. అనవసరమైన కోరికలను తగ్గించుకోవాలి. అవి దుఃఖానికి హేతువులని గుర్తించినప్పుడే వాటిపై నియంత్రణ ఏర్పడుతుంది. స్వార్థంతో చేసే కర్మలు రాగద్వేషాలకు దారితీస్తాయి. అంతఃకరణ శుద్ధి ద్వారా నిస్వార్థంగా చేసే పనులు ఆధ్యాత్మికతకు బాటలు వేస్తాయి.

అంతర్యామి

అంతఃకరణ శుద్ధి వల్ల మనసులో కల్లోలం సృష్టించే ఆందోళనలు, ఒత్తిడి తగ్గుతాయి. తేలికైన మనసు ఆనందాన్ని కలిగిస్తుంది. అప్పుడు బాహ్య వస్తువులు, సంఘటనలపై ఆధారపడకుండా అంతర్గత ఆనందాన్ని అనుభవించగలుగుతారు. ఇతరుల పట్ల జాలి, దయ, కరుణ, క్షమ వంటి దైవీ గుణాలు అలవర్చుకుని సమాజ హితాన్ని కాంక్షించాలి. అప్పుడే అపార్థాలు, కక్షలు, కార్పణ్యాలు తగ్గి సమాజంలో పరస్పర అవగాహన పెరుగుతుంది. మనసు కల్మషరహితం అవుతుంది. మానసిక స్పష్టత వల్ల సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సందిగ్ధం తొలగిపోతుంది.

అంతఃకరణ శుద్ధితో అనేక అనారోగ్య సమస్యలకు ఉపశమనమూ లభిస్తుంది. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ అంతఃకరణ శుద్ధిని సాధన చేస్తే సమాజంలో శాంతి, సామరస్యాలు పెరుగుతాయి. నేరాలు తగ్గి మానవత్వం పరిమళిస్తుంది. అంతఃకరణ శుద్ధి ఆధ్యాత్మిక పురోగతికి ప్రధానమైనది. ఇది జ్ఞానం పొందడానికి, ఆత్మసాక్షాత్కారానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. అంతఃకరణ శుద్ధి అనేది ఆధ్యాత్మిక భావన మాత్రమే కాదు, అదొక జీవన విధానం. నిరంతర ప్రక్రియ. దాన్ని అనుసరించడం ద్వారా మరింత అర్థవంతమైన, శాంతియుతమైన జీవితాన్ని గడపవచ్చు.

– ఎం.వెంకటేశ్వర రావు

సమగ్ర సంస్కరణే మేలు!

దేశీయంగా ఉన్నత విద్య మొత్తాన్ని ఏకీకృత నియంత్రణ వ్యవస్థ కిందకు తెచ్చేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా భారత ఉన్నత విద్యా కమిషన్(హెచ్‌ఈసీఐ) ఏర్పాటు కోసం ప్రత్యేక బిల్లును సిద్ధం చేస్తున్నట్లు లోక్‌సభలో వెల్లడించింది. నూతన జాతీయ విద్యావిధానం 2020 ప్రతిపాదనలకు అనుగుణంగా కీలక మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ శాసన ముసాయిదాను సమగ్రంగా పరిశీలించడం అవసరం.

భారతదేశం నిజంగా 'విశ్వ గురు'గా నిలవాలంటే ఉన్నత విద్యలో సమూల సంస్కరణలు తీసుకురావాలి. ఉన్నత విద్యా సంస్థలకు నిజమైన స్వయం ప్రతిపత్తినిచ్చి మారుతున్న కాలానికి కావాల్సిన నాణ్యమైన విద్య, నైపుణ్యాలను యువతరానికి అందించాలి. నేడు డిగ్రీలకు విలువ లేదు. అభ్యర్థులకు సమస్య పరిష్కార నైపుణ్యాలు కావాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో డిగ్రీ కళాశాలలు,



సాంకేతిక విద్యాసంస్థల మధ్య, ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ కోర్సుల మధ్య భేదం చెరిగిపోతోంది. అందుకే నేడు ఐఐటీల వంటి ఉన్నత సాంకేతిక విద్యాసంస్థలు సైతం బీఎస్సీ, బీఏ డిగ్రీలను అందిస్తున్నాయి. అనేకానేక సంస్థలు అన్ని రకాల కోర్సులను బోధిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలైతే ఒకే ఛత్రం కింద బీటెక్, ఎంటెక్, బీఈడీ, ఎంఈడీ, ఎంబీఏ, బీఏ, ఎంఏ, బీఎస్సీ, ఎంఎస్సీ, బీకాం, ఎంకాం, ఎల్ఎల్‌బీ వంటి కోర్సులను అందిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్నత విద్యను విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ), జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నియంత్రిస్తున్నాయి. ఒకే కప్పు కింద బహువిధ విద్యా కోర్సుల బోధనను పర్యవేక్షిస్తున్నాయి.

యూజీసీ స్థానంలో...

కృత్రిమ మేధ ఆధారిత 21వ శతాబ్ది డిజిటల్ ప్రపంచంలో బహుముఖ ప్రావీణ్యం సాధించాలని అధ్యాపకులతో పాటు విద్యార్థులు కూడా గ్రహిస్తున్నారు. తదనుగుణంగా మన ఉన్నత విద్య రూపాంతరం చెందాల్సి ఉంది. దానికి కొత్త మార్గదర్శకత్వం, నియంత్రణ వ్యవస్థ కావాలి. అందుకే ఇప్పుడున్న నియంత్రణ సంస్థలపై పునస్సమీక్ష చేయక తప్పదని 2020లో వెలువడిన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) ప్రతిపాదించింది. అన్ని రకాల ఉన్నత విద్యను చట్టపూర్వకంగా ఒకే నియంత్రణ చట్రం కిందకు తీసుకురావాలని సూచించింది. ఎన్‌ఈపీ-2020 వెలువడి అయిదేళ్లయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారత ఉన్నత విద్యా కమిషన్(హెచ్‌ఈసీఐ) ఏర్పాటుకు ఒక ముసాయిదా బిల్లును సిద్ధం చేస్తోంది. దీన్ని ఏకీకృత నియంత్రణ సంస్థగా అభివర్ణిస్తోంది. ఎన్‌ఈపీ-2020 దేశంలో ఉన్నత విద్యను నియంత్రిస్తున్న యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల స్థానంలో ఒకే నియంత్రణ సంస్థను ఏర్పరచాలని సూచించగా- కేంద్రం ఇప్పుడు కేవలం యూజీసీ స్థానంలో హెచ్‌ఈసీఐని ఏర్పాటు చేయదలిచింది. ఈ మూడు సంస్థల బాధ్యతలను, అక్రెడిటేషన్ అధికారంతో సహా హెచ్‌ఈసీఐకి బదలాయించదలిచారు.

ముసాయిదా బిల్లు ప్రకారం హెచ్‌ఈసీఐ పలు కీలక విధులను నిర్వర్తించనుంది. ఉన్నత విద్యలో ప్రమాణాలు, నాణ్యతను పెంచి విద్యార్థులకు ఈ కాలపు విద్యను అందించడం హెచ్‌ఈసీఐ లక్ష్యం. వారిలో నవీకరణ సామర్థ్యాన్ని, వ్యవస్థాపక లక్షణాలను పెంపొందించడం, నవకల్పనలు చేయడానికి ఇంక్యుబేటర్లను అందించడం దాని బాధ్యత. మారిన కాలానికి అనుగుణమైన పాఠ్య ప్రణాళికలు అది రూపొందిస్తుంది. అధ్యాపక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలకు నిధుల సమీకరణ, ప్రభుత్వంతో సమన్వయం నెరపడం హెచ్‌ఈసీఐ విధులే. పటిష్ఠమైన అక్రెడిటేషన్ విధానాన్ని హెచ్‌ఈసీఐ చేపడుతుంది. కనీస ప్రమాణాలను అందుకోలేకపోయిన విద్యాసంస్థలకు తగిన మార్గదర్శకత్వం అందిస్తుంది. డిగ్రీలు, డిప్లొమాలు ప్రదానం చేయడానికి అర్హతా ప్రమాణాలను నిర్ణయిస్తుంది. ఉన్నత విద్యాసంస్థలకు స్వయంనిర్ణయాధికారం ఇవ్వడానికి ప్రమాణాలను నిర్దేశిస్తుంది. అలాంటి సంస్థలకు సొంత పాఠ్యప్రణాళికలను రూపొందించుకునే స్వేచ్ఛను కల్పిస్తుంది. విద్యాపరిశోధనలకు సంబంధించిన విధానాల రూపకల్పనలో కేంద్రం, రాష్ట్రాలకు హెచ్‌ఈసీఐ సలహాలిస్తుంది. సమకాలీన ప్రపంచంలో విజ్ఞాన సముపార్జన రీతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాలు విద్యాపరంగా సమతుల అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటుంది. జాతీయ డేటాబేస్‌ను ఏర్పరచి నవీన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాలను అందుబాటులోకి తెస్తుంది.

హెచ్‌ఈసీఐ కింద నాలుగు కీలక మండళ్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల బదులు జాతీయ ఉన్నత విద్యానియంత్రణ మండలి(ఎన్‌హెచ్‌ఈఆర్‌సీ)ని కొలువుదీరుస్తారు. న్యాక్, ఎన్‌బీఏల బదులు జాతీయ అక్రెడిటేషన్ మండలి(ఎన్ఏసీ)ని నెలకొల్పుతారు. ఇది ఉన్నత విద్యాసంస్థల నాణ్యతా ప్రమాణాలను బేరీజు వేస్తుంది. అర్హమైన సంస్థలకు అక్రెడిటేషన్ ఇస్తుంది. ఉన్నత విద్యాసంస్థలకు నిధులు అందించడానికి ఉన్నత విద్యాగ్రాంట్ల మండలి(హెచ్‌ఈజీసీ)ని ఏర్పాటు చేస్తారు. విద్యాప్రమాణాలు, అభ్యసన ఫలితాలను నిర్వచించడానికి సార్వత్రిక విద్యామండలి(జీఈసీ)ని ఏర్పాటు చేస్తారు. అది ప్రస్తుత యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల పాఠ్యప్రణాళికలకు భిన్నమైన సిలబస్‌లను అందిస్తుంది.

సమస్యాత్మక అంశమిదీ...

ముసాయిదా బిల్లు పీఠిక 1956నాటి యూజీసీ చట్టాన్ని తొలగించి హెచ్‌ఈసీఐని నెలకొల్పాలని ఉద్దేశిస్తోంది. హెచ్‌ఈసీఐకి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, 12 మంది సభ్యులు, ఒక సభ్య కార్యదర్శి ఉంటారు. ప్రస్తుత ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల అధిపతులు హెచ్‌ఈసీఐలోనూ సభ్యులవుతారు. అంటే- ఈ రెండు సంస్థలు కొంతకాలం వరకైనా హెచ్‌ఈసీఐతో కలిసి పయనిస్తాయి. ఒక్క యూజీసీని మాత్రమే తొలగించి మిగిలిన రెండు నియంత్రణ సంస్థలను హెచ్‌ఈసీఐలో విలీనం చేయడం వల్ల వచ్చే అదనపు ప్రయోజనమేంటి? ఇది చివరకు కొత్త సీసాలో పాత నీరుగా మిగులుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. 2020నాటి జాతీయ విద్యావిధానాన్ని నిజంగా ఆచరణలోకి తీసుకురావాలంటే అన్ని ఉన్నత విద్యా నియంత్రణ సంస్థలను ఒకే సంస్థ కింద విలీనం చేయాలి. ఒక్క యూజీసీని పక్కనపెడితే సరిపోదు. యూజీసీ, న్యాక్, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈలను హెచ్‌ఈసీఐ ఛత్రం కింద ఏకం చేయాలి. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలోగా ఈ మార్పులు చేయడం మంచిది.



ఆచార్య అప్పారావు పొదిలె
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి


'జీవితమంటే- తినడం, పడుకోవడం కాదు... ముందుకు సాగిపోవాలన్న తపన కలిగి ఉండటం'

'నేను కూలివాణ్ని. ఏ రోజైతే రాయనో ఆరోజు నాకు తిండి తినే అర్హత లేదు'

'చక్కటి భాషలో సత్యాన్ని వ్యక్తీకరిస్తూ, మనసు మీద, మేధస్సు మీద ప్రభావాన్ని కలిగించేదే సాహిత్యం'

ప్రేమ్‌చంద్ మాటల్లాగే ఆయన రచనల్లోని ప్రతి వాక్యమూ పాఠకుణ్ని సమాజం పట్ల బాధ్యుణ్ని చేస్తుంది. 1880 జులై 31న కాశీ సమీపంలోని లమహి గ్రామంలో జన్మించారు ప్రేమ్‌చంద్. తండ్రి తపాలా కార్యాలయంలో గుమాస్తా. భార్య చనిపోవడంతో ఆయన మరో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లి పోరు పడలేక చిన్నారి ప్రేమ్

నవలా చక్రవర్తి



చంద్ ఇంటి బయటే కాలక్షేపం చేసేవాడు. తండ్రి కార్యాలయంలో కాజాకి అనే తపాలా బంట్రోతుతో సాన్నిహిత్యం ఏర్పడింది. అతడు చెప్పిన కథలు బాలుడైన ప్రేమ్‌చంద్ హృదయంపై చెరగని ముద్ర వేశాయి. తాను రచయిత కావడానికి కాజాకి ప్రభావం ఎంతో ఉందని ప్రేమ్‌చంద్ ఓ సందర్భంలో చెప్పారు. తండ్రి కూడా చనిపోవడంతో కుటుంబ బాధ్యత పదిహేనేళ్ల ప్రేమ్‌చంద్ మీద పడింది. చదువుకుంటూనే ఎలాగో ఆ బాధ్యతలను నెట్టుకొస్తుండగా సవతి తల్లి బంధువుల అమ్మాయితో ప్రేమ్‌చంద్‌కు పెళ్లి చేసింది. ఇద్దరికీ సఖ్యత కుదరకపోవడంతో కొంత కాలానికే విడిపోయారు. అనంతరం ప్రేమ్‌చంద్ బాల వితంతువు శివరాణి దేవిని పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. పత్రికలకు వ్యాసాలు, కథలు, సీరియల్స్... ఎన్ని రాసినా ఆర్థిక ఇబ్బందులు తీరేవి కావు. సొంతంగా ప్రెస్ పెట్టి మాధురి, జాగరణ్, హంస్ లాంటి పత్రికలు నడిపి మరిన్ని నష్టాలను కొనితెచ్చుకున్నారు. కష్టపడి బీఏ పూర్తిచేసి ఉపాధ్యాయుడిగా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేశారు. ఆయనకు ఈ ఉద్యోగాలు స్వేచ్ఛను హరించేవిగా అనిపించాయి. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఉద్యోగానికి రాజీనామా చేసి జీవితాన్ని సాహిత్య సేవకు అంకితం చేశారు. అసలు పేరు ధన్‌పత్ రాయ్ అయినా ప్రేమ్‌చంద్ ఆర్థికంగా కాకుండా సాహితీ రంగంలో ధనవంతుడై, ఆధునిక హిందీ కథను ప్రపంచ సాహిత్యం సరసన నిలిపిన ధీరుడయ్యారు.

రంగభూమి, కర్మభూమి, గబన్, గోదాన్ లాంటి నవలలు; కఫన్, నశా, ఈద్గా, శత్‌రంజ్ కె ఖిలాడి లాంటి మూడువందల పైచిలుకు అద్భుతమైన కథలు, కర్బలా లాంటి నాటకాలు... ఆయన సృజనశక్తికి మచ్చుతునకలు. ప్రేమ్‌చంద్ జీవించింది 56 ఏళ్లే అయినా అద్భుత సాహిత్య సృజన చేశారు. ప్రేమ పట్ల ఆయనకు ఉదాత్త భావన ఉండేది. 'చెరకు నుంచి రసం పిండేస్తే పిప్పి మిగులుతుంది. మనిషి హృదయంలోంచి ప్రేమను తీసివేస్తే చర్మం తొడిగిన అస్థిపంజరం అవుతాడు తప్ప మనిషి కాలేడు' అనేవారాయన. భార్య శివరాణి దేవి, కొడుకు అమృత్ రాయ్ ఇద్దరూ ప్రేమ్‌చంద్ జీవిత చరిత్రను రాశారు. వాటి ద్వారా ఆయన జీవితాన్ని సమగ్రంగా తెలుసుకోవచ్చు.

– డా.నరసింహారావు కల్యాణి

తప్పని ప్రభావం

అందివస్తున్న ఆధునిక సాంకేతికతలు, పెరుగుతున్న యాంత్రీకరణ వల్ల ఉద్యోగ విధుల్లో చాలా మార్పులొస్తున్నాయి. టెక్నాలజీ ప్రభావంతో ప్రస్తుతం మనుషులు చక్కబెడుతున్న చాలా పనులు భవిష్యత్తులో యంత్రాల పరం కానున్నాయి. ముఖ్యంగా ఆటోమేషన్ వల్ల రాబోయే రోజుల్లో చాలా కొలువులకు ముప్పు ఏర్పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, సాంకేతికతలను అందిపుచ్చుకునేకొద్దీ కొత్త అవకాశాలు సైతం తలుపుతడతాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాబోయే అయిదేళ్లలో మనుషులు, సాంకేతికత, మానవులు- టెక్నాలజీ కలిసి నిర్వర్తించే విధుల వాటా... (శాతాల్లో)

	ప్రస్తుతం	2030 నాటికి
సాంకేతికతతోనే చక్కబెట్టగలిగేవి	22	34
మనుషులు, యంత్రాలు కలిపి చేసేవి	30	33
మనుషులు చేసే పనులు	47	33

(ఆధారం: ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025)

అధిక దిగుబడి... రైతుకు రాబడి!

దేశంలో ఉద్యానరంగ ఉత్పత్తులు 2024-25లో రికార్డు స్థాయిలో 36.77 కోట్ల టన్నులకు చేరుకున్నాయి. తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే ఈ పంటల వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. ఆహారధాన్యాల సాగులో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాన్ని ఉద్యాన పంటలు చూపుతుండటంతో వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ ప్రోత్సహిస్తున్నాయి.

దేశంలో ఉద్యాన పంటల సాగు 2023-24తో పోలిస్తే నిరుడు 3.7శాతం వృద్ధి సాధించింది. వరి, గోధుమ, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల కంటే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూల దిగుబడి 2.5కోట్ల టన్నులు అధికంగా నమోదైంది. ఈ పంటల సాగు విస్తీర్ణం ఒక ఏడాదిలోనే 290.86 లక్షల హెక్టార్ల నుంచి 292.67 లక్షల హెక్టార్లకు పెరిగిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఇటీవల నివేదించింది. ప్రస్తుతం దేశంలో ఉద్యాన రంగం... ఉపాధి అవకాశాలు, ఎగుమతుల పరంగా దేశ ఆర్థిక వ్యవస్థకు సహకరిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల స్థూల విలువలో 33శాతం వాటాతో ఇది క్రమేపీ ఆర్థిక రంగానికి చోదకశక్తిగా ఎదుగుతోంది.



అన్ని విధాలా లాభాలు

భారత్ ప్రపంచంలో పండ్లు, కూరగాయల రెండో అతిపెద్ద ఉత్పత్తిదారు. అరటి, మామిడి, బొప్పాయి, ఉల్లిపాయలు, అల్లం, బెండకాయలు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, జీడిపప్పుల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంది. 2024-25లో మామిడి, అరటి సహా పండ్ల ఉత్పత్తి 1,145.10 లక్షల టన్నులు. అంతకుముందు సంవత్సరం కంటే ఇది 1.36 శాతం అధికం. కూరగాయల దిగుబడి ఆరు శాతం పెరుగుదలతో 2,196.74 లక్షల టన్నులకు చేరుకుంది. బంగాళాదుంపల ఉత్పత్తి 26శాతం అధికమై 60.17 లక్షల టన్నులకు ఎగబాకింది. ఉల్లిగడ్డల ఉత్పత్తి 5.46శాతం పెరిగి 57.05 లక్షల టన్నులకు చేరుకుంది.


వరి వంటి సంప్రదాయ పంటలకు 120 రోజుల సాగు కాలం కాగా, ఒక ఎకరానికి నెలకు సగటున రూ.3-4వేల విలువైన దిగుబడే దక్కుతుంది. దానితో పోలిస్తే ఉద్యాన పంటల ఉత్పాదకత చాలా ఎక్కువ. ఒక రైతు కూరగాయలు పండిస్తే 40 రోజుల పంట కాలంలో నెలకు రూ.13-15వేల వరకు ఆదాయం వస్తోంది. ఎగుమతుల ద్వారా దేశానికి విదేశ మారక ద్రవ్యమూ లభిస్తోంది. అంతేకాకుండా నర్సరీల పెంపకం, నాటడం, కోయడం, శుద్ధి, మార్కెటింగ్, ల్యాండ్‌స్కేపింగ్, ఫ్లోరికల్చర్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ద్వారా ఉద్యోగావకాశాలూ అందివస్తున్నాయి. అలా దేశంలో సగటున ఎకరం పంటకు ఏడాదికి వంద మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు.

సమ్మిళిత వృద్ధి, మెరుగైన ఆదాయం కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పంటలను పెద్దయెత్తున ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పోషకాహారం, సాధికారత, జీవనోపాధి అనే మూడు ప్రధాన అంశాలపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ దృష్టి సారించింది. పోషక విలువలు కలిగిన పంటలను ప్రోత్సహించడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించడం, ఏడాది పొడవునా సాగు చేయడానికి అనుకూలమైన పరిస్థితులను కల్పించడం లక్ష్యాలుగా నిర్దేశించింది. అందుకు రైతులకు మెరుగైన శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. అప్పుడే వారి ఆదాయాన్ని పెంచడం, సుస్థిరాభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం వీలవుతుంది. జాతీయ ఉద్యాన మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) 2025-26 కింద పంట ఉత్పత్తులు, రైతుల ఆదాయాలు, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఉద్యాన పంటల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. దీని కింద అధిక దిగుబడినిచ్చే పంటల సాగును ప్రోత్సహిస్తారు. రైతులకు సబ్సిడీలు, సాంకేతికతతో పాటు ఇతర సాయాన్నీ అందిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో...

ఏపీ, తెలంగాణాల్లోనూ ఉద్యానరంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 18.23 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వార్షిక దిగుబడి 366.53 లక్షల టన్నులుగా ఉంది. తెలంగాణ సుమారుగా 4.85 లక్షల హెక్టార్ల ఉద్యాన సాగు విస్తీర్ణంతో 61.64 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధిస్తోంది. ఉద్యాన ఉత్పత్తుల్లో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, కర్ణాటక, జమ్మూకశ్మీర్‌లు ముందంజలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల మీద తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తగిన సబ్సిడీలు అందిస్తూ రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలి. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలూ సంస్థల్లో పరిశోధనలు, కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగం ద్వారా తెలుగు రాష్ట్రాలు పురోగమించాలి.

– ఆకారపు మల్లేశం



(c) eenadu

అనుమతి లేకుండా పెర్గోలాను ఎలా కూల్చారు?

దేవాదాయ శాఖ కమిషనర్ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో చేపట్టిన అభివృద్ధి పనుల స్థితిగతులపై దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో శీనానాయక్, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయా పనులను బుధవారం రెండు గంటల పాటు పరిశీలించారు. కమిషనర్ ఆర్డర్ లేకుండా రూ.6 కోట్లతో నిర్మించిన పెర్గోలాను ఎలా తొలగించారని ప్రశ్నించారు. పూజా మండపాల నిర్మాణ పనులు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రకాల టైల్స్ ఎందుకు వేశారని అడగ్గా.. అర్చకులు కోరారని అధికారులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్చకులకు ఇంజినీరింగ్ పనులతో సంబంధం ఏంటని ప్రశ్నించారు. దసరా ఉత్సవాలు సమీపిస్తున్నందున భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ వంటి విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.


పూజా మండపాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్ తదితరులు

ఘాట్ రోడ్డు పగుళ్లు ఇచ్చిన వైనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, డీఈలు కోటేశ్వరరావు, రవీంద్ర, అశోక్ పాల్గొన్నారు.


కౌలు రైతులకు సత్వర పంట రుణాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో కౌలు రైతులకు 56,000 సీసీ ఆర్సీ కార్డుల జారీ లక్ష్యం... ఇప్పటికే 42,415 అందజేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్డులున్న ప్రతి కౌలుదారునికీ సత్వరమే రుణాలు మంజూరు చేయాలి. ఇందుకు ప్రతి బ్యాంకు శాఖలోనూ 'క్రెడిట్ డే' నిర్వహించాలని బ్యాంకర్లకు సూచించారు. రుణాల మంజూరు అంశంపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులు, కౌలుదార్లకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. చాలా అంశాల్లో జిల్లా ముందంజలో ఉంది. కౌలుదార్లకు రుణాల విషయంలోనూ ప్రథమ స్థానంలో నిలిపేలా చూడాలని కోరారు. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, డీఏవో విజయకుమారి, ఎల్డీఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకుల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

ఘడియ ఘడియకో గండం..!

సాయంత్రం 6 నుంచి 9 మధ్యే అధిక ప్రమాదాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



విజయవాడ నగరం మీదుగా.. రెండు జాతీయ రహదారులు వెళుతున్నాయి. స్థానిక రహదారులు ఐదుకుపైగా ఉంటాయి. వాహనాలు ఏటా భారీగా పెరుగుతున్నాయి. వెరసి రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల సమయంలో వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. కూడళ్లు దాటడానికి చోదకులు హైరానా పడుతున్నారు. ఇలాంటి రద్దీ సమయంలోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మరణాలు అధికంగా నమోదవుతున్నాయి. ఒకేసారి వేలాది వాహనాలు రహదారులపైకి రావడంతో.. ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

ప్రతి మూడు గంటలను విశ్లేషిస్తే.. ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఉదయం 6 గంటల నుంచి ప్రతి మూడు గంటలకు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషిస్తే.. ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలోనే ప్రమాదాలు, మరణాలు చోటుచేసుకోవడం గమనార్హం. క్షతగాత్రులు అధికంగానే ఉంటున్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఇవీ కారణాలు.. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు సాయంత్రం వేళల్లో బయటకు వస్తారు. వాతావరణం చల్లబడిన తర్వాత షాపింగ్, ఇతర అవసరాల నిమిత్తం ప్రజలు, వినియోగదారులు వస్తున్నారు. దశాబ్దాల నాటి రహదారులే ఇప్పటికీ ఉన్నాయి. కానీ వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇరుకు రహదారులే నరకానికి దిక్కు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగిపోతుంటాయి. ప్రాణాలు తీసేస్తాయి. వేగ నియంత్రణ పాటించడం, రోడ్డు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తే. . కొంత వరకు ప్రమాదాలు జరగకుండా కాపాడవచ్చు.

సమయాల వారీగా ప్రమాద మరణాల నమోదు..

ఏడాది	6–9	9–12	12–15	15–18	18–21	21–24	1–3	3–6
2023	32	41	50	51	71	52	31	29
2024	37	38	60	59	85	74	25	28
2025	20	22	30	27	36	31	14	15

జెట్ వేగం.. కొలువుల యోగం..

'విజయవాడ జక్కంపూడిలోని ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్ సిటీ)లో ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు నిర్మిస్తున్న ఐదంతస్తుల మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ త్వరలో అందుబాటులోకి రానుంది. 80 శాతం పూర్తయిన భవనానికి తుదిమెరుగులు దిద్దే బాధ్యతను తాజాగా ఏపీఐఐసీకి అప్పగించారు. ఈ భవన ప్రధాన నిర్మాణం పూర్తయింది. మట్టి గోడలు, విద్యుత్తు, ఇతర అంతర్గత పనులు చేపట్టాలి. ఈ పనులను ఏపీఐఐసీ పూర్తిచేయనుంది. ఆర్థిక నగరంలో మొదటి టవర్‌ను త్వరగా పూర్తిచేయాలని ఏపీఐఐసీని ఆదేశించారు.'

– ఈనాడు, అమరావతి

మొదటి ఎఫ్ఎఫ్ఎస్ టవర్ పూర్తికి సన్నాహాలు

మహిళలకు ఉపాధినిచ్చే ఎంఎస్ఎంఈలకు కేటాయింపు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో జక్కంపూడి, వేమవరంలో కలిపి 153 ఎకరాల్లో జెట్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజలు నివసించేలా 15 వేల ఇళ్లతో టౌన్‌షిప్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్ఎస్) పేరుతో ఒక్కోటి ఐదు అంతస్తుల్లో ఉండే మూడు భారీ భవన సముదాయాలు నిర్మించాలని ప్రతిపాదించారు. తొలుత 6,750 ఇళ్ల నిర్మాణాలు ఆరంభించారు. ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (అపెడ్కో) ఆధ్వర్యంలో ఎఫ్ఎఫ్ఎస్ మొదటి భవన నిర్మాణం ప్రారంభించారు. ఇదో ఆర్థిక నగరంగా ఎదగాలనేది ప్రభుత్వ లక్ష్యం. అనుకున్నట్లే పనులు వేగంగా జరుగుతుండగా.. వైకాపా గద్దె నెక్కింది. అంతే.. ఇళ్ల నిర్మాణం, ఎఫ్ఎఫ్ఎస్ భవనం.. పనులన్నీ ఆగిపోయాయి.


మొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఇదే..

రూ.20.39 కోట్ల మంజూరుకు హామీ..

తాజాగా కూటమి ప్రభుత్వం దృష్టిసారించి.. రూ.20.39 కోట్ల పనుల బిల్లులను కూడా మంజూరు చేస్తామని ప్రకటించింది. అపెడ్కో నుంచి ఏపీఐఐసీకి ఎఫ్ఎఫ్ఎస్‌ల నిర్మాణం అప్పగించాలని సూచించింది. తాజాగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో అపెడ్కో నుంచి ఏపీఐఐసీకి నిర్మాణ బాధ్యత అప్పగించారు. పరిశ్రమలను విడివిడిగా కాకుండా.. ఒకే భవనంలో పెట్టడమే.. ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ప్రధాన ఉద్దేశం.

ఐదు అంతస్తుల్లో పరిశ్రమలు.. ప్రధానంగా మహిళలకు ఉపాధి కల్పించే ఎలీక్ లాంటి పరిశ్రమలకు ఆర్థిక నగరంలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం నిర్మాణం పూర్తికానున్న మొదటి టవర్‌లో మొత్తం ఐదు అంతస్తుల్లో పరిశ్రమలు పెట్టనున్నారు. ఒక్కో అంతస్తు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. మొత్తం ఐదు కలిపి 1.26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వస్తుంది.

ఐదేళ్లు ఆగిన పనులు పునరుద్ధరించి..

మొదటి టవర్ ఆరంభించగానే.. ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ఇక్కడ అవకాశం కల్పిస్తారు. వాటిలో పని చేసేందుకు జక్కంపూడి టౌన్‌షిప్‌లోనే వేల మంది ఉంటారు. ఇంటి నుంచి నడిచి వెళ్లి తిరిగి పనిచేసి ఇంటికొచ్చేలా చేయాలనేదే ఈ ఆర్థిక నగర ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోనే ఓ నమూనాగా జక్కంపూడి ఆర్థిక నగరాన్ని రూపుదిద్దాలనేది ప్రణాళిక. మధ్యలో ఐదేళ్లు ఆగిన పనులను పునరుద్ధరించి.. గత ప్రణాళికను గాడిన పెడుతున్నారు. ఇలాంటివే మరికొన్ని ఎఫ్ఎఫ్ఎస్ టవర్లను నిర్మించనున్నారు. మొత్తం కలిపి జక్కంపూడిలో ఒకేచోట 6.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఎంఎస్ఎంఈల కోసం అందుబాటులోకి తేవాలనేది లక్ష్యం. మిగతా టవర్ల నిర్మాణ బాధ్యతనూ ఏపీఐఐసీకే అప్పగించారు.

కృష్ణమ్మ పరవళ్లు

★ ప్రకాశం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తివేత
★ 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే ప్రమాదం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ఉద్ధృతి నెలకొంది. మధ్యాహ్నం నుంచి క్రమేపీ పెరిగింది. రాత్రి 9.30 గంటలకు 1.21 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. కలెక్టర్ జి.లక్ష్మీశ బ్యారేజీని పరిశీలించి, వరద పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కృష్ణా నది ఎగువున పులిచింతల ప్రాజెక్టు నుంచి 60,000 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయడంతో, అది ప్రకాశం బ్యారేజీకి చేరుతోందన్నారు. గురువారం ఉదయానికి మరింత పెరగవచ్చన్నారు. మూడు రోజుల్లో 3 లక్షల క్యూసెక్కులకు చేరే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. జలవనరులు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని వివరించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
91549 70454 ఫోన్ నంబరు 24 గంటలూ పని చేస్తుంది.

బుడమేరుపై అప్రమత్తం

కృష్ణా నదికి వరదల నేపథ్యంలో బుడమేరు, పులివాగు, కోతులవాగు తదితరాలపై అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకుంటున్నట్టు చెప్పారు.


వరద పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

వరద పరిస్థితిని జలవనరుల శాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు కలెక్టర్‌కు వివరించారు. కేసీ డివిజన్ ఈఈ ఆర్.రవికిరణ్, డీఈఈ ఎన్.అజయ్ బాబు, బ్యారేజీ ఏఈఈ సత్యరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాహం పెరుగుదల ఇలా..

మధ్యాహ్నం 12 గంటలకు ఎగువ నుంచి 52,084 క్యూసెక్కుల వరద రాగా, ప్రకాశం బ్యారేజీ 50 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 36,250 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 77,804 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. 15 గేట్లను రెండు అడుగులు, మిగతా 55 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 60,875 క్యూసెక్కులు వదిలారు. రాత్రి 9 గంటలకు ఎగువ నుంచి 94,679 క్యూసెక్కులు రాగా, 40 గేట్లను రెండు అడుగులు, మిగతా 30 గేట్లను అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 77,750 క్యూసెక్కులు విడుదల చేశారు. అరగంట వ్యవధిలో రాత్రి 9.30 గంటలకు ఎగువ నుంచి 1,21,679 క్యూసెక్కులు వచ్చింది. 10 గేట్లను మూడు అడుగులు, మిగతా 60 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,04,750 క్యూసెక్కులు విడుదల చేశారు.

కాలువలకు 16,929 క్యూసెక్కులు

కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు 16,929 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 10,207, కృష్ణా పశ్చిమకు 6,522, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్‌కు 5,017, బందరు 1,964, కేఈబీ 1,715, ఏలూరు కాల్వలకు 1,511 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

భవానీ ద్వీపానికి రాకపోకలు నిలిపివేత

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణా నది మధ్యలోని భవానీ ద్వీపానికి బోట్ల రాకపోకలను పర్యాటక శాఖ అధికారులు నిలిపివేశారు. కృష్ణమ్మ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నది మధ్యలో ఉన్న ద్వీపానికి బుధవారం సందర్శకులను అనుమతించలేదు. పర్యాటక శాఖ బోట్లను పున్నమి ఘాట్‌కే పరిమితం చేశారు. ఒడ్డున తాళ్లతో కట్టేసి ఉంచారు.

తడబడితే క్షణం.. తల్లడిల్లదా ప్రాణం

ఈ చిత్రంలో వ్యక్తిని చూడండి ఒకచేతిలో ముద్దులొలికే చిన్నారి.. ముందు పిల్లాడిని తీసుకుని ఒంటి చేత్తో ద్విచక్ర వాహనాన్ని ఎంత ప్రమాదకరంగా నడుపుతున్నాడో. ఎంత జాగ్రత్తగా ఉన్నా ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో తెలియదు. అలాంటిది మనమే నిర్లక్ష్యంగా ప్రమాదానికి ఎదురెళ్తే అనర్థమే. అది కూడా నిత్యం భారీ వాహనాలతో ఎంతో రద్దీగా ఉండే ఆటోనగర్ ప్రాంతంలో కూడళ్లు దాటుకుంటూ వెళ్తున్న దృశ్యమిది.

-ఈనాడు, అమరావతి



ఆ అభ్యర్థుల దరఖాస్తులను మాన్యువల్‌గా స్వీకరిస్తాం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ వైద్య విద్య ప్రవేశాల కౌన్సెలింగ్‌లో తమను స్థానికులు(లోకల్)గా పరిగణించాలని హైకోర్టును ఆశ్రయించిన 51 మంది అభ్యర్థుల దరఖాస్తులను మాన్యువల్‌గా స్వీకరిస్తామని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఆగస్టు 14వ తేదీలోగా కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తమను ఆదేశించినందున మాన్యువల్‌గా దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తామని చెప్పారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాతే ఐచ్ఛికాలు పెట్టుకునే అవకాశం ఇస్తామని వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల ప్రవేశానికి దాదాపు 13 వేల దరఖాస్తులు వచ్చాయని, ప్రస్తుతం వాటి పరిశీలన జరుగుతోందని, ఆగస్టు 10 లోగా మెరిట్ లిస్ట్ విడుదల చేసి, ఐచ్ఛికాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సెప్టెంబరు 9న స్నాతకోత్సవం: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సెప్టెంబరు 9న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ స్నాతకోత్సవంలో దిల్లీ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఒ.పి.యాదవకు డాక్టర్ ఆఫ్ సైన్స్ ఇచ్చేందుకు విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ అనుమతి ఇచ్చారని రిజిస్ట్రార్ తెలిపారు.

జీవవైవిధ్యం.. నవ దేదీప్యం

అమరావతిలో 20 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి


ఉద్దండరాయునిపాలెంలో జంగిల్ క్లియరెన్స్

రాజధాని అమరావతిలో బయోడైవర్సిటీ నర్సరీ ఏర్పాటు కానుంది. ఇందుకు ఇప్పటికే సీఆర్డీఏ సన్నాహాలు ప్రారంభించింది. భవిష్యత్తు అవసరాలకు అక్కరకొచ్చేలా దీనిని సిద్ధం చేశారు. ఈ నర్సరీ నమూనాలు ఖరారయ్యాయి. ఉద్దండరాయునిపాలెంలో దీనికి కేటాయించిన ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయ్యాక చుట్టూ కంచె వేయనున్నారు. పూర్తిగా.. ఇక్కడి వాతావరణం, నేలలకు తగిన మొక్కలను పెంచనున్నారు. వీటినే పచ్చదనం పెంపునకు ఉపయోగించనున్నారు. రోడ్ల పక్కన, ఉద్యానాలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఇక్కడి మొక్కలను వాడనున్నారు. నర్సరీని ఆరు నెలల్లో సిద్ధం చేయాలని ప్రణాళిక రచించారు.

రాజధాని అవసరాల కోసం..

ఉద్దండరాయునిపాలెంలో నర్సరీ ఏర్పాటుకు సీఆర్డీఏకు గతంలో తెదేపా ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించింది. 2015లో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతం ఎదురుగా.. కరకట్ట దిగువన ఈ స్థలం ఉంది. ఇందులో ఇప్పటికే 5 ఎకరాలను శిక్షణ అవసరాల కోసం ఉద్యాన శాఖకు సీఆర్డీఏ ఇచ్చింది. అది పోగా మిగిలిన 20 ఎకరాలలో నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు. ★ స్థానిక భౌగోళిక పరిస్థితులను తట్టుకునేవి, జీవవైవిధ్యాన్ని పెంపొందించే రకాలనే ఇక్కడ పెంచనున్నారు. ఏ రకాలు వేయాలనే దానిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. తర్వాత ఆ రకాలను ప్రత్యేక కమిటీ పరిశీలించి ఆమోదం తెలపనుంది. ఇక్కడి పక్షులు, జంతుజాలం మనుగడకు ముప్పు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.

★ ఈ ప్రాంతంలో అనేక పరిమితులు ఉన్నాయి. చాలాచోట్ల మధ్యస్థ క్షార గుణం నేలలు అధికంగా ఉన్నాయి. దీనికితోడు అధికంగా బంక మట్టి నేలలు కనిపిస్తాయి. కొన్నిచోట్ల భూగర్భ జలంలో లవణ శాతం ఎక్కువ ఉన్నట్లు పరిశీలనతో తేలింది. భూగర్భ జలం కేవలం 7 అడుగుల నుంచి 30 అడుగుల లోపు ఉంటుంది. పలు రకాల మొక్కలు నీరు అధికంగా ఉండేచోట బతకలేవు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేస్తున్నారు.

అభివృద్ధి చేయనున్న థీమ్ పార్కు..

★ ఈ నర్సరీలో పాలిహౌస్‌లు, షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా సీతాకోకచిలుకల పార్కును డిజైన్ చేశారు. ఔషధ గుణాలున్న మొక్కల కోసం కొంత ప్రాంతాన్ని ఉద్దేశించారు. ఇందులో వర్మీ కంపోస్టు తయారీ యూనిట్‌ను కూడా నిర్మిస్తారు. ఇక్కడ తయారైన సేంద్రియ ఎరువునే ఉపయోగించనున్నారు. బోన్సాయ్ రకాలను కూడా విరివిగా పెంచనున్నారు. ఇందులోనే థీమ్ పార్కును కూడా అభివృద్ధి చేయనున్నారు. ★ రాజధాని అవసరాలకే కాకుండా.. చుట్టుపక్కల పట్టణాలకు కూడా ఇక్కడి నుంచి మొక్కలను సరఫరా చేస్తారు. తర్వాత దశలో అమరావతిలో ప్రజల రూఫ్‌టాప్, పెరట్లో మొక్కల పెంపకంపై శిక్షణ కూడా ఇచ్చి.. సరఫరా చేస్తారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు డ్రోన్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని రమేష్ ఆసుపత్రి కూడలిలో సాయంత్రం వేళ వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. కొద్ది క్షణాల్లో ఆకాశంలో ఎల్ఈడీ లైట్ల ధగధగలతో డ్రోన్ కనిపిస్తుంది. అక్కడే చక్కర్లు కొడుతూ.. ఆగిన ట్రాఫిక్‌ను చూస్తుంది. ఇంతలో సైరన్ మోతతో లైట్లు వెలిగించుకుంటూ ఓ ద్విచక్రవాహనం వచ్చేస్తుంది. నిబంధనలు ఉల్లంఘించి.. అడ్డదిడ్డంగా వెళ్లే వారు ఒక్కసారిగా అప్రమత్తమై క్షణాల్లో చకచకా సర్దుకుంటారు. అప్పటి వరకు ఆగిన వాహనాలు.. ముందుకు పరుగులు తీస్తాయి. దీన్ని సుసాధ్యం చేసేందుకు విజయవాడ పోలీసులు మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

45 ఆధునిక ద్విచక్ర వాహనాలు

విజయవాడలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లలో నిలిచిపోతున్న వాహనాలు.. ట్రాఫిక్ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. వీవీఐపీ వస్తున్నారంటే చాలు.. సిబ్బంది మొత్తాన్ని రోడ్లపైనే నిలబెడతారు. ఎప్పుడు ఎక్కడ నిలిచిపోతుందో అనుకుంటూ గుండెలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. తాజాగా.. ఈ తరహా ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఎన్టీఆర్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికార్లకు ఒక్కొక్కరికి ఒక్కో డ్రోన్ చొప్పున మొత్తం 14 డ్రోన్లను గురువారం (నేడు) అప్పగించనున్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో.. తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే ప్రాంతాల్లో వీటి సాయంతో నిఘా ఉంచుతారు.



ఆధునికత ఉట్టిపడేలా...

ట్రాఫిక్ నిలిచిపోయిన ప్రాంతాలకు తక్షణం చేరుకునేందుకు పోలీసులకు ద్విచక్రవాహనాలు ఇస్తున్నారు. వీటిని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. వాహనం వెనుక, ముందు భాగాల్లో లైట్లు వెలుగుతుంటాయి. సైరన్ మోగుతుంది. ఈ వాహనంలో ప్రత్యేకమైన మైక్ కూడా ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతూనే సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తారు. మొత్తం 45 ప్రత్యేకమైన ద్విచక్ర వాహనాలను సిద్ధం చేసారు. వీటిని డీజీపీ చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు అప్పగించనున్నారు.

పశ్చిమ బైపాస్‌కు.. అనుసంధాన దారులు..!

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పెరుగుతున్న వాహన రద్దీ నేపథ్యంలో జాతీయ రహదారుల విస్తరణతోపాటు అనుసంధాన సర్వీస్ రోడ్లు, సబ్‌వేల ఏర్పాటు అత్యవసరం. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే జాతీయ రహదారిని పున్నమిఘాట్ వరకు విస్తరణ, పశ్చిమ బైపాస్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్లు, గొల్లపూడి నుంచి జక్కంపూడికి రహదారి విస్తరణ, కృష్ణలంక ప్రాంతంలో సబ్‌వేల ఏర్పాటు.. ప్రాజెక్టులను చేపట్టాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి.. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లోని గడ్కరీ కార్యాలయంలో మంత్రి, ఎంపీ తాజాగా భేటీ అయ్యారు. ప్రజల ప్రయాణ భద్రతకు ఈ నాలుగు ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేయాలని నివేదించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారనీ, వెంటనే జాతీయ రహదారుల అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారని ఎంపీ చిన్ని వెల్లడించారు.

ఎన్‌హెచ్-65ను పున్నమిఘాట్ వరకు విస్తరించాలి.. విజయవాడ నుంచి హైదరాబాద్ మధ్యలో ఉన్న ఎన్‌హెచ్65 జాతీయ రహదారిని ఆరు వరసలుగా ప్రస్తుతం విస్తరించేందుకు అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. దీనిని విజయవాడ నగరం వెలుపల వరకే పరిమితం చేయకుండా, భవానీపురంలోని పున్నమిఘాట్ వరకు ఆరు వరసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రికి తాజాగా నివేదిక అందజేశారు. దీంతో భవిష్యత్తులో తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా అడ్డుకోవచ్చని వివరించారు.

గొల్లపూడి-జక్కంపూడి దారి నాలుగు వరుసలు


కేంద్రమంత్రి గడ్కరీకి నివేదిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ చిన్ని

గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి.. విజయవాడ పశ్చిమ బైపాస్ ప్యాకేజీ 03లో భాగంగా గొల్లపూడి నుంచి పెదఅవుటపల్లి వరకు రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు మంజూరు చేయలేదు. ఈ రహదారి గ్రామీణ ప్రాంతాలను విజయవాడ నగరానికి, అమరావతి రాజధాని ప్రాంతానికి సైతం కలిపే అనుసంధానంగా మారబోతున్నందున, సర్వీస్ రోడ్లు లేకపోతే ప్రమాదాలు పెరుగుతాయని కేంద్ర మంత్రికి వివరించారు. గ్రామీణులు వ్యవసాయానికి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు, ఎడ్ల బండ్లను వినియోగిస్తుంటారనీ, వాటిపై జాతీయ రహదారిపైకి వస్తే.. ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. సర్వీస్ రోడ్ల ఏర్పాటుతో వాళ్లు జాతీయ రహదారిపైకి రాకుండా పక్కనుంచి వెళ్లిపోతారని తెలిపారు.

నగరంలో సబ్‌వేలు లేక...

విజయవాడ నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి తూర్పు నియోజకవర్గంలో ఉండే ప్రాంతాలను రెండుగా విభజిస్తూ మధ్యలో నుంచి వెళుతోంది. ప్రధానంగా కృష్ణలంక-ఎంజీరోడ్డు, రాణిగారితోట-వెటర్నరీ హాస్పిటల్ రోడ్డుకు గతంలో అనుసంధానం ఉండేది. నిత్యం వేల మంది తిరిగే మార్గాలివి. ప్రస్తుతం సబ్‌వేలు లేక ప్రజలు కిలోమీటర్ల దూరం వెళ్లి.. రోడ్డును దాటుతున్నారు. సబ్‌వేలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

5.5 కిలోమీటర్లు అత్యంత కీలకం..

గొల్లపూడి నుంచి జక్కంపూడి వరకు ప్రస్తుతం ఉన్న 5.5 కిలోమీటర్ల రహదారిని నాలుగు వరసలుగా విస్తరించడంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రహదారి హైదరాబాద్-విజయవాడ మధ్య ఉన్న ఎన్‌హెచ్ 65, నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎన్‌హెచ్163జి, చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్16, విజయవాడ ఇన్నర్‌రింగ్‌రోడ్డు, జక్కంపూడి ఎకనమిక్ సిటీ దారులను కలుపుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే నిత్యం 30వేల మందికి పైగా ప్రయాణికులు తిరుగుతున్నారు. ఇంత కీలక రహదారికి కేంద్ర రహదారులు మౌలిక సదుపాయాల నిధి(సీఆర్ఐఎఫ్) ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు.



(c) eenadu

ఇదేంది బంగారు..!

లబ్ధిదారుల్లో అనర్హులు ఉండడంపై ఆక్షేపణలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే



ఇటీవల పారామౌంట్ పరిశ్రమ యాజమాన్యం దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలు

☛ ఇటీవల పెనుగంచిప్రోలు పంచాయతీ కార్యాలయంలో పీ4 పథకంలో బంగారు కుటుంబాల లబ్ధిదారుల అర్హుల జాబితాపై గ్రామసభ జరిగింది. జాబితాలో చేర్చిన పేర్లను చదివి వినిపిస్తుండగా గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. సభకు వచ్చిన మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు మాట్లాడుతూ జాబితాలో పేదల కంటే ధనికులే అధికంగా ఉన్నారని, ఇలా ఎంపిక జరిగితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని సర్వే జరిగిన తీరుపై ఆక్షేపణ వ్యక్తం చేశారు.

☛ కొణకంచి, ముండ్లపాడు, నవాబుపేటకు చెందిన 202 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని స్థానికంగా ఉన్న పారామౌంట్ పరిశ్రమ యాజమాన్యాన్ని అధికారులు కోరారు. జాబితాపై పరిశ్రమ యాజమాన్యం సొంతంగా సర్వే చేయగా అందులో 27 కుటుంబాలు మాత్రమే అర్హులుగా తేల్చారు. మిగిలిన వారికి ఆస్తులు, కొందరి పిల్లలు విదేశాల్లో ఉద్యోగాల్లో ఉన్నట్లు గుర్తించారు. తాము అర్హులను మాత్రమే దత్తత తీసుకుంటామని యాజమాన్యం నిర్మొహమాటంగా చెప్పేసింది. మండలంలోని మిగిలిన గ్రామాల్లో సైతం ఇదేవిధంగా ఎంపిక జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 లబ్ధిదారుల ఎంపిక ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల వ్యాప్తంగా గందరగోళంగా మారింది. గ్రామసభల్లో అధికారులు విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంట్లో తమ తప్పిదం ఏమీ లేదని, సిస్టమ్ జనరేట్ చేసిందని అధికారులు, సిబ్బంది సమాధానమిస్తున్నారు.

ఎంపిక ఎలా జరిగిందంటే..

ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి యాప్ ద్వారా సర్వే చేశారు. ఒక కుటుంబంలో సభ్యుల జీవన విధానం ఎలా ఉందని 16 రకాల ప్రశ్నలు యాప్‌లో పొందుపర్చారు. సొంతిల్లు ఉందా? స్థిర, చరాస్తులు, ఉద్యోగాలు, నెలకు ఎన్ని యూనిట్ల విద్యుత్తు వాడుతున్నారు? గ్యాస్ సదుపాయం, టీవీ, ఫ్రిజ్ ఇలా ప్రశ్నలున్నాయి. యాప్‌లో ప్రశ్నలకు ఎదురుగా ఉంది, లేదు అనే బాక్సుల్లో టిక్‌లు పెట్టారు. అవన్నీ కలిపి జిల్లా యూనిట్ కేంద్రానికి చేరతాయి. వాటి ఆధారంగా సిస్టమ్ అర్హులను జనరేట్ చేసింది. ఇలా జరిగిన సర్వేలో సిబ్బంది సరిగా ఇళ్లకు వెళ్లకుండానే టిక్కులు పెట్టడం వల్లే అనర్హులు జాబితాలోకి వచ్చారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

☛ పెనుగంచిప్రోలు మండలంలో 15 గ్రామాల నుంచి 1,428 మందిని అర్హులుగా జాబితా రూపొందించారు. వారందరినీ దత్తత తీసుకునేందుకు మార్గదర్శకుల కోసం అధికారులు విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉరిమితే ఏరు.. ఉప్పెనే కన్నీరు!

దాములూరు వంతెనకు అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం



వంతెనకు అనుసంధాన రోడ్డు లేక ఇలా..

నందిగామ, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే ముఖ్యమైన రోడ్డు వత్సవాయి- చెవిటికల్లు మార్గం. ఈ దారిలో నందిగామ మండలం దాములూరు వద్ద వైరా ఏరుపై తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్లు లేవు. ఇందుకు ప్రస్తుతం నిధులు మంజూరైనా పనుల్లో కదలిక లేదు.

వైరా ఏటికి వరదలొస్తే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీనివల్ల 40 గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వస్తున్న వరదలకు దాములూరు వద్ద ఏటిపై లోలెవల్ వంతెన మీద రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీనివల్ల రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. గత వైకాపా ప్రభుత్వంలో వంతెనకు అనుసంధానంగా అప్రోచ్ రోడ్లు నిర్మాణానికి నోచుకోలేదు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నుంచి నిధులు కేటాయించినా పనులు జరగలేదు. గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేయలేదు. దీనివల్ల పల్లంపల్లి- కొణతమాత్మకూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు, దాములూరు వద్ద వంతెనకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వంలో కదలిక: కూటమి ప్రభుత్వం వచ్చాక ‘ఈనాడు’లో దాములూరు వంతెన గురించి వరుస కథనాలు ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య ఆదేశాలతో వంతెనకు అనుసంధానంగా రోడ్ల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఎన్‌డీబీ నిధులతో మళ్లీ అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించగా ఆమోదించారు. అనంతరం గుత్తేదారు సంస్థకు పనుల బాధ్యతలు అప్పగించారు. పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుంది. వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే చాలు: దాములూరు వంతెనకు అనుసంధానంగా రెండు వైపులా కలిపి 400 మీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మించారు. వంతెనకు అటు వైపు పల్లంపల్లి, ఇటు వైపున దాములూరు గ్రామాలు ఉన్నాయి. అప్రోచ్‌లు నిర్మిస్తే వైరా ఏటికి ఎంత వరదొచ్చినా రాకపోకలకు ఇబ్బంది ఉండదు.

ఎన్‌డీబీలో నిధులు మంజూరు

- పరుశురాముడు, డీఈ, జగ్గయ్యపేట

ఎన్‌డీబీలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గుత్తేదారుడికి ఆరోగ్య సమస్య రావటంతో నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. వెంటనే పనులు ప్రారంభించేలా ప్రయత్నాలు చేస్తాం.

అత్యవసర సేవలు పొందండిలా..!

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే



ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలకు టోల్‌ఫ్రీ నంబర్లు ఉన్నాయి. వీటి ద్వారా 24×7 సేవలు అందిస్తున్నారు. వీటికి కాల్ చేస్తే ఛార్జీలు పడవు. ఉచితంగా సేవలు అందిస్తాయి. ఏయే రకాల సమస్యలకు ఏయే నంబర్లు ఉన్నాయో చూద్దామా...

డయల్ 112 పోలీస్ అత్యవసర సేవలు పొందవచ్చు. ఫోన్ చేయగానే తక్షణమే పోలీస్‌లు లైనులోకి వస్తారు. వివరాలు తెలుసుకుంటారు. మీ ఫిర్యాదు స్వీకరించి.. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపిస్తారు. అక్కడి పోలీసులు మీ వద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తారు.

1930 ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే ఈ నంబరుకు ఫోన్ చేయాలి. మీ ఖాతా నుంచి డబ్బులు మాయమైనా..? డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని బెదిరించడం, అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి, మిమ్మలన్ని మోసం చేసినా.. తక్షణం ఈ నంబరుకు ఫోన్ చేస్తే.. మీకు సాయం చేస్తారు. మీ ఖాతా నుంచి పోయిన డబ్బులు ఎక్కడకు వెళ్లాయో గుర్తించి దాన్ని ఫ్రీజ్ చేయిస్తారు. కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పంపుతారు.

1098 బాలల హెల్ప్‌లైన్ నంబరు ఇది. బాలలపై లైంగిక వేధింపులు, బాల కార్మికులను ఎక్కడైనా గుర్తించినా, అక్రమ రవాణాకు గురవుతున్న పిల్లలను గుర్తించినా, వీధుల్లో ఒంటరిగా ఉంటున్న వీధి బాలలను గుర్తించినా, మాదకద్రవ్యాలకు అలవాటు పడినా. . ఈ నంబరుకు కాల్ చేస్తే వారు స్పందిస్తారు. పిల్లలను సంరక్షణలోకి తీసుకుని సంరక్షణ కేంద్రాల్లో చేరుస్తారు.

181 మహిళలకు కావాల్సిన సమాచారం ఇస్తుంది. అత్యవసర పరిస్థితిలో ఈ నంబరుకు ఫోన్ చేయవచ్చు. పోలీస్, న్యాయపరమైన సేవల కోసం సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తుంది. మహిళలు ఆయా సేవలు పొందడంలో సాయ పడుతుంది. వన్‌స్టాప్ సెంటర్ల వివరాలు తెలియజేస్తుంది. గృహ హింసకు గురైతే. . ఈ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. తక్షణం వారు స్పందించి సేవలు అందిస్తారు.

1073 ట్రాఫిక్ పోలీసులు 24×7 సేవల కోసం దీనిని ఏర్పాటు చేశారు. రోడ్లపై ట్రాఫిక్ అత్యవసర సేవల కోసం ఫోన్ చేయవచ్చు. ఏదైనా ప్రాంతంలో ఏ కారణం చేతైనా భారీగా ట్రాఫిక్ నిలిచిపోతే.. సమాచారం అందిచొచ్చు. ఎక్కడైనా ట్రాఫిక్ ఇబ్బందులు వస్తుంటే కారణాలు తెలియజేయవచ్చు.

101 అగ్నిప్రమాదాలు జరిగితే ఈ నంబరుకు సమాచారం ఇస్తే.. అగ్నిమాపకశాఖ స్పందిస్తుంది. గ్యాస్ లీకేజీలు, బోరు బావుల ప్రమాదాలు, నీళ్లలో ఎవరైనా పడిపోయినా.. తదితర అత్యవసర సేవల్లో ఈ నంబరుకు ఫోన్ చేసి, రక్షణ పొందవచ్చు.

వరద నీటి మళ్లింపునకు ఏర్పాట్లు



రివర్‌ఫ్రంట్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద ముంపు ప్రాంతాలే కాకుండా నగరపాలకసంస్థ పరిధిలోని 42 వర్షపు నీటి నిల్వలు ఉండే ప్రదేశాల వద్ద ఎమినిటీస్, ప్లానింగ్, శానిటరీ కార్యదర్శులను మూడు షిఫ్టుల్లో పని చేసేలా ఏర్పాటు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. వరద ముంపునకు అవకాశం ఉన్న ప్రాంతాలైన రామలింగేశ్వరనగర్ సాయిరాం కట్‌పీసెస్ రోడ్డు, కృష్ణలంక రివర్‌ఫ్రంట్ పార్క్ ప్రాంతాలను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి బుధవారం కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా రక్షణగోడ వద్ద ప్రవాహం పెరిగినప్పుడు నీటిని మళ్లించే వివరాలను కలెక్టర్‌కు కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. వరద ముంపు ప్రాంతాల్లో వర్షాకాల స్పందన బృందాలు మూడు షిఫ్టుల్లో పనిచేస్తాయన్నారు. వరద ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు రక్షణగోడ వద్ద ఉండే ఇంజినీరింగ్ సిబ్బంది మోటార్లతో నీటిని ప్రజలు నివసించే ప్రాంతాలకు రానివ్వకుండా డ్రెయిన్‌లో మళ్లించనున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కె.చైతన్య, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ముఖ్య వైద్యాధికారి డాక్టర్ కె.అర్జునరావు, ఈఈలు పి.సత్యనారాయణ, జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

పారామౌంట్ పరిశ్రమలో ఆర్డీవో విచారణ



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దారు శాంతిలక్ష్మి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కొణకంచి సమీపంలోని పారామౌంట్ పరిశ్రమను నందిగామ ఆర్డీవో బాలకృష్ణ బుధవారం సందర్శించి విస్తరణకు సంబంధించిన భూముల అనుమతుల విషయమై ప్లాంట్ అధికారులతో చర్చించారు. ప్లాంట్ విస్తరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని సామాజిక మాధ్యమం వేదికగా ప్లాంట్ అధినేత వెనిగళ్ల సురేష్ మంగళవారం ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు తహసీల్దారు శాంతిలక్ష్మితో కలిసి ఆర్డీవో బాలకృష్ణ విస్తరణ చేపట్టనున్న భూములను పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులకు రెవెన్యూ పరంగా వెంటనే అనుమతులు ఇస్తామని తెలిపారు. ప్లాంట్ అధినేత సురేష్‌తో ఆర్డీవో ఫోన్‌లో మాట్లాడి త్వరలోనే అన్ని రకాల అనుమతులు ఇస్తామన్నారని ప్లాంట్ ప్రతినిధులు వెల్లడించారు.

పెనుగంచిప్రోలు తహసీల్దారుకు షోకాజ్ నోటీస్

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పెనుగంచిప్రోలు తహసీల్దారు శాంతిలక్ష్మికి కలెక్టర్ లక్ష్మీశ బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పారామౌంట్ స్టీల్ పరిశ్రమ విస్తరణకు సంబంధించిన భూముల అనుమతుల విషయంలో తహసీల్దారు రూ.8 లక్షలు డబ్బులు డిమాండ్ చేశారని, ఇలాంటి అవినీతి అధికారుల తీరుతో పరిశ్రమలు నడపలేమని యజమాని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడం కలకలం రేగింది. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ తహసీల్దారుకు షోకాజ్ నోటీస్ జారీ చేసి విచారణకు ఆదేశించారు. పరిశ్రమకు చెందిన భూముల అనుమతులను నెల రోజుల్లోగా పూర్తి చేయాల్సి ఉండగా.. తహసీల్దారు 13 రోజుల్లోనే చేశారన్నారు. అయితే అవినీతి ఆరోపణలు రావడంతో షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు చెప్పారు.

రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు కసరత్తు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా. పక్కన డీఆర్వో లక్ష్మీనరసింహం, ఆర్డీవోలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై కలెక్టర్ జి.లక్ష్మీశ ఆగ్రహం వ్యక్తం చేసిన క్రమంలో.. ఆయా శాఖల ప్రక్షాళనకు కసరత్తు ఆరంభించారు. రెవెన్యూ, సర్వే, భూసేకరణ, పౌరసరఫరాలు తదితర విభాగాల అధికారులతో నగరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియా బుధవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సేవల దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని, ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్జీల సమస్యలను గడువులోగా, ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ, రీసర్వే, నూతన రేషన్ కార్డులు, ఈ-కేవైసీ, రేషన్ సరకుల పంపిణీ తదితరాలపై చర్చించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, డీఎస్‌వో ఎ.పాపారావు, సర్వే శాఖ ఏడీ పి.తివిక్రమరావు, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికురాలిపై దాడి చేశారని ఆందోళన



మైలవరం పంచాయతీ కార్యాలయ కూడలిలో నిరసన

మైలవరం, న్యూస్‌టుడే: పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిపై తెదేపా నాయకుడు కటారు ఉమామహేశ్వరరావు దాడి చేశారంటూ బుధవారం కార్మికులు రహదారిపై బైఠాయించడం ఉద్రిక్తతకు దారి తీసింది. తక్షణమే కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేయాలని, అదుపులోకి తీసుకోవాలంటూ దాదాపు నాలుగు గంటలకు పైగా విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయ కూడలిలో నిరసన తెలిపారు. బాధితురాలిని ఆస్పత్రిలో చేర్పించి ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ వారికి నచ్చజెప్పినా ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని అక్కడే కూర్చున్నారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డులో బుధవారం నివాసాల నుంచి చెత్త సేకరిస్తున్న కార్మికురాలు బిజిలి భవాని, ఆ ప్రాంతంలోని ఓ ఇంటి నుంచి చెత్త తీసుకెళ్లే విషయంలో ఓ మహిళతో వాదన చోటుచేసుకుంది. విషయం తెలుసుకొని అక్కడ వచ్చిన కటారి ఉమామహేశ్వరరావు తనను కాలితో తన్నుతూ అసభ్య పదజాలంతో దూషించాడని ఏడుస్తూ, బాధితురాలు తోటి కార్మికులకు తెలిపింది. దాంతో సీపీఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ కార్మికులకు మద్దతుగా వారితో కలిసి కూడలిలో బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న సీఐ చంద్రశేఖర్, సుధాకర్ వాళ్లను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. కొన్ని గంటల తర్వాత కార్మికులను సైతం ధర్నా ప్రాంతం నుంచి పంపించారు. ఆ సమయంలో కార్మికులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో రెడ్డిగూడెం ఎస్ఐ మోహన్‌రావు చేతికి చిన్న గాయమైంది. అనంతరం బాధితురాలిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిర్యాదుపై విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

యువకుల నుంచి డ్రగ్స్ స్వాధీనం

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే : బెంగళూరు నుంచి విజయవాడకు గుట్టుచప్పుడు కాకుండా ఎండీఎంఏ అనే డ్రగ్‌ను తీసుకువచ్చిన ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వీరి నుంచి ఒక గ్రాము సరకు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సందీప్ అనే యువకుడికి డ్రగ్స్ ఇచ్చేందుకు అతని స్నేహితుడు కిరణ్ బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చాడు. బుధవారం బి.ఆర్.టి.ఎస్.రోడ్డులో చేతులు మారుతుండగా.. పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. బెంగళూరు నుంచి తరచూ ఎండీఎంఏ విజయవాడకు వస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 11న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 5.2 గ్రాముల మిత్ అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. దీనిని కూడా బెంగళూరు నుంచి తీసుకువచ్చినట్లు తేలింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్డర్ చేస్తే.. విజయవాడకు తెచ్చి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు.. సూత్రధారులను పట్టుకునేందుకు బెంగళూరు వెళ్లారు. అక్కడి పబ్‌ల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లు గుర్తించారు. ఈ గుట్టు వీడకముందే మరోసారి బెంగళూరు నుంచి డ్రగ్స్ రావడంతో నగరంలో కలకలం రేగింది. పట్టుబడిన ఇద్దరూ విద్యార్థులనేనని గుర్తించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి.. కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి సరకు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బెంగళూరు ముఠా.. విజయవాడ కేంద్రంగా దందా కొనసాగించడంపై నగరవాసుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పది టన్నుల కూరగాయల వితరణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే అన్నప్రసాదానికి విస్సన్నపేట కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పది టన్నుల కూరగాయలు వితరణగా పంపించినట్లు సమితి అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు తెలిపారు. కూరగాయలు తిరుపతి తీసుకెళుతున్న లారీని ఆయా ప్రతినిధులు ప్రారంభించారు. కూరగాయలు పంపించేందుకు సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



లారీని ప్రారంభించిన కాకతీయ కమ్మ సేవా ప్రతినిధులు

రవాణా శాఖ ప్రతిష్ఠ పెంచుదాం



సుందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్టీవోలు ప్రవీణ్, వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజుబాబు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వాహన యజమానులు, చోదకులకు పారదర్శక సేవలు అందించి రవాణా శాఖ ప్రతిష్ఠను పెంచాలని ఆ శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వడ్డే సుందర్ పేర్కొన్నారు. బుధవారం ఉపరవాణా కమిషనర్ కార్యాలయాన్ని ఆయన తొలిసారిగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వాహన్ పోర్టల్ ద్వారా సేవలు అందించే సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రవాణా శాఖ ఉద్యోగుల పదోన్నతులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన సమయానికి పరిష్కరించి నివేదికలు సమర్పించాలన్నారు. డాష్‌బోర్డ్‌లో పెండింగ్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగమురళి, ఏఓలు సత్యనారాయణ, అబ్దుల్ సత్తార్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 131 చికెన్ విత్ స్కిన్ - 190, చికెన్ స్కిన్‌లెస్ - 216.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, 124, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 290.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

గుంటూరులో ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభ

గాంధీనగర్, న్యూస్‌టుడే : ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడు మోటూరు హనుమంతరావు 24వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభను ఆగస్టు 1న గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎం.వి.ఎస్.శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 45వ వార్షికోత్సవ ప్రధాన సంచికను ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రజాశక్తి జర్నలిస్టులకు ఇచ్చే వి.ఆర్.భమ్మారెడ్డి జర్నలిస్టు పురస్కారాలకు ఈ ఏడాది మంచికలపూడి శివాజీ (అమరావతి బ్యూరో), పీతల రాజశేఖర్ (రాజోలు విలేకరి) ఎంపికయ్యారు. శుక్రవారం సభలో వీరికి నగదు పురస్కారం అందజేయనున్నారు.

మరో రెండు కేంద్రాల్లో దస్త్రాల పరిశీలన

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలో ఏఆర్టీ, సరోగసీ కేంద్రాల్లో తనిఖీల ప్రక్రియ మూడో రోజు కూడా కొనసాగింది. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని సారథ్యంలోని బృందం ఫెర్టీ-9, డాక్టర్ సురేంద్ర జాస్తి ట్రస్టు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దస్త్రాలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జర్మనీలో ఉపాధి అవకాశాలు

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన 35 ఏళ్ల వయసులోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు ఏడో తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారిత శాఖ అధికారిణి ఎం.రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, రెండేళ్ల క్లినికల్ అనుభవం లేదా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని సూచించారు. ముందుగా జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రెజ్యూమ్, విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రాలు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 94402 01284, 70756 24856 చరవాణి నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

హజ్ ఎంబార్కేషన్ పాయింట్ పునరుద్ధరణ

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయానికి హజ్ ఎంబార్కేషన్ పాయింట్‌ను పునరుద్ధరిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 ఏడాదికి రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు విజయవాడ నుంచి వెళ్లేలా గన్నవరం విమానాశ్రయానికి ఎంబార్కేషన్ పాయింట్‌ను పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు ఇటీవల లేఖ రాశారు. దీనిపై ఆయన స్పందిస్తూ హజ్ ఎంబార్కేషన్ పాయింట్‌ను పునరుద్ధరిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక వినతితోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. విజయవాడ నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తోందని, దీన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయవాడ నుంచి వెళితే రాష్ట్ర ప్రభుత్వం వసతులు, సేవల ఏర్పాట్లను మరింత బాగా చేయడానికి వీలవుతుందని తెలిపారు.

Short Tender Notice

Andhra Pradesh Medicinal & Aromatic Plants Board
(Health Medical & Family Welfare Department)
Government of Andhra Pradesh

Tender No.: APMAPB/IT/2025-26/01 **Date: 30-07-2025**

Sealed tenders are invited from eligible and experienced IT firms/agencies for the **Design, Development, Deployment and Maintenance of a Web Application** for the Andhra Pradesh Medicinal & Aromatic Plants Board (APMAPB). **Scope of Work:** Development of a dynamic, responsive and user-friendly web portal with modules for farmer registration, plant database, scheme monitoring and MIS reporting. **Eligibility Criteria:** ● Minimum 3 years of experience in web application development for government or public sector. ● Prior experience in database-driven applications. ● GST registration and PAN mandatory. **Last Date for Submission:** Before 05:00 p.m. on 11-08-2025 **Opening of Sealed Tenders:** 11:00 am. on 12-08-2025. Tender documents with terms and conditions can be obtained from 01-08-2025, on any working day between 10.30 a.m. and 5.00 p.m., in the office of CEO AP Medicinal & Aromatic Plants Board, 5th Floor, Jasthi Towers, Saipuram Colony, Gollapudi, Vijayawada-521 225, Ph. No: 0866-2410234.

Chief Executive Officer, AP Medicinal & Aromatic Plants Board

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనుటకు. ... సంప్ర: 81422 92071.
బంగారం కొనుటకు. ... సంప్ర: 87907 41166.

REAL ESTATE
HOUSE FOR SALE
... 2BHK Houses ... ☏ 98496 88151.
LAND FOR SALE
... Ph: 9133574455.

EDUCATION
Prabhas Colleges, VJA: Regular/ Dist/ Online: MBA, MCA, MA, M.Com, M.Sc, BCA, BBA, B.Sc, BA, ADMS, L.Dc 10-08-2025. Ph: 99634 72800, 99634 72816, 94935 32325.

HEALTH & CARE

PEOPLE CARE
OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. ... ☏ 99590 21122, 99635 21122.
విశ్వశాంతి గ్రూప్ (AP No:1) VJA. ... ☏ 82474 49036, 95052 76877.
బాలాజీ గ్రూప్ (AP No:1) VJA. ... ☏ 97064 72233, 98404 96677.

TO LET
COMMERCIAL
2000 sft commercial space for rent near Amma Kalyana mandapam. Contact: 9441120033
1600 చ.అ. ... ☏ 93929 24469.
... ☏ 96525 00311.

JOBS
... ☏ 99690 31122, 96769 01122.
... ☏ 94935 75370.

రామకృష్ణ గ్రూప్, VJA, HYD. ... ☏ 95736 91122, 99690 01122.
... ☏ 99635 21122, 99631 01122.
... ☏ 91173 35969.
... ☏ 99998 06121, 86397 71756.
... ☏ 7331191175.

DRIVERS
... 96183 82562 / 040-35861715

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జీఎస్‌టీ 5% అదనం

గమనిక

విజయవాడ పశ్చిమ

సినిమాలు

హరిహర వీరమల్లు: అలంకార్, జయరామ్, శైలజ, జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అన్నపూర్ణ, నవరంగ్, స్వర్ణకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)
ది పెంటాస్టిక్ ఫోర్(ఫస్ట్ స్టెప్స్): నవరంగ్(గవర్నరుపేట); పీవీపీ మాల్(బందరురోడ్డు)
-విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:

విద్యుత్తు భారం తగ్గించండి



ప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపడంతో పాటు ప్రజలకు భారంగా మారిన విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 50వ డివిజన్‌లోని గొల్లపాలెం గట్టు క్వారీ ప్రాంతంలో విద్యుత్తు భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. విద్యుత్తు సమస్యలపై ప్రజా సంఘాలు, ప్రజావేదిక పిలుపు మేరకు ఆగస్టు 5వ తేదీ వరకు సంతకాల సేకరణ, సచివాలయాలు, విద్యుత్తు ఉపకేంద్రాల వద్ద ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాజేశ్వరి, గురుమూర్తి, అమీరా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? వాగు సెంటర్ వడ్రుపేట వినాయకుని ఆలయం ఎదురు వీధిలో కాలువల్లో పూడిక తీయడం లేదు. **-గణపతిరావు, స్థానికుడు**
✔ పూడిక తీయిస్తాం. -నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి
? పోతిన ఆదియ్య వీధిలో తాగునీరు రంగుమారి సరఫరా అవుతోంది. **-జయలక్ష్మి, స్థానికురాలు** ✔ సమస్య పరిష్కరిస్తాం. **-రామకృష్ణ, ఏఈ**
? విద్యాధరపురం చెరువు సెంటర్‌లో టీ దుకాణం వద్ద చెత్త పేరుకుపోయింది. **-ఫణికుమార్, స్థానికుడు**
✔ చెత్త తీయిస్తాం. **-డి.రాజు, స్థానిక శానిటరీ అధికారి**
? భవానీపురం స్వాతి సెంటర్‌లో కుక్కల బెడద నెలకొంది. **-రామలింగేశ్వరరావు, స్థానికుడు** ✔ తగిన చర్యలు తీసుకుంటాం. **-సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి**
-న్యూస్‌టుడే: విజయవాడ వన్‌టౌన్,

స్పందనకు వందనం

✿ చిట్టినగర్ సొరంగ మార్గం నుంచి టేనర్‌పేట అడ్డరోడ్డు మార్గంలో కాలువల్లో పూడిక తీయక దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పారిశుద్ధ్య అధికారులు స్పందించి కార్మికులతో పూడిక తీయించారు. ✿ చిట్టినగర్ ఇమ్మానియేల్ స్కూల్ ప్రాంతంలో కాలువలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం ఇవ్వగా, పారిశుద్ధ్య అధికారులు స్పందించి కార్మికులతో పూడిక తీయించారు. ✿ గొల్లపాలెంగట్టు ఆర్సీఎం పాఠశాల ఆవరణలో కాలువలో పూడిక తీయక రోడ్డుపై మురుగు పారుతోందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తేగా.. పారిశుద్ధ్య అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. ✿ వాగు సెంటర్ కొండ ప్రాంతానికి వెళ్లే మెట్ల మార్గంలో పైపులైన్ లీకవుతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

సంరక్షణ చతికిలపడి.. పచ్చదనం కొరవడి..!

భవానీపురం, న్యూస్‌టుడే

వీధులు, కాలనీల్లో పచ్చదనం పెంపొందించే పనులు ఆశించిన స్థాయిలో ముందుకెళ్లడం లేదు. ఈ విషయంలో నగరపాలక సంస్థ అధికారుల ఆదేశాలు అమలు కావడం లేదు. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఉన్నప్పటికీ ఆ దిశగా పటిష్ఠ కార్యాచరణ కొరవడింది.


నాటిన కొన్నాళ్లకే చనిపోయిన మొక్కలు

భవానీపురం, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో ఆ కార్యక్రమం మొక్కుబడి తంతుగా మారింది. ముఖ్యంగా మొక్కలు నాటాక వాటి సంరక్షణను పట్టించుకోవడం లేదు. దీంతో అవి కొన్నాళ్లకే చనిపోతున్నాయి. మరికొన్ని ఎండిపోతున్నాయి. ఫలితంగా లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది.

◆ భవానీపురం హెచ్‌బీకాలనీ, ఊర్మిళానగర్, కరకట్ట, పున్నమిఘాట్ తదితర ప్రాంతాల్లో గతంలో మొక్కలు నాటారు. వాటికి ట్రీగార్డులను సైతం ఏర్పాటు చేశారు. అయితే అవి ప్రస్తుతం అనేక చోట్ల కనిపించడం లేదు. కొన్ని చోట్ల వాటిని ఎత్తుకెళ్లారు. ఖాళీ స్థలాలు, ఉద్యానవనాల్లో నాటినవి సైతం మాయమయ్యాయి. ఉన్నచోట నీరు పోసే వాళ్లు లేక ఎండిపోతున్నాయి. మరికొన్నింటినీ పశువులు తినేస్తున్నాయి. మరోవైపు మొక్కల సంరక్షణ నిమిత్తం తయారు చేయించిన ట్రీగార్డులను నెలల తరబడి హెచ్‌బీకాలనీలోని ఓ ఉద్యానవనానికే పరిమితం చేశారు. దీంతో అవి చెల్లాచెదురయ్యాయి. కొన్ని వర్షాలకు తడిసి తుప్పు పట్టి పాడైపోతున్నాయి. ప్రస్తుతం వాటి చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి.


ట్రీగార్డులు ఇలా..

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ లబ్బీపేటకు చెందిన వేములపల్లి శ్రీలక్ష్మి రూ.1,01,116 విరాళం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించారు. మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో రమేష్, వేద పండితుడు.. విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


దాత శ్రీలక్ష్మికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేద పండితుడు

ప్రమాదాల నివారణకు చర్యలు

భవానీపురం, న్యూస్‌టుడే: కనకదుర్గ పైవంతెన వద్ద ప్రమాదాలను నివారించేందుకు భవానీపురం పోలీసులు చర్యలు చేపట్టారు. రహదారి మధ్యలో రెయిలింగ్ ఏర్పాటు చేయించారు. పైవంతెన వద్ద విభాజిని మీదుగా పాదచారులు, వాహనచోదకులు రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వృద్ధురాలిని కారులో వెళుతున్న వ్యక్తి ఢీకొట్టడంతో చనిపోయింది. ఈ నేపథ్యంలో పాదచారులు, వాహనచోదకులు రోడ్డు దాటకుండా చర్యలు చేపట్టారు.


కనకదుర్గ పైవంతెన వద్ద ఏర్పాటు చేసిన రెయిలింగ్

గుర్తింపుకార్డు ఉంటేనే వీధి వ్యాపారానికి అనుమతి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో వీధివ్యాపారం చేసుకునే వారు కచ్చితంగా గుర్తింపుకార్డు పొందేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. అధికారులు, వెండింగ్ కమిటీ సభ్యులతో బుధవారం ప్రధాన కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే వచ్చేనెల 5వ తేదీతో ముగుస్తుందన్నారు. సర్వే ద్వారా గుర్తింపు పొందిన వారికి కార్డులు అందజేస్తున్నామని, ఇకపై కార్డులున్న వారే వీధి వ్యాపారం చేసుకునేందుకు అర్హులని తెలిపారు. టౌన్ వెండింగ్ కమిటీ ఈమేరకు తీర్మానించిందని వెల్లడించారు. నగరంలోని అన్నిరోడ్లను సర్వే చేసి, వీధి వ్యాపారం చేసుకునేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. సచివాలయాల పరిధిలోని ప్రతిరోడ్డును స్థానిక ప్రజాప్రతినిధి, వెండింగ్ అసోసియేషన్ సభ్యుడు, ప్లానింగ్, వెల్ఫేర్, శానిటేషన్ కార్యదర్శులు సమన్వయంతో సర్వే చేసి గ్రీన్, రెడ్, ఎల్లో జోన్లుగా మార్కింగ్ చేయాలని సూచించారు. డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో శార్వాణి మూర్తి, పి.వెంకటనారాయణ, సంజయ్‌రత్నకుమార్, అర్జునరావు, చంద్రబోస్, రాంబాబు, షేక్‌సబీర్, రత్నకుమారి, పిల్లి నాగమల్లేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జోజినగర్ ప్లాట్ల యజమానులకు సంఘీభావం


మాట్లాడుతున్న జలీల్‌ఖాన్, పక్కన శ్రీధర్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: జోజినగర్ ప్లాట్ల యజమానులకు మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, పత్తిపాటి శ్రీధర్ బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జలీల్‌ఖాన్ మాట్లాడుతూ వైకాపా పాలనలో రూ.వంద కోట్లు విలువ చేసే ప్లాట్లను కబ్జా చేసేందుకు ఆ పార్టీ నేతలు కబ్జాదారులతో సొసైటీ ఏర్పాటు చేయించి, దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఇప్పుడు వారే బాధితులకు సంఘీభావం తెలపడం విచిత్రంగా ఉందన్నారు. కబ్జాలకు పాల్పడే ముఠాలపై నగర సీపీ రాజశేఖరబాబు దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు మైలవరపు కృష్ణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రసాదం బాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం


కార్యక్రమంలో తెదేపా నాయకులు

భవానీపురం: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని భవానీపురం 40వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. డివిజన్ తెదేపా అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. నాయకులు సురేష్, నారాయణరావు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

'పేదల గొంతుక రామచంద్రరాజు'


ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పేదల పక్షాన నిరంతరం పోరాటాలు చేసిన వ్యక్తి ఉప్పలపాటి రామచంద్రరాజు అని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పాతబస్తీ లెనిన్ భవన్ వద్ద సీపీఐ మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రామచంద్రరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఠా కార్మికుల హక్కుల సాధన కోసం రామచంద్రరాజు చేసిన పోరాటాలను ఎవరూ మరువలేరన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాడి పైడియ్య, కొట్టు రమణరావు, పంచదార్ల దుర్గాంబ, రాజ్యలక్ష్మి, డీవీ రమణబాబు, తూనం వీరయ్య, సింగరాజు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సొరంగంలో విద్యుత్తు దీపాలు అమర్చండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని సొరంగ మార్గంలో విద్యుత్తు దీపాల సంఖ్యను పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. పాతబస్తీ, వన్నలత, చిట్టినగర్, విద్యాధరపురం, ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డు, రామరాజ్యనగర్, నాలుగుస్తంభాల సెంటర్, అంబేడ్కర్ రోడ్డు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సొరంగంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా వివిధ పాయింట్లలో దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని, నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయల్లో మరమ్మతులు చేపట్టి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.


అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

'సర్కారు వైఫల్యాలను ప్రజలకు చెప్పండి'

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైకాపా కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. లేబరుకాలనీలో బుధవారం నిర్వహించిన 44వ డివిజన్ వైకాపా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో స్థానిక నాయకులు సాయిబాబా, నిరీష్, కెనడీ పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-18/20, టమాటా-46, బెండ-30, పచ్చిమిర్చి-64, కాకర-28, బీర-34/38, క్యాబేజి-24, క్యారెట్-34/48, దొండ-32, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-35, దోస-18, సొర-13/15, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-30, అల్లం-75 (నిన్నటివి).
- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

పథకం ప్రారంభించక.. గొంతు తడవక!

చిట్టినగర్, న్యూస్‌టుడే

భీమనవారిపేట, భీమన జానకిరామయ్య వీధి కొండ ప్రాంతం(46వ డివిజన్) లో సుమారు 5వేల మందికి ప్రయోజనం చేకూరేలా లక్ష గ్యాలన్ల సామర్థ్యంతో సుమారు రూ.1.72 కోట్లతో తాగునీటి రిజర్వాయర్ నిర్మించారు. పైపులైన్లు కూడా వేశారు. ఈ పథకాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా టేనర్‌పేట పంపింగ్ బూస్టర్ నుంచి లంబాడీపేట చివరి వరకు నీటి సరఫరా సక్రమంగా జరగక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.


నూతనంగా నిర్మించిన రిజర్వాయరు

● అన్ని కాలాల్లోనూ సమస్యే..



వేసవిలో కాకుండా ఇతర రోజుల్లో కూడా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నాగమ్మ సత్రం పంపింగ్ బూస్టర్ నుంచి సక్రమంగా సరఫరా కావడం లేదు. కొండ ప్రాంతంలో నిర్మించిన ట్యాంకును ప్రారంభిస్తే సమస్య ఉండదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.. తప్పితే అందుబాటులోకి తీసుకురావడం లేదు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలి. **- సీతామహలక్ష్మి, భీమనవారిపేట**

● నిత్యం ఎదురు చూపులే..



రోజూ నీటి కుళాయి వద్ద ఎదురు చూడాల్సి వస్తోంది. టేనర్‌పేట పంపింగ్ బూస్టర్ నుంచి లంబాడీపేట వరకు సరఫరా సక్రమంగా జరగడం లేదు. భీమనవారిపేటలో కొత్తగా రిజర్వాయరు నిర్మించినా నేటికీ ప్రారంభించలేదు. దాని నుంచి మా పేటకు నీటి సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. **- రాజకుమారి, లంబాడీపేట**

● రంగులు వేయాల్సి ఉంది

భీమనవారిపేటలో కొత్తగా తాగునీటి రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేశాం. నెలరోజులు టెస్టింగ్ కూడా జరిగింది. రంగులు పూర్తి చేసి పథకాన్ని ప్రారంభిస్తాం. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. **-శ్రీనివాసరావు, ఏఈ**

చేపల వేటకు వెళ్లొద్దు

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణా నది ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని పశ్చిమ తహసీల్దార్ ఇంతియాజ్ పాషా పేర్కొన్నారు. భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీకి నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి భారీగా వరద వస్తోందన్నారు. పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మత్స్యకారులు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ తీరంలో ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు.


భవానీపురంలో జాలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇంతియాజ్

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: షష్ఠిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం బుధవారం నేత్ర పర్వంగా నిర్వహించారు. తొలుత శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయించిన అనంతరం వధూవరులుగా అలంకరించారు. ఈవో శీనానాయక్‌తో విఘ్నేశ్వర పూజను స్థానాచార్య శివప్రసాద శర్మ చేయించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ క్రతువు నిర్వహించారు.


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న స్థానాచార్య శివప్రసాదశర్మ, పక్కన ఈవో శీనానాయక్

అయిదు మండలాల్లో వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని అయిదు మండలాల్లో వర్షం పడింది. బుధవారం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.కొండూరు 5.6 మి.మీ., విస్సన్నపేట 3.2, గంపలగూడెం 3, తిరువూరు, జగ్గయ్యపేటలలో 2.4 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో వర్షఛాయలు లేవు.

ప్రకటన

నా క్లయింట్ Canara Bank, MPF Branch, Vijayawada వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.. భవానీపురం, విజయవాడ వాస్తవ్యులు మంచికంటి వెంకటేశ్వరరావు గారి భార్య మంచికంటి పుష్పావతి గారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని సెక్యూరిటీగా తీసుకొని వారి తాలూకు వారి వ్యాపార నిమిత్తం లోన్ మంజూరు చేయవలసినదిగా నా క్లయింట్‌ను కోరుచున్నారు. షెడ్యూలు ఆస్తి తాలూకు విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన original link document No: 4137/1995 Dt: 19-10-1995 పోయినట్లుగా తెలియపరచినారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎట్టి క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ ఉన్నచో ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోగా వ్రాతపూర్వకముగా రిజిస్టరు పోస్టు తిరుగు రసీదుతో ఈ దిగువ ప్లీడరు గారి అడ్రసుకు తెలియపరచవలెను. గడువు లోపు ఎలాంటి క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ రాని యెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాదమైనదిగా పరిగణించి, షెడ్యూలు ఆస్తి సెక్యూరిటీగా తీసుకొని నా క్లయింటుకు Loan మంజూరు చేయుదురు. గడువు దాటి వచ్చిన క్లయిములకు ఎలాంటి బాధ్యత లేదని, చట్టరీత్యా చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: భవానీపురం, విజయవాడలోని R.S. No: 81, రెవెన్యూ వార్డు నెం. 1, బ్లాక్ నెం 1, Door No: 76/11/13 గా గల 190-75 చ॥గజములు లోగల నేల మరియు మొదటి అంతస్తు గల బిల్డింగునకు **హద్దులు: తూర్పు:** మంచికంటి శ్రీనివాసరావు గారి ఆస్తి, **దక్షిణం:** అబ్దుల్ అజీమ్ గారి Plot No-25. **పడమర:** Road. **ఉత్తరం:** మంచికంటి శ్రీనివాసరావు గారి ఆస్తి.

ఇట్లు **Y.S.C BOSE,** Advocate
54-19-8, 2nd Road, Jayaprakash Nagar
Vijayawada-520 008. Cell No: 94408 80227
విజయవాడ, Dt: 30-07-2025.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ఆస్పత్రులు, పాఠశాలల యాజమాన్యాలు అగ్నిప్రమాదాలు జరక్కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అందుకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని నగరపాలక సంస్థ అగ్నిమాపక విభాగం అధికారులు సూచించారు. సూర్యారావుపేట, విద్యాధరపురం ప్రాంతాల్లోని ఆస్పత్రులు, పాఠశాలలను బుధవారం వీరు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు చేశారు. అగ్నిమాపక పరికరాలను ఉపయోగించి మంటలను ఎలా నిలువరించాలో చూపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.



1వ తేదీ నుంచి ఆటో మ్యుటేషన్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆటో మ్యుటేషన్ ప్రక్రియ అమలు చేస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో సూచించారు. తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలోనే ఆస్తిపన్ను పేరు కూడా మార్చుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని వెల్లడించారు. ఇకపై ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు చేసుకున్నాక తమ పేరు, పన్ను మార్పు కోసం ప్రజలెవరూ నగరపాలక సంస్థ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని కమిషనర్ ప్రకటించారు. ఆటో మ్యుటేషన్ కోసం ఆస్తి, ఖాళీస్థలాల పన్ను బకాయిలు, మ్యుటేషన్ ఫీజు చెల్లించిన పక్షంలో తేలిగ్గా పేరు మార్పు జరిగిపోతుందని తెలిపారు


5వ వర్ధంతి
మంచికి మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి అనురాగం, ఆప్యాయత అనుబంధాలతో ఆదరించిన పుణ్యమూర్తి, కుటుంబ శ్రేయస్సు కోసం ఎంతో శ్రమించిన మీరు మానుండి దూరమై నేటికి 5 సం॥లు గడిచినను మీ మధురస్మృతులను మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
చిల్ల శ్రీనివాస రెడ్డి (వంశీ)
ఇట్లు
కుటుంబ సభ్యులు
విజయవాడ

వెట్టిచాకిరి నుంచి కార్మికులకు విముక్తి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన నలుగురు కార్మికులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా నేరుడుగుమ్ము మండలంలో ఆ జిల్లా కార్మిక శాఖ అధికారులు దాడులు చేయగా.. నగరానికి చెందిన నలుగురు కార్మికులు వెట్టిచాకిరీలో ఉన్నట్లు గుర్తించారు. వారిని ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. విముక్తి పొందిన కార్మికులను నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఎదుట హాజరు పరిచారు. ఆయన మాట్లాడుతూ.. నలుగురిలో ఇద్దరిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మిగతా ఇద్దరి వద్ద ఆధార్ కార్డులు లేవని, వీరిని గుర్తించి వారి స్వస్థలాలకు పంపేలా చూడాలని కార్మిక శాఖను ఆదేశించారు. వెట్టి చాకిరిని సహించబోమని, మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు వివరించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ సి.హెచ్.ఆశారాణి పాల్గొన్నారు.

2న కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో విజయవాడలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆగస్టు 2వ తేదీ శనివారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాండ్ స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, అకడమిక్ ఓవర్సీస్ ప్రైవేటు కంపెనీలో కౌన్సెలర్లు, టెలీపెర్ఫార్మెన్స్‌లో ప్రాసెస్ అసోసియేట్, ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్, ఇసుజు మోటార్స్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బి.టెక్ ఉత్తీర్ణులై, 30 సంవత్సరాల వయసులోపు అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.15,000ల నుంచి రూ.30,000ల వరకు జీతం, ఇన్సెంటివ్‌లు, ఉచిత వసతి, భోజన, రవాణా సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయి. ఆసక్తి గల వారు రెండో తేదీ ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాల నకళ్లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98494 65427 ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.


ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
గత మూడున్నర దశాబ్దాలుగా, ఆదర్శ ఉపాధ్యాయురాలిగా సేవలందించి, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా అమ్మ గారు నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీమతి కె.రేణుకాదేవి గారు
M.Sc., M.A., M.Ed.
School Assistant (B.S), S.P.S.M.C.H.School, L.B.S.Nagar, VJA-15
కుమార్తెలు: గర్రె పల్లవి, M.S. డా॥ భోగవల్లి నీరజ, M.B.B.S
అల్లుళ్ళు: - కళ్యాణ్, M.S. Ph.D. - ఉదయ్‌కిరణ్, B.Tech, MBA, (IIM Mumbai)
భర్త: Dr. N.V.రావు, M.A., M.A., M.Ed., Ph.D
రేణుక సర్వీస్ సొసైటీ, Regd., రాకేష్ సర్వీస్ సొసైటీ, Regd.
మేనేజ్‌మెంట్ & స్టాఫ్, రాకేష్ విద్యా సంస్థలు

శ్రద్ధాంజలి



పూజ్యనీయులు, మంచి మనసున్న వ్యక్తి, మా అందరి శ్రేయోభిలాషులు
కీ॥శే॥ మల్లంపాటి సుబ్బయ్య గారు
దివికేగిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ...
శ్రద్ధాంజలి ఘటిస్తూ...

పాములపాటి సాంబశివరావు & బ్రదర్స్ శ్రీ విజయదుర్గా టింబర్ డిపో & సామిల్, సీతారామపురం.	పరిమి నరసింహారావు & బ్రదర్స్ మిథిలానగర్, విద్యాధరపురం.	అల్లు మహేశ్వరరావు శ్రీ మధుసూదన టింబర్ డిపో & సామిల్, గొల్లపూడి.
ధనేకుల వెంకట సుబ్బారావు తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ	దివి కృష్ణ కిషోర్ దివిస్ ఇన్‌ఫ్రా	అల్లు మధుసూదనరావు కె.టి.రోడ్డు, చిట్టినగర్.
మల్లంపాటి వెంకటేశ్వరరావు ఓంకార్ ట్రేడర్స్, కె.టి.రోడ్డు, చిట్టినగర్.	అల్లూరి నాగేశ్వరరావు ఛైర్మన్, ABC ఫౌండేషన్, మిథిలానగర్, విద్యాధరపురం.	మచ్చవ చిన వెంగయ్య ఇసుక, ఇటుక వ్యాపారం, చిట్టినగర్.
మల్లంపాటి మాల్యాద్రి చౌదరి బెంగుళూరు.	పులివర్తి మాలకొండయ్య విద్యాధరపురం.	కూండ్ల సుధాకర్, రవితేజ ట్రేడర్స్ మిథిలానగర్, విద్యాధరపురం.
మల్లంపాటి కొండలరావు మిథిలానగర్, విద్యాధరపురం.	చుంచు కొండయ్య కె.టి.రోడ్డు, కొత్తపేట.	కూండ్ల నరసింహారావు, కూండ్ల మాల్యాద్రి కూండ్ల కృష్ణమూర్తి. గుంటూరు.
అప్పికట్ల వెంకటేశ్వరరావు శ్రీ సీతారామాంజనేయ టింబర్ డిపో & సామిల్, భవానీపురం.	చుంచు రమణయ్య, చుంచు శ్రీధర్ చుంచు సురేష్ ప్రొప్రైటర్ : శాన్ హెయిర్ అండ్ బ్యూటీ	వేమూరి కొండలరావు సూర్యాపేట
అప్పికట్ల వెంకట రామారావు శ్రీ శ్రీనివాస టింబర్ డిపో & సామిల్, భవానీపురం.	చుంచు మాల్యాద్రి కటక్ మిథిలానగర్, విద్యాధరపురం.	మద్దినేని తిరుపాలు పాములూరు, ప్రకాశం జిల్లా.
బాల్లు గురవయ్య పెట్రోలు బంకు, కె.టి. రోడ్డు, చిట్టినగర్.	చుంచు నరసింహారావు లక్ష్మినరసింహస్వామి ఫిల్లింగ్ స్టేషన్, కె.టి.రోడ్డు, చిట్టినగర్.	కొండా శ్రీనివాస చౌదరి కరప్పినగర్, రామవరప్పాడు.
రావెళ్ళ చిన హనుమంతరావు (ఆంజనేయులు) శ్రీసాయి దుర్గా పాన్ బ్రోకర్స్, కె.టి.రోడ్డు, చిట్టినగర్.	గొట్టుముక్కల వంశీమోహన్ కె.టి. రోడ్డు, చిట్టినగర్.	దేవరపు వెంకట సూర్యనారాయణ శ్రీలక్ష్మి గణేష్ ఉడ్ వర్క్స్ & కార్వింగ్, బైపాస్ రోడ్, విద్యాధరపురం.
గొడుగులూరి వెంకటేశ్వర్లు కె.టి.రోడ్డు, చిట్టినగర్.	తోట వెంకట రమణారావు భీమనవారి పేట, విజయవాడ.	బత్తిన మాల్యాద్రి (బాలాజి) కటక్, ఒరిస్సా.

బెల్లం వెంకటేశ్వర్లు శ్రీసాయి బాలాజి పాన్ బ్రోకర్స్, వించిపేట, విజయవాడ. | బొమ్మసాని బుల్లి కోటయ్య & బ్రదర్స్ గొల్లపూడి.

మొన్న కుక్క.. నేడు ట్రాక్టరు

• బిహార్‌లో వింత రెసిడెన్సీ దరఖాస్తులు



ఈటీవీ భారత్: బిహార్‌లోని పట్నాలో కుక్కకు 'డాగ్ బాబు' పేరుతో నివాస ధ్రువీకరణ పత్రం జారీచేసిన ఉదంతంపై రాజకీయ దుమారం ఆగకముందే.. తూర్పు చంపారణ్ జిల్లా మోతిహారిలో చెందిన వ్యక్తి ట్రాక్టరు నివాస ధ్రువీకరణ పత్రం కావాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. అందులో భోజ్‌పురి నటి మోనాలిసా ఫొటోను జత చేసి, దరఖాస్తుదారు పేరు 'సోనాలికా (ట్రాక్టర్)' అని రాశారు. అధికారులు అందించిన సమాచారంతో పోలీసులు ఈ దరఖాస్తుదారుపై సైబర్ నేరం కింద కేసు నమోదు చేశారు. పట్నాలో ఎటువంటి దర్యాప్తు చేయకుండా కుక్కకు నివాస ధ్రువీకరణ పత్రం జారీచేసిన ఇద్దరు అధికారులపై జిల్లా కలెక్టరు వేటు వేశారు. కాగా, ఇదే రాష్ట్రంలోని నవాడా జిల్లాలోనూ మరో కుక్క ఫొటోతో 'డాగేశ్ బాబు' పేరిట నివాస ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు వచ్చింది. ఈసారి అధికారులు జాగ్రత్తపడి నవాడా జిల్లా కలెక్టరు రవి ప్రకాశ్ దృష్టికి తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసి దరఖాస్తుదారుని అదుపులోకి తీసుకోవాలని పోలీసులను కలెక్టరు ఆదేశించారు. సరదాగా చేసే ఇటువంటి పనులతో ప్రభుత్వ వ్యవస్థలు ఇబ్బందిపడతాయని కలెక్టర్ అన్నారు.

127 ఏళ్ల తర్వాత భారత్‌కు బుద్ధుడి అవశేషాలు

దిల్లీ: బ్రిటిష్ హయాంలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుని అవశేషాలు 127 ఏళ్ల తర్వాత స్వదేశానికి తిరిగి చేరుకున్నాయి. ఈ విషయాన్ని ప్రధాని మోదీ బుధవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ అవశేషాలను.. వలస పాలన సమయంలో మన దేశం నుంచి తరలించారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. "ఈ ఏడాది ప్రారంభంలో ఓ అంతర్జాతీయ వేలంలో బుద్ధుడి అవశేషాలు కనిపించాయి. దీంతో వాటిని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాం" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. పిప్రహ్వా ప్రాజెక్టు వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. 1898లో ఉత్తర్‌ప్రదేశ్‌లో భారత్- నేపాల్ సరిహద్దు సమీపంలోని పిప్రహ్వాలో ఓ పురాతన బౌద్ధ స్తూపం తవ్వకాల సమయంలో పెద్ద రాతిపెట్టెలో కొన్ని అవశేషాలు బయటపడ్డాయి. ఇందులో గౌతమ బుద్ధునికి చెందినవిగా భావిస్తున్న అస్థి అవశేషాలు, పేటికలు, బంగారు ఆభరణాలు, రత్నాలు వంటివి ఉన్నాయి. బౌద్ధులకు పంపిణీ చేసేందుకుగానూ.. ఆ అస్థి అవశేషాలను సియామ్ (ప్రస్తుత థాయ్‌లాండ్) రాజుకు అప్పగించినట్లు వెబ్‌సైట్ చెబుతోంది. అప్పట్లో అవశేషాలను ఉంచిన ఆ పెద్ద రాతి పెట్టె ప్రస్తుతం కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలో ఉంది.



బుద్ధుడి అవశేషాల వద్ద కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బౌద్ధ సన్యాసులు

ప్రతి ఇంట్లో ఏటా 55 కిలోల ఆహారం వృథా



ఈనాడు, దిల్లీ: దేశంలో ప్రతి ఇంట్లో ఏటా సగటున 55 కిలోల ఆహారం వృథా అవుతున్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి బి.ఎల్.వర్మ బుధవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వెలువరించిన ఆహార వృథా సూచీ-2024 నివేదిక ప్రకారం ఈ లెక్కలు తెలినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఒక్కో కుటుంబంలో సగటున 79 కేజీల ఆహారం వృథా అవుతున్నట్లు వెల్లడించారు. వృథాను అరికట్టడానికి దీనిని పాఠ్యాంశంగా చేర్చడంతో పాటు యువతకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆయన చైనా గురు

• రాహుల్‌గాంధీపై జైశంకర్ పరోక్ష విమర్శలు



దిల్లీ: లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీని 'చైనా గురు' అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వ్యంగ్యంగా సంబోధించారు. రాహుల్ పేరు ప్రస్తావించకుండానే తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం రాజ్యసభలో కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. "నేను చైనా గురు కాను. అందుకే ఇటీవలి నా పర్యటనలో అక్కడ ఎవరితోనూ రహస్యంగా సమావేశం కాలేదు.. గోప్యంగా ఒప్పందాలూ కుదుర్చుకోలేదు. ఉగ్రవాదం, ఉద్రిక్తతలు, వాణిజ్యం, ఉభయదేశాలకు ఆసక్తి ఉండే ఇతర అంశాలపైనే చర్చించాను. మనదగ్గర ఒక చైనా గురు ఉన్నారు. ఆయనకు ఆ దేశంపై ఎంతో ప్రేమ. ఇరు దేశాలకు సంబంధించి ఆయనొక ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిపేరు చిండియా (చైనా+ఇండియా). నా చైనా పర్యటనలో కొన్ని లోటుపాట్లు ఉండవచ్చు. ఎందుకంటే నేను చైనా (బీజింగ్) ఒలింపిక్స్‌కు వెళ్లి ఎవరివో పాఠాలు చెప్పించుకోలేదు. నన్ను వదా దానికి పిలవలేదు. ఎందుకంటే నేను ప్రత్యేక వ్యక్తిని కాను. ఒకరు మాజీ ఆ ఒలింపిక్స్‌కు వెళ్లి జ్ఞానం పొందారు. వారు అక్కడ చైనావాళ్లనే కాదు.. వేరేవారిని కలిశారు. ఒలింపిక్ క్లాసులో నిద్రపోవడం వల్ల ఆయన నేర్చుకోవాల్సినవి కొన్ని మిగిలిపోయాయేమో. అందుకే చైనా గురువు రాహుల్ ఇంటికి ఆహ్వానించి మరోసారి ట్యూషన్ చెప్పించుకున్నారు. చైనావల్ల మన దేశానికి యూపీఏ పాలనలో ఏయే రూపాల్లో నష్టం వాటిల్లిందో ఆ గురు గుర్తెరగాలి" అని జైశంకర్ హితవు పలికారు. పాక్‌తో పోరు విరమణలో వేరే దేశం జోక్యం గానీ, వాణిజ్య సంబంధం గానీ లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా ఇప్పుడు మన దేశంలో ఉగ్రదాడికి ప్రతిదాడి అదేరోజు ఉంటుందని స్పష్టంచేశారు.

అందరూ కోరుకున్నట్లే జరిగింది: అమిత్ షా



పహల్గాంలో తమవారి తలలపై గురిపెట్టి ఉగ్రవాదులు ఎలా కాల్చారో వారికీ అదే గతి పట్టించాలని బాధిత కుటుంబాలవారు సహా అనేకమంది కోరుకున్నారని, ఆపరేషన్ మహాదేవ్‌లో ముష్కరుల తలలను ఆ రీతిలోనే లేపేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. రాజ్యసభలో చర్చకు ఆయన సమాధానమిచ్చారు. హతమైన ముగ్గురూ లష్కరే తయ్యిబాకు చెందినవారేనని విస్పష్టంగా ఆధారాలు లభించాయని చెప్పారు. మతం గురించి అడిగి మహిళలు, పిల్లల ముందు దారుణంగా ప్రాణాలు తీసిన దారుణ ఉదంతాలు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ఆ ప్రాంతాన్ని కాంగ్రెస్‌పార్టీయే పాక్‌కు ఇచ్చిందన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కారని సగర్వంగా చాటగలనన్నారు.


బుల్లెట్ పేల్చిన వారికి బిర్యానీ పెట్టారు: నడ్డా



రాజ్యసభాపక్ష నేత, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా చర్చలో పాల్గొంటూ- కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో బాంబు పేలుళ్లు జరగని నగరమే లేదని విమర్శించారు. సరైన రాజకీయ సంకల్పం లేకపోవడంతో ఉగ్రవాదాన్ని వారు చూసీచూడనట్లుగా వదిలేశారని మండిపడ్డారు. "మనపై బుల్లెట్లు పేల్చినవారికి కాంగ్రెస్ బిర్యానీ పెట్టింది" అని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భద్రత బలగాలు సాధించిన ఆధిపత్యాన్ని ప్రభుత్వం తగినరీతిలో ఉపయోగించుకోలేకపోయిందని విపక్ష సభ్యులు ఆరోపించారు. దేశ ప్రజల విశ్వాసాన్ని మూడుసార్లు చూరగొన్న ప్రధాని మోదీని నమ్మకపోవడం ఏమిటని భాజపా సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రధాని సభకు రావాలన్న డిమాండును సభాపతి తోసిపుచ్చడంతో విపక్షాలు వాకౌట్ చేశాయి.

ట్రంప్‌వి అబద్ధాలని మోదీ చెప్పలేకపోతున్నారు: రాహుల్

దిల్లీ: భారత్-పాకిస్థాన్ పోరు విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నవి అబద్ధాలని ప్రధాని మోదీ చెప్పలేకపోతున్నారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శించారు. దీనివెనుక ఏదో రహస్యం దాగి ఉందని.. కప్పిపుచ్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "ట్రంప్ మాటలు అబద్ధాలని మోదీ చెబితే అసలు నిజాలు బయటకొస్తాయి. అందుకే ఏం మాట్లాడలేకపోతున్నారని స్పష్టమవుతోంది" అని బుధవారం లోక్‌సభలో చెప్పారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారణమయ్యానని ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాలు మరోసారి మండిపడ్డాయి. మోదీని పాములా ట్రంప్ చుట్టుకున్నారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ బలహీన స్థితిలో ఉన్నారని, చాలా విషయాలు దాచిపెడుతున్నారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



క్షయను గుర్తించే పరికరం


గువాహటి: స్మార్ట్ ఫోన్ సహాయంతో క్షయ వ్యాధికారక బ్యాక్టీరియాను కనిపెట్టే పరికరాన్ని అస్సాంలోని తేజ్‌పుర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. భౌతిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్ పవిత్ర నాథ్ నాయకత్వంలో ఈ పరికరాన్ని రూపొందించారు. కేవలం 300 గ్రాముల బరువు ఉండే ఈ పరికరాన్ని ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. దీని ద్వారా గ్రామాల్లో క్షయ వ్యాప్తిని వేగంగా గుర్తించి చికిత్స చేయవచ్చని విశ్వవిద్యాలయ ఉప కులపతి శంభునాథ్ సింగ్ పేర్కొన్నారు

మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపునకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు కొనసాగించడానికి ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఆగస్టు 13తో ముగియబోతున్న రాష్ట్రపతి పాలన దీని ప్రకారం ఇంకో ఆరు నెలలు కొనసాగనుంది. ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలన విధించాక అక్కడ శాంతి నెలకొందని, గత నాలుగు నెలల్లో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు.

మీ ప్రవర్తన విశ్వాసం కలిగించటం లేదు

• జస్టిస్ వర్మపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



దిల్లీ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై అంతర్గత విచారణ కమిటీ నివేదికను సవాల్ చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు పదునైన ప్రశ్నలు సంధించింది. జస్టిస్ వర్మ ప్రవర్తన విశ్వాసాన్ని కలిగించటం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎ.జి.మసీహ్ ధర్మాసనం పేర్కొంది. తీర్పును రిజర్వు చేసింది. అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేసినప్పుడే సవాల్ చేయకుండా దాని ముందు ఎందుకు హాజరయ్యారని జస్టిస్ వర్మను ధర్మాసనం ప్రశ్నించింది. "కమిటీ నివేదిక ఇవ్వకముందే సుప్రీంకోర్టుకు వచ్చి ఉండాల్సింది. న్యాయమూర్తి తొలగింపు అంశాన్ని పార్లమెంటు పరిశీలిస్తుంది. ఆ డబ్బు మీదా, కాదా అన్నది పార్లమెంటు నిర్ణయిస్తుంది. అది అంతర్గత విచారణ కమిటీ బాధ్యత కాదు" అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ.. జస్టిస్ వర్మ తొలగింపునకు విచారణ కమిటీ చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అదే విషయమై ప్రధాన న్యాయమూర్తి చేసిన సిఫార్సు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని సిబల్ కోరారు. తన నివాసంలో లభించిన కాలిపోయిన నోట్ల కట్టల వీడియోను సుప్రీంకోర్టు వెబ్‌సైట్లో పెట్టిఉండకూడదనే జస్టిస్ యశ్వంత్ వర్మ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. అయితే, వెబ్‌సైట్లో పెట్టినంత మాత్రాన విచారణ ప్రక్రియ నీరుగారినట్లు కాదని పేర్కొంది. అంతర్గత విచారణ కమిటీ నివేదికను ప్రస్తావించకుండా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ స్వతంత్రంగా జరుగుతుందని తెలిపింది.

'సిగ్నల్ ఇవ్వకుండా సడెన్ బ్రేక్ వేయడం డ్రైవర్ నిర్లక్ష్యమే'

దిల్లీ: సిగ్నల్ ఇవ్వకుండా జాతీయ రహదారిపై అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే అది డ్రైవర్ నిర్లక్ష్యం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. "జాతీయ రహదారిపై అతి వేగంతో దూసుకెళ్లే వాహనాలు ఉంటాయి. ఒకవేళ డ్రైవర్ తన వాహనాన్ని ఆపాలని అనుకుంటే.. తన వెనక వస్తున్న వాహనాలను హెచ్చరించాలి లేదా వాటికి సిగ్నల్ ఇవ్వాలి" అని ఓ కేసులో జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది.

న్యాయవాదుల ముందు గుంజీలు తీసిన ఐఏఎస్ అధికారి బదిలీ



షాజహాన్‌పుర్ (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని షాజహాన్‌పుర్ జిల్లా పువాయా పట్టణ సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు (ఎస్‌డీఎం)గా నియమితులైన ఐఏఎస్ అధికారి రింకూసింగ్ రాహీ వైరల్‌గా మారిన ఓ వీడియో కారణంగా ఒక్కరోజులో బదిలీ కావాల్సి వచ్చింది. లఖ్‌నవూలోని రెవెన్యూ కౌన్సిలుకు ఆయన బదిలీ కాగా, షాజహాన్‌పుర్ జిల్లా మెజిస్ట్రేటు ధర్మేంద్ర ప్రతాప్‌సింగ్ బుధవారం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మంగళవారం ఎస్‌డీఎం బాధ్యతలు చేపట్టిన రింకూసింగ్ తొలిరోజు కార్యాలయ ఆవరణను, మరుగుదొడ్లను పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఇకపై బహిరంగంగా ఎవరైనా మూత్ర విసర్జన చేసినా, ఆవరణను అపరిశుభ్రం చేసినా శిక్షగా గుంజీలు తీయాల్సి ఉంటుందని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సమ్మెలో ఉన్న న్యాయవాదుల బృందం తనను కలవగా రింకూసింగ్ 'గుంజీల శిక్ష' గురించి ప్రస్తావించారు. ప్రస్తుత దుస్థితికి అధికారుల బాధ్యత కూడా లేకపోలేదని న్యాయవాదులు చెప్పారు. రింకూసింగ్ ఈ విషయాన్ని అంగీకరిస్తూ తన రెండు చెవులను పట్టుకొని అందరి ముందు గుంజీలు తీశారు. ఈ చర్య ఆయన బదిలీకి దారితీసింది.

నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం ఇదే..



ఓ విషయాన్ని 10 సార్లు చదవడం కన్నా, దాన్ని మరొకరికి బోధించడం ద్వారానే బాగా ఆకళింపు చేసుకోవచ్చు. ఎంతటి క్లిష్ట విషయాన్నైనా పదేళ్ల పిల్లాడికి కూడా అర్థమయ్యేలా సులువుగా వివరించే ప్రయత్నం చేయండి. అప్పుడు మీకు దానిపై ఏ స్థాయి అవగాహన ఉందో, ఇంకెంత మెరుగుపర్చుకోవాలో అర్థమవుతుంది.
ముఖ్యంగా విద్యార్థులు ఈ చిట్కాను పాటిస్తే మేలు.

– జాన్ సైమండ్స్, డిజిటల్ క్రియేటర్

ఆకలిపై ఆయుధం

• గాజాలో మరో 83 మంది మృతి
• దాడులు, కాల్పుల్లో మరణం



విమానాల ద్వారా జారవిడుస్తున్న ఆహార సంచుల కోసం పాలస్తీనియుల పాట్లు

డెయిర్ అల్-బలా: గాజాలో ఒకవైపు ఆకలితో అల్లాడుతుంటే.. మరోవైపు ఇజ్రాయెల్ ఆయుధాలు గర్జిస్తున్నాయి. హమాస్ మిలిటెంట్ల ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో ప్రజలూ మరణిస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ జరిగిన దాడులు, కాల్పుల్లో మరో 83 మంది మృతి చెందారు. మరణించిన వారిలో ఎక్కువ మంది ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారేనని స్థానిక ఆసుపత్రులు వెల్లడించాయి.

■ వాయవ్య గాజాలోని జికిం ప్రాంతంలో ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారిపై మంగళవారం రాత్రి, బుధవారం రాత్రి చోటు చేసుకున్న కాల్పుల్లో 49 మంది మృతి చెందారని షిఫా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

■ జబాలియా శరణార్థ శిబిరం, బీట్ లహియా, బీట్ హనౌన్ పట్టణాల్లో జరిగిన దాడుల్లో 13 మంది మృతి చెందారు.

■ ఖాన్ యూనిస్‌లో జరిగిన దాడిలో మరణించిన 16 మంది మృతదేహాలు తమ వద్దకు వచ్చాయని నాజర్ ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. వీరంతా ఆహారం కోసం ఎదురుచూస్తున్నవారేనని తెలిపాయి.

■ నుసేరత్ శిబిరంపై జరిగిన దాడుల్లో ఐదుగురు మరణించారు.

ఆకలితో ఏడుగురి మృతి: గాజాలో గడచిన 24 గంటల్లో ఆకలితో ఏడుగురు మృతి చెందారని ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇందులో ఒక చిన్నారి ఉన్నారు. దీంతో ఇప్పటిదాకా గాజాలో పోషకాహార లోపంతో 89 మంది చిన్నారులు మరణించారు.

అలా చేస్తే మీకే చేటు...

• బ్రిటన్‌పై మండిపడ్డ నెతన్యాహు



లండన్: కాల్పుల విరమణకు, ద్విదేశ సిద్ధాంతానికి అంగీకరించకపోతే సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చేసిన వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. హమాస్ ఉగ్ర కార్యకలాపాలకు కీర్ స్టార్మర్ పరోక్షంగా మద్దతిస్తున్నారని మండిపడ్డారు. తద్వారా హమాస్ బాధితులను శిక్షిస్తున్నట్లు అవుతోందని పేర్కొన్నారు. "మా సరిహద్దులోని ఈ ప్రాంతాన్ని దేశంగా గుర్తిస్తే.. అది భవిష్యత్తులో బ్రిటన్‌కూ ముప్పుగా మారుతుంది. ఈ గుర్తింపు విషయంలో బ్రిటన్ ఓ చారిత్రక, నైతిక బాధ్యతను కలిగి ఉంది" అని అన్నారు. ఉగ్రవాదుల పట్ల బుజ్జగింపు చర్యలనేవి పనిచేయవని పేర్కొన్నారు. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలనే బ్రిటన్, ఫ్రాన్స్ తదితర ఐరోపా దేశాల ప్రణాళికలను బందీల కుటుంబాలు తప్పుపట్టాయి. ఇటువంటి చర్యలు ఉగ్రవాదానికి మద్దతుగా నిలుస్తాయని విమర్శించాయి. ఇది శాంతిస్థాపనకు దోహదపడదని, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే అవుతుందని పేర్కొన్నాయి.

2,024 ఎకరాల రక్షణ భూమి అన్యాక్రాంతం

• సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రప్రభుత్వం

దిల్లీ: దేశవ్యాప్తంగా రక్షణ శాఖకు 75,629 ఎకరాల భూమి ఉందని సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం బుధవారం నివేదించింది. అందులో 2,024 ఎకరాలను ఇప్పటివరకు ఇతరులు ఆక్రమించుకున్నారని తెలిపింది. మరో 1,575 ఎకరాల భూమి.. వ్యవసాయం కోసం లీజుకు తీసుకున్నవారి అధీనంలో అనధికారికంగా ఉందని వెల్లడించింది. ఈ మేరకు కోర్టుకు ప్రమాణ పత్రం సమర్పించింది. దాదాపు 819 ఎకరాల రక్షణ భూమి పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల అధీనంలో ఉందని అందులో పేర్కొంది. రోడ్లు, పాఠశాలలు, పబ్లిక్ పార్కులు, బస్టాండుల నిర్మాణం వంటి పనులకు ఆ భూమిని తీసుకున్నారని తెలిపింది. మొత్తం 75,629 ఎకరాలకు గాను.. కంటోన్మెంట్ల లోపల 52,899 ఎకరాలు, ఆవల 22,730 ఎకరాలు ఉన్నాయని వివరించింది. ఈ ఏడాది 220 ఎకరాల్లో ఆక్రమణలను తొలగించినట్లు పేర్కొంది. ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనానికి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ తెలియజేశారు. ఆక్రమణల తొలగింపు చర్యల పర్యవేక్షణకు కొత్త కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్రం తెలపడంతో.. మరో రెండు నెలల్లో తాజా నివేదికను తమకు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. దేశవ్యాప్తంగా రక్షణ భూముల ఆక్రమణలపై దర్యాప్తు జరపాలంటూ 2014లో కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు ప్రస్తుతం విచారణ జరుపుతున్న సంగతి గమనార్హం.

మానవ అక్రమ రవాణా కేసులో.. ఐదుగురిని నిర్దోషులుగా తేల్చిన కేరళ కోర్టు

త్రిశ్శూర్: మూడేళ్ల క్రితం నాటి ఓ మానవ అక్రమ రవాణా కేసులో ఇద్దరు క్రైస్తవ సన్యాసినులు సహా మొత్తం ఐదుగురిని కేరళలోని ఓ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. వారిపై అభియోగాలను నిరూపించే సాక్ష్యాధారాలేవీ లేవని తెలిపింది. త్రిశ్శూర్ అదనపు సెషన్స్ జడ్జి కె కమనీస్ ఈ నెల 26న ఈ మేరకు తీర్పు వెలువరించారు. 2022లో ఝార్ఖండ్ నుంచి కేరళకు అమ్మాయిలను బలవంతంగా తీసుకొస్తున్నారన్న ఆరోపణలతో ఇద్దరు నన్‌లతోపాటు ఝార్ఖండ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు ఈ కేసులో అరెస్టు చేసిన సంగతి గమనార్హం.

మేఘాలయలో పార్టీ మారిన కాంగ్రెస్ ఒక్కగానొక్క ఎమ్మెల్యే

షిల్లాంగ్: మేఘాలయలో కాంగ్రెస్ ఒకేఒక్క ఎమ్మెల్యే రోనీ వీ లింగ్డో పార్టీ మారారు. మాయిలీఎం నియోజకవర్గం నుంచి ప్రతిపక్ష చీఫ్ విప్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన బుధవారం అధికార నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)లో చేరారు. ఉపముఖ్యమంత్రి స్నియావభలంగ్ ధార్ సహా సీనియర్ ఎన్‌పీపీ నేతల సమక్షంలో అసెంబ్లీ స్పీకర్ థామస్ ఎ.సంగ్మాకు ఆయన విలీన లేఖను సమర్పించారు. దీనిని స్పీకర్ ఆమోదించి...లింగ్డోను ఎన్‌పీపీ నేతగా గుర్తిస్తున్నానని తెలిపారు. ఈ పరిణామంతో 60 మంది సభ్యులు ఉన్న మేఘాలయ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్..."రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకుని ఎన్‌పీపీ ప్రభుత్వం ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది" అని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది.

ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్ దాడి

93 మంది మాజీ బ్యూరోక్రాట్లు

దిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా 93 మంది మాజీ ప్రభుత్వాధికారులు(మాజీ బ్యూరోక్రాట్లు) అభివర్ణించారు. దీనివల్ల పెద్ద సంఖ్యలో ఓటర్లు ఓటు వేసే హక్కు కోల్పోతారని తమ బహిరంగ లేఖలో విమర్శించారు. మూడు అఖిల భారత సర్వీసులకు, వేర్వేరు ప్రభుత్వ విభాగాలకు చెందిన ఈ మాజీ అధికారులు రాజ్యాంగ ప్రవర్తనా బృందంగా ఏర్పడ్డారు. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను కొనసాగించి, తరవాత దేశమంతటికీ వర్తింపజేయడం భారత ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు అవుతుందని హెచ్చరించారు. బోగస్ ఓటర్ల ఏరివేత పేరుతో భారీ సంఖ్యలో నిజమైన ఓటర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఓటర్లే సాధికార పత్రాలతో స్వీయ ధ్రువీకరణ చేయాలనడం, వారి ఓటు హక్కును హరించడానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్రైస్తవ సన్యాసినుల విడుదలకు కేంద్రం జోక్యం చేసుకోవాలి

• లేకపోతే పరిస్థితి చేయిదాటిపోతుంది
• లోక్‌సభలో కేరళ ఎంపీల డిమాండ్

దిల్లీ: బలవంతపు మత మార్పిళ్లు, మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టైన ఇద్దరు క్రైస్తవ సన్యాసినుల (నన్‌ల) విడుదలకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని లోక్‌సభలో కేరళ ఎంపీలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు చెందిన కేసీ వేణుగోపాల్, కె.సురేశ్, హిబీ ఈడెన్‌తోపాటు కె.ఫ్రాన్సిస్ జార్జ్ బుధవారం శూన్యగంట (జీరో అవర్) సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తారు.



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న కేరళ ఎంపీలతో ప్రియాంకా గాంధీ

అరెస్టైన ఇద్దరు నన్‌లు అమాయకులని, వారిని అదుపులోకి తీసుకోవడం ఆందోళనకర విషయమన్నారు. క్రైస్తవ సన్యాసినులపై భౌతిక దాడి కూడా జరిగిందని, వారిని తప్పుడు అభియోగాల్లో ఇరికించారని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఇప్పుడు కేంద్రం జోక్యం చేసుకోకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని చెప్పారు. "కేరళలో ఆగ్రహజ్వాలలు చెలరేగుతున్నాయి. కేంద్రం జోక్యం చేసుకొని స్పష్టమైన సమాధానం చెప్పాలి. నన్‌లను వెంటనే విడుదల చేయాలి" అని ఆయన పేర్కొన్నారు. క్రైస్తవ సన్యాసినుల విడుదలను డిమాండ్ చేస్తూ జీరో అవర్‌లో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. నన్‌ల అరెస్టుకు వ్యతిరేకంగా ఆ సమయంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా తమ స్థానాల్లో నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు- క్రైస్తవ సన్యాసినుల అరెస్టును భాజపా ఎంపీ విజయ్ బఘేల్ సమర్థించారు. మత సామరస్యాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

ప్రియాంకాగాంధీ నిరసన

ఛత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ సన్యాసినుల అరెస్టుకు వ్యతిరేకంగా పలువురు కేరళ ఎంపీలతో కలిసి పార్లమెంటు హౌస్ సముదాయంలో ప్రియాంకాగాంధీ బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మైనార్టీలపై భాజపా దాడులు చేస్తోందని ఆమె ఆరోపించారు.

అరెస్టయిన నన్‌లను కలిసిన బృందా కారాట్

ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 25న అరెస్టయి దుర్గ్ కేంద్ర కారాగారంలో ఉన్న కేరళకు చెందిన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులను (ప్రీతి మేరీ, వందనా ఫ్రాన్సిస్) సీపీఎం అగ్ర నాయకురాలు బృందా కారాట్ బుధవారం కలిశారు. అనంతరం జైలు బయట ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. నన్‌ల అరెస్టు రాజ్యాంగవిరుద్ధమని, అక్రమమని పేర్కొన్నారు. దేశంలో క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడిగా ఈ ఘటనను అభివర్ణించారు.

ప్రత్యేక కోర్టుకే వెళ్లాలన్న సెషన్స్ కోర్టు

బెయిలు కోసం ప్రీతి మేరీ, వందనా ఫ్రాన్సిస్ చేసుకున్న దరఖాస్తులు తమ విచారణ పరిధిలోకి రావని ఛత్తీస్‌గఢ్ దుర్గ్ జిల్లాలోని సెషన్స్ కోర్టు బుధవారం తేల్చిచెప్పింది. ప్రత్యేక కోర్టునే ఆశ్రయించాలని వారికి సూచించింది.



రష్యా దాడితో ఉక్రెయిన్ ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయి. నీటికి కూడా కటకటలాడుతున్నారు. ఈ క్రమంలో రష్యా ఆక్రమిత దొనెట్స్క్‌లో బుధవారం ట్యాంకర్ ద్వారా అందిస్తున్న నీటి కోసం వేచి చూస్తున్న స్థానికులు

కాంగ్రెస్‌పై వీహెచ్‌పీ మండిపాటు

దిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టైన క్రైస్తవ సన్యాసినులకు మద్దతుగా రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తదితర కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుండటంపై విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మండిపడింది. చట్టాలు చేయాల్సిన నాయకులే.. చట్టాలను ఉల్లంఘిస్తున్నవారికి రక్షణగా నిలుస్తున్నారని హస్తం పార్టీ నాయకులను ఉద్దేశించి వీహెచ్‌పీ జాతీయ సెక్రటరీ జనరల్ సురేంద్ర జైన్ విమర్శలు గుప్పించారు.

సైనిక వాహనంపై పడిన బండరాయి

ల‌ద్దాఖ్‌లో లెఫ్టినెంట్ కర్నల్ సహా జవాను మృతి

లేహ్: లద్దాఖ్‌లో సైనిక వాహనం ప్రమాదానికి గురైంది. ఓ మారుమూల ప్రాంతంలో వెళ్తున్న వాహనంపై బండరాయి పడటంతో అందులో ఉన్న లెఫ్టినెంట్ కర్నల్‌తో పాటు ఓ జవాను ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గల్వాన్‌లోని చార్‌బాగ్ ప్రాంతంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దుర్బుక్ నుంచి చోంగ్‌టాష్‌కు శిక్షణ కోసం వెళ్తున్న క్రమంలో కాన్వాయ్‌లోని ఓ ఎస్‌యూవీపై కొండ ప్రాంతం నుంచి బండరాయి వచ్చి పడిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనం నుజ్జునుజ్జయ్యిందని పేర్కొన్నారు. మృతులను లెఫ్టినెంట్ కర్నల్ భాను ప్రతాప్ సింగ్, లాన్స్ దఫాదార్ దల్జీత్ సింగ్‌గా గుర్తించారు. గాయపడిన మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఇరాన్ నుంచి 18 లక్షల మంది అఫ్గాన్లు వెనక్కి!

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశం నుంచి లక్షల మంది అఫ్గాన్లు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. 3 నెలల్లో 18లక్షల మంది అఫ్గాన్ శరణార్థులు ఇరాన్ నుంచి బలవంతంగా స్వదేశానికి చేరుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ పాకిస్థాన్ నుంచి 1.84 లక్షల మంది, తుర్కియే నుంచి 5వేల మంది వచ్చినట్లు అంచనా. మరో 10వేల మంది అఫ్గాన్ ఖైదీలను పాకిస్థాన్ నుంచి స్వదేశానికి తరలించారు.

బాణసంచా పరిశ్రమలో పేలుడు

థాయ్‌లాండ్‌లో 9 మంది మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లోని ఓ బాణసంచా పరిశ్రమలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బ్యాంకాక్‌కు వాయవ్యంగా 95 కి.మీ. దూరంలో ఉన్న సుఫాన్ బురీ ప్రావిన్సులోని ఓ టపాసుల పరిశ్రమలో బుధవారం ఈ పేలుడు సంభవించింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

జీసీసీల్ని నడిపిస్తున్నారు!

లింగ వివక్ష, పక్షపాత ధోరణి, వేతనంలో వ్యత్యాసం, అనుక్షణం మారే సాంకేతికత... గ్లోబల్ టెక్ రంగంలో ఇలాంటి సవాళ్లెన్నో. వీటన్నింటినీ దాటుకుని తమదైన నైపుణ్యాలతో ప్రపంచ వినియోగదారుల్ని ఆకట్టుకుంటున్నారు. కృత్రిమ మేధనీ అందిపుచ్చుకుని గ్లాస్ సీలింగ్‌ని బద్దలుకొడుతున్నారు. జీసీసీల్లో నాయకురాళ్లుగా రాణిస్తున్నారు.



ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, ఆర్‌అండ్‌డీ, అనలిటిక్స్ విభాగాల్లో మెరుగైన పనితీరుకీ, కస్టమర్ సేవల్ని అందించేందుకూ బహుళజాతి సంస్థలు తమ ప్రధాన కేంద్రాలకు అనుసంధానంగా ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసే కేంద్రాలే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు(జీసీసీ). వెస్టియన్ రిసెర్చ్ సంస్థ రిపోర్టు ప్రకారం- ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3200 జీసీసీలు ఉంటే వాటిల్లో 1800కి పైగా ఇండియాలో ఉన్నాయి. వీటికి బెంగళూరు, హైదరాబాద్, పుణె ప్రధాన కేంద్రాలు. తాజాగా ఇండోర్, కోయంబత్తూర్, భువనేశ్వర్... వంటి టైర్- 2 నగరాల్లోనూ ఈ కేంద్రాలు నెలకొంటున్నాయి. 'ఓ పక్క టీసీఎస్ వంటి సంస్థలు ఉద్యోగుల్ని తగ్గించు కుంటున్నా... జీసీసీల కేంద్రంగా నిశ్శబ్దంగా అభివృద్ధి చెందుతోంది భారత్. జీసీసీలో ఇప్పటికే సుమారు 20 లక్షల ఉద్యోగులుంటే- వాళ్లలో 35శాతం అమ్మాయిలే' అంటున్నారు 'ప్రొటివిటీ' సంస్థ ఎండీ నాన్సీ భట్. దీనికి కారణం... గ్లోబల్ టెక్ రంగంలో గ్లాస్ సీలింగ్‌ని బద్దలు గొట్టి మనదేశ మహిళలు నాయకత్వ హోదాల్లో అద్భుతంగా రాణించడమే అంటున్నాయి మరికొన్ని అధ్యయనాలు.

ఎవరెవరు?

జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియాకు సీఈఓగా లలితా ఇంద్రకంటి, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్‌కి సీఈఓ అండ్ ఎండీగా శిరీష ఓరుగంటి, హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ సర్వీసెస్‌కి ఎండీ అండ్ హెడ్‌గా మమతా మాదిరెడ్డి, మెటా (ఇండియా) సంస్థ వైస్‌ప్రెసిడెంట్ అండ్ ఎండీగా సంధ్యా దేవనాథన్, మెట్రో బిజినెస్ సొల్యూషన్ సెంటర్ సీఈఓగా శ్రీమా నల్లశివం, మైక్రోసాఫ్ట్ ఇండియా-డేటా అండ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్- లీడర్ సప్నా గ్రోవర్, గూగుల్ భారతీయ ఆపరేషన్లకి హెడ్‌గా ప్రీతి లోబానా, సేల్స్‌ఫోర్స్ ఇండియా ఆసియా విభాగానికి చీఫ్‌గా అరుంధతీ భట్టాచార్య.. వీళ్లంతా జీసీసీల్లో సమర్థమైన నాయకురాళ్లుగా నిలిచారు. నిజానికి భట్టాచార్య బ్యాంకింగ్ కెరియర్‌లో రిటైరయ్యాక... సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా టెక్నాలజీ రంగంలోకి వచ్చారు.

వీళ్లే కాదు, ఏఎమ్‌డీ భారత్ విభాగానికి జయా జగదీశ్ సారథిగా వ్యవహరిస్తోంటే; అడోబ్ ఇండియాకి పవిత్ర మహాపాత్ర వీసీ అండ్ ఎండీగా ఉన్నారు. సిస్కో ఇండియా అండ్ సార్క్ ఆపరేషన్స్‌కి డైసీ చిట్టిలపల్లి ప్రెసిడెంట్‌గా ఉంటే; మెర్క్ ఐటీ సెంటర్‌కు హెడ్‌గా అనుప్రీత భట్టాచార్య... ఇలా ఎందరో మహిళలు గ్లోబల్ టెక్ లీడర్లుగా ఆయా సంస్థల్ని విజయవంతంగా నడిపిస్తున్నారు. అయితే వీళ్లంతా అసమానతనీ వివక్షనీ మరెన్నో సవాళ్లనీ తట్టుకుని నిలిచినవారే.

ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. టెక్నాలజీ సంస్థలతోపాటు మధ్య, సీనియర్ విభాగాల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెంచడంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలూ కృషి చేస్తున్నాయి. ఉదాహరణకు వి-హబ్ ద్వారా వ్యాపారంలోనే కాదు, జీసీసీల్లోనూ మహిళల ప్రాతినిధ్యం పెరిగేలా ప్రోత్సహిస్తోంది తెలంగాణ ప్రభుత్వం. మహిళల్ని నియమించుకునే కంపెనీలకు ప్రోత్సాహకాలతోపాటు నైపుణ్య శిక్షణ అందించేందుకూ మద్దతు ఇస్తున్నాయి మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు. మొత్తంగా భారత ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన జీసీసీల్లో మహిళలు కీలకంగా మారుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగాలి. కాలేజీల నుంచి నేరుగా రిక్రూట్ చేసుకోవడంతోపాటు కార్యాలయాల్లో అనుకూల వాతావరణం ఏర్పాటుచేయడం, మెంటార్‌షిప్ ప్రోగ్రామ్స్‌ని నిర్వహిస్తే జీసీసీల్లో మహిళలు మరింత రాణిస్తారనడంలో సందేహం లేదు

గత ఐదేళ్లలో జీసీసీల్లో మహిళా లీడర్ల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా ఆలోచిస్తున్నారు. నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతున్నారు. అందరినీ కలుపుకొంటూ సంస్థల్ని ముందుకు తీసుకెళుతున్నారు. ఈ సంఖ్య ఇంకా పెరగాలంటే నాయకత్వంలో ఉన్న మహిళలు సీనియర్ స్థాయిలో ఉన్న మహిళలకు మార్గదర్శకులుగా ఉండాలి.

- లలితా ఇంద్రకంటి, సీఈఓ, జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా

ఓ మహిళ బాస్‌గా ఉంటే అందరూ సహకరించరు. కెరియర్ ప్రారంభంలో... 'నువ్వు అమ్మాయివి, చిన్న వయసు' వంటి కామెంట్లే కాదు, నా విజయానికి కారణం నైపుణ్యం, అర్హతలు కాదనే అర్థం వచ్చేలా... 'స్కర్టు వేసుకుంటే ఎవరైనా డైరెక్టర్ కావొచ్చు...' వంటి గుచ్చుకునే మాటల్నీ ఎదుర్కొన్నా. ఓసారి నేను పుణెలో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యా. అక్కడ యాభై మందికి పైగా యూరోపియన్లే, అందరూ పురుషులే. వాళ్లు నన్ను టీమ్ అసిస్టెంట్, అడ్మిన్ అసిస్టెంట్, హెచ్‌ఆర్ మేనేజర్ అని పిలిచేవారు. దాంతో 'హెచ్‌ఆర్ కాదు అన్న బ్యాడ్జ్‌ను ధరించా. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాల్సిందే.

- శ్రీమా నల్లశివం, సీఈఓ, మెట్రో బిజినెస్ సొల్యూషన్ సెంటర్

మహిళల్ని టెక్ వైపు ప్రోత్సహించడం ప్రాథమిక స్థాయిలోనే అదీ ఇంటి నుంచే మొదలు కావాలి. అటు పిల్లల్నీ ఇటు పనినీ సమన్వయం చేసుకోగలిగే వాతావరణాన్ని మహిళలకు కంపెనీలూ కల్పించాలి. అప్పుడే సాంకేతిక రంగంలో నిలదొక్కుకోగలరు. మహిళలు సైతం ఏఐ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. మా సంస్థలో కొత్తగా ఏఐ ఆఫీసర్లనీ ప్రవేశపెట్టాం. ఈ ఆఫీసర్లు తెలివైన నిర్ణయాల్ని తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటమే కాదు, ఉత్పాదకతను పెంచేందుకూ వ్యాపార లక్ష్యాలను చేరుకునేందుకూ తోడ్పడతారు. అందుకే అమ్మాయిలు కొత్త టెక్నాలజీని నేర్చుకోవడానికి వెనుకాడకూడదు.

- సప్నా గ్రోవర్, హెడ్ క్లౌడ్ అండ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మైక్రోసాఫ్ట్

ఏఐ ఉద్యోగులకు ప్రత్యామ్నాయం కాదు. వ్యాపార విస్తరణకి టెక్నాలజీని జోడించాల్సింది మానవ మేధస్సే. ఈ రెండింటినీ సమన్వయం చేయడంలోనే కాదు, డిజిటల్ మోడల్స్‌ను ఆవిష్కరించడం, నైపుణ్యాలను పెంపొందించే వ్యూహాలను రచించడం ద్వారా వర్క్‌ప్లేస్‌ల్ని అభివృద్ధి చేయడంలోనూ జీసీసీలు ముందువరసలో ఉన్నాయి. వీటిల్లో మహిళా శక్తి కీలకమే.

- అనుప్రీత భట్టాచార్య, ఇండియా హెడ్, మెర్క్ ఐటీ సెంటర్



అది... 'రూమినేషన్'

ఏదైనా పని చేస్తున్నప్పుడు జయాపజయాలు సహజం. వాటిని తలచుకుని అక్కడే ఆగిపోలేం. పరిస్థితుల్ని పాఠాలుగా మలుచుకుని ముందుకు వెళ్లినప్పుడే విజయ తీరాల్ని చేరుకోగలం. కానీ కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా అది సాధ్యం కాదు. చేస్తున్న పని మీద దృష్టి ఉండదు. పదేపదే ఫెయిల్యూర్స్ గుర్తొస్తుంటాయి. ఈ ప్రతికూల ఆలోచనల ప్రభావం వల్ల చేస్తున్న పని, లక్ష్యం మీదా ఆసక్తి ఉండదు... సరికదా ఏదోలా దాన్ని పూర్తిచేసి ఇచ్చినా... నాణ్యత ఉండదు. దాంతో మరో ఫెయిల్యూర్ మన జాబితాలో చేరుతుంది. ఈ పరిస్థితిని 'రూమినేషన్' అంటారు. వైఫల్యాన్ని అంగీకరించకుండా, భయపడి దానికి దూరంగా పరుగెత్తడం వల్ల ఇది వస్తుంది. ఆందోళననీ, నిరాశనూ పెంచి, ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. దీన్నుంచి బయటపడకపోతే మీ మీద మీరు విశ్వాసం కోల్పోవడంతోపాటూ... అనేక మానసిక సమస్యలకూ దారితీస్తుంది. అందుకే పదే పదే అపజయాలు గుర్తొస్తున్నప్పుడు... వాటి నుంచి ధ్యాస మళ్లించుకునే ప్రయత్నం చేయండి. వాటన్నింటినీ ఓ చోట రాసుకోండి. పక్కనే మీరు సాధించిన విజయాలనూ ప్రస్తావించండి. ఇవి హ్యాపీ హార్మోన్ల విడుదలకు సహకరిస్తాయి. వీటితోపాటు వైఫల్యాలను అంగీకరించడం నేర్చుకోండి. వాటిని జీవితంలో, వర్క్‌లైఫ్‌లో ఓ భాగంగా భావించండి. ఆలోచనలు మరీ ఎక్కువగా ఇబ్బంది పెడుతోంటే... మానసిక నిపుణుల సలహాను తీసుకోండి. అప్పుడే వీటినుంచి బయటపడగలరు.

'మైక్రోమాన్స్' మీ మధ్య ఉందా?



డైమండ్ రింగ్ ప్రపోజళ్లు, డేట్ నైట్లు, ఖరీదైన బహుమతులు, సడెన్ సర్‌ప్రైజ్‌లు... ప్రేమను వ్యక్తపరచాలంటే ఈతరం జంటలకి గుర్తొచ్చేవి ఇవే. అయితే, ఎన్నిరోజులు? ఎప్పుడూ ఇలా మెప్పించడం సాధ్యమేనా? అంటే... కాదంటున్నారు సైకాలజిస్టులు. బంధం పదిలంగా ఉండాలంటే భార్యాభర్తల మధ్య 'మైక్రోమాన్సింగ్' ఉండాల్సిందే అంటున్నారు. సినిమాల్లోనో, సామాజిక మాధ్యమాల్లోనో చూసినట్లుగా వైభవంగా ఏమీ ఉండదు ఇది. రొమాన్స్ అసలే కాదు. అనవసరపు డ్రామాలకు చోటే లేదు. పార్ట్‌నర్‌కి తలనొప్పిగా ఉంటే ఓ టాబ్లెట్ తెచ్చి వేసుకోమనటం, టీవీ చూస్తూ అలా సోఫాలో కునుకు తీస్తుంటే... ఓ వెచ్చని దుప్పటి కప్పడం, ఒకరికోసం ఒకరు కాఫీ చేయటం, ఇష్టమైన పాటల్ని కలిసి వినటం... ఇదంతా మైక్రోమాన్సే. జెన్‌జీ అమ్మాయిలకు ఇది బోరింగ్‌లా అనిపించొచ్చు. కానీ, ఒకరికొకరు ఎమోషనల్‌గా కనెక్ట్ అవ్వటానికి దీన్ని మించినది లేదంటున్నారు నిపుణులు. నిజానికి చాలామంది భార్యాభర్తలు లేదా ప్రేమలో ఉండేవారు విడిపోవటానికి కారణం ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమను వ్యక్తపరచకపోవటమేనట. మీరు ఇచ్చే ఓ చిన్న ప్రశంస, కాస్తంత ప్రేమ, గౌరవం... ఇవే మీ మధ్య ఎమోషనల్ గ్యాప్‌ని పూరిస్తాయట. కాబట్టి, మైక్రోమాన్స్ చేస్తే, బ్రేకప్‌కే దూరంగా ఉండొచ్చంటున్నారు మానసిక నిపుణులు. ప్రయత్నిస్తారా మరి.

క్రియాటిన్ పెరిగింది... ఏం తినాలి?

నాకు 47 ఏళ్లు. డయాబెటీస్ ఉంది. ఈ మధ్య పరీక్ష చేయిస్తే క్రియాటిన్ పెరిగింది జాగ్రత్తగా ఉండమన్నారు డాక్టర్లు. లేదంటే కిడ్నీ పనితీరుపై ప్రభావం చూపుతుందన్నారు. దీన్ని తగ్గించుకోవడానికి ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి?- నిర్మల, తిరుపతి

మీకు డయాబెటీస్ వచ్చి ఎన్ని సంవత్సరాలు అయ్యింది? దీర్ఘకాలం నుంచి మధుమేహం ఉంటే కిడ్నీ, గుండె, పళ్లు, నరాల పనితీరుపై దీని ప్రభావం ఉంటుంది. చక్కెర స్థాయిల్లో హెచ్చుతగ్గులు ఏర్పడినప్పుడు రక్తంలోని క్రియాటిన్ నిల్వలు సాధారణం కంటే ఎక్కువ పెరుగుతాయి. అందుకే ఈ సమయంలో ఆహార నియమాలను తప్పక పాటించాలి. మీరు తినే ఆహారంలో ప్రొటీన్ తక్కువ ఉండేలా చూసుకోవాలి. రక్తంలో క్రియాటిన్ పెరగకూడదంటే చక్కెర స్థాయులను నియంత్రణలో ఉంచుకోవాలి. అంతేకాదు, మీ ఎత్తుకు తగిన బరువు ఉన్నారా? శరీరంలో అధిక కొవ్వులున్నాయా? కండశాతం ఎంత ఉంది? వంటివాటిని కూడా గమనించుకోవాలి. ఒకవేళ మీరు బరువు తగ్గాలని తక్కువ ప్రొటీన్ తీసుకుంటున్నట్లయితే ఇది శరీరంలో కండ పరిమాణాన్ని తగ్గించే అవకాశం ఉంది. అది మీకు మేలుచేయకపోగా, కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. దీనివల్ల కూడా క్రియాటిన్ పెరిగే అవకాశం ఉంది. అందుకే రోజువారీ ఆహారంలో మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు... పప్పు దినుసులు, సోయా, పాలు, పెరుగు వంటివి తీసుకుంటే మేలు. వీటిలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. మాంసాహారులైతే చేప, తక్కువ ఫ్యాట్ ఉండే చికెన్, రెండు గుడ్లను తక్కువ నూనెతో వండి మాత్రమే తినాలి. అయితే రోజులో 90గ్రా. నుంచి 100గ్రా. ప్రొటీన్‌కి మించకూడదు. ఈ డైట్ పాటిస్తూ మీ క్రియాటిన్ స్థాయులను రెండు నెలల తర్వాత మళ్లీ ఓసారి చెక్ చేయించుకోండి. ఒకవేళ మీకు డయాబెటీస్‌తో పాటు బీపీ కూడా ఉంటే అదుపులో ఉంచుకునేందుకు మెడిటేషన్, యోగ, వ్యాయామాలు చేయాలి. వీటితోపాటు పొటాషియం, మెగ్నీషియం ఎక్కువ ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఈ ఆహార నియమాలు మీ ఎత్తు, బరువులను బట్టి మారుతూ ఉంటాయి. కాబట్టి మీ పోషకాహార నిపుణులను సంప్రదించి అప్పుడు మాత్రమే ఈ డైట్‌ని పాటించాల్సి ఉంటుంది.

వానాకాలంలో ఆకుకూరలు తినకూడదా?

వర్షాకాలంలో ఆకుకూరలు తింటే విరేచనాలు అవుతాయి అంటారు. ఇది నిజమేనా? - ఓ సోదరి

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

వానాకాలంలో ఆకుకూరలు తింటే విరేచనాలు అవుతాయనేది అపోహ మాత్రమే. ఈ కాలంలో ఎందుకు తినకూడదు అంటారంటే... మిగిలిన కూరగాయలతో పోలిస్తే ఆకుకూరలు భూమికి దగ్గరగా పెరుగుతాయి. వర్షపు జల్లుల వల్ల ఆకుకూరలపై మట్టి పేరుకుని కీటకాలకు ఆవాసంగా మారతాయి. వీటిని సరిగ్గా శుభ్రం చేయకుండా వండితే అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంటుంది. కానీ, ఈ సీజన్‌లో మన శరీరానికి అవసరమయ్యే పోషకాలు కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫోలిక్ ఆమ్లాలు ఆకుకూరల నుంచే ఎక్కువ మొత్తంలో లభిస్తాయి. అందుకే, రోజువారీ ఆహారంలో 50గ్రా. ఏదోక ఆకుకూరని చేర్చుకోవాలి. అయితే వీటిని వండేముందు ఉప్పు లేదా వినెగర్ కలిపిన నీటితో రెండుమూడు సార్లు బాగా కడగి ఎక్కువసేపు ఉడికించాలి. ఆకుకూరల్ని ఈ పద్ధతిలో తీసుకుంటే ఎలాంటి జీర్ణసమస్యలూ ఉండవు.



శోధిత

ఆ ముద్ర పడనీయొద్దు!

'మండే బ్లూస్'... సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా దీనికి సంబంధించిన ఫన్నీ ట్వీట్స్, మీమ్స్, స్లోగన్లే. వారమంతా ఆ ప్రాజెక్ట్, ఈ డెడ్‌లైన్.. అంటూ ఉరుకులు పరుగులు పెట్టే అమ్మాయిలే ఎక్కువ. వీకెండ్ వచ్చేసింది... అనుకునేలోపే అదేమో వెళ్లిపోతుంది కూడా. ఇక, సోమవారం మొదలవుతుందంటే చాలు... ఎక్కడలేని ఆందోళన కమ్మేస్తుంది. వారంలో చేయాల్సిన పనంతా కళ్లముందు మెదులుతుంది. ఇదంతా స్నేహితులతోనూ సరదాగా షేర్ చేసుకుంటాం కదా! అయితే, ఈ ఫీలింగ్ ఆ ఒక్క రోజే ఉండిపోయేదా? అంటే, కాదంటున్నాయి 'ది యూనివర్సిటీ ఆఫ్ హాంగ్‌కాంగ్' తాజా అధ్యయనాలు. వారం ప్రారంభమయ్యే రోజు చాలామందిలో ఒత్తిడి పెంచే కార్టిసాల్ స్థాయులు పెరుగుతున్నాయట. మిగిలిన రోజులతో పోలిస్తే ఇది 23శాతం అధికమట. అంతేనా, దీని తాలూకా బయోకెమికల్ ఫుట్‌ప్రింట్ మెదడులో అలానే కొన్ని వారాలు, నెలలపాటు ఉండిపోతుందట. అందుకు సంబంధించిన ఆనవాళ్లు జుట్టులోనూ ఉన్నట్లు గుర్తించారు శాస్త్రవేత్తలు. ఇది పనిచేసే వాళ్లలోనే కదా... అనుకుంటే పొరపాటే. రిటైర్ అయిన వారిలోనూ ఈ ఒత్తిడి స్థాయులు కనిపిస్తున్నాయట. ఏళ్లపాటు ఈ 'ప్యాటర్న్' కండిషనింగ్‌కి అలవాటు పడి, ఒత్తిడి ఆటోమేటిక్‌గా వచ్చేస్తోందట. దీర్ఘకాలంలో ఇదే గుండె సమస్యలకీ, హైపర్ టెన్షన్‌కీ, ఇన్సులిన్ నిరోధకతకీ దారితీస్తోందట. కాబట్టి, వారాంతాల్లోనే రాబోయే వారానికి తగినట్లు ప్రణాళిక వేసుకోవటం, ఆర్గనైజ్‌డ్‌గా ఉండటం, రోజుని ప్రశాంతంగా ప్రారంభించటం... వంటివి చేయాలని సూచిస్తున్నారు నిపుణులు. ఫాలో అవుతారా అమ్మాయిలూ...

శివాని... పారా క్రీడల రాణి!



వైకల్యం.. ఆమె సంకల్పానికి ఓడిపోయింది. పేదరికం.. తన ఆత్మవిశ్వాసం ముందు తలొంచింది. పుట్టుకతోనే కుడిచేయి సగం లేకపోయినా కుంగిపోకుండా చదువులో ముందడుగు వేసింది. చదువుతోపాటు జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడల్లో రాణిస్తూ... ప్రతిభకు పేదరికం, వైకల్యం అడ్డుకావని నిరూపిస్తోంది కర్నూలుకి చెందిన శివాని.



ఈమెది కర్నూలు జిల్లా మడికేరి ప్రాంతం. తల్లిదండ్రులు లలిత, ఈరప్ప వ్యవసాయం చేస్తారు. పుట్టుకతోనే శివాని కుడిచేయి సగం మాత్రమే ఉంది. ఎంతో మంది డాక్టర్లకు చూపించినా ఫలితం లేదు. చిన్నప్పుడు పిల్లలు తనతో కలిసి ఆటలు ఆడేవారు కాదు. అంతా చులకనగా చూసేవారు. ఒంటరి భావనతో కుంగిపోయేది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఆమెకు అండగా నిలిచారు. అప్పుడే చదువుతో పాటు క్రీడల పైనా దృష్టి పెట్టింది. ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత కర్నూలు జిల్లా జవహర్ నవోదయ పాఠశాలలో సీటు వచ్చింది. రెండేళ్ల కిందట మినీ మైగ్రేషన్ కింద అన్నమయ్య జిల్లా మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయానికి వచ్చిన ఈమె, ప్రస్తుతం 12వ తరగతి చదువుతోంది. రెండేళ్ల కిందట నిర్వహించిన నేషనల్ పారా స్పోర్ట్స్ టాలెంట్ హంట్‌లో సత్తా చాటి, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని నవోదయ విద్యాలయంలో ఇచ్చే శిక్షణకు ఎంపికయ్యింది. అక్కడ పారా క్రీడల్లో శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంది. గుజరాత్, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లో షాట్‌పుట్, జావెలిన్ త్రో, పరుగుపందాల్లో పాల్గొని పతకాలు సాధించింది. వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ యూత్ గేమ్స్- 2024లో జరిగిన పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకం సాధించింది. జవహర్ నవోదయ విద్యాలయం, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో థాయ్‌లాండ్‌లో ఇటీవల నిర్వహించిన ఆసియా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్రం తరపున షాట్‌పుట్, జావెలిన్‌త్రో, పరుగు పందాల్లో రెండు బంగారు, ఒక వెండి పతకాలు సాధించింది. ఇప్పటి వరకూ పాల్గొన్న పోటీల్లో మొత్తం 8 బంగారు పతకాలు, ఒక వెండి, కాంస్యం సాధించింది. తన ప్రతిభను గుర్తించిన అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందించడంతోపాటు కృత్రిమ చేతినీ పెట్టించారు. 'భవిష్యత్తులో పారాలింపిక్స్ పతకంతోపాటు, ఐఏఎస్ సాధించటమే నా లక్ష్యం' అంటోంది శివాని.

– పెద్దిరెడ్డిగారి పవన్‌కుమార్‌రెడ్డి, కడప

ఈ తరమైనా మారాలని..!



పీరియడ్... ఈ మాట బయటికి వచ్చిందో లేదో పక్కవారి నోట్లోంచి 'ష్... మెల్లగా' అన్న సూచన వచ్చేస్తుంది. ఆ సమయంలో వచ్చే ఇబ్బందిని చెప్పాలన్నా ఎవరైనా ఉన్నారేమోనని చుట్టూ పరిశీలించుకోవడం. ఈ ఇబ్బందులన్నీ తట్టుకోలేకే ఎంతోమంది అమ్మాయిలు ఇప్పటికీ చదువు మానేస్తున్నారు. ఆ పరిస్థితిని మార్చాలనుకున్నారు ప్రీతి శర్మ. అందుకే నెలసరిపై అవగాహన కల్పిస్తున్నారామె.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోకుల్... ప్రీతి శర్మది. స్కూల్లో మామూలుగానే అమ్మాయిలు తక్కువ. ఇక నెలసరి మొదలైందంటే పూర్తిగా చదువు మానేసేవారు. కొందరైతే సరైన సదుపాయాలు లేవని ఆ సమయంలో స్కూలుకే వచ్చేవారు కాదు. తన పరిస్థితీ అంతే. అయితే ఇదంతా కొన్నేళ్ల క్రితం! కానీ ఇప్పటికీ... దాదాపు రెండు దశాబ్దాల తరవాత... తన కూతుళ్ల సమయంలోనూ ఎన్నో ఇబ్బందులు. చదివే స్కూళ్లు మంచివే. సదుపాయాలపరంగా ఎలాంటి ఢోకా లేదు. కానీ పీరియడ్ సమయంలో ఇబ్బందులను బయటికి చెప్పే వీలే లేదు. నవ్వుతారేమో, హేళన చేస్తారేమోనన్న భయం. తన పరిస్థితి ఈ తరాలకు రాకూడదనుకున్నారు ప్రీతి. నెలసరి కారణంగా ఎవరూ చదువుకి దూరం కాకూడదు అనుకున్నారు. 2018లో రాజస్థాన్‌లో 'ప్రజ్ఞ ఫౌండేషన్' ప్రారంభించారు. దానిద్వారా స్కూలు విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'ఓ నివేదిక ప్రకారం కేవలం 2019లో 2.3 కోట్లమంది అమ్మాయిలు నెలసరి ప్రారంభమయ్యాక చదువులు మానేశారు. ఇప్పటికీ శానిటరీ ప్యాడ్ కొనుక్కోలేని వారు ఉన్నారంటే నమ్ముతారా? అందుకే మొదట శానిటరీ, శుభ్రత కిట్లను అందించడంపైనే దృష్టిపెట్టా. కానీ అదొక్కటే చాలదనిపించి 'కిశోరీ' పేరుతో నెలసరి శుభ్రత, ఆరోగ్యాలపై అవగాహన కలిగించడం ప్రారంభించా. ఉపాధ్యాయులు, పిల్లలనూ దీనిలో భాగం చేశా. అప్పుడే వారికి అమ్మాయిల ఇబ్బందులు అర్థమవుతాయి. అమ్మాయిలూ ధైర్యంగా సమస్యని అందరి ముందూ మాట్లాడతారు. నెలసరి సిగ్గుపడాల్సిన, అసహ్యించుకునే విషయం కాదనీ తెలిసొస్తుంది. అయితే ఒక్కసారి ఉత్పత్తులు ఇచ్చి, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే మార్పు సాధ్యం కాదు. అందుకే ప్రభుత్వ స్కీముల సాయం తీసుకుంటున్నా' అనే ప్రీతి 'అక్షర్ కక్షా', 'షేరింగ్- కేరింగ్', 'పన్జార్ట్' వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా వెనకబడిన మహిళలకీ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ఉపాధి శిక్షణనిస్తున్నారు. మురికివాడల పిల్లలను బడిబాట పట్టిస్తున్నారు. ఈ క్రమంలో అవార్డులే కాదు, ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కితాబులూ అందుకున్నారు ప్రీతి. ఆమె ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!

ఇది పామ్‌పామ్ చామంతి!













ఆకర్షణీయమైన ఆకృతి, కంటికింపైన రంగులతో ఆకట్టుకునే చామంతులంటే ఎవరికి ఇష్టముండదు? అందులోనూ గుండ్రని బంతుల్లా కనువిందు చేసే పామ్ పామ్ క్రిసాంతిమమ్ అంటే మరీనూ. వీటిని ఎలా పెంచుకోవాలో తెలుసా..!

పువ్వు రూపాన్ని బట్టి ఈ చామంతికి పామ్ పామ్ క్రిసాంతిమమ్ అనే పేరు వచ్చింది. దొంతరలా గుండ్రంగా పేరుకున్న రేకలతో పామ్‌పామ్‌లా కనిపిస్తాయా పూలు. ఇవి మామూలుగా ఇతర చామంతుల కంటే కాస్త చిన్నగా ఉంటాయి. వీటిల్లో కుషన్ మమ్స్, బటన్ మమ్స్... ఇలా ఎన్నోరకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఆస్టరేసీ కుటుంబానికి చెందిన ఇవి 1-3 అడుగుల పొదవులో పెరుగుతాయి. ఇవి తెలుపు, పసుపు, గులాబీ, ఎరుపు, ఊదా సహా అనేక రంగుల్లో విరుస్తాయి. మంచి సువాసననూ ఇస్తాయి.

చక్కగా ఎదగాలంటే...

ఈ పూలు ఆసియాలోని పలు దేశాల్లో విరివిగా కనిపిస్తాయి. ముఖ్యంగా చైనా, జపాన్ దేశాల్లో శతాబ్దాలుగా సాగు చేస్తున్నారు. ఔషధ, అలంకరణ మొక్కలుగా విశేష ప్రాచుర్యం పొందాయి. ఇవి చక్కగా ఎదగాలంటే... రోజుకి కనీసం 5-6 గంటల పాటు ఎండ, తేమ ఎక్కువగా ఉండే నేల అవసరం. బంకమట్టి లేదా ఇసుక నేలల్లో నాటుకోవచ్చు. మట్టిలో కంపోస్ట్ కలిపితే ఆరోగ్యంగా ఎదుగుతాయి. నీళ్లు మరీ ఎక్కువైతే మాత్రం... వేళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఆకుల్నీ తడపకూడదు. ఇక, పూలు ఎక్కువగా రావాలంటే... పొటాషియం శాతం ఎక్కువగా ఉండే ఎన్‌పీకేను ఎరువుగా ఇవ్వాలి. మొగ్గలు మొదలయ్యే వరకూ చిగుళ్లను తుంచేస్తే ఎక్కువ కొమ్మలు వస్తాయి.

గాలి వీచే చోట...

దీనికి బూజు తెగులు ఎక్కువగా వస్తుంది. అందుకే, గాలి బాగా వీచే చోట వీటిని నాటుకోవాలి. ఎండిన, వ్యాధిసోకిన కొమ్మల్ని, ఆకుల్ని ఎప్పటికప్పుడు కత్తిరించాలి. మొక్క చుట్టూ ఉన్న మట్టి మరీ బిగుసుకుపోకుండా వదులు చేయాలి. పండిన కూరగాయలు, పండ్లు వంటివి ఎరువుగా వేయొద్దు. ఎందుకంటే అవి ఉత్పత్తి చేసే ఇథలీన్... పూల జీవితకాలాన్ని తగ్గిస్తుంది.

బంగారం - వెండి



30న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,01,670	92,500	1,16,309
విజయవాడ	98,695	92,100	1,17,100
ప్రొద్దుటూరు	99,600	91,680	1,16,800
రాజమహేంద్రవరం	1,00,480	92,100	1,27,000
విశాఖపట్నం	1,00,100	92,100	1,20,000
తమిళనాడు	-----	92,100	1,27,000

(c) eenadu

వణికించిన సునామీ

మాస్కో, టోక్యో: రష్యాను బుధవారం భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత నమోదైన ఈ భూకంపంవల్ల రష్యాతోపాటు అమెరికా, జపాన్, హవాయ్ దీవుల్లో సునామీ వచ్చింది. సముద్ర తీరంలో అలలు భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. భూకంపం, సునామీ సమయాల్లో జనం భయంతో పరుగులు తీశారు. ప్రాణ, ఆస్తి నష్టంపై పూర్తి వివరాలింకా అందలేదు. అయితే రష్యా, జపాన్‌లలో కొంత మంది గాయపడ్డట్లు అధికారులు తెలిపారు. తీవ్రమైన గాయాలు కాదని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను ఉపసంహరించినా.. మరికొన్ని చోట్ల 24 గంటల వరకూ కొనసాగిస్తున్నారు. సునామీతో పలు దేశాల్లోని తీర ప్రాంతాల్లో ఉండే లక్షల మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. అమెరికా, జపాన్, రష్యాల్లో పరిస్థితులు కుదుటపడ్డా బుధవారం సాయంత్రానికి చిలీ, క్యూబాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి.

తొలుత భూకంపం

రష్యా తూర్పు తీర ప్రాంతంలో ఉన్న కమ్చట్కా ద్వీపకల్పంలో స్థానిక కాలమానం ప్రకారం.. ఉదయం 11.24 గంటలకు భూకంపం సంభవించింది. తొలుత దీని తీవ్రతను 8.0గా నిర్ధారించిన జపాన్, అమెరికా భూకంప శాస్త్రవేత్తలు.. ఆ తరువాత 8.8గా పేర్కొన్నారు. 6.9 తీవ్రతతోపాటు పలుమార్లు భూమి కంపించింది. భూకంప కేంద్రం 1,80,000 జనాభా ఉన్న రష్యా నగరం పెట్రోపావ్‌లోవ్స్క్‌కు 119 కిలోమీటర్ల దూరంలో ఉంది. 20.7 కిలోమీటర్ల లోతున కేంద్రీకృతమైంది.

• భూకంపం కారణంగా క్లుచేవ్‌స్కాయా సోప్కా అగ్ని పర్వతం నుంచి లావా ప్రవహిస్తోంది.

భయపెట్టిన సునామీ

రష్యాలో వచ్చిన భూకంపంతో ఆ దేశంతోపాటు జపాన్, అమెరికాకు చెందిన హవాయ్ దీవుల్లో సునామీ అలలు ఎగసిపడ్డాయి. కమ్చట్కాలోని తీర ప్రాంతాల్లో అలు ఇళ్లను ముంచెత్తాయి. దీంతో ప్రజలంతా ఆ ప్రాంతాలను ఖాళీ చేశారు. ఈ సమయంలో కొంత మంది గాయపడ్డారు. జపాన్ ఉత్తర ప్రాంతంలో అలలు భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. హవాయ్ రాజధానిలోని తీర ప్రాంత రోడ్లు, జాతీయ రహదారులు కార్లతో తరలివెళ్లే వారితో నిండిపోయాయి.



రష్యాలోని ఒఖోస్క్ సముద్ర తీర ఉత్తర కురిల్ దీవుల్లో ఒడ్డుకు చేరిన స్టెల్లర్ సీ లైన్స్

అప్రమత్తమైన భారత్

అమెరికాలోని కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి భారత రాయబార కార్యాలయం అప్రమత్తమైంది. కాలిఫోర్నియా, హవాయ్‌తో పాటు అమెరికా పశ్చిమ తీర రాష్ట్రాల్లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

• భారీ భూకంపం కారణంగా హవాయ్ ప్రాంతంలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయని, అలస్కా, పసిఫిక్ తీర ప్రాంతాలకు ముప్పు పొంచి ఉందని, జాగ్రత్తగా, ధైర్యంగా ఉండాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు.

• భారత్‌కు ఎలాంటి సునామీ ముప్పు లేదని ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) పేర్కొంది.

• కమ్చట్కాలో సునామీతో అలలు.. 3 నుంచి 4 మీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. కురిల్ దీవుల్లో 10 నుంచి 15 మీటర్ల ఎత్తుల అలలు ఎగసిపడ్డాయని రష్యా అధికారులు తెలిపారు.

• జపాన్ ఉత్తర ద్వీపమైన హొక్కైడోలో 60 సెంటీమీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. జపాన్ తీర ప్రాంతాల్లోని ప్రజలు కొండలపైకి, ఇళ్ల పైకి వెళ్లారు.

• అలస్కాలోని అల్యూటియన్ ద్వీపంలో 1.4 అడుగుల ఎత్తున అలలు ఎగసిపడ్డాయి.

• భూకంపం, సునామీ కారణంగా పలువురు గాయపడ్డారని రష్యా అధికారులు తెలిపారు. జపాన్‌లో ఒకరు గాయపడ్డారని అక్కడి అధికారులు వెల్లడించారు.

• హొనలులులో వీధులు కార్లతో జామ్ అయ్యాయి. ట్రాఫిక్ స్తంభించింది. రష్యాలోని తీర నగరం సెవెరో కురిల్స్క్‌లో అలలు భారీగా ఎగసిపడ్డాయని, చేపల బోట్లు కొట్టుకుపోయాయని మేయర్ అలెగ్జాండర్ ఓవ్సియన్నికోవ్ తెలిపారు. విద్యుత్తు సరఫరాను నిలిపేసి తనిఖీ చేశామని వెల్లడించారు.

• కొన్ని గంటల తర్వాత సునామీ హెచ్చరికలను హవాయ్ ఉపసంహరించుకుంది. పసిఫిక్ తీరంలో ఈ హెచ్చరికలను ఉపసంహరించుకున్న జపాన్.. తూర్పు తీర ప్రాంతంలో కొనసాగిస్తోంది. 24 గంటల వరకూ సునామీ ప్రభావం ఉండవచ్చని ప్రకటించింది.

• ఫిలిప్పీన్స్, మెక్సికో, న్యూజిలాండ్‌లో హెచ్చరికలు జారీ అయినా తర్వాత ఉపసంహరించుకున్నారు. వాటితోపాటు ఈక్వెడార్, రష్యా, వాయవ్య హవాయ్, చిలీ, కోస్టారికా, ఫ్రెంచ్ పాలినేసియా, గువామ్, హవాయ్, జపాన్, జార్విస్ ఐలాండ్, జాన్‌స్టన్ అటోల్, కిరిబాటి, మిడ్‌వే ఐలాండ్, పాల్మిరా ఐలాండ్, పెరూ, సమోవా, సోలోమన్ దీవులు, అంటార్కిటికా, ఆస్ట్రేలియా, చుక్, కొలంబియా, కుక్ దీవులు, ఎల్ సాల్వడార్, ఫిజీ, గ్వాటెమాల, ఇండోనేసియా, మెక్సికో, న్యూజిలాండ్, నికరాగువా, పనామా, పపువా న్యూగినీ, ఫిలిప్పీన్స్, తైవాన్, బ్రూనై, చైనా, ఉత్తర కొరియా, దక్షిణ కొరియా, మలేసియా, వియత్నాం దేశాలను అప్రమత్తం చేశారు.

• ముందు జాగ్రత్త చర్యగా జపాన్‌లోని ఫుకుషిమా అణు కేంద్రంలోని 4,000 మంది సిబ్బందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. అయితే అక్కడ ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

భూప్రకంపనల్లోనూ సర్జరీని పూర్తి చేసిన వైద్య బృందం

భారీ భూకంపం సమయంలో కమ్చట్కా ప్రాంతంలోని ఓ ఆసుపత్రిలో సర్జరీ జరుగుతోంది. ప్రకంపనల ధాటికి ఆ భవనం మొత్తం ఊగిపోయింది. అయితే.. వైద్యులు ఏ మాత్రం భయపడకుండా.. ప్రశాంతంగా ఆ సర్జరీని పూర్తి చేయడం గమనార్హం. ఆపరేషన్ థియేటర్‌లోని స్ట్రెచర్‌ను ఊగకుండా సిబ్బంది గట్టిగా పట్టుకొన్నారు. వైద్యులు సర్జరీని కొనసాగించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి.



తీరానికి కొట్టుకొచ్చిన తిమింగలాలు..

సునామీ దెబ్బకు తిమింగలాలు తీరానికి కొట్టుకొచ్చాయి. సముద్రంలో కల్లోలంతో నీటి మధ్యలో ఉండాల్సిన అవి తీరంలో విసిరేసినట్లు పడ్డాయి. జపాన్‌లోని చింబా తీరంలోని వాటి దృశ్యాలు వైరల్‌గా మారాయి.

ప్రతిష్ఠాత్మక కంపెనీలకు భూములు కేటాయిస్తే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

టీసీఎస్‌కు 99 పైసలకే అమ్మేస్తున్నారంటూ పిల్

విశాఖపట్నంలో రూ.529 కోట్ల ఖరీదు చేసే 21.16 ఎకరాల భూమిని 99 పైసలకే టీసీఎస్ కంపెనీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 21న జీవో జారీ చేసిందంటూ 'సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ రైట్స్' సంస్థ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.సమ్మగ్రేస్ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో ఆమె తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. టీసీఎస్ కంపెనీకి భూ కేటాయింపుపై తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే ఏపీఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా నగరం నడిబొడ్డున 99 పైసలకు మొత్తం 21.16 ఎకరాలు కేటాయించారని, ఆ భూమిని టీసీఎస్‌కు విక్రయిస్తూ దస్తావేజులు రాసుకొనేందుకు అనుమతిచ్చారని చెప్పారు. విక్రయ దస్తావేజు రాయటం వల్ల భవిష్యత్తులో టీసీఎస్ సంస్థ పెట్టుబడులు పెట్టకపోయినా, ఉద్యోగాలు కల్పించకపోయినా ఆ భూమిని వెనక్కి తీసుకునే అధికారం ప్రభుత్వం కోల్పోతుందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఆరోపిస్తున్నట్లు భూమిని విక్రయించటం లేదన్నారు. కేవలం లీజుకు మాత్రమే ఇస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు గడువు కోరారు. ధర్మాసనం అంగీకరించి, విచారణను వాయిదా వేసింది.

ఫామ్‌హౌస్‌లో మద్యం నోట్ల కట్టలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన అనుచరుడైన బూనేటి చాణక్య గతేడాది జూన్‌లో 12 అట్టపెట్టెల్లో రూ.11 కోట్ల నగదును ప్యాక్ చేసి పురుషోత్తం వరుణ్‌కుమార్‌కు అందజేశాడు. వాటిని శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పరిపాలన అధికారిగా పనిచేసే ముత్యాల వినయ్ కుమార్‌రెడ్డి (వినయ్)కి అప్పగించాలని ఆదేశించాడు. అట్టపెట్టెల్లో డబ్బులున్న విషయం వినయ్‌కుమార్‌రెడ్డికి చెప్పొద్దని, అందులో రాజ్ కెసిరెడ్డి, బూనేటి చాణక్య కార్యాలయాలకు సంబంధించిన ఫైళ్లు ఉన్నాయని మాత్రమే చెప్పాలని వరుణ్‌కు నిర్దేశించాడు.

వర్ధమాన్ కాలేజీలోనే భద్రపరచాలనుకున్నా..

నగదుతో కూడిన ఈ అట్టపెట్టెలను వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల కార్యాలయంలోనే భద్రపరచాలని రాజ్ కెసిరెడ్డి, చాణక్యలు భావించారు. అయితే వినయ్‌కుమార్‌రెడ్డి.. వాటిని కళాశాలకు అనుబంధంగా ఉన్న ఫామ్‌హౌస్‌లో ఓ గోదాము ఖాళీగా ఉందని అందులో పెట్టుకోవాలని సూచించారు. వరుణ్ ఆ సమాచారాన్ని చాణక్యకు చేరవేసి ఆ గోదాములోనే అట్టపెట్టెలను భద్రపరిచి వచ్చేశాడు. రెండు నెలల తర్వాత గతేడాది ఆగస్టులో సీఐడీ అధికారులు వరుణ్‌ను విచారణకు పిలిపించారు. అప్పట్లో అతను నోరు విప్పలేదు. ఈ కేసు దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 5న సిట్‌ను ఏర్పాటు చేయటంతో వైకాపా ముఠా అప్రమత్తమైంది. అదే నెల 8న వరుణ్‌కుమార్‌ను దుబాయ్‌కు పంపించేసింది. అతని ప్రయాణ టికెట్లు, ఇతర ఖర్చులన్నీ రాజ్ కెసిరెడ్డే భరించాడు. అప్పటి నుంచి వరుణ్ దుబాయ్‌లోనే ఉన్నాడు. తనపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయటానికి సిట్ రంగం సిద్ధం చేస్తుండటం, అన్ని వైపుల నుంచీ ఉచ్చు బిగించటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వరుణ్ రెండు రోజుల కిందట భారత్‌కు వచ్చి, సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఈ అక్రమ సొత్తు గుట్టు బయటపడింది.





సులోచన ఫామ్ హౌస్ ● ఏపీ మద్యం కేసులో హైదరాబాద్‌లో సీజ్ చేసిన నగదును పెట్టెలలో విజయవాడ సిట్ ఆఫీస్‌కు తీసుకెళ్తున్న పోలీసు సిబ్బంది

యంత్రాలతో ముడుపుల సొమ్ము లెక్కించి..

అట్టపెట్టెల్లో భద్రపరిచిన ముడుపుల సొమ్ము ఎంతో తేల్చేందుకు సిట్ అధికారులు తమతో పాటు రెండు నగదు లెక్కింపు యంత్రాల్ని తీసుకెళ్లారు. అర్ధరాత్రి 12.30 నుంచి ఉదయం 5 గంటల వరకు ఈ లెక్కింపు ప్రక్రియ జరిగింది. తొలుత 5 అట్టపెట్టెల్లో కనిపించాయి. వెతికి చూడగా మొత్తం 12 అట్టపెట్టెలు లభ్యమయ్యాయి. వాటిలో 10 అట్టపెట్టెల్లో రూ.కోటి చొప్పున, మరో 2 అట్టపెట్టెల్లో ఒకదానిలో రూ.70 లక్షలు, మరోదానిలో రూ.30 లక్షలు దొరికాయి. ఈ నగదంతా రూ.500, రూ.200, రూ.100 నోట్లకట్టలే. ఈ అట్టపెట్టెలను సీజ్ చేసి, బుధవారం మధ్యాహ్నం విజయవాడలోని సిట్ కార్యాలయానికి తరలించారు.

ముడుపుల సొమ్ముకు మూడంచెల భద్రత

వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ద్వారం వద్దకు సిట్ అధికారులు చేరుకున్న విషయాన్ని సీసీ కెమెరాల్లో గమనించిన కళాశాల యాజమాన్యం వెనక గేటు వైపు నుంచి నగదు, కొన్ని పత్రాలు బయటకు తరలించినట్లు సమాచారం. ఈ కళాశాల యజమాని తీగల విజేందర్‌రెడ్డి.. కళాశాలకు ఎదురుగా తన తల్లి సులోచన పేరిట ఫామ్‌హౌస్, అందులో విలాసవంతమైన అతిథిగృహంతోపాటు గోదాము నిర్మించుకున్నారు. దీనికి మూడంచెల భద్రత ఉంటుంది. బయట వ్యక్తులు ఎవరూ లోపలికి అడుగుపెట్టలేరు. అలాంటిచోట మద్యం ముడుపుల సొత్తును ఈ ముఠా భద్రపరిచింది. అస్వస్థతకు గురైన విద్యార్థులను అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి తరలించేందుకు ఉద్దేశించిన ఇంజినీరింగ్ కళాశాల అంబులెన్స్‌ను నగదు రవాణా కోసం వినియోగించినట్లు సమాచారం.

ఆ డబ్బుతో నాకు సంబంధం లేదు!

విజయవాడ ఏసీబీ కోర్టులో రాజ్ కెసిరెడ్డి అఫిడవిట్

ఈనాడు, అమరావతి: 'హైదరాబాద్ శివారు శంషాబాద్ మండలం కాచారంలోని ఫామ్ హౌస్‌లో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నగదుతో నాకు ఎటువంటి సంబంధం లేదు. అది తీగల బాలిరెడ్డికి చెందిన సులోచనా ఫామ్‌హౌస్. కానీ ఆ డబ్బు నాదేనని సిట్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం' అని మద్యం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఏ1 రాజ్ కెసిరెడ్డి.. బుధవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. 'బాలిరెడ్డి కుమారుడైన తీగల విజేందర్‌రెడ్డికి వర్ధమాన్ ఇంజినీరింగ్ కాలేజ్, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆసుపత్రులు, తదితర వ్యాపారాలు ఉన్నాయి. ఆయన వ్యాపార టర్నోవర్ రూ.కోట్లలో ఉంటుంది. వారికి చెందిన అరెట్ ఆసుపత్రిలో నా సతీమణి మైనర్ భాగస్వామి మాత్రమే. అంతకు మించి వారి వ్యాపారంతో మాకెలాంటి సంబంధం లేదు. సిట్ సీజ్ చేసిన నగదు నాది కాదు' అని ఆ అఫిడవిట్‌లో రాజ్ కెసిరెడ్డి పేర్కొన్నారు.

రూ.11 కోట్ల నగదుపై మెమో దాఖలు చేసిన సిట్

ఫామ్‌హౌస్‌లో బుధవారం తెల్లవారుజామున సీజ్ చేసిన రూ.11 కోట్ల డబ్బు మద్యం కుంభకోణానికి సంబంధించినదంటూ సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఆ నగదుకు సంబంధించి ఎలా ముందుకు సాగాలన్న దానిపై తగిన ఉత్తర్వులు ఇవ్వాలని అందులో కోరారు.

అమెరికాలో చదివి... మద్యం స్కాంలో పాత్రధారి!

పురుషోత్తం వరుణ్‌కుమార్ కథ ఇది



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన ముడుపుల సొత్తులో కొంత మొత్తాన్ని శంషాబాద్‌లోని సులోచన ఫామ్‌హౌస్‌లో డెన్‌లో దాచిపెట్టినట్లు సిట్ అధికారులకు వాంగ్మూలమిచ్చిన పురుషోత్తం వరుణ్‌కుమార్ (ఏ-40) అప్పట్లో ఈ ముఠాలో కీలక సభ్యుడిగా కొనసాగారు. ఎస్ఎన్‌జే డిస్టిలరీస్ యాజమాన్యాన్ని బెదిరించి వారి అనుబంధ సంస్థలైన లీలా డిస్టిలరీస్‌ను స్వాధీనం చేసుకున్న రాజ్ కెసిరెడ్డి.. దానికి ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా వరుణ్‌కుమార్‌ను నియమించి దోచుకున్నారు. వైకాపా హయాంలో లీలా డిస్టిలరీస్‌కు రూ.458 కోట్ల మేర మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు. ప్రతిగా వారి నుంచి ప్రభుత్వ పెద్దలకు రూ.62 కోట్ల ముడుపులు వెళ్లించారు. తానే వెళ్లి ఈ డబ్బులు వారి మనుషులకు అందజేసేవాణ్నని సిట్ విచారణలో వరుణ్‌కుమార్ వెల్లడించినట్లు సమాచారం. ఒక్కో దఫా రూ.25-30 లక్షల చొప్పున ఇచ్చానని చెప్పినట్లు తెలుస్తోంది.

అదాన్ డిస్టిలరీస్‌లో ఆపరేషన్స్ మేనేజర్‌గా చేరి..

సికింద్రాబాద్‌లోని ఓల్డ్ మారేడ్‌పల్లికి చెందిన పురుషోత్తం వరుణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదివారు. అమెరికాలోని లింకన్ విశ్వవిద్యాలయం నుంచి 2016లో ఎంబీఏ పూర్తిచేశారు. ఏడాది పాటు అమెరికాలోనే ఉన్న ఆయన 2018లో భారత్‌కు తిరిగొచ్చేశారు. రాజ్ కెసిరెడ్డికి ప్రధాన అనుచరుడు, మద్యం ముడుపుల వసూళ్లలో కీలక పాత్రధారి బూనేటి చాణక్య (ఏ8), వరుణ్ ఇంటర్‌లో క్లాస్‌మేట్లు. ఆ స్నేహంతో చాణక్య... వరుణ్‌ను అదాన్ డిస్టిలరీస్‌లో ఆపరేషన్స్ మేనేజర్‌గా నియమించారు. తర్వాత లీలా డిస్టిలరీస్‌కు ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించారు. ఇలా కుంభకోణంలో వరుణ్ కీలకంగా మారారు. రాజ్ కెసిరెడ్డి తరఫున అనేక వ్యవహారాలు చక్కబెట్టేవారు.

ముడుపుల సొమ్ము రూ.10 కోట్లు రాజ్ కెసిరెడ్డికి చేరవేత

వైకాపా మద్యం ముఠా నిర్వహించిన డెన్‌లలో ఒకటైన ఖాజాగూడలోని నిహారిక ఇంటర్‌లేక్ అపార్ట్‌మెంట్‌లో భద్రపరిచిన ముడుపుల సొమ్ములో రూ.10 కోట్లను 2024లో తాను జూబ్లీహిల్స్‌లోని రాజ్ కెసిరెడ్డి కార్యాలయానికి చేరవేశానని సిట్ విచారణలో వరుణ్‌కుమార్ వెల్లడించినట్లు సమాచారం. చాణక్య 12 అట్టపెట్టెల్లో అందజేసిన రూ.11 కోట్లను సులోచన ఫామ్ హౌస్‌కు తీసుకెళ్లి తాను భద్రపరిచినట్లు సిట్‌కు వివరించారు.

ఆ రూ. 11 కోట్ల వివరాలివ్వండి

సిట్ అధికారులను కోరిన ఈడీ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉచ్చు బిగిస్తోంది. శంషాబాద్‌లోని సులోచన ఫామ్ హౌస్ నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం ముడుపుల సొమ్ము రూ.11 కోట్ల వివరాలివ్వాలని సిట్‌ను కోరింది. ఈ కేసులో ఇప్పటివరకూ చేసిన దర్యాప్తు, సాక్షుల వాంగ్మూలాలు, మనీ ట్రయల్, అభియోగపత్రం సహా ఇతర పత్రాలను సమర్పించాలని కోరింది. ఒకటి, రెండు రోజుల్లో సిట్ అధికారులు ఈ వివరాలు ఇవ్వనున్నారు. వాటి ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేయనుంది.

జగన్‌పై సీబీఐతో విచారణ చేయించండి

హైకోర్టులో దిల్లీ న్యాయవాది పిల్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో సహజ వనరులు కొల్లగొట్టి రూ. కోట్ల ఆస్తులు కూడబెట్టిన వ్యవహారంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తదితరులపై సీబీఐ/ఈడీతో దర్యాప్తు చేయించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనరైన దిల్లీకి చెందిన న్యాయవాది మెహక్ మహేశ్వరి ఆన్‌లైన్‌లో స్పందిస్తూ.. తాను స్వయంగా హాజరై వాదనలు వినిపిస్తానన్నారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. మీరు ఉద్యమకారులా? ఇప్పటి వరకు ఎన్ని పిల్స్ దాఖలు చేశారు? వాటి వివరాలేంటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. న్యాయవాది మహేశ్వరి బదులిస్తూ అవినీతి, ఆదాయ పన్ను శాఖ పోర్టల్ విషయాల్లో గతంలో పిల్స్ వేశానన్నారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి వివరాలపై కూటమి ప్రభుత్వం శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేసిందని పిటిషన్‌లో వెల్లడించారు. ఆ అంశాలను పరిగణనలోకి తీసుకొని సీబీఐతో జగన్, తదితరులపై విచారణ జరిపించాలని కోరారు.

యువ మెదడుకు ఉప్పెన చేటు!

(మొదటి పేజీ తరువాయి)

కొత్త బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయి. సగటున ప్రతి 20 సెకన్లకు ఒకరు దాని బారిన పడుతున్నారు. ● బాధితుల్లో 25% మంది 40 ఏళ్లలోపు వారేనని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) తెలిపింది. ● గత రెండు దశాబ్దాల్లో ఈ కేసులు రెట్టింపు అయినట్లు నివేదికలు చెబుతున్నాయి. అవగాహన లోపం, గోల్డెన్ అవర్‌లో చికిత్స అందకపోవడం వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రధాన కారణాలు..

● ధూమపానం, మద్యపానం వల్ల రక్తనాళాల్లో చెడు కొలెస్ట్రాల్ పెరిగి స్ట్రోక్‌కు కారణమవుతుంది.

● శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక స్క్రీన్ సమయం, దీర్ఘకాలిక ఒత్తిడి, ఆహారపుటలవాట్లు ప్రధాన కారణాలు.

● అధిక రక్తపోటు, డయాబెటిస్, చెడు కొలెస్ట్రాల్ నేరుగా రక్తనాళాలను దెబ్బతీస్తాయి.

మెదడు ఎలా ఉంది?

● జ్ఞాన సంబంధమైన అన్ని సామర్థ్యాలకూ మెదడే స్థావరం. దృష్టి, వినికిడి, వాసన, రుచి, స్పర్శ ఇతర పనులకు మెదడులోని పిట్యూటరీ గ్రంథి సూత్రధారి. అందుకే దాని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

● ఉదయం నిద్రలేచే సమయంలో తలనొప్పి, వాంతులు తరచూ వేధిస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చూపు మందగించడం, శరీరం ఒకవైపు కుంగినట్లు అనిపించడం, మాటముద్దగా రావడం, మూతి వంకర పోవడం, ఒక చేయి, కాలు చచ్చుబడిపోవడం లాంటి సమస్యలు ఉంటే వెంటనే చికిత్స తీసుకోవాలి.

● ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉండే చేపలు తీసుకోవాలి. బ్లూబెర్రీస్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్‌లు మెదడుకు చాలా మేలు చేస్తాయి.

● గుమ్మడికాయ, నారింజ, వాల్‌నట్‌లు, బ్రకోలి, గుడ్లు తదితర విటమిన్ బీ12 ఉండే ఆహారం తీసుకోవాలి.

● వారానికి 150 నిమిషాలు అంతకంటే ఎక్కువ సమయం తేలికపాటి వ్యాయామం, జాగింగ్, వేగంగా నడక, సైక్లింగ్, స్విమ్మింగ్ చేయాలి. అధిక రక్తపోటు, శరీరబరువు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ ఎప్పుడూ నియంత్రణలో పెట్టుకోవాలి.

● మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.

ఆ సంగతి.. నగం మందికి తెలీదు...

దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు అధిక రక్తపోటు సమస్యను ఎదుర్కొంటున్నారు. 50 శాతం మందికే తమకు అధిక రక్తపోటు సమస్య ఉన్నట్లు తెలుసని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ చెబుతోంది. 18 ఏళ్లు నిండినవారు ఏటా ఒక్కసారైనా బీపీ చెక్ చేసుకోవాలని ఐఎస్ఏ సూచిస్తోంది.

ప్రతి నిమిషానికీ 20 లక్షల న్యూరాన్లు చనిపోతాయి

బ్రెయిన్ స్ట్రోక్ ఎప్పుడైనా, ఎవరికైనా రావొచ్చు. స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రతి నిమిషం 20 లక్షల బ్రెయిన్ సెల్స్ (న్యూరాన్లు) చనిపోతాయి. పక్షవాతం గుర్తించడంలో ఆలస్యం చేయడం, 4 నుంచి 5 గంటల కీలకమైన గోల్డెన్ అవర్‌లో రోగికి చికిత్స అందకపోవడం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లుతోంది.

– డాక్టర్ పి.విజయ, అధ్యక్షురాలు, ఇండియా స్ట్రోక్ అసోసియేషన్

డిజిటల్ విరామాలు అవసరం

అలవాట్లు మార్చుకోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్స్‌కు దూరంగా ఉండొచ్చు. రోజులో 7-8 గంటలు నాణ్యమైన నిద్ర పోవాలి. ధ్యానం, ప్రకృతిలో గడపడం లాంటి విధానాలతో ఒత్తిడి తగ్గించుకోవాలి. డిజిటల్ విరామాలు తీసుకోవాలి. చెడు అలవాట్లకు బానిస కాకూడదు.

– డాక్టర్ కైలాస్ మిర్చే, సీనియర్ న్యూరాలజిస్టు, కేర్ ఆసుపత్రి

జంటగా తొలి విజయం

(మొదటి పేజీ తరువాయి)

సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్ (ఎస్ఎస్‌పీఓ)లో నైసార్‌ను విడిచిపెట్టింది. తద్వారా 10 ఏళ్ల ఇస్రో, నాసా కృషి ఫలించినట్లయింది. "జీఎస్ఎల్‌వీ ఎఫ్-16 ప్రయోగం విజయవంతమైంది. నైసార్ నిర్దేశిత కక్ష్యలోకి చేరింది" అని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు.

ఎస్ఎస్‌పీఓకు తొలిసారి జీఎస్ఎల్‌వీ

ఇస్రో ఇప్పటి వరకు జీఎస్ఎల్‌వీ రాకెట్‌ను జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ) ప్రయోగాలకే వినియోగించగా నైసార్‌ను ఎస్ఎస్‌పీఓలో ప్రవేశపెట్టడానికి తొలిసారి ఈ రాకెట్‌ను ప్రయోగించింది. సుమారు రూ.13,155 కోట్ల వ్యయంతో చేపట్టిన నైసార్ ప్రయోగంతో భూ ఉపరితలంపై జరిగే మార్పులను నిశితంగా పరిశీలించవచ్చు. ఈ ఉపగ్రహం ప్రతి 12 రోజులకోసారి భూమిని ఏ సమయంలో అయినా, ఏ పరిస్థితుల్లో అయినా ఒకే సామర్థ్యంతో స్కాన్ చేస్తుంది. ముఖ్యంగా మంచు కరిగిపోవడం, సముద్రాల్లో మార్పులు తదితర వాతావరణ మార్పులను గుర్తిస్తుంది.

నైసార్‌తో ఇస్రో, నాసా బంధం బలోపేతం: ఇస్రో ఛైర్మన్ నారాయణన్





ప్రయోగం తర్వాత ఎంసీసీ నుంచి మాట్లాడుతున్న నారాయణన్. పక్కన షార్ డైరెక్టర్ రాజరాజన్ తదితరులు ● నాసా ప్రతినిధి సెయింట్ జర్మన్

శ్రీహరికోట, న్యూస్‌టుడే: నైసార్ ఉపగ్రహ ప్రయోగంతో భారత్, నాసా మధ్య బంధం బలోపేతమైందని, అది పరస్పర సుసంపన్నతను పెంపొందిస్తుందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ అన్నారు. షార్‌లో జీఎస్ఎల్‌వీ ప్రయోగం విజయవంతమైన తర్వాత మిషన్ కంట్రోల్ సెంటర్(ఎంసీసీ) నుంచి ఆయన మాట్లాడారు. 'నాకు ఈ రోజు చాలా సంతోషంగా ఉంది. అంచనాలకు తగ్గట్లు నైసార్ కచ్చితమైన కక్ష్యలో చేరింది. ఈ ఉపగ్రహాన్ని దశాబ్దంపాటు అభివృద్ధి చేశాం. దీని జీవితకాలం ఐదేళ్లు. పేలోడ్ అభివృద్ధి, ఉపగ్రహ అనుసంధానం, వాహకనౌక రియలైజేషన్‌లో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిది. నాసా జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ(జేపీఎల్) బృందం, ఇతర వాటాదారుల సహకారానికి కృతజ్ఞతలు. నైసార్ ద్వారా వచ్చే డేటా ఒకటి రెండు దేశాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచం మొత్తానికీ ప్రయోజనం చేకూరుస్తుంది' అని ఆయన చెప్పారు. కొవిడ్-19 మహమ్మారి సమయంలోనూ శాస్త్రవేత్తలు నైసార్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశారని, ఇది చాలా ప్రత్యేకమైనదని నాసా ప్రతినిధి సెయింట్ జర్మన్ అన్నారు.

భారత్‌పై 25 శాతం సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

అమలులోకి వస్తుందన్నారు. అయితే, ప్రస్తుతం అమలులో ఉన్న 10 శాతం సుంకాలకు ఇది అదనమా? దీనితో కలిపే 25శాతమా అనే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే, జరిమానాలు ఏ మేరకు ఉంటాయన్నదీ తెలియాల్సి ఉంది. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నట్లు భారత ప్రభుత్వం తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారుపై ఆశాభావం వ్యక్తం చేసింది.

చమురు కొనుగోళ్లపై ట్రంప్ అక్కసు

చాలా కాలంగా భారత్ తమకు మిత్ర దేశంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయినప్పటికీ అమెరికా వస్తువులపై భారత్ విధిస్తున్న అధిక సుంకాల కారణంగా పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని, ఏ దేశంలోనూ లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ తమకు అడ్డంకులున్నాయన్నారు. రష్యా-భారత్ వాణిజ్య సంబంధాలపై ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు. 'రష్యా నుంచి భారత్ చాలా వరకు రక్షణ రంగ ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. మాస్కో నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా, భారత్ ఉన్నాయి. పుతిన్ సైన్యం దాడుల్లో ఉక్రెయిన్ పౌరుల మరణాలను అడ్డుకోవాలని అందరూ చూస్తుంటే భారత్ మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది. ఇది ఏ మాత్రం మంచిది కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యాతో వాణిజ్యం కారణంగానే 25 శాతం సుంకాలతో పాటు పెనాల్టీ విధిస్తున్నట్లు తెలిపారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా అమెరికా పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. చైనాపై అధిక సుంకాలు విధించినా జరిమానాలను మాత్రం అమెరికా ప్రకటించలేదు.

ట్రంప్ వ్యూహం అదేనా?

భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు కోసం ఇరు దేశాల ప్రతినిధులు ఇప్పటి వరకూ ఐదు దఫాలు చర్చలు జరిపారు. చివరిగా గత వారం వాషింగ్టన్‌లో భేటీ అయ్యారు. దీని కొనసాగింపులో భాగంగా ఆరో దఫా సంప్రదింపుల కోసం ఆగస్టు 25న అమెరికా బృందం భారత్‌కు రానుంది. ఈలోపలే ట్రంప్ సుంకాల మోత మోగించడం వెనుక వాణిజ్య ఒప్పందంలో తమ డిమాండ్లను సాధించుకునేలా భారత్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహం ఉండవచ్చన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి.

వారి స్నేహం ప్రభావం ఇంతేనా?

ప్రధాని మోదీపై కాంగ్రెస్ విసుర్లు

భారత్ వస్తువులపై అమెరికా భారీగా సుంకాలు, అదనంగా జరిమానాలు విధించడంపై విపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ...ప్రధాని మోదీపై విమర్శలు సంధించింది. మోదీ, ట్రంప్ స్నేహం ప్రభావం ఇంతేనా? అంటూ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయించానంటూ 30 సార్లు చెప్పి ట్రంప్ అవమానించినా, పాకిస్థాన్ సైన్యాధిపతికి అమెరికా అధ్యక్షుడు ప్రత్యేక విందు ఇచ్చినా, పాక్‌కు ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా మౌనం వహిస్తే ట్రంప్ భారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యమిస్తారని మోదీ భావించారని రమేశ్ పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని మోదీ ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారన్నారు. ఇప్పటికైనా ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని అమెరికా అధ్యక్షుడికి దీటుగా జవాబివ్వాలని మోదీకి సూచించారు. టీఎంసీ, ఆర్జేడీ, సీపీఐ, డీఎంకే తదితర ప్రతిపక్ష పార్టీల నేతలూ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

(c) eenadu



చాంపియన్స్

ఈపాటికే సిరీస్ ఫలితం తేలిపోవాల్సింది. చివరి టెస్టు నామమాత్రం కావాల్సింది. సిరీస్‌ను కోల్పోయిన నైరాశ్యంలో ఓవల్‌లో టీమ్‌ఇండియా బరిలోకి దిగాల్సింది. కానీ ఓటమి తప్పదనుకున్న మాంచెస్టర్ టెస్టులో.. నలుగురు బ్యాటర్ల అద్భుత పోరాటంతో డ్రాతో గట్టెక్కిన టీమ్‌ఇండియా.. ఇప్పుడు సిరీస్‌ను సమం చేసే లక్ష్యంతో చివరి టెస్టులో అడుగు పెడుతోంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ ఫలితాన్ని తేల్చే ఆఖరి మ్యాచ్ గురువారం నుంచే. గాయంతో ఇంగ్లాండ్ జట్టు కెప్టెన్ స్టోక్స్ సేవలను కోల్పోవడం గిల్ బృందానికి కలిసొచ్చే విషయమే. భారత్ కూడా పంత్, బుమ్రా లేకుండా ఆడబోతోంది. మరి టీమ్‌ఇండియా 2-2తో సిరీస్‌ను ముగించగలదా? ఆఖరి పంచ్ ఎవరిదో!

సమం చేస్తారా?

మధ్యాహ్నం 3.30 నుంచి


రాహుల్ / గిల్ / ఆకాశ్‌దీప్

- నేటి నుంచే ఇంగ్లాండ్‌తో భారత్ ఆఖరి టెస్టు
- గాయంతో స్టోక్స్ ఔట్

లండన్

ఇంగ్లాండ్ పర్యటనలో ఆఖరి సమరానికి వేళైంది. గురువారం మొదలయ్యే అయిదో టెస్టులో ఇంగ్లాండ్‌తో భారత్ తలపడుతుంది. తొలి, మూడో టెస్టుల్లో గెలిచిన ఇంగ్లాండ్.. సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉంది. రెండో టెస్టులో నెగ్గిన భారత జట్టు అసాధారణ పోరాటంతో నాలుగో టెస్టును డ్రాగా ముగించిన సంగతి తెలిసిందే. ఆ డ్రా ఇచ్చిన ఉత్సాహంతో గిల్‌సేన బరిలోకి దిగుతోంది. ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. పనిభార నిర్వహణలో భాగంగా ఆర్చర్‌కు విశ్రాంతినిచ్చారు. వీళ్ల లేకపోవడంతో ఈ మ్యాచ్‌లో భారత్ అవకాశాలు మెరుగవుతాయనే చెప్పాలి. ఓవల్ క్యురేటర్‌తో భారత్ చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ వాగ్యుద్ధం నేపథ్యంలో పోరు మరింత ఆసక్తికరంగా మారింది.


ఒలీ పోప్

ఉత్సాహంతో భారత్: గత మ్యాచ్‌ను డ్రాగా ముగించడం టీమ్‌ఇండియాకు ఉత్సాహాన్నిస్తుందనడంలో సందేహం లేదు. మాంచెస్టర్‌లో ఓటమి తప్పదనుకున్న పోరులో ఖాతా అయినా తెరవకుండానే రెండు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 143 ఓవర్ల పాటు ఇంగ్లాండ్‌ను అడ్డుకుని గట్టెక్కిన సంగతి తెలిసిందే. ఆఖరి సమరంలోనూ టీమ్ ఇండియా అదే పట్టుదలను ప్రదర్శించాలన్నది అభిమానుల ఆశ. ఈ మ్యాచ్ కూడా ఆఖరి రోజు వరకు రసవత్తరంగా సాగుతుందని భావిస్తున్నారు. ఆఖరి పంచ్ విసరాలని గిల్‌సేన తహతహలాడుతోంది. గాయంతో కీలక బ్యాటర్ పంత్ దూరం కావడం పెద్ద దెబ్బే అయినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్‌ల ఫామ్ భారత్‌కు గొప్ప సానుకూలాంశం. నాలుగు శతకాలతో 722 పరుగులు చేసిన గిల్.. సిరీస్ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. 511 పరుగులతో రెండో స్థానం రాహుల్‌ది. వీళ్ల పరుగుల వేటను కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. గత మ్యాచ్‌లో అద్భుత పోరాటంతో జట్టును గట్టెక్కించిన స్పిన్ ఆల్‌రౌండర్లు జడేజా, వాషింగ్టన్ సుందర్ అదే జోరును కొనసాగించాలని జట్టు ఆశిస్తోంది. సాయి సుదర్శన్‌కు మరో అవకాశం దక్కడం ఖాయం. అతడు, యశస్వి జైస్వాల్ రాణించాల్సివుంది. పంత్ గాయపడ్డ నేపథ్యంలో ధ్రువ్ జురెల్ తొలిసారి సిరీస్‌లో ఆడబోతున్నాడు. అతను 6 లేదా 7వ స్థానంలో ఆడతాడు. ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ ఉండాలని భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటున్న నేపథ్యంలో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ మరోసారి పెవిలియన్‌కే పరిమితం కాక తప్పకపోవచ్చు. పైగా ఇప్పటికే తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లున్నారు. ఇప్పటివరకు పెద్దగా ఆకట్టుకోని శార్దూల్ ఠాకూర్‌కు మరో అవకాశం సందేహమే. అతడి స్థానంలో అరంగేట్ర పేసర్ అర్ష్‌దీప్ ఆడే అవకాశముంది. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అయిదో టెస్టులో ఆడే అవకాశాలు దాదాపు లేనట్లే. పనిభార నిర్వహణలో భాగంగా అతడికి విశ్రాంతినిచ్చే అవకాశాలు మెండు. అతడి స్థానంలో ఆకాశ్‌దీప్ తుది జట్టులోకి వస్తాడని భావిస్తున్నారు. మహ్మద్ సిరాజ్ భారత పేస్ దళానికి నాయకత్వం వహిస్తాడు. తొలి రెండు టెస్టుల్లో నిరాశపరిచినప్పటికీ.. ప్రసిద్ధ్ కృష్ణ తిరిగి తుది జట్టులోకి రావచ్చు.

ఇంగ్లాండ్‌కు దెబ్బ: స్ఫూర్తిదాయక కెప్టెన్ స్టోక్స్ లేకపోవడం ఇంగ్లాండ్‌కు పెద్ద ఎదురుదెబ్బే. ఆల్‌రౌండ్ జోరుతో గత రెండు టెస్టుల్లోనూ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన స్టోక్స్.. భుజం గాయం వల్ల ఈ నిర్ణయాత్మక సమరానికి దూరమయ్యాడు. ఇప్పటివరకు 304 పరుగులు, 17 వికెట్లతో స్టోక్స్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఆధిక్యంలో నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. అతడి స్థానంలో ఒలీ పోప్ ఇంగ్లాండ్ నాయకత్వం వహించనున్నాడు. కానీ స్టోక్స్ లేని లోటు మాత్రం పూడ్చలేనిదే. ఫాస్ట్‌బౌలర్ జోఫ్రా ఆర్చర్‌కు విశ్రాంతినిచ్చారు. పేసర్ బ్రైడన్ కార్స్, స్పిన్నర్ డాసన్ సైతం ఈ మ్యాచ్‌లో ఆడరు. అంటే చాలా మార్పులతో ఇంగ్లాండ్ ఆడనుంది. ఆ జట్టు ఒక్క స్పెషలిస్ట్ స్పిన్నరూ లేకుండానే బరిలోకి దిగనుంది. ఓవల్ పిచ్‌పై మంచి అవగాహన ఉన్న పేసర్లు అట్కిన్సన్, ఓవర్టన్ తుది జట్టులో చోటు సంపాదించారు. వోక్స్, జోష్ టంగ్‌లతో కలిసి వీళ్లు పేస్ భారాన్ని పంచుకుంటారు. ఈ సిరీస్‌లో మొదటి నుంచి చివరి టెస్టు వరకు జట్టులో ఉన్న ఏకైక ఇంగ్లాండ్ బౌలర్ వోక్స్ మాత్రమే. బ్యాటుతో రూట్ ఫామ్ ఇంగ్లాండ్‌కు గొప్ప సానుకూలాంశం. గత మ్యాచ్‌లో భారీ శతకం (150) బాదిన అతడు మొత్తంగా ఈ సిరీస్‌లో 67.16 సగటుతో 403 పరుగులు చేశాడు. టాప్-3లో క్రాలీ, డకెట్, పోప్‌లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ టాప్-4 బ్యాటర్లంతా రాణించారు. ధాటిగా ఆడే బెతెల్ జట్టులోకి వచ్చాడు

పిచ్.. వాతావరణం

ఓవల్‌లో పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇటీవల ఓ కౌంటీ మ్యాచ్‌లో ఇక్కడ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి దాదాపు 1500 పరుగుల వచ్చాయి. ఈ మైదానంలో భారీ స్కోర్లు నమోదవుతుంటాయి. ఓవల్‌లో సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 343 పరుగులు. అయితే మ్యాచ్ సందర్భంగా వర్షం పడితే పిచ్ స్పందించే తీరులో మార్పు రావొచ్చు. వాతావరణం ఆఖరి టెస్టులో కీలక పాత్ర పోషించే అవకాశముంది. గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం జల్లులు పడొచ్చు. రెండు, మూడు రోజుల్లోనూ జల్లులు పడే అవకాశముంది.

తుది జట్లు

ఇంగ్లాండ్: క్రాలీ, డకెట్, ఒలీ పోప్, రూట్, బ్రూక్, జాకబ్ బెతెల్, జేమీ స్మిత్, వోక్స్, అట్కిన్సన్, టంగ్, ఓవర్టన్.

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్, జడేజా, ధ్రువ్ జురెల్, సుందర్, శార్దూల్ ఠాకూర్/అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్, సిరాజ్.

2 ఓవల్‌లో ఆడిన 15 టెస్టుల్లో టీమ్‌ఇండియా గెలిచిన మ్యాచ్‌లు. 6 మ్యాచ్‌ల్లో ఓడి.. 7 టెస్టులను డ్రా చేసుకుంది. చివరగా ఇక్కడ 2023 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో ఓడిపోయింది.

3 21వ శతాబ్దంలో 26 అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లు జరిగితే.. అందులో మూడు సిరీస్‌ల్లో మాత్రమే అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆట అయిదో రోజుకు చేరింది. ప్రస్తుత సిరీస్‌లో గత నాలుగు మ్యాచ్‌లూ అయిదో రోజుకు వెళ్లాయి.

కోచ్ పిచ్‌ను పరిశీలిస్తే తప్పేంటి?

లండన్: భారత్-ఇంగ్లాండ్ చివరి టెస్టుకు వేదికైన ఓవల్ మైదానంలో పిచ్‌ను పరిశీలించేందుకు వెళ్లిన కోచ్ గౌతమ్ గంభీర్‌ను క్యురేటర్ అడ్డుకోవడాన్ని టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తప్పుబట్టాడు. "పిచ్‌ను పరిశీలించే హక్కు కోచ్‌కు పూర్తిగా ఉంది. మరి క్యురేటర్ ఎందుకు అనుమతించలేదో నాకు అర్థం కాలేదు. రబ్బర్ స్పైక్స్ వేసుకున్నారా.. వట్టి పాదాలతో వచ్చారా అన్నది సమస్య కాదు. అతనెందుకు నిరాకరించాడో తెలియదు. గత నాలుగు మ్యాచ్‌ల్లో మాకు ఈ ఇబ్బంది ఎదురు కాలేదు" అని గిల్ అన్నాడు. నాలుగో టెస్టు ముగిసిన నాలుగు రోజులకే చివరి టెస్టు ఆరంభం కావడం పట్ల గిల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. "అయిదు టెస్టుల సిరీస్‌లో మ్యాచ్‌ల మధ్య కాస్త ఎక్కువ విరామం ఉండాలి. కొన్ని మ్యాచ్‌లకు వారం పైగా విరామం ఇచ్చారు. కొన్ని మ్యాచ్‌లకు మూణ్నాలుగు రోజుల ఖాళీయే ఉంది. ఇలా కాకుండా ప్రతి మ్యాచ్‌కూ అయిదు రోజుల విరామం ఉంటే బాగుండేది" అని అతనన్నాడు.

ఆ 20 నిమిషాల గురించే ఎందుకు


బెన్ స్టోక్స్

లండన్: మాంచెస్టర్ టెస్టు చివరి రోజు పరిణామాల గురించి ఎక్కువ చర్చ అనవసరమని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అభిప్రాయపడ్డాడు. అయిదో రోజు ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా పోరాడడంతో భారత్ మ్యాచ్‌ను డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే మాండేటరీ ఓవర్లు (15) మొదలు కావడానికి ముందు స్టోక్స్ డ్రా కోసం ప్రతిపాదించగా.. అప్పటికి 80ల్లో ఉన్న జడ్డూ, సుందర్ అందుకు నిరాకరించారు. దీనిపై స్టోక్స్‌తో పాటు ఇంగ్లాండ్ ఆటగాళ్లందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెంచరీల కోసమే ఆడుతున్నారా అంటూ స్టోక్స్ వ్యంగ్యాస్త్రాలు విసిరాడు. వీరి ప్రవర్తనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. బాయ్‌కాట్ సహా ఇంగ్లాండ్ మాజీలు సైతం దీన్ని తప్పుబట్టారు. అయితే ఆ మ్యాచ్‌లో జరిగిన దాని పట్ల తామేమీ పశ్చాత్తాపం చెందట్లేదని స్టోక్స్ అన్నాడు. "జడేజా, సుందర్ గొప్పగా ఆడారు. వాళ్లు శతకాలు పూర్తి చేసుకోవాలని అనుకున్నారు. ఆ సమయంలో అందరం అలసిపోయి ఉన్నాం. మా ప్రధాన బౌలర్లు బౌలింగ్ చేస్తే గాయాల పాలవుతారేమో అన్న ఉద్దేశంతో వారిని దించకూడదని అనుకున్నా. ఈ విషయంలో మాకు పశ్చాత్తాపం ఏమీ లేదు. సిరీస్ ఇప్పటిదాకా ఎంతో గొప్పగా సాగింది. కేవలం ఆ 20 నిమిషాల మీద దృష్టి పెట్టడం ఎందుకు, వదలేయండి" అని స్టోక్స్ పేర్కొన్నాడు.

తప్పుకే తప్పుకొన్నా: తన శరీరం ఏమాత్రం సహకరించేలా ఉన్నా చివరి టెస్టులో ఆడేవాడినని, కానీ భుజం గాయం తీవ్రత దృష్ట్యానే ఈ మ్యాచ్ నుంచి తప్పుకున్నానని స్టోక్స్ చెప్పాడు. "మనం సాహసం చేస్తే అందుకు తగ్గ ఫలితం ఉండాలి. కానీ నాకు ఇప్పుడున్న గాయంతో సాహసం చేస్తే అది చాలా ప్రమాదం అవుతుంది. ఈ స్థితిలో నా సహచరులు ఎవరున్నా ఆడొద్దనే కోరుకుంటా. నా కండరాల్లో ఒకదాంట్లో చీలిక వచ్చింది. నేను ఆడకూడదనే నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం తీసుకున్నాం. స్కాన్ రాగానే బౌలింగ్ చేయడం అసాధ్యమని తేలిపోయింది. కనీసం బ్యాటర్‌గా అయినా ఆడగలనా అని ఆలోచించాను. వైద్య సిబ్బందితో చర్చించాక ఆడడం సాధ్యం కాదనే నిర్ణయానికి వచ్చాం. ఈ గాయం కాకుండా నేను ఏం చేసి ఉండాల్సిందంటే చెప్పలేను. ఆటలో గాయాలు భాగం" అని స్టోక్స్ అన్నాడు.

ఆడమంటే ఆడం

లెజెండ్స్ లీగ్‌లో పాక్‌తో సెమీస్‌కు భారత్ నో

బర్మింగ్‌హామ్: ప్రపంచ లెజెండ్స్ ఛాంపియన్‌షిప్ టీ20 లీగ్‌లో భారత జట్టు తన వైఖరికి కట్టుబడింది. దాయాది పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేది లేదంటూ మరోసారి కుండ బద్దలు కొట్టింది. గురువారం సెమీఫైనల్లో పాక్‌తో తలపడేందుకు భారత్ నిరాకరించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలకు వ్యతిరేకంగా తన వైఖరిని పునరుద్ఘాటించింది. జట్టులోని శిఖర్ ధావన్, యువరాజ్‌సింగ్, హర్భజన్‌సింగ్, సురేశ్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ తదితరులు పాక్‌తో ఆడేందుకు నిరాకరించారు. గ్రూప్ దశ మ్యాచ్‌లోనూ భారత్ ఇదే వైఖరి అవలంబించింది. మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ అయిదు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై నెగ్గి సెమీస్‌కు అర్హత సాధించింది. భారత్ మ్యాచ్ నుంచి వైదొలగడంతో పాకిస్థాన్ శనివారం నేరుగా ఫైనల్ ఆడనుంది. మరో సెమీస్‌లో దక్షిణాఫ్రికాతో ఆసీస్ తలపడనుంది.


లక్ష్యసేన్

ప్రీక్వార్టర్స్‌లో లక్ష్యసేన్

మకావు: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో ప్రీక్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో రెండో సీడ్ లక్ష్యసేన్ 21-8, 21-14తో జియోన్ జిన్ (కొరియా)పై విజయం సాధించాడు. తరుణ్ మన్నెపల్లి 21-19, 21-13తో మన్‌రాజ్‌సింగ్‌పై, ఆయుష్ శెట్టి 21-10, 21-11తో హువాంగ్ యు (చైనీస్ తైపీ)పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరుకున్నారు. హెచ్.ఎస్.ప్రణయ్, కిరణ్ జార్జ్‌లకు చుక్కెదురైంది. ప్రణయ్ 21-18, 15-21, 16-21తో యోహానెస్ మార్సిలినో (ఇండోనేసియా) చేతిలో, కిరణ్ 15-21, 10-21తో లాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్) చేతిలో, సతీశ్‌కుమార్ 19-21, 12-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో, శంకర్ ముత్తుసామి 18-21, 14-21తో హు ఆన్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో రక్షితశ్రీ ప్రీక్వార్టర్స్ చేరుకుంది. తొలి రౌండ్లో రక్షిత 18-21, 21-17, 22-20తో పోర్న్‌పిచా చోకీవాంగ్ (థాయ్‌లాండ్)పై గెలుపొందింది. తస్నిమ్ మీర్ 6-21, 14-21తో టాప్ సీడ్ చెన్ యుఫీ (చైనా) చేతిలో, ఆకర్షి కశ్యప్ 14-21, 16-21తో నొజొమి ఒకుహర (జపాన్) చేతిలో, ఉన్నతి హుడా 21-16, 19-21, 17-21తో జూలీ జాకబ్‌సెన్ (డెన్మార్క్) చేతిలో, అనుపమ ఉపాధ్యాయ 16-21, 10-21తో రికో గుంజి (జపాన్) చేతిలో, అన్మోల్ ఖర్బ్ 21-23, 11-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ 21-10, 21-15తో రచపోల్- నట్టమోన్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. రోహన్ కపూర్- రుత్విక శివాని 20-22, 17-21తో గువాన్ షున్- లీ చియా (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశారు.


జడేజా

నం.1 పదిలం

దుబాయ్: భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో అజేయ సెంచరీతో అదరగొట్టిన జడేజా.. ఐసీసీ టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. మరో సెంచరీ హీరో వాషింగ్టన్ సుందర్ 8 స్థానాలు మెరుగై 13వ ర్యాంకు సాధించాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రిషబ్ పంత్ 7, యశస్వి జైశ్వాల్ 8, శుభ్‌మన్ గిల్ 9వ స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. రవీంద్ర జడేజా 14వ స్థానంలో ఉన్నాడు. టీ20 బ్యాటింగ్‌లో అభిషేక్‌శర్మ తన కెరీర్‌లో తొలిసారిగా నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) ఒక ర్యాంకు కోల్పోయి రెండో స్థానానికి పడిపోయాడు. తిలక్‌వర్మ 3, సూర్యకుమార్ యాదవ్ 6, యశస్వి జైశ్వాల్ 11వ స్థానాల్లో ఉన్నారు.


ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన వెన్నెలకు రూ.లక్ష నజరానా అందిస్తున్న హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు చాముండేశ్వరీనాథ్



మార్షాన్

మార్షాన్ ప్రపంచ రికార్డు

సింగపూర్: ప్రపంచ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఫ్రెంచ్ స్టార్ స్విమ్మర్ లెయోన్ మార్షాన్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. బుధవారం జరిగిన పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే సెమీఫైనల్లో మార్షాన్ ఒక నిమిషం 52.61 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానం సాధించాడు. 2011లో ర్యాన్ లోచ్టే (1 నిమిషం 54 సెకన్లు- అమెరికా) పేరిట నమోదైన రికార్డును బద్దలు కొట్టాడు. గురువారం జరిగే ఫైనల్లోనూ అతను రికార్డును తిరగరాసే అవకాశముంది. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో మార్షాన్ నాలుగు బంగారు పతకాలు సాధించాడు. సింగపూర్‌లో రెండు విభాగాల్లో (200 మీ, 400 మీ మెడ్లే) మాత్రమే మార్షాన్ బరిలో దిగుతున్నాడు. అంతకుముందు 200 మీ వ్యక్తిగత మెడ్లేలో భారత స్విమ్మర్ షోన్ గంగూలీ (2 నిమిషాల 0.540 సెకన్లు) సెమీస్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. హీట్స్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచిన గంగూలీ.. మొత్తం 38వ ర్యాంకుతో పోటీల నుంచి నిష్క్రమించాడు. మొదటి 16 మంది సెమీస్ చేరుకున్నారు.

హెచ్‌సీఏ సెలక్షన్ కమిటీల నియామకం

హైదరాబాద్, ఈనాడు: జస్టిస్ నవీన్ రావు మార్గదర్శకాల మేరకు హైదరాబాద్ క్రికెట్ సీనియర్, జూనియర్ కమిటీలను నియమించినట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం ప్రకటించింది. సీనియర్ సెలక్షన్ కమిటీకి పరువు హరిమోహన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తాడు. నరేంద్రపాల్ సింగ్, ఆకాశ్ భండారి, షేక్ రియాజుద్దీన్, జ్యోతిశెట్టి కమిటీలో ఇతర సభ్యులు. సుదీప్ త్యాగి ఛైర్మన్‌గా వ్యవహరించనున్న జూనియర్ సెలక్షన్ కమిటీలో హబీబ్ అహ్మద్ ఖాన్, సందీప్ రాజన్, అరవింద్ శెట్టి, అన్వర్ అహ్మద్ ఖాన్ సభ్యులు.

విజృంభించిన హెన్రీ

149కే కుప్పకూలిన జింబాబ్వే

బులవాయో: జింబాబ్వేతో మొదటి టెస్టును న్యూజిలాండ్ ఘనంగా ఆరంభించింది. తొలి రోజు, బుధవారం పేసర్ మ్యాట్ హెన్రీ (6/39) ధాటికి జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టు 26 పరుగులకే చివరి అయిదు వికెట్లు కోల్పోయింది. 39 పరుగులు చేసిన క్రెయిగ్ ఇర్విన్ టాప్ స్కోరర్. సిగా 30 పరుగులు చేశాడు. నాథన్ స్మిత్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 92 పరుగులు చేసింది. ఓపెనర్లు కాన్వే (51 బ్యాటింగ్), విల్ యంగ్ (41) నిలకడగా ఆడుతున్నారు. న్యూజిలాండ్ ఇంకా 57 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది.


హెన్రీ

ముగిసిన నిషేధం.. టేలర్ పునరాగమనం


టేలర్

మూడున్నరేళ్ల నిషేధాన్ని పూర్తిచేసుకున్న బ్రెండన్ టేలర్.. జింబాబ్వే టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. ఆగస్టు 7న న్యూజిలాండ్‌తో మొదలయ్యే రెండో టెస్టు కోసం ఎంపిక చేసిన జట్టులో టేలర్‌కు చోటు దక్కింది. ఐసీసీ అవినీతి, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘించినందుకు 2022 జనవరిలో టేలర్‌పై నిషేధం పడింది. 2019లో భారత్‌కు చెందిన వ్యాపారవేత్త స్పాట్ ఫిక్సింగ్ కోసం సంప్రదించిన విషయాన్ని సకాలంలో నివేదించనందుకు టేలర్‌పై ఐసీసీ నిషేధం విధించింది. డోప్ పరీక్షలో విఫలమైనందుకు ఒక నెల సస్పెన్షన్ కూడా ఎదుర్కొన్నాడు. 2019లో 15,000 అమెరికన్ డాలర్ల అవినీతి సొమ్ము పుచ్చుకున్నట్లు, అదే సమయంలో కొకైన్ తీసుకున్నట్లు టేలర్ అంగీకరించిన తర్వాత అతనిపై నిషేధం పడింది. నిషేధ కాలం పూర్తవడంతో టేలర్‌ను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు.

(c) eenadu

బాక్స్‌లో సిక్సర్ల మోత!

చుట్టూ వేల మంది ప్రేక్షకులుండరు... విశాలమైన మైదానం కూడా ఉండదు... కానీ ఫోర్లు, సిక్సులు మోతమోగుతాయి. ఫుట్‌బాల్ గోల్స్ నిండిపోతాయి. కబడ్డీ కూత మార్మోగుతుంది. ఇదంతా చిన్న బాక్స్‌లో జరుగుతుంది. బాక్స్ క్రీడల్లో 11 మంది క్రీడాకారులు అవసరం లేదు... ఓ నలుగురు దోస్తులు కలిస్తే చాలు. పగలు, రాత్రితో పనిలేదు... ఎప్పుడంటే అప్పుడు చలో ఆటకు అంటున్నారు.

ప్రత్యేక లీగ్‌లూ...


బాక్స్ క్రికెట్ ఇప్పుడు లీగ్‌ల వరకూ వెళ్లింది. హైదరాబాద్‌లో పలు బాక్స్ మైదానాల నిర్వాహకులంతా కలిసి లీగ్‌లను నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ స్థాయి లీగ్‌లను ఇప్పటికే నిర్వహించారు. 'ఆట స్థలాలు అందుబాటులో లేక పోవడం, కార్పొరేట్ ఉద్యోగాలు చేసే వారికి సమయం ఉండక పోవడంతో వీలైనప్పుడు ఆడేందుకు బాక్స్‌లవైపు మొగ్గు చూపుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా వస్తున్నారు' అని తాలిబ్ అనే క్రికెటర్ 'ఈనాడు'కు తెలిపారు.

వీటికోసం విశాలమైన స్థలాలు అవసరం లేదు. ఎక్కడో పట్టణాలకు దూరంగా ఇవి ఉండవు. నివాస ప్రాంతాల మధ్య ఖాళీ జాగాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

ఒక్కో బాక్స్‌కు రూ.5 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి... సగటున నెలకు రూ.1.50 లక్షల దాకా నిర్వాహకులకు ఆదాయం వస్తోంది.

జట్టు సభ్యులు పూర్తి స్థాయిలో లేకపోతే బౌలింగ్ యంత్రం కూడా అందుబాటులో ఉంటోంది.

ఆన్‌లైన్‌లోనూ ఈ మైదానాలను బుక్ చేసుకునేందుకు నిర్వాహకులు యాప్‌లు, వెబ్‌సైట్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



కవర్ డ్రైవ్, ఫ్రంట్ ఫుట్, లెగ్ సైడ్, ఆఫ్ సైడ్.. ఇలా ఏ కోణంలో బాగా ఆడుతున్నామనేది చూసుకునేందుకు కెమెరా - కంప్యూటర్లు ఉండడంతో క్రేజీగా ఉంటోంది.


గంటకు రూ.500 నుంచి రూ.2 వేల వరకు ఛార్జి చేస్తున్నారు. నిత్యం వచ్చేవారికి ప్రత్యేక రాయితీలు ఇస్తున్నారు. బ్యాట్లు, బాల్స్, వికెట్లు, ప్యాడ్లు, హెల్మెట్లు ఏవీ పట్టుకొని వెళ్లక్కర్లేదు. అన్నీ అక్కడే అందుబాటులో ఉంటాయి.

సరిగ్గా సముద్ర తీరంలో ఉన్నట్లుగా ఇసుకతో బీచ్ వాలీబాల్ గ్రౌండ్‌లను రూపొందిస్తున్నారు. ఫుట్‌బాల్ మైదానాలు కూడా బాక్స్‌లలో ఇమిడిపోతున్నాయి. పచ్చికతో పాటు రెండు గోల్ పోస్టులు కూడా ఇందులో ఉంటాయి.

ఉదయం, సాయంత్రం, రాత్రిళ్లూ మ్యాచ్‌లు ఆడేందుకు లైటింగ్, సేద తీరడానికి గదులు, అల్పాహారం, శీతల పానీయాలు కూడా అక్కడే ఏర్పాటు చేస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

కశ్మీర్ అందాల్



శ్రీనగర్‌లోని దాల్ సరస్సు ఇది. ప్రస్తుతం పర్యాటక సీజనే అయినా.. వర్షాల నేపథ్యంలో పర్యాటకులు పెద్దగా లేకపోవడంతో సందడి తక్కువగా ఉంది. స్థానికులు ఇక్కడ ఖాళీ సమయాల్లో సరస్సు నుంచి వివిధ రకాల మొక్కలను సేకరించి.. పశువుల మేతగా విక్రయిస్తూ ఉపాధి పొందుతారు. సరస్సులో, చుట్టుపక్కల సేకరించిన పశువుల మేతను బుధవారం ఓ మహిళ ఇలా పడవలో తీసుకెళ్తూ కెమెరా కంటికి చిక్కారు.

వెలుగుల ఓదెల



'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అంటారు. ఆ గ్రామ ప్రజలు తమ నేత్రాలు తమ తదనంతరం ఇతరుల జీవితాల్లో కూడా వెలుగులు పంచాలని ప్రతినబూనారు. అందుకే ఆ ఊళ్లో ఎవరు కన్ను మూసినా వారి కళ్లను కుటుంబీకులు దానం చేస్తారు. అలా పదేళ్లలో ఏకంగా 250 నేత్రదానాలు చేసి మార్గదర్శిగా నిలిచింది పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండల కేంద్రం. 10 వేల జనాభా గల ఈ ఊళ్లో ఈ ఆదర్శం 2015లో మొదలైంది. ఆ సంవత్సరం గ్రామానికి చెందిన ఆడెపు సక్కుబాయి కన్నుమూశారు. ఆమె అల్లుడు బావాజీలు ఆమె కుమారులకు అప్పటికే నేత్రదానంపై అవగాహన ఉండడంతో అమ్మ కళ్లు మట్టిలో కలిసిపోవడం కన్నా దానం చేద్దామని నిర్ణయించుకున్నారు. ఆమె కళ్ల నుంచి వైద్య సిబ్బంది కార్నియా సేకరించడాన్ని అంత్యక్రియలకు వచ్చిన వారంతా ప్రత్యక్షంగా చూశారు. నేత్రదానం అంటే కళ్లు పీక్కుపోతారని భావించిన వారికి కార్నియా మాత్రమే సేకరిస్తారని తెలియడంతో దీనిపై ఉన్న అపోహ తొలగిపోయింది. సక్కుబాయి నేత్రదానం స్ఫూర్తి అంతటితో ఆగిపోవద్దని ఆమె అల్లుడు భీష్మాచారి విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ బృహత్కార్యాన్ని మరింతగా జనంలోకి తీసుకెళ్లేందుకు 'సదాశయ' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శ్రవణ్ కూడా ముందుకొచ్చారు. చనిపోయిన వారి నుంచి కార్నియా సేకరించి దాన్ని ఆసుపత్రులకు పంపే బాధ్యత తీసుకున్నారు. అలా 2022లో ప్రజలంతా కలిసి.. గ్రామంలో ఎవరు మరణించినా నేత్రదానం చేయాలని గ్రామసభలో తీర్మానం చేసి అప్పటి కలెక్టర్ సంగీత సత్యనారాయణకు అందజేశారు. నాలుగు రోజుల క్రితం ఓదెలలో కన్నుమూసిన మాజీ ఎంపీపీ 56 ఏళ్ల ఈద రాజమ్మ 250వ నేత్రదాత అయ్యారు. ఓదెల స్ఫూర్తితో అబ్బిడిపల్లె, కన్నాల గ్రామాల్లో కూడా నేత్రదానాలు మొదలయ్యాయి.

– ఈనాడు, హైదరాబాద్

ఫోన్ పోయిందా... కంగారొద్దు!



సెల్‌ఫోన్ ఎవరో కొట్టేశారు... అందులో ముఖ్యమైన డేటా చాలా ఉంది. మొబైల్ బ్యాంకింగ్, గూగుల్ పే, ఫోన్‌పే వంటి పేమెంట్ యాప్‌లన్నీ ఉన్నాయి. మరి ఇదంతా దుర్వినియోగం కాకుండా ఎలా అడ్డుకోవాలి? ఎవరికి ఫిర్యాదివ్వాలి? పోయిన ఫోన్ తిరిగి పొందటమెలా?.. వివరాలు మీకోసం

- సెల్‌ఫోన్ చోరీకి గురైందని నిర్ధారించుకున్న వెంటనే ముందుగా సంబంధిత నెట్‌వర్క్ సర్వీసు ప్రొవైడర్లకు (జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్) కాల్ చేసి, లేదా ఆ కార్యాలయానికి వెళ్లి సిమ్ బ్లాక్ చేయించాలి.
- ఆండ్రాయిడ్ వినియోగదారులైతే వెబ్ బ్రౌజర్‌లోకెళ్లి 'ఫైండ్ మై డివైస్', ఐవోఎస్ వాడే వారైతే 'ఫైండ్ మై ఐ ఫోన్' అని టైప్ చేసి యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో లాగిన్‌కావాలి. దీని ద్వారా ఆ ఫోన్ ప్రస్తుతం ఏ లొకేషన్‌లో ఉందో తెలుసుకోవచ్చు. ప్లే సౌండ్, సెక్యూర్ డివైస్, ఫ్యాక్టరీ రీసెట్ డివైజ్ అనే మూడు ఆప్షన్లనూ అవసరాన్ని బట్టి వాడుకోవాలి.

1 ప్లే సౌండ్: ఈ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ఫోన్ పెద్ద శబ్దంతో రింగ్ అవుతుంది. మీకు దగ్గర్లో ఫోన్ ఉంటే ఆ శబ్దం ఆధారంగా గుర్తించొచ్చు.

2 సెక్యూర్ డివైజ్: రిమోట్ విధానంలో ఫోన్‌కు స్క్రీన్ లాక్ చేయొచ్చు. గూగుల్ అకౌంట్ నుంచి సైన్ అవుట్ కావొచ్చు. గూగుల్ వ్యాలెట్స్‌లోని పేమెంట్ కార్డులు తొలగించొచ్చు. దీనివల్ల ఎవరూ మీ ఫోన్ ఉపయోగించలేరు. వ్యక్తిగత సమాచారాన్ని యాక్సెస్ చేయలేరు.

3 ఫ్యాక్టరీ రీసెట్ డివైజ్: రిమోట్ విధానంలో ఫోన్‌లోని డేటాను శాశ్వతంగా డిలీట్ చేయాలి. తద్వారా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లు, ఫోన్‌పే, గూగుల్ పే వంటి పేమెంట్ యాప్‌లు వినియోగానికి ఆస్కారం లేకుండా చేయొచ్చు. డేటా దుర్వినియోగం కాకుండా అడ్డుకోవొచ్చు.

సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు...

- పై ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత సమీపంలోని పోలీసుస్టేషన్‌కెళ్లి ఫిర్యాదు చేయాలి. వారి నుంచి రసీదు తీసుకోవాలి.
- కేంద్ర టెలీ కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ నిర్వహించే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌కు సంబంధించిన ceir.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి కంప్లైంట్ రిజిస్టర్ ఫామ్‌లో ఫిర్యాదు ఇవ్వాలి.
- చోరీకి గురైన సెల్‌ఫోన్‌లోని మొబైల్ నంబర్లు, ఐఎంఈఐ నంబర్లు, డివైజ్ బ్రాండ్, మోడల్, కొనుగోలు బిల్లు, ఎక్కడ పోయింది, పోయిన తేదీ, ఏ పోలీసుస్టేషన్ పరిధిలో పోయింది? పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రతి వంటివి అప్‌లోడ్ చేసి సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత ఓ రిక్వెస్ట్ ఐడీ వస్తుంది. ఆ నంబరు ఉపయోగించుకుని మీరిచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశముంది.
- మీ సెల్‌ఫోన్‌లో ఎవరైనా సిమ్ వేస్తే... ఆ సమాచారం సీఈఐఆర్ నుంచి వెంటనే సమీప పోలీసుస్టేషన్‌కు తెలుస్తుంది.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో పోలీసులు ఈ ఫిర్యాదుల కోసం చాట్‌బాట్‌లు నిర్వహిస్తున్నారు.

ఇలా చేయండి...

- మీ డివైజ్‌కు స్క్రీన్ లాక్ తప్పనిసరిగా వేసుకోవాలి.
- ఫోన్‌లో ఫైండ్ మై డివైజ్, ఫైండ్ మై ఐ ఫోన్‌లు సెట్టింగ్స్‌ను టర్న్ ఆన్‌లో ఉంచుకోవాలి. ఎనేబుల్ చేసుకోవాలి.
- మీ డేటాను గూగుల్ డ్రైవ్ లేదా ఐ క్లౌడ్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి.

- ఈనాడు, అమరావతి



మీ ఉద్యోగం సుఖంగా అనిపిస్తోందా?.. జాగ్రత్త!

- ✦ ఉద్యోగంలో మీ పని రోజూ ఒకలాగే అనిపిస్తోందా?
- ✦ కొత్త విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం పడలేదా?
- ✦ మీరు చేసే పనిని మీ జూనియర్లు కూడా చేయగలరా?

మీ సమాధానం 'అవును' అయితే.. మీకు ఆ ఉద్యోగం ఎక్కువ రోజులు ఉండదు. మీ కన్నా తక్కువ వేతనానికి పనిచేసేవారికి ఆ ఉద్యోగం ఇవ్వొచ్చు లేదా ఎవరైనా చేయగల ఆ పనిని భవిష్యత్తులో కృత్రిమ మేధ(ఏఐ)కు అప్పగించొచ్చు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే నిత్యం కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంతో పాటు మీ పనికి సృజనాత్మకతను జోడించండి.

– సుసాన్ బ్రాక్, కంటెంట్ క్రియేటర్

బంధాలతోపాటు పచ్చదనమూ చిగురిస్తుంది




అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి గుర్తుగా జరుపుకొనేదే 'రాఖీ' పండగ. ఆ రోజు ఎంతో ప్రేమతో కట్టించుకున్న రాఖీలను కొన్ని రోజుల తర్వాత పారేస్తారు. ఇవి ఎక్కువగా ప్లాస్టిక్‌వే కావడంతో భూమిలో కలిసిపోకుండా అలాగే ఉండిపోతాయి. అలా కాకుండా రాఖీ బంధాన్ని బతికిస్తామంటున్నారు 'గ్రీన్ క్లైమేట్' సంస్థ వ్యవస్థాపకులు రత్నం, రాజేశ్వరి. ఇందుకోసం ప్లాస్టిక్‌తో కాకుండా ధనియాలు, దోస, మెంతులు, ఆవాలు, శనగపప్పు, చోళ్లు, బొబ్బర్లు, పెసర విత్తనాలతో రాఖీలను తయారుచేస్తున్నారు. వీటిని పడేసిన తర్వాత మొలకెత్తుతాయని.. పక్షులు, జంతువుల ఆకృతుల్లో ఉన్న ఈ రాఖీలు పిల్లలనూ ఆకర్షిస్తున్నాయని వారు చెబుతున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

విమానం వస్తోందంటే రైలును ఆపేస్తారు



ఇంటర్నెట్ డెస్క్: సాధారణంగా రైళ్లు వెళుతున్నప్పుడు... క్రాసింగుల వద్ద గేట్లు వేసి ఇతర వాహనాలను నిలిపివేస్తారు. విమానం వెళుతుంటే.. రైలును ఆపడం ఎక్కడైనా చూశారా! ప్రపంచంలో అలాంటి విమానాశ్రయం ఒక్కటే ఉంది. న్యూజిల్యాండ్‌లోని గిస్‌బోర్న్ ఎయిర్‌పోర్టు రన్‌వేను రెండు ముక్కలు చేసినట్లుగా మధ్య నుంచి రైల్వేట్రాకు ఉంటుంది. ఈ విమానాశ్రయాన్ని అటు రైల్వే, ఇటు విమానయాన సేవలకు వినియోగిస్తున్నారు. న్యూజిల్యాండ్‌లోని ఉత్తర ద్వీపంలో గిస్‌బోర్న్ అనేది చాలా చిన్న పట్టణం. ఇక్కడ ప్రతిరోజూ ఉదయం 6.40 నుంచి రాత్రి 8.30 వరకు మాత్రమే ఎయిర్‌పోర్టు అందుబాటులో ఉంటుంది. విమానాశ్రయ అధికారులే సిగ్నలింగు వ్యవస్థనూ పర్యవేక్షిస్తారు. విమానం టేకాఫ్ లేదా ల్యాండింగుకు సిద్ధంగా ఉంటే రైళ్లను కాసేపు నిలిపివేస్తారు. గతంలో ఆస్ట్రేలియాలోని టాస్మానియాలో ఈ తరహా ఎయిర్‌పోర్టు ఉండేది. 2005లో అక్కడ రైల్వే సేవలను నిలిపివేశారు.



స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పెట్టిన ఓ తాళపత్రం

నన్నయ, పోతన, శ్రీనాథుల

చేతిరాతలు చదివేద్దామా!

మన చరిత్ర, సంస్కృతి, సాహిత్యాన్ని లిఖితం చేసిన తాళపత్రాలను, వాటిలోని విజ్ఞానాన్ని భావితరాలకు భద్రంగా అందజేయాలన్న లక్ష్యంతో వాటిని డిజిటల్ రూపంలోకి తెస్తున్నారు కాకినాడ పురావస్తుశాఖ అధికారులు. ఆదికవి నన్నయ రాసిన మహాభారతం మొదలు శ్రీనాథుడి భీమఖండం, కాశీఖండం, పోతన భాగవతం, విష్ణుశర్మ పంచతంత్రకథలు, రామాయణం, పద్య, గద్య కావ్యాలు, ఆయుర్వేద, జాతక, సాహిత్య తదితర 5 వేలకు పైగా తాళపత్ర గ్రంథాలు ఇక్కడి కార్యాలయంలో ఉన్నాయి. తీరప్రాంతం కావడంతో తరచూ చెమ్మగిల్లడం, తాళపత్రాలు పిండిలా రాలిపోతుండడంతో ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా శుభ్రం చేస్తున్నారు. ఇంకా ఎక్కువ కాలం ఉంటే పూర్తిగా పాడై విలువైన గ్రంథాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉండడంతో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం, చీరాలలోని సనాతన జీవన్‌ట్రస్ట్ సహకారం తీసుకున్నారు. తాళపత్రాలను ముందుగా మెత్తని బ్రష్‌తో శుభ్రంగా తుడిచి వాటిపై సిట్రినెల్లా అనే రసాయనం, లెమన్ గ్రాస్ ఆయిల్‌తో లేపనం చేసి ఆరబెట్టారు. ఆ తర్వాత వాటిని తిరుపతిలోని వేద విశ్వవిద్యాలయానికి పంపించి.. అత్యంత శక్తిమంతమైన స్కానర్లతో స్కాన్ చేశారు. ఆ తాళపత్రాలకు మళ్లీ చెదలు పట్టకుండా ఎర్రని గుడ్డతో చుట్టి కాకినాడకు తీసుకొచ్చారు. మూడున్నరేళ్ల క్రితం చేపట్టిన ఈ ప్రక్రియ ఇటీవల పూర్తయింది. త్వరలోనే వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచుతామని.. ఈ మేరకు వెబ్‌సైట్ రూపొందిస్తున్నట్లు కాకినాడ పురావస్తుశాఖ ఏడీ తిమ్మరాజు తెలిపారు.

– ఈనాడు, కాకినాడ

అమ్మ.. ఎంబీబీఎస్



ఉన్నత విద్యనభ్యసించాలని ఆసక్తి ఉండాలే గానీ.. వయసు అడ్డుకాదని నిరూపించారు తమిళనాడుకు చెందిన 49 ఏళ్ల మహిళ. ఈ వయసులో కుమార్తె సహకారంతో చదివిన ఆమె ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. తెంకాశీ జిల్లాకు చెందిన అముదవల్లి ప్లస్‌టూ పూర్తయ్యాక ఎంబీబీఎస్ చదవాలనుకున్నారు. అప్పట్లో ఫిజియోథెరపీ కోర్సు చేయడానికి అవకాశం రావడంతో ఎంబీబీఎస్ చదవలేకపోయారు. ఇటీవల కుమార్తె సంయుక్త నీట్‌కు సిద్ధమయ్యారు. కుమార్తె సహకారంతో అముదవల్లి కూడా నీట్‌కు సిద్ధమై పరీక్ష రాశారు. అందులో ఆమెకు 147 మార్కులు వచ్చాయి. బుధవారం తమిళనాడులో వైద్యవిద్య ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరగ్గా.. అందులో ఆమెకు దివ్యాంగుల కేటగిరీలో విరుదునగర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో సీట్ లభించింది. సంయుక్తకు నీట్‌లో 460 మార్కులు రాగా.. ఆమె కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తోంది. –న్యూస్‌టుడే, చెన్నై (అర్కేనగర్)

మార్కులిస్తున్న మొక్కలివి..



ఆచరించాలి గానీ.. ఎన్ని మంచి అంశాలు లేవు. అలాంటిదే ఇది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఒద్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ మంచి సంప్రదాయం అమలవుతోంది. ఇక్కడ ఆరో తరగతిలో చేరిన విద్యార్థులందరితో సామాన్య శాస్త్రం ప్రాజెక్టులో భాగంగా ఉపాధ్యాయులు ఒక్కో మొక్కను నాటిస్తారు. ఆ మొక్కకు గుర్తింపు కార్డు కడతారు. ఆ కార్డులో మొక్క పేరు, శాస్త్రీయ నామం, విద్యార్థి పేరు, తరగతి, నాటిన సంవత్సరం తదితర వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ విద్యార్థి 9వ తరగతికి వచ్చేవరకూ ఆ మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. ఇలా చేసినందుకు ఆ విద్యార్థికి ప్రతి తరగతిలో అన్ని పరీక్షలకు కలిపి 10 మార్కులు ఇస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌ఛార్జి ఎంఈవో ప్రభాకర్ రావు తెలిపారు. ఈ పాఠశాల 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. ప్రస్తుతం 300కు పైగా మొక్కలు పెరుగుతున్నాయి. – న్యూస్‌టుడే, గంగాధర

ఆ ఊరిలో కోడి కూయదు!



గ్రామాల్లో తెల్లారితే కోడి కూత వినబడటం సాధారణమే. కానీ అనంతపురం జిల్లా కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డిలో కోడి కూత వినపడదు. ఎందుకంటే ఇక్కడి గ్రామస్థులు కోడి మాంసం తినరు. కోళ్లను పెంచరు కూడా. వందేళ్ల క్రితం పెద్దలు విధించిన ఈ కట్టుబాటును నేటి తరంలోనూ పాటిస్తున్నారు. గ్రామంలో 60 కుటుంబాలకు చెందిన 450 మంది నివసిస్తున్నారు. ఏళ్ల కిందట నెలకొన్న అరిష్టాల నివారణకు ఊరి పొలిమేర చుట్టూ గోపంచకం చల్లిన పెద్దలు.. కోడిమాంసం తినడం మానేయాలని నిబంధన పెట్టారు. అప్పటి నుంచి ఏళ్లుగా కోళ్లను పెంచడం కానీ తినడం కానీ చేయడం లేదు. అయితే ప్రతి ఇంట్లో మేకలు, గొర్రెలు ఉంటాయి. మటన్ తింటారు.

– న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం, కుందుర్పి

ఈ పనస తింటే.. మందు తాగినట్టే!



కేరళలోని పథనంథిట్ట జిల్లా పందాళం ఆర్టీసీ డిపోలో ప్రతిరోజూ డ్రైవర్లకు ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఇటీవల ముగ్గురు డ్రైవర్లకు పాజిటివ్ వచ్చింది. కంగుతిన్న ఆ డ్రైవర్లు అమ్మ తోడు.. జీవితంలో ఇప్పటిదాకా మందు గ్లాసు ముట్టలేదని ఒట్టేసి చెప్పారు. అధికారులు మొదట వీరిని నమ్మలేదు. డ్రైవర్లు ముగ్గురూ పనసపండ్లు తిని విధులకు వచ్చామని చెప్పడంతో.. సిబ్బందిలో ఒకరికి ఆ పండ్లను తినిపించారు. కొద్దిసేపయ్యాక పరీక్షలో వచ్చిన పాజిటివ్ ఫలితాన్ని చూసి షాకవడం అధికారుల వంతైంది. ఇక్కడి తేనె పనసలో అధిక మోతాదులో గ్లూకోజ్, ఫ్రక్టోస్ ఉంటాయని.. ఈ పండ్లు బాగా పండాక పులియబెడితే ఆల్కహాల్ లక్షణాలు ఏర్పడతాయని నిపుణులు చెబుతున్నారు. బాగా పండిన అరటి, మామిడిపండ్లు.. పులిసిన ఇడ్లీపిండి, ఎక్కువ వెనిగర్ కలిపిన వంటకాలు తిన్నా శ్వాస పరీక్షలో పాజిటివ్ రావచ్చని అంటున్నారు. –ఈటీవీ భారత్

వివాహంలో రాజ్యాంగ పీఠిక



కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా కేంద్రంలోని కేఈబీ కల్యాణ మండపం. బుధవారం ఉదయం వరుడు చేతన్, వధువు భవ్యశ్రీ పరిణయానికి అంతా సిద్ధమైంది. ఎలాంటి ఆడంబరాలు కనిపించలేదు. వాద్యాలు, మంత్ర ఘోష వినిపించలేదు. పురోహితుడి జాడే లేదు. కాసేపటికి వధూవరులు, వారి తల్లిదండ్రులు కల్యాణ వేదిక వద్దకు వచ్చారు. బంధువులను పలకరించిన తర్వాత జాతీయ కవి కువెంపు రూపొందించిన 'మంత్ర మాంగల్య' వివాహ పద్ధతిని పాటిస్తూ.. ఒకరికొకరు తోడుగా ఉంటామని ప్రమాణాలు చేశారు. అనంతరం వధువు రాజ్యాంగ పీఠికను చదివి వినిపించగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. పది నిమిషాల్లో వేడుకలు పూర్తయ్యాయి. వరుడు చేతన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా వధువు భవ్యశ్రీ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు. – న్యూస్‌టుడే, చిత్రదుర్గం

ఆ మహిళది అరుదైన రక్తం!

శస్త్రచికిత్స కోసం చేరిన ఒక మహిళ (38)కు అరుదైన రక్తం గ్రూపు ఉందని కర్ణాటక రాష్ట్రం కోలారు వైద్యులు గుర్తించారు. ఆమెకు అరుదైన ఓ ఆర్‌హెచ్+ గ్రూపు రక్తం ఉందని ప్రాథమిక పరీక్షల్లో గుర్తించినట్లు వైద్య పరీక్షలు నిర్వహించిన రోటరీ బెంగళూరు టీటీకే రక్తనిధి వైద్యుడు డాక్టర్ అంకిత్ మాథుర్ బుధవారం ఇక్కడ వెల్లడించారు. ఈ రక్తం గ్రూపునకు సీఆర్ఐబీ అని పేరు పెట్టారు. సీఆర్ అంటే క్రోమర్ అని ఐబీ అంటే ఇండియా బెంగళూరు అని డాక్టర్ మాథుర్ తెలిపారు. మెరుగైన సెరోలాజికల్ సాంకేతికతలను వినియోగించుకుని ఆమె రక్తం 'ప్యానియాక్టివ్' లక్షణాలు కలిగి ఉందని, అదే తరహా రక్తం మినహా ఏ రక్తం గ్రూపూ ఆమెకు సరిపోదని స్పష్టం చేశారు. ఆమెతో పాటు, ఆమె కుటుంబంలోని 20 మంది సభ్యుల రక్తం నమూనాలను బ్రిటన్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న అంతర్జాతీయ బ్లడ్‌గ్రూప్ ప్రయోగశాలకు పంపించామని చెప్పారు. రక్తం దొరక్కపోయినా ఆ మహిళకు అవసరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశామని వైద్యులు ప్రకటించారు. –న్యూస్‌టుడే, కోలారు

EENADU Vol: 51, Issue: 352 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

ప్రధాని ప్రశంసించినవారు మా విద్యార్థులే: అలెన్

కోటా: మన్ కీ బాత్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు పొందినవారు తమ విద్యార్థులేనని కోటకు చెందిన అలెన్ విద్యా సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అంతర్జాతీయ కెమిస్ట్రీ ఒలంపియాడ్‌లో బంగారు, వెండి పతకాలు పొందిన దేవేశ్ పంకజ్ భయ్యా, దేవదత్త ప్రియదర్శిలను ప్రధాని ప్రశంసించారని వివరించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో తుది పోటీలు జరిగాయని, మన దేశం నుంచి నలుగురు పాల్గొన్నారని, వారిలో తమ విద్యార్థులకు పతకాలు దక్కాయని వెల్లడించింది. దేవేశ్ గత ఏడేళ్లుగా, దేవదత్త మూడేళ్లుగా అలెన్‌లో చదువుతున్నారని తెలిపింది.



హత్య కేసులో జడ్జికి పాఠాలు.. మహిళా ప్రొఫెసర్‌కు జీవితఖైదు

ఇంటర్నెట్ డెస్క్: రసాయనశాస్త్రంలో మాజీ ప్రొఫెసరు అయిన మమతా పాఠక్ అనే మహిళకు జీవితఖైదు విధిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఒకప్పుడు ఛతర్‌పుర్‌లోని కెమిస్ట్రీ ప్రొఫెసరుగా ఈమె పనిచేశారు. భర్త డాక్టర్ నీరజ్ పాఠక్ 2021లో అనుమానాస్పద పరిస్థితుల మధ్య ఇంట్లో మరణించారు. ఈ దంపతుల మధ్య సుదీర్ఘకాలంగా విభేదాలు ఉండేవి. నీరజ్ మరణం విద్యుదాఘాతం వల్ల జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్, పోస్టుమార్టం నివేదికల్లో చాలా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో మమతపై హత్య కేసు నమోదుచేయగా.. దిగువ కోర్టు 2022లో ఆమెను దోషిగా తేల్చింది. ఈ తీర్పుపై మమత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పుర్ బెంచ్‌కు అప్పీలు చేశారు. సొంతంగా వాదనలు వినిపించేందుకు అనుమతి కూడా పొందారు. ఈ క్రమంలో జస్టిస్ వివేక్ అగర్వాల్‌కు ఆమె వాదనలు వినిపించిన వీడియో వైరల్‌గా మారింది. రసాయన శాస్త్రంలో తనకున్న పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ వేడి వల్ల అయ్యే గాయాలు, విద్యుదాఘాతంతో అయ్యే గాయాలను వర్గీకరించి వివరించారు. పోస్ట్‌మార్టం చేసిన డాక్టరు పొరబడి ఉంటారని చెప్పారు. అందరి వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పునే సమర్థిస్తూ ఆమెకు జీవితఖైదు విధించింది.

పహల్గాంపై ఆధారాల్లేకుండా మాపై నిందలా?: పాకిస్థాన్

- చర్చలకు కట్టుబడి ఉన్నామని ప్రకటన

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్రదాడి కేసులో ధ్రువీకరించదగిన ఆధారాలు, విశ్వసనీయ దర్యాప్తు లేకుండానే భారత్ తమపై నిందలు వేస్తోందని పాకిస్థాన్ మరోసారి విమర్శించింది. "ఘటనపై భారత్ నేతల తాజా ప్రకటనలు వాస్తవాలను వక్రీకరించేవిగా ఉన్నాయి. మా దేశం అణ్వస్త్ర బెదిరింపులకు పాల్పడిందని చెప్పడం తప్పుదోవ పట్టించడమే. సింధూ జలాల ఒప్పందం గురించీ తప్పుడు వాదనలు చేశారు. ఒక బాధ్యతాయుతమైన దేశంగా.. శాంతి, ప్రాంతీయ సుస్థిరత, జమ్మూకశ్మీర్ వివాదం సహా అన్ని అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అర్థవంతమైన చర్చలకు కట్టుబడి ఉన్నాం" అని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.



విక్రయానికి బిల్‌గేట్స్ రహస్య విలాస నౌక

- ఖరీదు 645 మిలియన్ డాలర్లు


లండన్: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్. తన విలాసవంతమైన నౌక 'బ్రేక్ త్రూ'ను విక్రయించనున్నారు. దీని ఖరీదు దాదాపు 645 మిలియన్ డాలర్లు మొనాకోలో సెప్టెంబరు 24-27 తేదీలలో నిర్వహించనున్న యాట్ షోలో దీన్ని అమ్మేందుకు రంగం సిద్ధమైంది. లిక్విడ్ హైడ్రోజన్‌తో నడిచే 390 అడుగుల పొడవైన ఈ నౌకలో ఏడు డెక్‌లు, బాస్కెట్‌బాల్ కోర్టు, సినిమా థియేటర్, పలు హాట్ టబ్‌లు, ఒక ప్రైవేట్ ఆసుపత్రి, నాలుగు అంతస్తుల భవంతి, పలు కార్యాలయాలు, లగ్జరీ స్లైడింగ్ బాల్కనీలు, అనేక అతిథి క్యాబిన్లు, లైబ్రరీలు, విశాలమైన టెర్రస్ వంటి విలాసవంతమైన సదుపాయాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని రూపొందించడానికి నెదర్లాండ్స్‌కు చెందిన ఫెడ్‌షిప్ సంస్థ ఐదేళ్లు శ్రమించింది. ఈ నౌకను కొనుగోలు చేసినప్పటి నుంచి ఒక్కసారి కూడా ఇందులోకి బిల్‌గేట్స్ అడుగుపెట్టలేదని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఎయిరిండియాలో 100 ఉల్లంఘనలు

- డీజీసీఏ వెల్లడి

దిల్లీ: అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం అనంతరం విచారణ జరిపిన పౌర విమానయాన సంస్థ డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) కీలక విషయాలు వెల్లడించింది. ఎయిరిండియా సంస్థలో 100 ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించామని పేర్కొంది. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్-1కి సంబంధించినవని.. వీటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండడంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు సూచించింది. సురక్షితమైన విమానయాన కార్యకలాపాలను నిర్ధారించడానికి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారనే దానిపై నివేదిక సమర్పించడానికి ఎయిరిండియాకు జులై 30 వరకు గడువు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా డీజీసీఏ గుర్తుచేసింది. అయితే.. ఆగస్టు 23 కల్లా మిగిలిన ఉల్లంఘనల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది.

ప్రపంచాన్ని వణికించిన భారీ భూకంపాలివే..



రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలో బుధవారం సంభవించిన భూకంపం తీరు ఇలా..

టోక్యో: భారీ భూకంపం ప్రకంపనల దాటికి రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ప్రపంచాన్ని వణికించిన 10 అతి భారీ భూకంపాలను చూద్దాం..

✦ చిలీలో 1960లో భారీ భూకంపం సంభవించింది. బయోబియో ప్రాంతంలో 9.5 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపాన్ని వాల్డివియా భూకంపం, గ్రేట్ చిలీ భూకంపం అని పిలుస్తారు. ఈ భూకంపం దాటికి దాదాపు 1,655 మంది ప్రాణాలు కోల్పోగా.. 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

✦ అమెరికాలోని అలస్కాలో 1964లో 9.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. గ్రేట్ అలస్కా భూకంపం, ప్రిన్స్ విలియం సౌండ్ భూకంపం, గుడ్ ఫ్రైడే భూకంపంగా దీనిని పిలుస్తారు. ఈ భూకంపం దాని తర్వాత వచ్చిన సునామీ కారణంగా 130 మంది మరణించారు. 2.3 బిలియన్ డాలర్ల ఆస్తినష్టం జరిగింది.

✦ 2004లో ఇండోనేషియాలోని సుమత్రా దీవుల్లో 9.1 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఇది సునామీకి దారితీసింది. 2,80,000 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా.. దక్షిణాసియా, తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో 1.1 మిలియన్ల మంది నిరాశ్రయులయ్యారు.

✦ 'గ్రేట్ తోహోకు' భూకంపంగా పిలిచే భారీ భూకంపం 2011లో చోటుచేసుకుంది. జపాన్‌లోని తోహోకు ప్రాంతంలో 9.1 తీవ్రతతో సంభవించింది. ఆ తర్వాత సునామీ కారణంగా 15,000 మందికిపైగా మరణించగా.. 1,30,000 మంది నిరాశ్రయులయ్యారు.

✦ ప్రపంచంలో తొలిసారి 9 తీవ్రతతో కూడిన భూకంపం 1952లో వచ్చింది. రష్యాలోని కమ్చట్కా ద్వీప ప్రాంతంలో ఇది చోటుచేసుకుంది. హవాయిని తాకిన ప్రకంపనలు భారీ సునామీకి దారితీశాయి. ఈ భూకంపంలో 1 మిలియన్ డాలర్ల ఆస్తి నష్టం చోటుచేసుకుంది.

✦ చిలీలోని బయోబియోలో మరోసారి 2010లో 8.8 తీవ్రతతో కూడిన భూప్రకంపనలు సంభవించాయి. క్విరిహ్యూ నగరం సమీపంలో చోటుచేసుకున్న ప్రకంపనలు 523 మంది ప్రాణాలను తీశాయి. 3.7 లక్షల ఇళ్లను ధ్వంసం చేశాయి.

✦ 1906లో 8.8 తీవ్రతతో సంభవించిన ఈక్వెడార్-కొలంబియా భూకంపం బలమైన సునామీకి దారి తీసింది. 1500 మంది ప్రాణాలు కోల్పోయారు.

✦ అలస్కాలోని ర్యాట్ దీవుల సమీపంలో 1965లో 8.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని కారణంగా 35 అడుగుల ఎత్తైన సునామీ అలలు విరుచుకుపడ్డాయి.

✦ అరుణాచల్ ప్రదేశ్‌లో 1950లో 8.6 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. 'అస్సాం-టిబెట్ భూకంపం' దీనిని పిలుస్తారు. ఈ ఘటనలో దాదాపు 780 మంది మరణించారు.

✦ ఇండోనేషియాలోని ఉత్తర సుమత్రా తీరంలో 2012లో భారీ భూకంపం సంభవించింది. 8.6 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి.

భూకంపాల కేంద్రం పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్

- 90శాతం ఈ ప్రాంతంలోనే..
- రష్యా, జపాన్ భూకంపంతో మరోసారి తెరపైకి..

మాస్కో: రష్యా తూర్పు ప్రాంతంలో బుధవారం సంభవించిన భూకంపంతో సునామీ వచ్చి సముద్ర అలలు 4 మీటర్ల ఎత్తు వరకూ ఎగసిపడ్డాయి. 1952 తర్వాత ఈ ప్రాంతంలో వచ్చిన అతి పెద్ద భూకంపం ఇదే కావడం గమనార్హం. దీనివల్ల భారీ ఎత్తున ప్రజలను ఖాళీ చేయించాల్సి వచ్చింది. ఈ ప్రాంతాన్ని పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అని పిలుస్తారు. ఇక్కడే 90శాతం భూకంపాలు సంభవిస్తుంటాయి. ఈ రింగ్ అనేది పసిఫిక్ మహాసముద్ర తీరం వెంట విస్తరించి ఉన్న భారీ టెక్టోనిక్ బెల్ట్. ఇది తూర్పు ఆసియా, పశ్చిమ అమెరికాతోపాటు అనేక పసిఫిక్ ద్వీపాలతో ఉంటుంది. ఇందులో జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్, అలస్కాలోని అల్యూటియన్ ద్వీపాలున్నాయి.

75శాతం అగ్ని పర్వతాలు ఇక్కడే..

ఈ ప్రాంతం సముద్రపు లోయలు, అగ్ని పర్వత సానువులు, టెక్టోనిక్ ప్లేట్ల సరిహద్దులతో గ్యాప్ లేకుండా అనుసంధానమై ఉంటుంది. మొత్తం ఇది 40,000 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. ఈ ప్రాంతంలోనే ప్రపంచంలోని 75శాతం అగ్ని పర్వతాలుంటాయి. 90శాతం భూకంపాలు ఇక్కడే సంభవిస్తుంటాయి. ఈ భయానక ప్రాంతంలో 450 అగ్ని పర్వతాలున్నాయి. ఇందులో కొన్ని క్రియాశీలంగా.. మరికొన్ని నిద్రాణంగా ఉంటాయి. భూ పలకల కదలికలను, భూకంపాలను అర్థం చేసుకోవడంలో ఇవి అత్యంత కీలకం. రింగ్ ఆఫ్ ఫైర్ పరిధిలోని పసిఫిక్ ప్లేట్.. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, యూరోఏసియన్ పలకలను తాకుతుంది. వీటితోపాటు నజ్కా, ఫిలిప్పీన్ పలకలనూ కలుస్తుంది. ఈ సరిహద్దులు.. అగ్ని పర్వతాలకు, సీస్మిక్ చర్యలకు కేంద్ర స్థానాలు.

ఇతర ప్రాంతాలపైనా ప్రభావం

రింగ్ ఆఫ్ ఫైర్ ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతోంది. దీనివల్ల భారత్‌తోపాటు ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌లోని జోన్లలో ప్రభావం పడుతుంది. ఈ ప్రాంతాల్లో 130 క్రియాశీల అగ్ని పర్వతాలున్నాయి. వాస్తవానికి భారత్.. ఈ రింగ్ ఆఫ్ ఫైర్ పరిధిలో లేదు. కానీ దాని ప్రభావం పడుతూనే ఉంటుంది.

భారీవర్షాలతో అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత

జమ్ము: కశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్ర నిలిచిపోయింది. పహల్గాం, బల్తాల్ బేస్ క్యాంపుల నుంచి యాత్రను బుధవారం నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలోని భగవతీ నగర్ శిబిరం నుంచి కూడా వాహనాల్లో భక్తుల రాకను గురువారం ఆపనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు వరదలకు దారితీశాయని బుధవారం అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌తో అనుసంధానమైన రోడ్డు, రైలు రవాణాకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా 15 జిల్లాల్లోని పాఠశాలలు మూసివేశారు.

మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాల తర్వాత వరదల్లాంటి పరిస్థితి నెలకొంది. ఈ వరదల్లో పిల్లలు సహా అనేక మంది చిక్కుకున్నారని, దీంతో సహాయక చర్యల నిమిత్తం సైన్యాన్ని పిలిపించామని బుధవారం అధికారులు తెలిపారు.


రాజస్థాన్‌లో బుధవారం కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన సవాయి మాధోపుర్ రైల్వే స్టేషన్

థాయ్-కంబోడియా మధ్య చైనా మధ్యవర్తిత్వం

బ్యాంకాక్: కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు థాయ్‌లాండ్, కంబోడియా బుధవారం ప్రకటించాయి. ఈ రెండు దేశాల మధ్య సోమవారమే ఒప్పందం కుదిరినా.. ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో చైనా రంగంలోకి దిగి షాంఘైలో రెండు దేశాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించింది. సమావేశం అనంతరం థాయ్‌లాండ్-కంబోడియా ప్రతినిధులు చైనా ఉప మంత్రి సన్ వీడాంగ్‌తో కలిసి చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. కంబోడియా- థాయ్‌లాండ్ కాల్పుల విరమణ కుదిర్చే విషయంలో తాము నిబద్ధతతో ఉన్నామని చైనా దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ అనధికారిక దౌత్య సమావేశం సరిహద్దు వివాదాన్ని తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించింది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందం జాప్యంపై ట్రంప్‌లో అసహనం

- శ్వేతసౌధ ఆర్థిక సలహాదారు వెల్లడి

వాషింగ్టన్: భారత్, అమెరికాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు ఆలస్యం కావడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనానికి గురయ్యారని శ్వేతసౌధ ఆర్థిక సలహాదారు కెవిన్ హస్సెట్ బుధవారం వెల్లడించారు. భారత్ వస్తువులపై 25 శాతం సుంకం విధించడమే దీనికి పరిష్కారమని ట్రంప్ భావించారని తెలిపారు. అమెరికా ఉత్పత్తులకు భారత్ మార్కెట్‌లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, అందుకు ద్వారాలు తెరచుకునేలా చేయటానికి ఈ నిర్ణయం తీసుకున్నారని కెవిన్ పేర్కొన్నారు.

నిఠారీ హత్యల కేసుల్లో.. సీబీఐ అపీళ్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ వరుస హత్యలకు సంబంధించి పలు కేసుల్లో సురేంద్ర కోలీ, మొనిందర్‌సింగ్ పంధేర్‌లను నిర్దోషులుగా తేల్చడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సీబీఐకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ వ్యవహారంలో సీబీఐతోపాటు హతుల కుటుంబ సభ్యులు దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. 2006లో నొయిడాలోని నిఠారీ వద్ద మొనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు బయటపడటం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. పంధేర్‌తోపాటు అతడి ఇంట్లో సహాయకుడైన కోలీని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం 19 కేసులను 2007లో నమోదు చేసింది. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిలో మూడింటిని మూసివేసింది. మిగతా 16 కేసులకుగాను పన్నెండింటిలో కోలీని నిర్దోషిగా 2023 అక్టోబరు 16న అలహాబాద్ హైకోర్టు తేల్చింది. అప్పటికి పంధేర్‌పై మూడు కేసులు మిగిలి ఉండగా.. వాటిలో అతణ్నీ నిర్దోషిగా నిర్ధారించింది. దర్యాప్తులో సీబీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిందితులే నేరం చేసినట్టు ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో సీబీఐ 12 అపీళ్లు దాఖలు చేసింది. మృతుల తరఫు బంధువులు రెండు పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం తాజాగా కొట్టివేసింది. హైకోర్టు తీర్పు అనుచితంగా ఏమీ లేదని స్పష్టం చేసింది. అస్థికలను ఆ మురుగుకాల్వలో నిందితులు తప్ప ఇంకెవ్వరూ వేయడం సాధ్యం కాదని నిరూపితమైతేనే.. వారు నేరం చేసినట్లు భావించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసులో పరిస్థితి అలా లేదని అభిప్రాయపడింది. దీంతో పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. అయితే- నిఠారీ హత్యల్లో ఒకటైన రింపా హల్దార్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న నేపథ్యంలో కోలీ ఇంకా కారాగారంలోనే ఉండనున్నాడు.

ఐక్యరాజ్యసమితి నివేదికలో 'పహల్గాం దాడి'

- ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్ పేరూ ప్రస్తావన
- భారత్‌కు దౌత్య విజయం!

ఐక్యరాజ్యసమితి: జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) పాత్ర ఉందని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి(యూఎన్ఎస్‌సీ) నివేదిక స్పష్టంచేసింది. టీఆర్ఎఫ్‌కు మద్దతిస్తున్న లష్కరే తయ్యిబా సంస్థ పేరు కూడా నివేదికలో ఉండటం గమనార్హం. 2019 తరువాత లష్కరే పేరును ఐరాస ఓ నివేదికలో ప్రస్తావించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. "యూఎన్ఎస్‌సీ మానిటరింగ్ టీమ్(ఎంటీ) నివేదికలోని దక్షిణాసియా విభాగం కింద పహల్గాం ఉగ్రదాడి గురించి వివరించారు. ఇందులోనే లష్కరే, టీఆర్ఎఫ్‌లకు ఉన్న సంబంధాలు గురించి, ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఇస్తున్న మద్దతు గురించి ప్రస్తావించారు. భారతదేశం ఇప్పటి వరకు ఏం చెబుతోందో, అదే యూఎన్ఎస్‌సీ నివేదిక కూడా చెప్పింది" అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. నివేదికలో టీఆర్ఎఫ్ పాత్రను సోదాహరణంగా మానిటరింగ్ టీం వివరించింది. "దాడి చేసింది తామేనని 'టీఆర్ఎఫ్' ప్రకటించింది. దాడి జరిగిన ప్రదేశానికి సంబంధించిన చిత్రాన్ని కూడా ప్రచురించింది. మరుసటి రోజు ఆ దాడి చేసింది తామేనని పునరుద్ఘాటించింది. ఆ తర్వాత తమ ప్రకటనను ఉపసంహరించుకుంది. అయితే లష్కర్, టీఆర్ఎఫ్ మధ్య సంబంధాలను తోసిపుచ్చలేం. ప్రస్తుతం భారత ఉపఖండంలో ప్రాంతీయ సంబంధాలు బలహీనంగా ఉన్నాయి. ఈ ఉద్రిక్తతలను ఉగ్రవాద గ్రూపులు ఉపయోగించుకునే ప్రమాదం ఉంది. లష్కరే తయ్యిబా మద్దతు లేకుండా టీఆర్ఎఫ్ ఆ దాడి చేయలేదు" అని నివేదిక పేర్కొంది. ఇది దౌత్యపరంగా భారత్ సాధించిన విజయమని విశ్లేషకులు భావిస్తున్నారు. టీఆర్ఎఫ్ గురించి ఐరాస ప్రస్తావించడం వల్ల పాకిస్థాన్ చెప్పేవన్నీ అబద్ధాలని, మోసపూరిత కథనాలని ప్రపంచానికి తెలుస్తుందని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



జమ్మూకశ్మీర్‌లో కాల్పులు.. ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంబడి భారత్‌లోకి చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది. వీరిని లష్కరే తయ్యిబా ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి సరిహద్దు కంచె వెంబడి ఇద్దరు అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించిన భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. మృతిచెందిన ఉగ్రవాదుల నుంచి భారీగా మందుగుండు సామాగ్రి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం పేర్కొంది.

సొరంగాన్ని మూసేసి.. ఉగ్రవాదులను మట్టుబెట్టి..

- రహస్య మార్గాలను మూసివేసిన సైన్యం

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి ముష్కరులను 'ఆపరేషన్ మహదేవ్' ద్వారా హతమార్చిన విషయాన్ని మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే వీరి కట్టడి వెనుక మన బలగాల వ్యూహం దాగి ఉంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన అత్యవసర భేటీలో ఎట్టి పరిస్థితుల్లో ముష్కరులు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లకూడదని సైన్యానికి అమిత్ షా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఉగ్రవాదులు ఉపయోగించిన 8 కిలోమీటర్ల మార్గాన్ని భద్రతా బలగాలు గుర్తించి. ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశాయి. ముష్కరులు చొరబాటుకు ఉపయోగించిన రహస్య సొరంగాలను గుర్తించి వాటిని వరదలతో ముంచెత్తించారు. దీంతో ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్‌లకు తప్పించుకునే మార్గం మూతపడింది. ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని ట్రాక్ చేసి.. వారిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి.

43 ఓటీటీలను నిషేధించాం: కేంద్రం

దిల్లీ: ఓటీటీ వేదికల్లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న అభ్యంతరకర వీడియోలను కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇటీవల 24 యాప్‌లు, వెబ్‌సైట్లను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే.. ఇప్పటివరకు 43 ఓటీటీ వేదికలను బ్లాక్ చేసినట్లు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ సహాయమంత్రి ఎల్.మురుగన్ బుధవారం లోక్‌సభకు వెల్లడించారు. చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న 43 ఓటీటీలపై సంబంధిత మంత్రిత్వ శాఖలతో సంప్రదింపుల అనంతరం నిషేధం విధించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

రాహుల్ వాస్తవాలను వక్రీకరించారు: దుబె

దిల్లీ: పాకిస్థాన్‌తో 1971లో మన దేశం జరిపిన యుద్ధానికి సంబంధించిన సత్యాలను లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ వక్రీకరించారని భాజపా ఎంపీ నిశికాంత్ దుబె ఆరోపించారు. అసంబద్ధ వాస్తవాలను సభలో చెప్పినందుకు ఆయన్ని మందలించాలని కోరుతూ లోక్‌సభ స్పీకరుకు బుధవారం లేఖ రాశారు. రాహుల్ పదేపదే ఇలాంటి అపరాధాలు చేస్తున్నారని, ఆయనకు తాఖీదు జారీ చేయాలని కోరారు.

ఇందౌర్‌లో ఆగస్టు 1 నుంచి నో హెల్మెట్.. నో పెట్రోల్

ఇంటర్నెట్ డెస్క్: మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ జిల్లాలో ద్విచక్ర వాహనదారులు హెల్మెటు లేకుండా పెట్రోల్ పంపుల వద్దకు వస్తే.. ఇంధనం నింపేందుకు నిరాకరించనున్నారు. ఈ నిర్ణయం ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుందని అధికారులు బుధవారం వెల్లడించారు. నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. బైకర్లు హెల్మెట్లు ధరించేలా, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్టులు పెట్టుకొనేలా ఇందౌర్‌లో ఓ ప్రచార కార్యక్రమం చేపట్టాలని సప్రే సూచించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఇందౌర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పెట్రోల్ బంకులపై ఏడాది జైలుశిక్ష లేదా రూ.5 వేల జరిమానా.. లేదా రెండూ విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇందౌర్ రోడ్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల గురించి మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఈ చర్యలకు ఉపక్రమించింది.



మైనర్‌కు అసభ్య వీడియో కాల్.. ముంబయి మహిళా టీచర్ అరెస్ట్

ముంబయి: మైనరు అయిన ఓ విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించిన మహిళా టీచరు (35)ను నవీ ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్టా సహా ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఆమె అసభ్యకర సందేశాలు పంపేది. అర్ధనగ్నంగా వీడియో కాల్స్ చేసేది. తీవ్రంగా ఇబ్బందిపడిన విద్యార్థి చివరకు తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాడు. ఆ టీచరు ప్రవర్తన తమ కుమారుడి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. టీచర్ ఫోను స్వాధీనం చేసుకొని, ఆమె సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తున్నారు. ముంబయిలోనే ఇటీవల ఓ పెద్ద పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థిపై మహిళా టీచరు ఇలాగే లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ విద్యార్థిని ఆమె పలు ఫైవ్‌స్టార్ హోటళ్లకు తిప్పి లైంగిక దాడి చేసింది. పోక్సో చట్టం కింద ఆమెను అరెస్టు చేశారు.

పాప్‌స్టార్‌తో కెనడా మాజీ ప్రధాని డేటింగ్

ఇంటర్నెట్ డెస్క్: గ్లోబల్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో డిన్నర్ డేట్‌కు వెళ్లటం చర్చనీయాంశంగా మారింది. కెనడా ప్రధాని పదవి నుంచి జనవరిలో వైదొలగిన ట్రూడో రాజీనామా అనంతరం చాలా అరుదుగా బయట కనిపిస్తున్నారు. తన కొత్త ఆల్బమ్ '143' ప్రమోషన్స్ కోసం పెర్రీ ప్రస్తుతం కెనడాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే వీరిద్దరూ మాంట్రియల్‌లో ప్రైవేటు డిన్నర్‌కు వెళ్లారు. కార్నర్ టేబులు వద్ద కూర్చొని విందు ఆరగించాక కొంతసేపు మాట్లాడుకున్నారు. ఈ దృశ్యాలను ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది. ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్న ట్రూడో 18 ఏళ్ల వివాహబంధానికి స్వస్తి పలుకుతూ 2023లో తన సతీమణి సోఫీ గ్రెగోయిర్‌తో విడిపోయారు. అటు పెర్రీ కూడా ఈ ఏడాది ప్రారంభంలో నటుడు ఓర్లాండ్ బ్లూమ్‌తో విడిపోగా.. వీరికి ఒక కుమార్తె ఉంది.



లాలూ సహ రచయితగా పుస్తకం

- జానపద కథల సంకలనంగా విడుదల

దిల్లీ: తరతరాల నుంచి ప్రజల నోళ్లలో నానుతున్న జానపద తత్వాలను తిరిగి చెప్పాలనే ఉద్దేశంతో ఆర్జేడీ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ రచయితగా మారారు. మరో రచయిత నళిన్ వర్మతో కలిసి ఆయన 'లోరెజ్ ఆఫ్ లవ్ అండ్ సెయింట్ గోరఖ్‌నాథ్' పుస్తకాన్ని రచించారు. ఈ కథా సంకలనంలో సోర్ఠీ-బ్రిజ్‌భర్, భర్తారి-పింగ్లా, హీర్-రంఝా, సారంగ-సదాబ్రిజ్ అనే నాలుగు కథలను పొందుపరిచారు. 11వ శతాబ్దానికి చెందిన యోగి గోరఖ్‌నాథ్ బోధనలతో ఇవి ముడిపడి ఉంటాయి. పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా ప్రచురించిన ఈ పుస్తకం.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మార్కెట్లలో అందుబాటులో ఉంది.


రష్యా దాడితో ఉక్రెయిన్‌లోని ఖర్కివ్‌లో ఓ ఆహార గిడ్డంగి నుంచి ఎగసిపడుతున్న పొగ

రష్యా దాడిలో ముగ్గురు ఉక్రెయిన్ సైనికుల మృతి

కీవ్: ఉక్రెయిన్ సైనిక శిక్షణ మైదానంపై రష్యా చేసిన క్షిపణి దాడిలో ముగ్గురు సైనికులు మరణించారు. మరో 18 మంది గాయపడ్డారు. రష్యా రక్షణ మంత్రిత్వశాఖ మాత్రం తాము చేసిన దాడిలో 200 మంది వరకు ఉక్రెయిన్ సైనికులు చనిపోవడం లేదా గాయపడటం జరిగిందని పేర్కొంది. ఈ దాడి చెర్నీవ్ ప్రాంతంలో ఉక్రెయిన్‌కు చెందిన 169వ ట్రైనింగ్ సెంటర్‌పై జరిగింది.

ఈనాడు సినిమా

మరో తెలుగు చిత్రంలో రిషబ్


రిషబ్ శెట్టి

కన్నడ కథానాయకుడు, 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి మరో తెలుగు సినిమాకి పచ్చజెండా ఊపారు. ఇప్పటికే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో 'జై హనుమాన్' చేస్తున్న ఆయన, మరో తెలుగు దర్శకుడు అశ్విన్ గంగరాజు చెప్పిన కథకు అంగీకారం తెలిపారు. కల్పిత చారిత్రక యాక్షన్ డ్రామాగా తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కనుందీ సినిమా. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో... ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని బుధవారం అధికారికంగా ప్రకటించారు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య. "18వ శతాబ్దం నేపథ్యంలో సాగే కథ ఇది. అప్పట్లో అల్లకల్లోలంగా ఉన్న బెంగాల్ ప్రావిన్స్‌లోని ఒక తిరుగుబాటుదారుడు ఎదిగిన క్రమం ఇందులో కీలకం. మంచి కథకుడిగా పేరు తెచ్చుకున్న అశ్విన్ గంగరాజు మరో అద్భుతమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడమే లక్ష్యంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నటులు, ప్రతిభగల సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పని చేయనున్నార"ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రం తెలుగు, కన్నడతో పాటు తమిళ, హిందీ, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది.

ముందు సరదా... చివరికి విషం


శ్రీరామ్

ప్రస్తుతం చాలా మంది మనుషులతో కంటే సామాజిక మాధ్యమాలతోనే ఎక్కువ సమయం గడిపేస్తున్నారు. నిత్యం ఇంటర్‌నెట్‌లో గడిపే ఓ నలుగురి జీవితాల చుట్టూ ఆసక్తికర కథాంశంతో తెరకెక్కిందే 'నెట్‌వర్క్' సిరీస్. శ్రీరామ్, కామ్నా జెత్మలానీ, ప్రియా వడ్లమాని, శ్రీనివాస్ సాయి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్ నేటి నుంచి ఆహా వేదికగా ప్రసారం కానుంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్‌ను సతీష్ చంద్ర నాదెళ్ల తెరకెక్కించారు. లావణ్య ఎస్.ఎస్, ఎం.జి జంగం నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ఆన్‌లైన్ డిపెండెంట్, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, ఆన్‌లైన్ డేటింగ్, ఆన్‌లైన్ ఇన్ఫ్లూయెన్సర్..ఇలా నాలుగు పాత్రల్ని పరిచయం చేసింది. "ముందు సరదా.. తర్వాత అలవాటు, చివరికి విషం', 'మనం డైరెక్షన్స్ ఇస్తే పని చేయాల్సిన వస్తువు.. మన లైఫ్‌ని డైరెక్ట్ చేయకూడదు' లాంటి డైలాగులు కథలోని లోతుని తెలియజేస్తున్నాయి. అలానే ఈ ట్రైలర్ అంతర్జాలంపై ఆధారపడుతూ తమ జీవితాన్ని గందరగోళం చేసుకున్న వ్యక్తుల కథతో ఆసక్తికరంగా సాగుతుంది. ఈ సిరీస్‌లో తాగుబోతు రమేశ్, సమ్మెట గాంధీ, జోష్ రవి, మీనా కుమారి, ఛత్రపతి శేఖర్, మాస్టర్ అవ్యక్త్ వల్లూరి తదితరులు నటిస్తున్నారు.

కేరళ అందాల్లో... పరదేశియా


జాన్వీ కపూర్

బాలీవుడ్ అందాలతార జాన్వీకపూర్, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'పరమ్ సుందరి'. ఈ సినిమాని ఉత్తరాదికి చెందిన అబ్బాయి, దక్షిణాది అమ్మాయికి మధ్య చిగురించే ప్రేమకథా నేపథ్యంతో తుషార్ జలోటా తెరకెక్కించారు. మడాక్ ఫిల్మ్స్‌పై దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ని ఆవిష్కరించింది చిత్ర బృందం. ఈ సినిమా ఆగస్టు 29న థియేటర్లలో ప్రేక్షకుల్ని పలకరించనుందని ప్రకటించింది. ఇన్‌స్టా వేదికగా ఈ సినిమాలో జాన్వీని సుందరిగా, సిద్ధార్థ్‌ని పరమ్ పాత్రలుగా పరిచయం చేస్తూ ప్రత్యేక పోస్టర్‌లను పంచుకుంది. అలాగే ఈ చిత్రంలోని 'పరదేశియా' అనే గీతాన్ని కూడా బుధవారం విడుదల చేసింది. 'పరదేశియా' అంటూ సాగే ఈ పాట కేరళలోని ప్రకృతి అందాలతో, నాయకానాయికల మధ్య ప్రేమగీతంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.


నాగవంశీ, విజయ్ దేవరకొండ, పవన్‌కల్యాణ్, భాగ్యశ్రీ బోర్సే, శ్రీలీల

నా దృష్టంతా ప్రేమపైనే.. కోపంపై కాదు!

– 'కింగ్డమ్' వేడుకలో విజయ్ దేవరకొండ

"ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకుల గౌరవం పొందుతుందని చిత్రీకరణ జరిగిన ప్రతి రోజూ నాకు అనిపించింది. సినిమా పూర్తయ్యాక చూసుకున్నప్పుడూ అదే అభిప్రాయం కలిగింది" అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కింగ్డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన భరోసాతో విడుదలకు ముందు మేం ఎంతో ప్రశాంతంగా ఉంటున్నాం. అడ్వాన్స్ బుకింగ్స్‌కి లభిస్తున్న ఆదరణ మాకు ఎంతో తృప్తినిస్తోంది. 'జెర్సీ' తీసిన గౌతమ్ తిన్ననూరి సినిమా ఇది. ఇందులోని భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా కుటుంబం కోసమో, పుట్టిన నేల కోసమో, ప్రేమకోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో సాగే చిత్రమిది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు ఈ కథా ప్రపంచంలోకి అడుగు పెడతారు. థియేటర్‌కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని పంచుతుంది" అన్నారు. ఒక ప్రశ్నకి బదులిస్తూ... ఎవరో నాపై కోపంగా ఉన్నారని వాళ్లపై దృష్టిపెట్టే సమయం నాకు లేదని, ఇప్పుడు నా దృష్టంతా ప్రేమమీదే ఉందన్నారు. ఎవరికోసమో తాను మారనని, మనసులో ఉన్నదే బయట మాట్లాడుతుంటానన్న విజయ్ దేవరకొండ... కెరీర్ ప్రారంభంలో నేను దూకుడుగా ఉన్నానంటే కారణం అప్పుడున్న పరిస్థితులే అని, అభిమానుల ప్రేమ కారణంగా ఇప్పుడు మరింత ప్రశాంతంగా మారిపోయానని చెప్పుకొచ్చారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "గ్యాంగ్‌స్టర్ డ్రామా కథల్లో ఓ మంచి సినిమాగా 'కింగ్డమ్' నిలుస్తుంది. ప్రేక్షకులు మెచ్చే అన్ని రకాల అంశాలతో, ఎక్కువభాగం రియల్ లొకేషన్లలో చిత్రీకరణ చేశాం. మా బృందం పడిన కష్టం తెరపై కనిపిస్తుంది. గౌతమ్ తిన్ననూరి శైలి భావోద్వేగాలతో, యాక్షన్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఈమధ్యకాలంలో సినిమాలకి ప్రారంభ వసూళ్లు రాబట్టడం పెద్ద సవాల్‌గా మారింది. ఆ విషయంలో మేం ఇప్పటికే విజయం సాధించాం. మా సినిమాకి అడ్వాన్స్ బుకింగ్స్ చాలా బాగున్నాయి" అన్నారు. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ "ఇదివరకటి సినిమాలో గ్లామర్‌గా కనిపించాను. ఇందులో పక్కింటి అమ్మాయి తరహాలో కనిపిస్తూనే, నటన ప్రదర్శించే అవకాశం కూడా దక్కింది. గౌతమ్ తిన్ననూరి తనదైన ముద్రతో నా పాత్రని మలిచారు. విజయ్ దేవరకొండతో కలిసి నటించడం సంతోషంగా ఉంది" అన్నారు.

పవన్‌కల్యాణ్‌ని కలిసిన 'కింగ్డమ్' బృందం

అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశానికి వస్తూ.. . అక్కడే చిత్రీకరణ చేసుకుంటోన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' సెట్‌కి వెళ్లింది 'కింగ్డమ్' బృందం. సెట్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, కథానాయకుడు పవన్‌కల్యాణ్‌ని కలిశారు నాయకానాయికలు విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే, నిర్మాత సూర్యదేవర నాగవంశీ. 'కింగ్డమ్' బృందానికి శుభాభినందనలు తెలియజేశారు పవన్‌కల్యాణ్. ఈ సెట్లో శ్రీలీల కూడా చిత్రీకరణలో పాల్గొంది.

పరోటాల కోసం రెండు నెలల కోర్స్ చేశా!

– విజయ్ సేతుపతి


నిత్యా మేనన్, సెల్వీ త్యాగరాజన్, నందినీ రెడ్డి, విజయ్ సేతుపతి

"ప్రతి పాత్రనీ ఆస్వాదిస్తూ చేయడం నా అలవాటు" అంటున్నారు విజయ్ సేతుపతి. చూసిన ప్రతి ఒక్కరూ ఇది తమ కథే అనుకునేలా 'సార్ మేడమ్' ఉంటుందని చెప్పారు. ఆయన కథానాయకుడిగా సత్యజ్యోతి ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కిన చిత్రమిది. పాండిరాజ్ దర్శకత్వం వహించారు. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలు. తమిళంలో 'తలైవన్ తలైవి' పేరుతో విడుదలైన ఈ సినిమా ఆగస్టు 1న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు విజయ్ సేతుపతి మాట్లాడుతూ "తమిళంలో పెద్ద విజయాన్ని అందుకున్న సినిమా ఇది. తెలుగు ప్రేక్షకుల్నీ అదే స్థాయిలో మెప్పిస్తుంది. అందరి కథ ఇది. ఈ సినిమా కోసం పరోటా చేయడం నేర్చుకున్నా. అందుకోసం రెండు నెలల కోర్స్ కూడా చేశా (నవ్వుతూ). నటుడిగా నాకొక గొప్ప అనుభవం ఈ సినిమా. దర్శకుడు కథని రాసిన విధానం, సినిమా తీసిన విధానం చాలా బాగుంది. ఒక కుటుంబ వాతావరణం మధ్య చిత్రీకరణ సాగింది. సినిమా కూడా అలాగే ఉంటుంది" అన్నారు. నిత్యామేనన్ మాట్లాడుతూ "తెలుగులో సినిమా చేసి చాలా రోజులైంది. అందుకే ఈ సినిమాకి తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పా. విజయ్ సేతుపతి, నేను కలిసి గతంలో ఒక సినిమా చేశాం. అదొక విభిన్నమైన సినిమా. అందులో సైలెన్స్ ఎక్కువగా ఉంటుంది, ఇందులోనేమో వైలెన్స్ ఉంటుంది. దర్శకుడు పాండిరాజ్ చెప్పిన ఈ కథ వినగానే చేయడానికి అంగీకారం తెలిపా. ఒక కుటుంబం లాంటి సినిమా ఇది. తమిళంలోలాగే తెలుగులోనూ ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుంది" అన్నారు. దర్శకుడు పాండిరాజ్ మాట్లాడుతూ "భార్యాభర్తల మధ్య జరిగే ఓ అందమైన కథ ఇది. ప్రేమ, హాస్యం, యాక్షన్, భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా ఉంటుంది" అన్నారు. దర్శకురాలు నందినిరెడ్డి మాట్లాడుతూ "ఇప్పటికే ఈ సినిమాని చూసిన ప్రేక్షకుల్లో ఒకరిగా నేను వచ్చా. ఒక మంచి ఇంటి భోజనంలాంటి సినిమా ఇది. ఇలాంటి కథలు అరుదుగా వస్తాయి. ఈమధ్య కాలంలో నేను చూసిన హృదయాన్ని హత్తుకునే ఓ అందమైన సినిమా ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు సుకుమార్, గీత రచయిత రాంబాబు గోసాల, ఎన్.వి.ఆర్ సినిమాస్ సురేశ్, నిర్మాత త్యాగరాజన్, సెల్వీ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డను బతికించుకోవడానికి దొంగగా మారిన ఓ తల్లి



సిరీస్: 'మార్క్డ్'
నటీనటులు: లెరాటో మ్వెలేస్, జబులాని మ్థెంబు
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్

రెడీ ఇన్ ఓటీటీ

కథాంశం: తల్లి తన బిడ్డ కోసం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. అలాంటిది తన కుమార్తె ప్రాణమే ప్రమాదంలో ఉందని తెలిస్తే ..ఆమెని కాపాడుకోవడానికి తన ప్రాణాన్ని కూడా లెక్కచేయదు. అలాంటి ఓ తల్లి బబల్వా (లెరాటో మ్వెలేస్). ఈమె ఒక సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. అనుకోకుండా ఓ రోజు తన కుమార్తెకు ప్రాణాంతకమైన అనారోగ్య సమస్య ఉందని తెలుస్తుంది. అది నయం కావాలంటే వైద్య ఖర్చులకు చాలా డబ్బు అవసరమవుతుంది. దానికోసం బబల్వా కొంతమందిని ఆర్థిక సహాయం అడుగుతుంది. కానీ ఆమెకు ఎవరూ సహాయం చేయరు. ఈ పరిస్థితులలో తన బిడ్డ జీవితంలోని ప్రతి క్షణం తనకు ఎంతో విలువైనది. కానీ సమయం గడిచిపోతుండడంతో బబల్వా డబ్బు దొరికే దారే లేదని నిర్ణయించుకుంటుంది. దీంతో ఆపరేషన్‌కు కావాల్సిన నిధుల కోసం ఒక వ్యక్తితో కలిసి సాహసోపేతమైన దోపిడీని ప్లాన్ చేస్తుంది. మరి చివరికి తన కుమార్తెని కాపాడుకోగలిగిందా? లేదా? అనేది తెలియాలంటే 'మార్క్డ్' సిరీస్ చూడాల్సిందే. ఈ ఆఫ్రికన్ థ్రిల్లర్ సిరీస్‌ని అకిన్ ఒమోటోసో, మత్సెపో మజా, జోనో హాల్ తెరకెక్కించారు.

మేఘాలయ హనీమూన్ హత్య కేసుపై సినిమా

ఇటీవలే దేశమంతటా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసు నేపథ్యంలో వెండితెరపై ఓ చిత్రం రానుంది. బాలీవుడ్ దర్శకుడు ఎస్పీ నింబావత్ రూపొందించనున్నారు. 'హనీమూన్ ఇన్ షిల్లాంగ్' అనే పేరుతో ఈ సినిమాని తెరకెక్కించనున్నారు. దీనికోసం మృతుడు రాజా రఘువంశీ కుటుంబ సభ్యులు కూడా అంగీకరించారని తెలిపారు. "ఈ హత్య కేసుపై సినిమా తీసేందుకు మేం అంగీకరించాం. మా సోదరుడి మరణం గురించి సినిమా తీస్తే ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు? అనేది ప్రజలు తెలుసుకుంటారు అని మేం విశ్వసిస్తున్నాం" అని మృతుడి సోదరుడు సచిన్ రఘువంశీ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.."భవిష్యత్తులో ఇలాంటి ఘోరాలు ఆగాలనే ఉద్దేశంతో ఈ సినిమా తీసేందుకు సిద్ధమయ్యాం. ఈ సినిమా కేవలం థ్రిల్లర్ మాత్రమే కాదు, సామాజిక సందేశం"గా రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా చర్చను లేవనెత్తిన అంశం చుట్టూ..!


రేఖ నిరోషా, ధనుష్ రఘుముద్రి

ఒక మంచి సందేశం ఉన్న కథతో అందరికీ కనెక్ట్ అయ్యేలా రూపొందిన సినిమానే మా 'థాంక్యూ డియర్' అన్నారు శ్రీకాంత్ తోట. ఆయన దర్శకత్వంలో ధనుష్ రఘుముద్రి కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. హెబ్బా పటేల్, రేఖ నిరోషా కథానాయికలు. పప్పు బాలాజీరెడ్డి నిర్మాత. ఈ చిత్రం ఆగస్టు 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విడుదలకి ముందస్తు వేడుకని నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "కుటుంబమంతా కలిసి చూసే వాణిజ్య ప్రధానమైన చిత్రమిది. ప్రపంచవ్యాప్తంగా చర్చని లేవనెత్తిన ఓ కీలకమైన అంశం చుట్టూ ఈ సినిమాని మలిచాం. ఇందులో కథలాగే, కథనం కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఇప్పటికే ఈ సినిమాకి ఎన్నో పురస్కారాలు వచ్చాయి. ప్రేక్షకుల ఆదరణ కూడా సొంతం చేసుకుంటుంది" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "మా అందరికీ ఎంతో ప్రత్యేకమైన సినిమా ఇది. హాస్యంతోపాటు, థ్రిల్లింగ్ అంశాలు ఇందులో ఆకట్టుకుంటాయి" అన్నారు. అందరి సహకారంతో ఓ కొత్త రకమైన సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు నిర్మాత. ఈ కార్యక్రమంలో లైన్ ప్రొడ్యూసర్ పునీత్, సంగీత దర్శకుడు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


'సారే జహా సే అచ్ఛా'

ఇండియా ఎప్పుడూ ఒక అడుగు ముందే!

'చెస్‌ని భారతదేశంలో కనుగొన్నారు. ఇండియా ఎల్లప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుంది" అంటూ ఆసక్తికరంగా విడుదలైంది 'సారే జహా సే అచ్ఛా' టీజర్. ప్రతీక్ గాంధీ, సన్నీ హిందూజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కి సుమిత్ పురోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ ఆగస్టు 13 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో టీజర్‌ను బుధవారం విడుదల చేసింది సిరీస్ బృందం. భారత నిఘా విభాగమైన రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా), పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)ల మధ్య సాగే సన్నివేశాలే కీలకంగా ఉన్న ఈ టీజర్ సిరీస్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

బాల్యాన్ని గుర్తుచేసే భావోద్వేగాల కథ



సినిమా: 'కురంగు పెడల్'
జానర్: ఫ్యామిలీ డ్రామా కామెడీ
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో

బ్రో.. ఓ లుక్కేయొచ్చు!

చిన్నప్పుడు స్కూల్ అయిపోయాక వేసవి సెలవులు ఇస్తే అమ్మమ్మ ఇంటికి లేదా ఎవరైనా బంధువుల ఇంటికి వెళ్లేవాళ్లం. అవేవి కుదరకపోతే అమ్మనాన్న వెంట సరదాగా పొలాలు చూడటానికి వెళుతుంటాం. ఊహతెలియని వయసులో మనందరి వేసవి ట్రిప్‌లంటే ఇవే. ఇలానే 1980లో కొందరు పిల్లలు వేసవి సెలవులు ఇవ్వగానే అందరిలానే సరదాగా గడపాలనుకుంటారు. అప్పుడు వారికి సైకిల్ నేర్చుకోవాలనిపిస్తుంది. కానీ ఎవరి దగ్గర సైకిల్ ఉండదు. దాని కోసం అందరూ తలోకొంత డబ్బులు వేసుకొని సైకిల్ అద్దెకు తీసుకుందాం అనుకుంటారు. ఆ పిల్లల్లో ఒకడి దగ్గర చిల్లిగవ్వ కూడా ఉండదు. దాంతో వాడిని అందరూ పక్కనపెట్టేస్తారు. ఆ సంఘటన ఆ చిన్నారి జీవితంలో ఎన్నో భావోద్వేగాలకు కారణం అవుతుంది. అలాంటి ఎన్నో బాల్య జ్ఞాపకాలతో సాగుతుంది 'కురంగు పెడల్' చిత్రం.

కథాంశం: ఇది 1980ల నేపథ్యంలో సాగే కథ. వేసవి సెలవులు ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్న కొంతమంది పిల్లలతో ఈ సినిమా ప్రారంభమవుతుంది. వారిలో ఒకడు మరియప్పన్(సంతోష్ వెల్ మురుగన్). మరియప్పన్ ఐదవ తరగతి పూర్తవగానే వేసవి సెలవులు వస్తాయి. ఎప్పటిలాగే వాళ్ల అక్కవాళ్లింటికీ వెళ్లడానికి సిద్ధమవుతాడు. కానీ తన స్నేహితులు ఊరిలోనే ఉండు మనం కలిసి సరదాగా ఆడుకుందాం అంటారు. వాళ్ల మాటలు విని మరియప్పన్ ఊళ్లోనే ఉంటాడు. సరదాగా చిలిపి అల్లర్లు, ఆటలతో సాగే వారి సెలవుల్లో ఓ రోజు సైకిల్ నేర్చుకోవాలనే ఆలోచన వస్తుంది. దాని కోసం ఓ సైకిల్‌ని అద్దెకు తీసుకోవాలని నిర్ణయించుకుంటారు. కానీ మరియప్పన్‌కి అద్దెకు అవసరమయ్యే డబ్బులు ఇంట్లో ఇవ్వరు. తన దగ్గర డబ్బులు లేకపోవడంతో స్నేహితులు అద్దె సైకిల్ నేర్చుకోవడానికి చేర్చుకోరు. బంధాన్ని మర్చిపోయారనే బాధతో మరియప్పన్ తన స్నేహితులతో వాళ్లకంటే ముందే సైకిల్ నేర్చుకుని తొక్కుతానని శపథం చేస్తాడు. మరి మరియప్పన్ సైకిల్ ఎలా అద్దెకు తీసుకున్నాడు? సైకిల్ నేర్చుకున్నాడా? లేదా వాళ్ల నాన్న లాగే సైకిల్ నేర్చుకోకుండా అలానే ఉండిపోయాడా? తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

● చిన్న పిల్లలతో భావోద్వేగాలను రేకెత్తించే చిత్రాలు చాలా అరుదుగా ఉంటాయి. ఈ సినిమాలోని ప్రధాన తారాగణమంతా ఆ చిన్నపిల్లలే. ఈ పిల్లలు తమ నటనతో ప్రేక్షకులందరికి తమ బాల్యాన్ని, అప్పటి రోజుల్లో సైకిల్ నేర్చుకోవడానికి పడిన తిప్పల్ని తప్పకుండా గుర్తుచేస్తారు. బాల్యంలో చిన్నారుల అమాయకత్వం, వారి ఆలోచనలను బాగా చూపించారు. మరియప్పన్ తండ్రికి తెలీకుండా సైకిల్ తీసుకుని ఒంటరిగా కష్టపడి పట్టుదలతో దానిని నేర్చుకునే సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. ఆ సైకిల్ మనమే నేర్చుకుంటున్నామా అనేంతగా మనం ఆ పాత్రలో మునిగిపోతాం. తండ్రికి సైకిల్ రాదని ఊరిలో అందరూ అనే మాటలు మరియప్పన్‌ని ఎంత బాధించాయో దర్శకుడు బాగా చూపించారు. అలానే అద్దెకు తీసుకున్న సైకిల్ వల్ల షాప్ దగ్గర ఉన్న అప్పుని తీర్చడానికి తన తండ్రి ఇబ్బంది పడకూడదనే మరియప్పన్ ఆలోచన నిజంగా మెచ్చుకోదగ్గ అంశమే. చిన్న వయసులోనే తండ్రి గురించి అంత గొప్పగా ఆలోచిస్తూనే..తన సరదాలను ఏ మాత్రం వదలకుండా, తిరిగి స్నేహితులతో కలిసిపోయే మరియప్పన్ కథేంటో మీరూ చూసేయండి. ఈ సినిమాకి కమల కన్నన్ దర్శకత్వం వహించగా, తమిళ నటుడు శివకార్తికేయన్ నిర్మించారు.



30 బి.డాలర్ల ప్రభావం

● ఇండోనేషియా, వియత్నాం కంటే మనపై అధిక పన్ను భారం

● రొయ్య, జౌళి, రత్నాభరణాల పరిశ్రమలపై ఎక్కువ ప్రభావం

● ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులూ భారమవుతాయ్



దిల్లీ: భారత్ నుంచి తమదేశంలోకి వచ్చే ఉత్పత్తులపై ఆగస్టు 1 నుంచి 25% టారిఫ్‌తో పాటు అదనపు పెనాల్టీ విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించడం వల్ల మన ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. ఈ నిర్ణయం వల్ల భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)పై 0.2-0.5% లేదా 30 బిలియన్ డాలర్ల (రూ.2.60 లక్షల కోట్ల) కు పైగా ప్రభావం పడుతుందని అంచనా. ఉక్కు, అల్యూమినియం, వాహన - విడిభాగాలు, రొయ్య, జౌళి, రత్నాభరణాలు, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్లు, కొన్ని ఆహారోత్పత్తుల ఎగుమతులపై ప్రభావం కనిపించొచ్చని చెబుతున్నారు.

అనిశ్చితే ఇంకా: రష్యా నుంచి మనదేశం మిలటరీ సామగ్రి, ముడి చమురు కొంటున్నందునే, టారిఫ్‌కు అదనంగా పెనాల్టీ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో కంపెనీల్లో అనిశ్చితి నెలకొందని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య ఫియో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. 'అమెరికాతో విస్తృత స్థాయి వాణిజ్య ఒప్పందం కుదిరాకే ప్రస్తుత అనిశ్చితి తొలగి స్థిరత్వం వస్తుంద'ని ఆయన అంచనా వేశారు.

ఫిక్కీ: ఇండోనేషియాపై 20%, వియత్నాంపై 19% టారిఫ్‌లే ఉన్నందున మన ఎగుమతులకు పోటీపరంగా ప్రతికూలతలు ఎదురుకావొచ్చని ఫిక్కీ అధ్యక్షుడు హర్షవర్ధన్ అగర్వాల్ పేర్కొన్నారు.

కళ తగ్గనున్న ఆభరణాలు: అమెరికాకు 10 బిలియన్ డాలర్ల వరకు రత్నాభరణాల ఎగుమతి జరుగుతోంది. ఇవి తగ్గొచ్చు.

అయ్యో.. రొయ్య: అమెరికా నిర్ణయం వల్ల భారత సముద్ర ఆహార ఉత్పత్తులు.. ముఖ్యంగా రొయ్య ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుందని వ్యవసాయ ఆర్థికవేత్త అశోక్ గులాటి అభిప్రాయపడ్డారు. 10-15% టారిఫ్ ఉంటుందని భావిస్తే, అంతకు మించి విధించడం దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు.

జౌళి పరిశ్రమపైనా టారిఫ్ ప్రభావం పడనుంది. భారత్-బ్రిటన్ వాణిజ్య ఒప్పందంతో కలిగిన భారీ ప్రయోజనాలన్నీ అమెరికా నిర్ణయంతో కొట్టుకుపోయినట్లయిందని అశోక్ అన్నారు.

తీవ్ర ప్రభావం ఉండదు: భారత వస్తువులపై టారిఫ్ ప్రభావం తీవ్రంగా ఉండేలా కనిపిస్తోంది కానీ, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాలతో పోలిస్తే పెద్ద ప్రభావం ఉండదని మేథో సంపత్తి సంస్థ జీటీఆర్ఐ పేర్కొంది. 'బ్రిటన్, ఈయూ, జపాన్, ఇండోనేషియా, వియత్నాంలకు తక్కువ టారిఫ్ ఉన్నా, అవి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై సున్నా సుంకాన్ని అందిస్తున్నాయి. భారత్ అటువంటిదేమీ చేయలేద'ని గుర్తు చేసింది.

ఔషధాలపై అస్పష్టతే: 'ఔషధాల పై టారిఫ్ ఎంతో తెలియదు. మన ఫార్మా ఎగుమతుల్లో 30 శాతం అమెరికాకే వెళుతున్నాయి.

మనకంటే ఎక్కువ పన్ను (%)

దేశం	%
బ్రెజిల్	50
లావోస్	40
మయన్మార్	40
థాయ్‌లాండ్	36
కంబోడియా	36
బంగ్లాదేశ్	35
సెర్బియా	35
కెనడా	35
దక్షిణాఫ్రికా	30
బోస్నియా	30
శ్రీలంక	30
లిబియా	30
అల్జీరియా	30
ఇరాక్	30
మెక్సికో	30
భారత్	25+

అమెరికాకు ఎగుమతుల తీరు ఇలా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఈ సమయంలో అమెరికాకు మన ఎగుమతులు 22.18% పెరిగి 25.51 బి. డాలర్లకు చేరాయి. ఇక దిగుమతులు సైతం 11.68% వృద్ధి చెంది 12.86 బి. డాలర్లుగా ఉన్నాయి.

2024లో అమెరికాకు ప్రధాన ఎగుమతులు

ఉత్పత్తి	ఎగుమతి(బి. డాలర్లలో)
ఔషధ ఫార్ములేషన్లు	8.1
టెలికాం సామగ్రి	6.5
విలువైన, పాక్షిక విలువైన రత్నాలు	5.3
పెట్రోలియం ఉత్పత్తులు	4.1
వాహన, వాహన విడిభాగాలు	2.8
పసిడి, ఇతర ఆభరణాలు	3.2
రెడీమేడ్ దుస్తులు	2.8
ఇనుము, ఉక్కు	2.7

టాటా మోటార్స్ చేతికి ఇటలీ ట్రక్కుల కంపెనీ ఇవెకో



రూ.38,240 కోట్లకు కొనుగోలు ఒప్పందం

దిల్లీ: ఇటలీకి చెందిన ట్రక్కుల తయారీ సంస్థ ఇవెకోను టాటా మోటార్స్ కొనుగోలు చేస్తోంది. లావాదేవీ విలువ సుమారు రూ.38,240 కోట్లు (3.8 బిలియన్ యూరోలు). 'ఇవెకో' గ్రూప్‌లో 100% (27,12,15,400) సాధారణ షేర్లను నగదు వాలంటరీ టెండర్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేసేందుకు కంపెనీ బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఒక్కో షేరుకు 14.1 యూరోల చొప్పున, మొత్తం కొనుగోలు విలువ సుమారు 3.8 బిలియన్ యూరోలు అవుతుంది. ఇవెకో గ్రూప్‌నకు చెందిన రక్షణ రంగ వ్యాపారం ఈ లావాదేవీ కిందకు రాదు. ఈ లావాదేవీ నియంత్రణ పరమైన అనుమతులు తీసుకోవాల్సి ఉందని టాటా మోటార్స్ తెలిపింది. 'టాటా మోటార్స్ వాణిజ్య వాహన వ్యాపార విభజన ప్రతిపాదన తర్వాత, మేము వేస్తున్న తదుపరి వ్యూహాత్మక అడుగు ఇది. అంతర్జాతీయంగా అసలైన పోటీ ఇచ్చేందుకు టాటా మోటార్స్‌కు ఈ కొనుగోలు దోహదం చేస్తుంద'ని టాటా మోటార్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తెలిపారు. ఇవెకో మొత్తం ఆదాయంలో 74% ఐరోపా నుంచే ఉంటోంది.

రెండో అతిపెద్ద కొనుగోలు..

✦ టాటా గ్రూప్ చేపడుతున్న రెండో అతిపెద్ద కొనుగోలు లావాదేవీ ఇదే. 2007లో 12.9 బిలియన్ డాలర్లతో (సుమారు రూ.1,10,000 కోట్లు) అంతర్జాతీయ ఉక్కు తయారీ సంస్థ కోరస్‌ను టాటా గ్రూప్ కొనుగోలు చేసింది.

✦ వాహన విభాగం వరకు చూస్తే.. టాటా గ్రూప్‌నకు ఇదే అతిపెద్ద కొనుగోలు లావాదేవీ. 2008లో 2.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.20,000 కోట్లు)తో జాగ్వార్ లాండ్ రోవర్ కొనుగోలే ఇప్పటివరకు అతిపెద్ద లావాదేవీగా ఉంది.

టాటా మోటార్స్ షేరుకు నష్టాలు..: ఇవెకోలో వాటా కొనుగోలు చేయనుందనే వార్తల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యింది. బీఎస్ఈలో షేరు 3.47% నష్టపోయి రూ.668.40 వద్ద ముగిసింది.

కళ్లతో చెల్లింపులు చేయొచ్చు

● పిన్ అవసరం లేదు ● ఎన్‌పీసీఐ యోచన



ముంబయి: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల కోసం తప్పనిసరిగా 4 లేదా 6 అంకెల పిన్ నమోదు చేస్తున్నాం. పిన్ నంబరు తెలిస్తే ఎవరైనా వినియోగించే వీలున్నందున, ఆ విధానంలో కొన్ని మోసాలు జరుగుతున్నాయి. అందువల్ల లావాదేవీ పూర్తి చేసేందుకు పిన్‌తో పాటు ముఖ గుర్తింపు (ఫేస్ ఐడీ), వేలి ముద్రలు (బయో మెట్రిక్స్), ఐరిస్ (కనుపాప) స్కానింగ్ ఆప్షన్లూ తీసుకురావాలని ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఆలోచిస్తోంది. దీనివల్ల లావాదేవీలో వేగం పెరగడంతో పాటు, మరింత సురక్షితంగా ఉంటాయని భావిస్తోంది. పిన్, ఫేస్ ఐడీ, బయో మెట్రిక్స్.. వీటిలో ఏది ఎంచుకోవాలన్నది వినియోగదారుని ఇష్టం. పిన్‌కు బదులు ఇతర మార్గాలను ఉపయోగించడం ద్వారా ఆర్థిక మోసాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పిన్ నంబరును గుర్తుపెట్టుకోవాల్సిన అవసరాన్ని ఇది తొలగిస్తుంది. వృద్ధులు, గ్రామీణులు, డిజిటల్ నైపుణ్యం లేని వారూ ఎంతో సులభంగా లావాదేవీలను పూర్తి చేసేందుకు నూతన విధానం వీలు కల్పిస్తుంది. ఈ మార్పు సమర్థంగా అమలు కావాలంటే, సమాచార భద్రతపై మరింత దృష్టి సారించాలి.

దేశీయంగా నంబర్ 1.. అంతర్జాతీయంగా 88

22వ ఏడాదీ ఫార్చూన్ గ్లోబల్ 500లో ఆర్ఐఎల్‌కు చోటు

దిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఈ ఏడాది ఫార్చూన్ గ్లోబల్-500 జాబితాలో అత్యుత్తమ భారతీయ కంపెనీగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అంతర్జాతీయంగా చూస్తే 88వ ర్యాంకును పొందింది. 2024లోని 86వ ర్యాంకుతో పోలిస్తే కాస్త కిందకొచ్చింది. గత నాలుగేళ్లలో ఈ సంస్థ 67 స్థానాలను మెరుగుపరచుకుంది. 2021లో రిలయన్స్ స్థానం 155గా ఉంది.

✦ అమెరికా రిటెయిల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఈ జాబితా అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానంలో అమెజాన్ నిలిచింది.

✦ టాప్-10లో మూడు కంపెనీలు.. స్టేట్ గ్రిడ్(3), చైనా నేషనల్ పెట్రోల్(5), సినోపెక్ గ్రూప్(6) చైనా దేశానివే కావడం విశేషం. సౌదీ ఆరామ్‌కో నాలుగో స్థానంలో, ఐఫోన్ల సంస్థ యాపిల్ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి.

భారత్ నుంచి 9 కంపెనీలు: జాబితాలో ఈ ఏడాది భారత్ నుంచి 9 కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. అందులో 5 ప్రభుత్వ, 4 ప్రైవేటు రంగ కంపెనీలున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫార్చూన్ గ్లోబల్ 500 జాబితాలో చోటు చేసుకోవడం ఇది 22వ సంవత్సరం కావడం విశేషం.

జాబితాలో భారతీయ కంపెనీలు

కంపెనీ	ర్యాంకు (గతేడాదితో పోలిస్తే మార్పు)
రిలయన్స్	88 (−2)
ఎల్ఐసీ	95(0)
ఐఓసీ	127(−11)
ఎస్‌బీఐ	163(+15)
ఓఎన్‌జీసీ	181(−1)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	258(+48)
టాటా మోటార్స్	283(−12)
బీపీసీఎల్	285(−27)
ఐసీఐసీఐ బ్యాంక్	464(0)

ఈనాడు బిజినెస్

పన్ను ఆడిట్‌లు ఏడాదికి 60

నిబంధనలను విడుదల చేసిన ఐసీఏఐ

దిల్లీ: వ్యక్తిగత చార్టర్డ్ అకౌంటెంట్ ఒక సంవత్సరంలో చేయాల్సిన పన్ను ఆడిట్‌ల సంఖ్యను 60కి పరిమితం చేస్తూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కొత్త నిబంధనలను జారీ చేసింది. దీనివల్ల నియంత్రణ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, ఆడిటింగ్ పనిపై దృష్టి సారించేందుకు వీలవుతుందని ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందా బుధవారం తెలిపారు. నాలుగు లక్షల మందికి పైగా సభ్యులున్న ఐసీఏఐ వ్యక్తిగత ఆడిట్‌ల సంఖ్యను పరిమితం చేస్తూ తీసుకొచ్చిన నిబంధనలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో చరణ్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ.. ఈ 60 అనేది.. ఒక సభ్యుడు తన వ్యక్తిగత సామర్థ్యంలో, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సంస్థల్లో భాగస్వామిగా చేసిన అన్ని పన్ను ఆడిట్‌లకు పరిమితం అని పేర్కొన్నారు. ఆడిట్ అనేది చార్టర్డ్ అకౌంటెంట్ల బలం అన్నారు.

'నైసార్' ఉపగ్రహ ప్రయోగంలో అనంత్ టెక్నాలజీస్ కీలకపాత్ర

ఈనాడు, హైదరాబాద్: నైసార్ ఉపగ్రహ ప్రయోగం ఇస్రో, నాసా మధ్య బలపడుతున్న బంధానికి చిహ్నమని అనంత్ టెక్నాలజీస్ సీఎండీ సుబ్బారావు పావులూరి పేర్కొన్నారు. ఎల్- బ్యాండ్, ఎస్- బ్యాండ్‌లలో పనిచేసే మైక్రోవేవ్ ఇమేజింగ్ సేవల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. భూమికి దాదాపు 743 కిలోమీటర్ల దూరంలో పోలార్ ఆర్బిట్ సమీపానికి చేరుకునే ఈ ఉపగ్రహం, 12 రోజులకోసారి భూమిని ఆసాంతం పరిశీలిస్తుంది. ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షానికి మోసుకెళ్లే జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 రాకెట్ అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, వివిధ సబ్-అసెంబ్లీలను టెస్ట్ చేయడంలో తమ సంస్థ భాగస్వామి అని తెలిపారు. ఇంటర్‌ఫేస్ యూనిట్, పవర్ మాడ్యూల్స్, డేటా సిస్టమ్స్, టెలిమెట్రీ ట్రాన్స్‌మిటర్స్.. వంటి 14 రకాల ముఖ్యమైన సబ్‌సిస్టమ్స్‌ను అందించామని, ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్ బాధ్యత చేపట్టామని వివరించారు. నైసార్ ఉపగ్రహానికి అవసరమైన 9 సబ్ సిస్టమ్స్.. కంట్రోల్ సిస్టమ్, పవర్ సిస్టమ్, డ్యూయల్ గింబాల్ యాంటెన్నా, మెయిన్‌ఫ్రేమ్ - పేలోడ్ కన్వర్టర్స్, మార్క్-3 స్టార్ సెన్సర్స్ ప్యాకేజ్‌ను అనంత్ టెక్నాలజీస్ యూనిట్లలో తయారు చేసింది.

అస్త్ర మైక్రోవేవ్ ప్రొడక్ట్స్: 'నైసార్' ఉపగ్రహానికి ఎస్-బ్యాండ్ ఆర్ఎఫ్ మాడ్యూల్స్ సరఫరా చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన అస్త్ర మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ వెల్లడించింది. ఎస్- బ్యాండ్ ఎస్ఏఆర్‌కు అవసరమైన టీఆర్ మాడ్యూల్స్, టీటీసీ ట్రాన్స్‌పాండర్స్ తయారు చేసి అందించినట్లు వివరించింది.

అమెరికాలో రేట్లు యథాతథం

వడ్డీరేట్లు తగ్గించాలన్న అమెరికా దేశాధ్యక్షుడి మాటలను ఫెడరల్ రిజర్వ్ పెడచెవిన పెట్టింది. వరుసగా అయిదో సమావేశంలోనూ కీలక రేట్లను యథాతథంగా ఉంచుతున్నట్లు బుధవారం ప్రకటించింది. ట్రంప్ ఆర్థిక ప్రణాళికల ప్రభావం, ఎలా ఉంటుందో గమనించాలనే భావిస్తోంది. గరిష్ఠ ఉపాధి, దీర్ఘకాలంలో 2% వద్దే ద్రవ్యోల్బణం కొనసాగాలనే దృక్పథంతోనే ఫెడ్ తన కీలక రేటును 4.25-4.50% శ్రేణిలో కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో అమెరికా వృద్ధిరేటు అంచనా కంటే మెరుగ్గా 3 శాతంగా నమోదైనందున, ఫెడ్ రేట్ల కోత విధిస్తుందనే ఆశాభావాన్ని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశాక, ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెరికా జీడీపీ జనవరి-మార్చిలో 0.5% క్షీణించింది.

కోడి గుడ్లు



31న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

ప్రాంతం	ధర
హైదరాబాద్	410
వరంగల్	412
విజయవాడ	475
గోదావరి	455
విశాఖపట్నం	455
చిత్తూరు	483

జీనోమ్ వ్యాలీలో ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ నూతన ప్రాంగణం

ఈనాడు, హైదరాబాద్: జీవ శాస్త్రాల రంగానికి చెందిన పరిశ్రమలకు సేవలు అందించే ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ అనే సంస్థ, హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో '1జీవీ' పేరుతో కొత్త ప్రాంగణాన్ని ప్రారంభించింది. దీనికి ప్రపంచ బ్యాంకు గ్రూపు సంస్థ, ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) నుంచి 'ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్' లభించినట్లు ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ వెల్లడించింది. జీవ శాస్త్రాల కంపెనీలు ఈ ప్రాంగణంలో పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టడానికి అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపింది. ఈ సంస్థ నవీ ముంబయి, బెంగళూరుల్లోనూ ఇలాంటి ప్రాంగణాలు నిర్మిస్తోంది.

48% తగ్గిన పీఎన్‌బీ లాభం

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), జూన్ త్రైమాసికానికి రూ.1675 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,252 కోట్ల కంటే ఇది 48% తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.32,166 కోట్ల నుంచి రూ.37,232 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయమే రూ.28,556 కోట్ల నుంచి రూ.31,964 కోట్లకు వృద్ధి చెందింది. నిర్వహణ లాభం రూ.6581 కోట్ల నుంచి రూ.7081 కోట్లకు చేరింది. పన్ను వ్యయాలు రూ.2017 కోట్ల నుంచి రూ.5083 కోట్లకు పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.98% నుంచి 3.78 శాతానికి; నికర ఎన్‌పీఏలు 0.60% నుంచి 0.38 శాతానికి మెరుగయ్యాయి. కేటాయింపులు కూడా రూ.1312 కోట్ల నుంచి రూ.323 కోట్లకు దిగివచ్చాయి.

ప్రసూతి సెలవుల తర్వాత ఏడాది పాటు ఇంటి నుంచే పని

మహిళా ఉద్యోగులకు స్విగ్గీ మరిన్ని సదుపాయాలు

దిల్లీ: ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని ఆహార పదార్థాలను సరఫరా చేసే సంస్థ స్విగ్గీ... తమ ఉద్యోగులకు సంబంధించి తల్లిదండ్రుల సంరక్షణ విధానంలో మార్పులు చేసింది. 'మామ్'ఎంటెమ్ 2.0 పేరుతో మరిన్ని సదుపాయాలను తన మహిళా ఉద్యోగులకు అందిస్తోంది. 26 వారాల ప్రసూతి సెలవుల అనంతరం ఏడాది పాటు ఇంటి వద్ద నుంచే పని చేసే (వర్క్ ఫ్రమ్ హోమ్) అవకాశాన్ని వాళ్లకు కల్పిస్తోంది. ఇంటి నుంచి పనిచేస్తూనే, తమ వీలును బట్టి నైష్పత్తిక వేతనం కింద పార్ట్ టైం విధులను కూడా వాళ్లు ఎంచుకోవచ్చు. పిల్లలు మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టే వరకు జెండర్- న్యూట్రల్ బాండింగ్ లీవ్ కింద ఏడాదిలో 15 రోజుల పాటు సెలవులు తీసుకోవచ్చు. వార్షిక సేవల పొడిగింపునూ పొందొచ్చు. ఈ కొత్త విధానం కింద ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కోసం పాక్షిక ఆర్థిక సహకారం అందివ్వడంతో పాటు ఐవీఎఫ్ చికిత్స సమయంలో మరిన్ని సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
పవర్‌గ్రిడ్	3631	3724	11,444	11,280
బిర్లా కార్పొరేషన్	119.57	32.62	2454.22	2190.37
హిటాచీఎనర్జీఇండియా	131.60	10.42	1529.84	1327.33
కేపీఐటీ టెక్	171.9	204.2	1538.7	1364.6
సీఈఎస్‌సీ	404	388	5285	4918
స్పెన్సర్స్‌రిటెయిల్	(61.6)	(43.43)	415.83	548.32
జైకాశ్‌పవర్	278	349	1631	1779
ప్రొక్టర్‌అండ్‌గ్యాంబుల్	192	81	937	932
జైడస్ వెల్‌నెస్	128	148	861	841
వరుణ్ బెవరేజెస్★	1325	1262	7163	7334

★ రెండో మధ్యంతర డివిడెండ్ రూ.0.50

ఎం అండ్ ఎం లాభం రూ.4,083 కోట్లు



ముంబయి: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.4,083 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,283 కోట్లతో పోలిస్తే ఇది 24% అధికం. కార్యకలాపాల మొత్తం ఆదాయం రూ.37,218 కోట్ల నుంచి రూ.45,529 కోట్లకు చేరింది. వాహన, వ్యవసాయ (ఫార్మ్) వ్యాపారాల లాభాలు 20% పెరిగాయని కంపెనీ తెలిపింది. ఆర్థిక సేవల విభాగంలో నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) 15% పెరిగాయని పేర్కొంది. టెక్ మహీంద్రా ఎబిటా 2.6% పెరిగినట్లు వెల్లడించింది. మహీంద్రా లాజిస్టిక్స్ ఆదాయం 14% అధికమవగా, మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా (ఎంహెచ్ఆర్ఐఎల్) గదుల ఇన్వెంటరీ 10% పెరిగినట్లు వివరించింది. 2026-27 లక్ష్యాల వైపు స్థిరంగా కొనసాగుతున్నామని కంపెనీ ఎండీ అనీశ్ షా వివరించారు.

రెట్టింపునకు పైగా పెరిగిన టాటా స్టీల్ లాభం

దిల్లీ: ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో టాటా స్టీల్ నికర లాభం ఏకీకృత ప్రాతిపదికన రూ.2,007.36 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల లాభం రూ.918.57 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపునకు పైగా అధికం. అయితే మొత్తం ఆదాయం రూ.55,031.30 కోట్ల నుంచి రూ.53,466.79 కోట్లకు పరిమితమైంది. వ్యయాలు కూడా రూ.52,389.06 కోట్ల నుంచి రూ.50,347.01 కోట్లకు తగ్గాయి. కంపెనీ భారత వ్యాపార ఆదాయాలు రూ.32,957.89 కోట్ల నుంచి రూ.31,014.36 కోట్లకు తగ్గాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నా, విధ విపణుల్లో మెరుగైన లాభదాయకత నమోదు చేయగలిగామని టాటా స్టీల్ సీఈఓ, ఎండీ టి.వి.నరేంద్రన్ తెలిపారు. నికరంగా ఉక్కు విక్రయాలపై అధిక లాభాలు రావడం, వ్యయ నియంత్రణ చర్యల వల్లే లాభం రెట్టింపునకు పైగా పెరగడానికి కారణమైందని వెల్లడించారు. ఏడాది వ్యవధిలో ఏకీకృత ప్రాతిపదికన ఉక్కు ఉత్పత్తి 8 మిలియన్ టన్నుల నుంచి 7.33 మిలియన్ టన్నులకు తగ్గింది. 2025 జూన్ 30 నాటికి కంపెనీ నికర రుణం రూ.84,835 కోట్లుగా ఉంది. నగదు, నగదు సమాన నిల్వలు రూ.14,118 కోట్లుగా ఉన్నాయి.

మాస్‌చిప్ టెక్నాలజీస్ ఆదాయం రూ.136 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన సెమీకండక్టర్ సేవల సంస్థ మాస్‌చిప్ టెక్నాలజీస్ జూన్ త్రైమాసికానికి మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.136.16 కోట్ల ఆదాయంపై రూ.10.89 కోట్ల నికరలాభం, ఈపీఎస్ రూ.0.57గా నమోదయ్యాయి. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.81.85 కోట్లు, నికరలాభం రూ.3.98 కోట్లు, ఈపీఎస్ రూ.0.21గా ఉన్నాయి. సిలికాన్ ఇంజనీరింగ్ విభాగంలో ఆదాయాలు, లాభాలు పెరిగినట్లు తెలుస్తోంది.

ఇండిగో లాభంలో 20% క్షీణత



దిల్లీ: దేశంలోనే అతిపెద్ద విమానయాన కంపెనీ ఇండిగో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.2,176.3 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,728.8 కోట్లతో పోలిస్తే ఇది 20% తక్కువ. మొత్తం ఆదాయం రూ.20,248.9 కోట్ల నుంచి 6.4 శాతం వృద్ధితో రూ.21,542.6 కోట్లకు చేరుకుంది. ప్రయాణికులు 12% అధికంగా ప్రయాణించినా, భారత్-పాక్ యుద్ధం వల్ల గగనతల ఆంక్షలు, నిర్వహణపరంగా సవాళ్లు కలిసి సంస్థ లాభాలు తగ్గేందుకు కారణమయ్యాయి. జూన్ చివరకు దేశీయ విమానయాన విపణిలో ఇండిగో వాటా 64.5 శాతంగా ఉంది. 'జూన్ త్రైమాసికంలో పరిశ్రమకు వెలుపల సవాళ్లు ఏర్పడి, మొత్తం రంగంపైనే ప్రభావం పడింది. అయినా రూ.2,173 కోట్ల లాభం, 11% నికర లాభాల మార్జిన్ సాధించాం. 3.1 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించామ'ని కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. సంస్థ వద్ద మొత్తం 416 విమానాలున్నాయని తెలిపారు.

రెండో రోజూ సూచీలు ముందుకే

సెన్సెక్స్ ▲ 144 **81482** | **నిఫ్టీ** ▲ 34 **24855**

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.850 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,829 కోట్లు



సమీక్ష

మదుపర్ల కొనుగోళ్లతో వరుసగా రెండో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, విదేశీ మదుపర్ల అమ్మకాలతో లాభాలు పరిమితమయ్యాయి. ఆకర్షణీయ ఫలితాలతో ఎల్ అండ్ టీ షేరు పరుగులు తీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 89 పైసలు తగ్గి జీవనకాల కనిష్ఠమైన 87.80 వద్ద ముగిసింది. రూపాయికిది మూడేళ్లలోనే అతిపెద్ద ఒకరోజు నష్టం. బ్యారెల్ ముడిచమురు 0.44% నష్టంతో 72.19 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.85,000 కోట్లు పెరిగి రూ.452.29 లక్షల కోట్లు (5.18 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 258 పాయింట్ల (క్రితం ముగింపు 81,337.95) లాభంతో 81,594.52 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 81,187.06 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ, అనంతరం కొనుగోళ్లతో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 81,618.96 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరకు 143.91 పాయింట్ల లాభంతో 81,481.86 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.95 పాయింట్లు పెరిగి 24,855.05 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,771.95-24,902.30 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 రాణించాయి. సన్‌ఫార్మా 1.41%, ఎన్‌టీపీసీ 1.26%, మారుతీ 1.19%, భారతీ ఎయిర్‌టెల్ 0.87%, ట్రెంట్ 0.83% లాభపడ్డాయి. టాటా మోటార్స్ 3.47%, పవర్‌గ్రిడ్ 1.38%, ఎటెర్నల్ 0.93%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.73% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. పరిశ్రమలు 1.31%, టెక్ 0.35%, ఫోకస్డ్ ఐటీ 0.31%, యంత్ర పరికరాలు 0.27% మెరిశాయి. స్థిరాస్తి, సేవలు, లోహ, వినియోగ నీరసపడ్డాయి. బీఎస్ఈలో 2030 షేర్లు లాభపడగా, 1968 స్క్రిప్‌లు నష్టపోయాయి. 160 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ త్రైమాసిక లాభం 30% పెరగడంతో ఎల్ అండ్ టీ షేరు 4.87% దూసుకెళ్లి రూ.3,665.10 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,387.99 కోట్లు పెరిగి రూ.5.04 లక్షల కోట్లకు చేరింది.

✦ త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపరచడంతో పీఎన్‌బీ షేరు 1.10% తగ్గి రూ.108.10 వద్ద ముగిసింది.

✦ సామాజిక మాధ్యమాలను ఉపయోగించి దర్శన్ ఒర్నా కంపెనీ షేరు ధరను ప్రభావితం చేసినందుకు 11 మందిపై రూ.3.87 కోట్ల జరిమానాను సెబీ విధించింది. ఈ జరిమానాను 45 రోజుల్లోగా చెల్లించాలని సెబీ ఆదేశించింది.

✦ 50వ వార్షికోత్సవం సందర్భంగా కొత్త కార్పొరేట్ చిహ్నాన్ని ఎఫ్ఎంసీజీ దిగ్గజం **ఇమామీ** ఆవిష్కరించింది. కంపెనీ అంతర్జాతీయ విస్తరణకు ఇది ప్రతిరూపమని కంపెనీ వైస్ ఛైర్మన్, ఎండీ హర్షవర్ధన్ అగర్వాల్ తెలిపారు.

✦ ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియాలో టెమాసెక్‌కు ఉన్న 35% వాటాను 5.5 బిలియన్ యూరోల (దాదాపు రూ.55,000 కోట్ల)కు కొనుగోలు చేయనున్నట్లు ష్నైడర్ ఎలక్ట్రిక్ ప్రకటించింది.

✦ నిధుల తరలింపు, కార్పొరేట్ పరిపాలనా వైఫల్యంతో సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి **జెన్సోల్**, కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ జగ్గీల విధించిన నిషేధాన్ని సెబీ ధ్రువీకరించింది.

ఐపీఓ సమాచారం

◗ జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్ షేరు అరంగేట్రంలో రాణించింది. ఇష్యూ ధర రూ.237తో పోలిస్తే, బీఎస్ఈలో షేరు ట్రేడింగ్ 47.67% లాభంతో రూ.350 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.364 వద్ద గరిష్ఠాన్ని తాకినా, చివరకు 40.71% పెరిగి రూ.333.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,802.28 కోట్లుగా నమోదైంది.

◗ ఇండిక్యూబ్ స్పేసెస్ షేరు ఇష్యూ ధర రూ.237తో పోలిస్తే, 7.72% నష్టంతో రూ.218.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.201.55 దగ్గర కనిష్ఠాన్ని తాకి, చివరకు 8% నష్టంతో రూ.217.97 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,576.15 కోట్లుగా నమోదైంది.

◗ ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓ తొలి రోజు 1.78 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 3,51,27,002 షేర్లను ఆఫర్ చేయగా, 6,26,08,572 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

◗ క్యాష్ యూఆర్ డ్రైవ్ మార్కెటింగ్ ఐపీఓ ఈనెల 31న ప్రారంభమై ఆగస్టు 4న ముగియనుంది. ధరల శ్రేణిని రూ.123-130గా నిర్ణయించారు. ఐపీఓ తర్వాత కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎమర్జ్‌పై నమోదు కానున్నాయి.

◗ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలను స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ కంపెనీ దాఖలు చేసింది.

◗ స్థిరాస్తి సంస్థ సత్వ గ్రూప్, బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు ఉన్న నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్ రీట్ రూ.4800 కోట్ల ఐపీఓ ఆగస్టు 5-7 తేదీల్లో రానుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.95-100 నిర్ణయించారు.

◗ ఎస్ఎంఈ ఐపీఓ ప్రీ-ఓపెన్ సెషన్‌లో.. ఇష్యూ ధర కంటే 20% తక్కువ ధరల పరిమితిని తీసుకురానున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. ఆగస్టు 4 నుంచి ఇది అమల్లోకి రానుంది.

◗ ఆదిత్య ఇన్ఫోటెక్ ఐపీఓ రెండో రోజుకు 6.87 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,12,23,759 షేర్లను ఆఫర్ చేయగా, 7,71,16,314 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

◗ శ్రీలోటస్ డెవలపర్స్ అండ్ రియాల్టీ ఐపీఓ మొదటి రోజు 3.59 రెట్ల స్పందన వచ్చింది.

(c) eenadu

మకరందం

makarandam@eenadu.in

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

స్వార్థం వదిలిపెట్టాలని...

బాల్యంలో కన్నయ్య చేసిన అల్లరి పనులను భాగవతం దశమస్కంధంలో రమణీయంగా వివరించాడు పోతన. నల్లనయ్య కొంటెతనం భరించలేక గోపికలు యశోద దగ్గర మొర పెట్టుకున్నారు. అయితే లీలామానుష రూపుడైన శ్రీకృష్ణ పరంధామ ఏం చేసినా ఒక అర్థం పరమార్థం ఉంటాయి, ఈ పద్యం చూడండి.

'పడతీ! నీ బిడ్డడు మా, కడవలలో నున్న మంచి కాగిన పాలా/ పడుచులకు బోసి చిక్కిన, కడవల బో నడిచె నాజ్ఞ గలదో లేదో?'

'యశోదమ్మా! మా ఇళ్లలోని కుండల్లో చక్కగా కాగిన పాలను నీ బిడ్డ తోటి పిల్లలకు తాగబోశాడు. మిగిలిన కడవలను పగలగొట్టేశాడు. ఆ బుడతడికి అసలు భయభక్తులు ఉన్నాయా లేవా?' అంటున్నారు గోపికలు. వాస్తవానికి ఆశే మనిషి దుఃఖానికి ప్రధాన కారణం. అవసరంలో ఉన్నవారికి సాయం చేయకుండా అంతా తనకే కావాలని పోగేసుకోవడం మొదలుపెడితే అది ఆగదు. అక్కడి నుంచే స్వార్థం, ద్వేషం, ఆరాటం, అసహనం మొదలవుతాయి. అంతిమంగా అవి మనిషిని పతనావస్థకూ తీసుకెళ్తాయి. అందుకే, మన వద్ద అవసరానికి మించి ఉన్నదాన్ని పదుగురితో పంచుకుంటూ మానవీయతతో బతకాలని తెలియజెప్పడం శ్రీకృష్ణుడి బాల్యక్రీడల వెనకున్న పరమార్థం. పరుల మేలు గురించి ఆలోచించని మనిషి జన్మకు సార్థకత లేదని వివరించడమే కుండలను పగలగొట్టడంలోని గూఢార్థం.

శ్రీనివాసుడి సన్నిధిలో
శ్రావణ శోభ



ఆగస్టు 4 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు

శ్రావణమాసాన్ని పండుగల మాసం అని కూడా అంటారు. దాదాపు ముప్పై రోజులు ఏదో ఒక పర్వదినమే! శ్రీనివాసుని అవతార నక్షత్రమూ, శ్రీకృష్ణజన్మాష్టమి, జ్ఞానదేవతామూర్తి అయిన హయగ్రీవస్వామి జయంతి తదితరమైనవి శ్రావణంలోనే రావడం విశేషం. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు శ్రావణ మాసంలో మరింత శోభతో అలరారుతాడు.

శ్రీనివాసుడికి ఈ మాసంలో జరిపే పవిత్రోత్సవం నయనమనోహరం. కలియుగ దైవం నిత్యం ఏదో ఒక ఉత్సవంతో శోభిస్తాడు. కోనేటిరాయుడికి చేసే ఉపచారాలు వర్ణనాతీతం. అయితే ఆయనకు జరిపే ఉత్సవాల్లో తెలిసో తెలియకో ఏవైనా పొరపాట్లు జరిగితే, వాటికి చేసుకునే ప్రాయశ్చిత్తాన్ని 'పవిత్రోత్సవం'గా నిర్వహిస్తారు. ఈ పూజను 'పవిత్రీకరణ' అని 'పవిత్రారోపణం' అనీ పిలుస్తారు. యజ్ఞయాగాదుల్లో జరిగే లోపాలను పూర్ణాహుతితో తొలగించినట్లు, సంవత్సరమంతా ఉత్సవాల్లో జరిగే దోషాల నివృత్తి కోసం దీనిని ఆచరించటం ధర్మమని మన మహర్షులు ఉద్ఘాటించారు. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ఠ, రెండోరోజు పవిత్ర సమర్పణ, మూడోరోజు పూర్ణాహుతి ఉంటుంది.

కనులపండువగా...

ఆనందనిలయంలో ఆలయ పవిత్ర వాతావరణాన్ని తిరిగి నెలకొల్పేందుకు చేసే పవిత్రోత్సవం మూడు రోజులపాటు కనులపండువగా సాగుతుంది. మొదటి రోజు అంటే దశమినాటి ఉదయం సుప్రభాతం, అర్చన, నైవేద్యం అయిన వెంటనే దేవేరులతో కూడిన శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తిని పల్లకీపై పవిత్రోత్సవ మండపానికి తీసుకువస్తారు. ఈ మండపంలో అర్చకులు ఏడు హోమగుండాల్లో అగ్నిప్రతిష్ఠ చేస్తారు. వీటి మధ్య ఒక వేదికపై నవకలశాన్ని, మరో వేదికపై ప్రాయశ్చిత్త కలశాన్ని ప్రతిష్ఠిస్తారు. వీటికి ఎదురుగా శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసమూర్తిని ఆసీనుల్ని చేస్తారు. పవిత్రోత్సవంలో స్వామివారికి, అమ్మవారలకు సహస్రధారలతో అభిషేకం చేస్తారు. ఉత్సవమూర్తులకు అలదిన చందనాన్ని భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. స్వామివారిని సర్వాభరణాలతో, పూలమాలలతో అలంకరించి, సాయంత్రం తిరుమల పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ మూడురోజులు శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రధాన ఆలయంలో కాకుండా యాగశాలలోనే ఉంచుతారు.

రెండోరోజు శ్రావణశుద్ధ ఏకాదశి రోజు హోమం పూర్తయ్యాక ముందురోజు ప్రతిష్ఠ చేసిన తులసిపూసల్లాగా ఉన్న పట్టుదండలను రుత్వికులు ఆనంద నిలయంలోకి తీసుకువెళ్లి మూలవిరాట్టుకు సమర్పిస్తారు. కిరీటంపైన, మెడలో హారంగా వేస్తారు. స్వామివారి శంఖ చక్రాలకు, నందక ఖడ్గానికి, వక్షస్థలంలో వెలసిన శ్రీదేవి భూదేవీలకు, ఆలయంలోని ఇతర దేవతామూర్తులకు సమర్పిస్తారు. ఆ తర్వాత తిరుమల కొండపై వెలసిన ఇతర దేవతాగణానికీ ఈ పట్టుదండలను సమర్పించటం ఆనవాయితీ.

చివరిరోజు హోమాల అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేస్తారు. ఆ రాత్రి పూర్ణాహుతితో పవిత్రోత్సవం పరిసమాప్తమవుతుంది. తర్వాత శ్రీవేంకటేశ్వరుడు శ్రీదేవి భూదేవిలతో ప్రదక్షిణగా వెళ్లి ఆలయ ప్రవేశం చేస్తారు.

చారిత్రక నేపథ్యం

తిరుమల పవిత్రోత్సవాలకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. 15వ శతాబ్దం నుంచే ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆధారాలున్నాయి. ఈ పవిత్రోత్సవాన్ని మొదటిసారిగా సాళువ నరసింహరాయల కాలంలో ప్రవేశ పెట్టారు. ఆరంభంలో ఇది అయిదు రోజుల వేడుక. విజయనగర సామ్రాజ్య పతనం తరువాత ఈ ఉత్సవాలు నిలిచిపోయాయి. తిరిగి ఇరవయ్యో శతాబ్దంలో పునరుద్ధరించారు. మూడు రోజులకు పరిమితం చేశారు.

అహంకారాన్ని తొలగించే..

భగవంతుడికి మనం నిష్ఠగా ఉపచారాలు చేస్తున్నప్పుడు తెలియకుండానే మనలో అహంకారం పొటమరిస్తుంది. మనం ఇతరుల కన్నా అధికమనే భావన అంకురిస్తుంది. అలాంటి అహంభావాన్ని తొలగించేందుకు పవిత్రోత్సవాలు ఉపకరిస్తాయి. మనం ఎన్ని పూజా పురస్కారాలు చేసినా ఎన్నటికీ సంపూర్ణం కాదని, ఏదో వెలితి మిగిలే ఉంటుందని స్పష్టం చేయటానికే ఇలాంటి ప్రాయశ్చిత్త పూజలు. - చైతన్య


మైత్రి ఆరోప్రాణం

పంచప్రాణాలకు తోడు ఆరోప్రాణం మరొకటుంది. అదే స్నేహం. మైత్రి అంత గొప్పది కనుకనే భగవంతుడిని చేరే నవవిధ భక్తిమార్గాల్లో సఖ్యభక్తికి ప్రత్యేక స్థానం కల్పించారు.

జీవనయాత్రలో తోడునీడగా ఉండే ఒక మంచి నేస్తానికి ఎలాంటి లక్షణాలుంటాయనే విషయాన్ని 'అఘము వలన మరల్చు, హితార్థకలితుఁ జేయు, గోప్యంబు దాఁచు, బోషించు గుణము, విడువఁడాపన్ను, లేవడివేళ నిచ్చు మిత్రుఁడీ లక్షణంబుల మెలగుచుండు' అనే సుభాషితం వివరిస్తుంది. మంచి మిత్రుడు ఎన్నడూ తన నేస్తం చెడుపనుల జోలికి వెళ్లకుండా చూస్తాడు. స్నేహితుడి రహస్యాలను కాపాడుతూ సద్గుణాలను మెచ్చుకుంటాడు. ఆపదలో వదిలేసి వెళ్లిపోడు. ఏది అవసరమైనా సందేహించక అందిస్తాడు. ఇవి నిజమైన మిత్రుడి లక్షణాలనేది ఈ పద్య భావం. మనకు అనునిత్యం సన్మార్గాన్ని సూచించే పురాణేతిహాసాల్లో ఇలాంటి స్నేహానికి అనేక చక్కని ఉదాహరణలున్నాయి.

భారతంలో కర్ణ-దుర్యోధనులు, భాగవతంలో కృష్ణ-సుదాములు, రామాయణంలో రామ-సుగ్రీవులు మైత్రికి నిర్వచనం అంటే అతిశయం కాదు. సీతమ్మను వెతకడంలో రాముడికి సుగ్రీవుడు సహాయం చేశాడు. వీరి స్నేహం పరస్పర సహాయం, నమ్మకం, విధేయతలకు ప్రతీక. కృష్ణ కుచేలుల కథ స్నేహానికే మణికిరీటం. వాళ్లిద్దరూ ఒకే గురువు దగ్గర చదివారు. విద్యార్థి దశలో ఆస్తులు, అంతస్థుల తారతమ్యాల్లేక కలిసిమెలిసి ఉండటం సహజం. కానీ జీవితంలో స్థిరపడటం వేరుగా ఉంటుంది. చెదరని చెలిమికి సాక్ష్యం కృష్ణకుచేలులు కాగా, మారిన వైఖరికి నిదర్శనం ద్రోణ ద్రుపదులు.

కుచేలుడు దారిద్ర్యాన్ని భరించలేక తన చిన్ననాటి స్నేహితుడు కృష్ణుడు సాయం చేస్తాడన్న నమ్మకంతో వెళ్లి కలిశాడు. ఆ నమ్మకం వమ్ముకాలేదు. ద్రుపద ద్రోణులూ బాల్యమిత్రులే. పైగా ద్రోణుడికి పెద్దయ్యాక సాయం చేస్తానని ద్రుపదుడు మాట ఇచ్చిన సందర్భం ఉంది. దుర్భర పరిస్థితి తలెత్తినప్పుడు ద్రోణుడు మిత్రుణ్ని సాయం అడిగాడు. కానీ అవమానమే ఎదురైంది. ఫలితంగా అనంతర కాలంలో తన శిష్యులైన పాండవులు ద్రుపదుణ్ని ఓడించేలా చేశాడు ద్రోణుడు. అతడిని రథానికి కట్టించి తన వద్దకు తెప్పించుకుని పగ తీర్చుకున్నాడు.



ఆగస్టు 3 స్నేహితుల దినోత్సవం

కష్టాలలో వెన్నంటి..

భారతంలో కర్ణదుర్యోధనులు అపురూప మైత్రికి ఉదాహరణ. విద్యా ప్రదర్శన సమయంలో కర్ణుడు అవమానాన్ని ఎదుర్కొన్నాడు. దుర్యోధనుడు వెంటనే తండ్రి సహాయంతో అతడిని అంగరాజ్యానికి రాజును చేశాడు. అందుకు ప్రతిగా కర్ణుడు దుర్యోధనుడి కోసం తన ప్రాణాన్నైనా ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. భారతంలోనే స్నేహానికి మరో ఉదాహరణ కృష్ణార్జునులు. వీరు బావాబావమరుదుల కంటే స్నేహితులంటేనే సరిపోతుంది. అర్జునుడి రథానికి తనే సారథి అయ్యి నడిపించాడు శ్రీకృష్ణుడు.

అగ్నిసాక్షిగా...

రామాయణంలో రామ సుగ్రీవుల మైత్రి అగ్నిసాక్షిగా ప్రారంభమైంది. వివాహ సమయంలో వధూవరులు అగ్ని ప్రదక్షిణ చేస్తారు. అలా ఏడడుగులు నడిచేటప్పుడు 'మనిద్దరం మంచి స్నేహితుల్లా ఎప్పటికీ కలిసుందాం' అని వాగ్దానం చేస్తారు. ఈ ఆచారం వివాహానికి స్నేహపరిమళాన్ని అద్ది స్నేహంలోని పవిత్రత, స్వచ్ఛతలను చాటుతుంది. ఈ సంగతి అర్థం చేసుకుంటే ఆలుమగల మధ్య గొడవలకు తావుండదు.

- కొందరితో స్నేహం కష్టనష్టాలకే దారితీస్తుంది. కనుక అటువంటి వ్యక్తులకు దూరంగా ఉండాలని హితవు పలికింది గరుడ పురాణం. వీరు అయిదు రకాలుగా ఉంటారు. ఇందులో మొదటివాడు అదృష్టం మీద ఆధారపడి జీవించేవాడు. ఏ పనీ చేయడు సరికదా మిత్రులనూ అలాగే జీవించమని ప్రేరేపిస్తాడు. ప్రతికూల మనస్తత్వం ఉన్న వ్యక్తులు రెండో రకం. వీరిలో సానుకూలత ఉండదు. ఇతరుల విజయానికి అడ్డంకిగా మారతారు. అహాన్ని ప్రదర్శించేవారు మూడో రకం. వీళ్లు గర్వాతిశయంతో ఇతరులను బాధిస్తారు, వేదనకు గురిచేస్తారు. నాలుగో రకం దుష్ట సలహాలు ఇచ్చేవారు. వీళ్లు ఏ పనినీ సరిగ్గా చేయరు, ఇతరులు చేసినా సహించరు. పనులకు ఆటంకం కలిగించి, వ్యర్థ విషయాలతో కాలయాపన చేస్తారు. సోమరులు అయిదో రకానికి చెందుతారు. ఇలాంటి వ్యక్తులతో స్నేహం చేసినవారు కూడా సోమరులుగా మారటం తప్ప సాధించేదేమీ ఉండదు. అందుకే ఇలాంటి అవగుణాలున్న వారితో స్నేహం చెయ్యకూడదన్నది ఆర్యోక్తి. - ప్రొ. యల్లాప్రగడ మల్లికార్జునరావు

అహంకారం వినాశకారకం




మహావీరుడో సంస్థానానికి రాజు. తన కంటే బలవంతుడు లేడని విర్రవీగేవాడు. ఒకరోజు అతడిని చూడటానికి కొందరు రుషులు వచ్చారు. వారు మహారాజుతో 'గంధమాదన పర్వతంపై నర నారాయణులు కఠిన తపస్సు చేస్తున్నారు. మీరు వారితో యుద్ధం చేయగలరా?' అని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన రాజు... 'నన్ను మించిన యోధులు ఎవరూ ఉండరు' అంటూ పర్వతానికి బయలుదేరాడు.

ఆ నర నారాయణుల తపస్సుకు భంగం కలిగించి 'మీరు నాకంటే గొప్పవారా? అయితే యుద్ధానికి రండి' అంటూ కత్తిదూశాడు. నర నారాయణులు నవ్వుతూ ఒక గడ్డిపరక తీసి 'ఇదే నీ సైన్యానికి జవాబు చెబుతుంది' అని వదిలారు. రాజు సైతం బాణాల వర్షం కురిపించగా ఆ గడ్డిపరక బాణాలను ముక్కలు ముక్కలుగా చేసింది. అది చూసిన రాజు నిశ్చేష్టుడయ్యాడు. ఆయుధాలన్నీ పక్కనపెట్టి ఆ నర నారాయణుల పాదాలపైపడ్డాడు. దాంతో వారు 'సిరి సంపదలు ఉన్నవారు పేదలకు దానధర్మాలు చేసి గొప్పవారు కావాలి కానీ, అహంకారంతో కాదు. రాజువు - ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకో' అని ఉపదేశించారు.

ఆహారం.. అల్లాహ్ వరం

ఆహారవృథా నేడు సర్వసాధారణంగా మారింది. కానీ ఇస్లాం ధర్మం దీన్ని పాపంగా పరిగణిస్తుంది. ఆహారం అల్లాహ్ మానవాళికి ప్రసాదించిన వరమని మత గ్రంథాలు, సంప్రదాయాలు చెబుతున్నాయి. 'తిను..తాగు.. వృథా మాత్రం చేయకు. నిశ్చయంగా ఆయన దుబారా చేసేవారిని ప్రేమించడు.' అని ఖురాన్ వ్యాఖ్యానం. ఆహారాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించటం, వృథా చేయకుండా ఉండటం, అవసరం ఉన్నవారితో పంచుకోవటం తాలూకా ప్రాధాన్యాన్ని ఇది నొక్కి చెబుతుంది. మితాహారాన్ని ప్రోత్సహిస్తుంది. దైవ ప్రవక్త మహ్మద్ (స) ఆహారం ఎంత ముఖ్యమైనదో ఈ విధంగా వివరించారు. 'ఆదాము కుమారుడు తన కడుపు కంటే దారుణంగా ఏ పాత్రను నింపలేదు. అతడు తన జీవనానికి సరిపడా ఆహారం తింటే సరిపోతుంది. కడుపులో ఆహారం కోసం మూడో వంతు, పానీయాలకు మూడో వంతు, శ్వాస కోసం మరో మూడో వంతు భాగాన్ని కేటాయించాలి' అని చెప్పారని ఇస్లామిక్ పండితులు పేర్కొంటారు. పేదవారితో ఆహారాన్ని పంచుకోవటాన్ని ఇస్లాం ప్రోత్సహిస్తుంది. దానధర్మాల్లో ప్రధానమైన జకాత్, సదఖా అనే అంశాల్లో అవసరమైన వారికి తిండి అందించటం ముఖ్యమైనది.



ఇస్లాం సందేశం

ఆహారం తినటానికి అనువుగా లేని పక్షంలో దాన్ని పూర్తి వృథాగా పడేయకూడదు. జంతువులకు వేయటమో, కంపోస్టు ఎరువు తయారీలో వినియోగించటమో మేలు. ఇస్లాం సమతుల జీవనశైలిని పాటించాలని చెబుతుంది. ఆహారాన్ని మితంగా తీసుకోవటం, ఇచ్చిన వారిని అభినందించటం, దుబారాకు దూరంగా ఉండటం దీనిలో ప్రధానమైనవి. మానవాళి ఆహార భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో మితాహారం తీసుకోవాలనే, వృథాను కట్టడి చేయాలనే ఇస్లాం బోధనలు ఆచరణీయాలు.

గురువే మిన్న



గౌతమ మహాముని శిష్యుల్లో సోమదత్తుడు ఉత్తముడు. గురువు వద్ద అనేక విద్యలు అభ్యసించి గొప్పవాడయ్యాడు. కాలక్రమేణా తానే అందరికన్నా మేటి పండితుడినని, శాస్త్రవిద్యల్లో ప్రావీణ్యుడినని భావించసాగాడు. ఒకరోజు సోమదత్తుడు శివ పూజ చేస్తుండగా అదే సమయానికి గౌతమముని వచ్చాడు. కానీ సోమదత్తుడు గురువుని పట్టించుకోకుండా పూజలో నిమగ్నమయ్యాడు. గౌతముడు తన శిష్యుడి చర్యకు కోపం తెచ్చుకోకుండా లోలోపల చింతించసాగాడు. కానీ సోమదత్తుడి పూజలందుకుంటున్న శివుడికి మాత్రం పట్టలేని కోపం వచ్చింది. 'ఓ సోమదత్తా, నీకు విద్య నేర్పిన గురువును లెక్కచేయలేని స్థితిలో ఉన్నావు. గురువుపై గౌరవం లేని నువ్వు దైవారాధనకు అర్హుడివి కాదు. బ్రహ్మ రాక్షసుడివై జన్మించు' అంటూ శాపమిచ్చాడు. దాంతో సోమదత్తుడు ఖిన్నుడై.. పశ్చాత్తాపంతో గురువు పాదాలపై పడి 'క్షమించండి గురుదేవా, నాలాంటి శిష్యుడు దొరకడం మీ దురదృష్టం. నాకు శాపవిమోచన మార్గం చెప్పండి' అని వేడుకున్నాడు. దీంతో గౌతముడు 'సోమదత్తా! విద్య నేర్పిన గురువులు దైవసమానులు. వారిని అవమానిస్తే ఏ దైవమూ అనుగ్రహించదు' అని చెప్పి, శాప విమోచనానికి తానే మార్గం వెతికేందుకు బయలుదేరాడు.

పంచశీల పరమార్థం

మనిషి ప్రవర్తనకు అతని ఆలోచనలే మూలకారణం. మంచి పని చేయాలన్నా, చెడ్డ పని చేయాలన్నా, దానికి ప్రేరణ స్వీయ ఆలోచనలే. మంచి భావనలు ఉత్తమ చర్యలకు కారకాలైతే.. ప్రతికూల ఆలోచనలు చెడ్డపనులు చేసేలా పురిగొల్పుతాయి.

బుద్ధం శరణం


సక్రమం కాని ఆలోచనలు మనిషిని అతలాకుతలం చేస్తాయి. చెడ్డవాడు చేసే పనులు లోకకంటకాలై ఇతరులను బాధిస్తాయి. ఆఖరికి అతని పతనానికి దోహదం చేస్తాయి. మంచి ఆలోచనలు గల వారి మనసు విరిసిన కలువలతో నిండిన సరస్సులా ఉంటుంది. తృప్తితో నిండి ఆనందంతో పరవశిస్తుంది. అతని ధర్మబద్ధమైన జీవనశైలి లోకంలో వర్ధిల్లుతుంది. కాబట్టి మన ఆలోచనలు ధర్మబద్ధంగా ఉండాలి. ప్రతి మనిషీ ధర్మబద్ధంగా జీవించడానికి భగవాన్ బుద్ధుడు పంచశీలను ఉపదేశించాడు. దాని ప్రకారం లోకంలో ఏ మనిషీ - జీవహింస, అబద్ధాలు ఆడటం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం చేయకూడదు.



- జీవహింస చేయకూడదు అంటే ఇతరుల మనసు కష్టపెట్టకూడదు. పరుషంగా మాట్లాడకూడదు. దయతో కూడిన మాటలే ఎప్పుడూ ఉత్తమమైనవి. అబద్ధాలు ఆడటం వల్ల శీలం కోల్పోతాం. మన మాటలకు విలువ ఉండదు. మద్యపానం వల్ల ఆరోగ్యం పాడవుతుంది. యుక్తాయుక్త జ్ఞానాన్ని మరిచి ప్రవర్తిస్తాం. వ్యభిచారం చాలా నీచమైనది. దొంగతనం హేయమైనది. పరులసొమ్ము ఆశిస్తే ముప్పు తప్పదు.

- సమాజ మనుగడకు కేంద్రబిందువు ధర్మం. ఎక్కడైనా, ఎప్పుడైనా ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రాథమికంగా ఉండాల్సినది ధర్మమేనని బుద్ధుడు పంచశీల ద్వారా ప్రబోధించాడు. ఎవరికైనా చెప్పడం తేలికే, ఆచరించడమే కష్టం. అందుకే బుద్ధుడు తాను బోధించిన పంచశీలను ఆచరించి నిరూపించాకే తన శిష్యులకు బోధించాడు. ఆ విధంగా ఈ సూత్రాలను ఎవరికి వారే స్వీయ ఆచరణ ద్వారా సాధన చేయాలి. లౌకిక జీవనంలో సమస్త కర్మలకు ధార్మిక విధానమే మూలంగా ఉండాలి. మనం చేసే పనుల ద్వారా ఇతరులకు గానీ, మొత్తం సమాజానికిగానీ నష్టం జరగకూడదు. ఉత్తమ ఆలోచనలు లోకకల్యాణ కారకాలని మర్చిపోకూడదు. వాటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి. దాంతో సకల జనులకు సుఖసంతోషాలు కలుగుతాయి.

వ్యర్థ మాటలొద్దు



క్రీస్తువాణి

మాట చాలా శక్తిమంతమైనది. దాన్ని ఎలా ఉపయోగించాలో అలా వాడితేనే మనుగడ. వ్యర్థమాటలు కూడదని, మాట సద్వినియోగానికే ప్రయత్నించాలని బైబిల్ సందేశం. తొలుత దేవుడు తన వాక్కు (మాట) ద్వారానే సృష్టి జరిపాడని అది చెబుతోంది. ఏసు తానే దైవకుమారుడనని తన మాట ద్వారానే లోకానికి తెలియపరిచాడు. ఇరుగుపొరుగు వారితో మన మాటతీరును బట్టే సత్సంబంధాలు కలుగుతాయి. మన ప్రతి మాటకు లెక్క అప్పజెప్పవలసి ఉంటుందని బైబిల్ ఉవాచ.

'నాలుక భుజాన్నేసుకొని తిరుగుతున్నాడు' అనేది నానుడి. మాటలతో చిచ్చుపెట్టే వారికి దూరంగా ఉండాలి. మాటతో మన గౌరవాభిమానాలు పెరగడమో తగ్గడమో జరుగుతుంది. ఓ చిన్న నిప్పురవ్వ దావాగ్ని అడవినంతా దహించినట్లు... నియంత్రణ లేని నాలుక దహించివేయగలదు. వీలైనంత వరకు మన పెదవులు మూసుకొంటేనే మంచిదని బైబిల్ చెబుతోంది.

మన మాటను సద్వినియోగ పరచుకోవడమా, లేదా దుర్వినియోగ పరచుకోవడమా అనేది మన చేతుల్లోనే ఉంది!

భక్తి గీతాలు...
ఆత్మను వెలిగించే దీపాలు

భగవంతుడ్ని ప్రేమించడంలో, పూజించడంలో, సేవించడంలో, కీర్తించడంలో కలిగే అనురాగమే - భక్తి.

కలియుగంలో మోక్ష సాధనకు అనువైన, అవసరమైన మార్గాల్లో భక్తి మార్గమే విశేషమైనదని జగద్గురు ఆదిశంకరులు పేర్కొన్నారు. నవ విధ భక్తి మార్గాల్లో శ్రవణం మొదటి రీతి. దేవుడికి సంబంధించిన లీల, రూప, గుణ, నామ సంకీర్తనలను వినడమూ దైవారాధనలో భాగమే.

దైవాన్ని హృద్యంగా కీర్తించే ఆరాధనాపూర్వక పరంపర భక్తి సంగీతం. భగవంతుడి పట్ల భక్తి, ప్రేమ, శరణాగతి ఇందులో ప్రకటితమవుతుంది. దైవ సామీప్యానికి మనల్ని తరలింపజేసే ఆధ్యాత్మిక రథసారథి ఇది. సుమధుర సంగీతాన్ని ఆలపించడం మాత్రమే కాదు, ఆలకించడం కూడా అద్భుతమైన కళ!

శాస్త్రీయ సంగీతం మన సంప్రదాయంలో గాంధర్వ విద్యగా ఖ్యాతిగాంచింది. భక్తి సంగీతానికి ఎల్లలు లేవు, అది ప్రపంచ భాష. దీంతో దైవాన్ని స్తుతించడం ద్వారా, వినడంతోనూ హృదయం ప్రక్షాళన అవుతుంది.

- భక్తి సంగీతంలోని ప్రతి పదంలో నవజీవన చైతన్యం ఉంటుంది. ఆ గీతంలోని ప్రతి పదం చుట్టూ లోతైన భావాల సంగీత మధురిమలు వ్యాపించి ఉంటాయి. పూల చుట్టూ సుగంధం వ్యాపించినట్టుగా, రాగి తీగ చుట్టూ విద్యుత్ తరంగాలు సుడులు తిరుగుతున్నట్టుగా భక్తి సంగీతంలోని అలౌకికమైన అనుభూతి మన హృదయాలను సమ్మోహితం చేస్తుంది.


- నామ సంకీర్తనం చేయడం, భజనలు వినడం ద్వారా జ్ఞాపకశక్తి పెంపొందుతుంది. రాగాలు హృదయంపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. భక్తి సంగీతమంటే గీతాలు మాత్రమే కాదు, అవి ఆత్మను వెలిగించే దీపాలు. శారీరక, మానసిక ఆరోగ్యానికి కారకాలు.

- ఈ విశ్వమంతా నాద బిందు కళామయం. నాదం అంటే ధ్వని. అది సృష్టికి మూలమైన ప్రణవ ధ్వని నుంచి ఆవిర్భవించింది. ప్రణవంలో గల మూడు అక్షర ధ్వనులు- అ, ఉ, మ. ఇవి సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలు. ఈ ప్రణవనాదం నుంచే సమస్త శబ్దజాలం జనించింది.



శాస్త్రీయంగా...

మన మెదడులో డోపమైన్, సెరటోనిన్ వంటి సంతోషకరమైన హార్మోన్ల విడుదలను దైవ సంబంధిత సంగీతం ప్రోత్సహిస్తుంది. 'జర్నల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ నర్సింగ్' అధ్యయనం ప్రకారం భక్తి సంగీతాన్ని ఆస్వాదించడం వల్ల ఆందోళన స్థాయిలు 25-35% తగ్గుతాయని నిరూపితమైంది. 'జర్నల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీ' అధ్యయనం ప్రకారం ఇది దీర్ఘకాల నొప్పులు నివారించడంలో సహాయపడుతుంది. నిద్రను మెరుగుపరుస్తుంది. హృదయ స్పందన రేటును, రక్తపోటును సమతుల్యం చేస్తుంది. మెదడులోని లింబిక్ సిస్టమ్‌ను ప్రభావితం చేస్తుంది.



పరమేశ్వరుడి ఏడు ముఖాల నుంచి సప్త స్వరాలు ప్రభవించాయని 'స్వరార్ణవం' పేర్కొంది. పరమశివ, ఈశ్వర, సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన అనే సప్తముఖాల నుంచి వరుసగా సరిగమపదని అనే స్వరాలు ఆవిష్కారమయ్యాయంటారు. సంగీతం వేద స్వరూపం. వేదం నుంచే ఇది ఆవిర్భవించింది. భారతీయ సంగీత శాస్త్రానికి సామవేదమే ఆధారం. సంగీతం దైవదత్తమైన కళ. అందుకే దీన్ని ఉపాసన కళగా కూడా భావిస్తారు.

- వంశీనాదంతో శ్రీకృష్ణుడు, డమరుక నాదంతో శివుడు, వీణానాదంతో సరస్వతి ఆనందభరితులవుతారు. సృష్టికి అక్షర దానం చేసిన పరమశివుడు, తన డమరుక శబ్దాలతో పాణినికి అక్షర దేవతల దర్శనం కలిగించాడని చెబుతారు. వేదాల్లో తాను సామవేదాన్ని అని కృష్ణుడు భగవద్గీతలో పేర్కొన్నాడు. కోమలమైన హృదయం గీతాన్ని మనసారా ఆస్వాదిస్తుంది. అది భగవత్ సంబంధిత కీర్తన అయితే ఆత్మ పులకరిస్తుంది. అందుకే త్యాగరాజస్వామి, అన్నమయ్య, రామదాసు వంటి వాగ్గేయకారులు తమ సంకీర్తనల్లో భక్తిరసాన్ని అణువణువునా నింపి మనకు అమూల్య కానుకలుగా ఇచ్చారు.

ప్రకృతిలో భాగం

సప్త స్వరాలైన షడ్జమం, రిషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం మంత్ర సమన్వితాలు. ఈ స్వరాలను సప్త ధాతువులకు, వర్ణాలకు సంకేతంగా భావిస్తారు. ఇవి ప్రకృతితో, పంచభూతాలతో, గ్రహచలనంతో సంబంధాన్ని కలిగి ఉంటాయని నిరూపితమైంది. ఆ ప్రకృతిలో భాగమైన మనిషి శారీరక మానసిక ఆరోగ్యాలను సప్తస్వర జనితమైన సంగీతం ప్రభావితం చేస్తుంది. దేహంలోని జీవధాతువులకు సంగీతం పట్ల గల అవినాభావ సంబంధానికి అది ప్రత్యక్ష నిదర్శనం. శరీరంలో ఏర్పడే అనారోగ్యాలకు, రుగ్మతలకు సంగీతం ద్వారా స్వస్థత చేకూర్చే 'మ్యూజిక్ థెరపీ' విశ్వవ్యాప్తంగా ప్రచారంలో ఉంది.

- భక్తి రస సంగీత ఆస్వాదనతో మన నిత్య జీవితం మమేకం కావాలి. మన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రాతిపదికగా భక్తి సంగీతం విరాజిల్లి, రమ్య మోహన జీవన పావన మార్గాన మనల్ని ముందుకు నడిపిస్తుంది. సరళ సుందరమై, ఆనందబంధురమై మనల్ని ఒత్తిళ్ల నుంచి దూరం చేస్తుంది. -డా॥ కావూరి రాజేశ్ పటేల్

(c) eenadu

అటవీ పోస్టులకు పోటీ పడతారా?

అటవీ శాఖలో 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ నియామక ప్రకటన విడుదల చేసింది. క్యారీ ఫార్వర్డ్ పోస్టులు 40. కొత్తగా మరో 70 ఉద్యోగాలు ప్రకటించారు. వీటికి సన్నద్ధత ఎలా ఉండాలో తెలుసుకుందాం!

మొదట స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇది 150 మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష విధానంలో ఉంటుంది. ఓఎంఆర్ షీట్‌లో సమాధానం గుర్తించాలి. తర్వాత మెయిన్స్ పరీక్ష 450 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో. ఆపై నడక, ఫిజికల్ పరీక్షలు, చివరిగా వంద మార్కులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

తుది ఎంపిక మెయిన్స్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టుల మార్కులతో జరుగుతుంది. ఎన్‌సీసీ సర్టిఫికెట్లకు ఇచ్చే బోనస్ పాయింట్లు ఎంపికకు ఉపయోగపడతాయి.

ఎవరు అర్హులు?

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే.. 22 జులై 2025 నాటికి బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, అగ్రికల్చర్‌లలో కనీసం ఒక సబ్జెక్టులో గ్రాడ్యుయేట్ అయి ఉండాలి.
- నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.
- 2025 జులై 1 నాటికి 18-30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా బలహీన వర్గాలకు గరిష్ఠ వయసులో ఐదు సంవత్సరాల సడలింపు ఉంటుంది. క్యారీ ఫార్వర్డ్ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పదేళ్ల సడలింపునిస్తారు..



ముఖ్య సూచనలు

- ఏపీపీఎస్సీ పరీక్షలు గ్రాడ్యుయేషన్ ఆధారంగా ఉంటాయి. కానీ ఈ పరీక్ష నిర్దిష్ట సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేట్ అయినవారికి మాత్రమే.
- నడక, సాధారణ కంటి దృష్టి ముఖ్యమైనవి. ఆ ప్రమాణాలు, తగిన శారీరక ప్రమాణాలు ఉంటేనే ముందుకెళ్లటం మంచిది.
- అసలు ఈ పరీక్ష రాయాలో, వద్దో నిర్ణయించుకునేందుకు ముందుగా మెయిన్ సిలబస్ పరిశీలించాలి. ఇచ్చిన సిలబస్ ప్రకారం స్క్రీనింగ్ గట్టెక్కటం కష్టమేమీ కాదు. కానీ మెయిన్ సిలబస్ అందరికీ అనుకూలం కాదు.
- మెయిన్స్ సిలబస్‌లో పదో తరగతి స్థాయి గణితం, గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉండే ఫారెస్ట్రీ.. చెరో 150 మార్కులకు ఉన్నాయి. ఈ రెండు సబ్జెక్టులూ అందరు అభ్యర్థులకూ అనుకూలమైనవి కాదు. అందువల్ల ఈ సబ్జెక్టుల్లో ఉన్న పట్టును బట్టి అసలీ పరీక్ష రాయాలా, వద్దా అనే నిర్ణయాన్ని ప్రాథమిక దశలోనే తీసుకుంటే మేలు.

స్క్రీనింగ్ పరీక్ష (150 ప్రశ్నలు, 150 మార్కులు)

పార్ట్-ఎ: జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ, గణితం అనే మూడు విభాగాలకు 75 మార్కులు. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ సిలబస్ భారీగా ఉంది. కానీ 40 మార్కులకు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. పైగా సెప్టెంబరు 7న పరీక్షలు నిర్వహిస్తారు కాబట్టి తగినంత సమయం కూడా ఉండదు. అందువల్ల అభ్యర్థులు సెలెక్టివ్‌గా కరెంట్ అఫైర్స్, జాతీయ ఉద్యమం, గ్రామీణాభివృద్ధి అంశాలు, సంతులిత అభివృద్ధి, విపత్తు నిర్వహణ లాంటి అంశాలకు పరిమితమై ఈ కొద్ది సమయాన్ని వాడుకుంటే మంచిది. రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ లాంటి అంశాలకు రోజూ గంట కేటాయించుకుని సాధన చేస్తే మెరుగైన ఫలితం ఆశించవచ్చు.

గణితంలో అరిథ్‌మెటిక్, జామెట్రీ, స్టాటిస్టిక్స్ విభాగాలున్నాయి. పాఠశాల స్థాయి పుస్తకాల్లో ఈ మూడు విభాగాల పాఠ్యాంశాలను సాధన చేయాలి. వీటిని బిట్స్, షార్ట్ కట్స్ రూపంలో ప్రాక్టీస్ చేస్తే మంచిది. రోజూ 3-4 గంటలు గణితానికి కేటాయించటం స్కోరింగ్‌కు దోహదపడుతుంది.

పార్ట్-బి: 75 మార్కుల జనరల్ ఫారెస్ట్రీలో 11 చాప్టర్లు ఉన్నాయి. దీనికి సిద్ధమవటం అభ్యర్థులందరికీ గట్టి సవాలే. ఒక్కొక్క చాప్టర్లోని విస్తృత సిలబస్ అంశాలు సామాన్యంగా మింగుడుపడవు. అందువల్ల అన్ని అంశాలనూ అధ్యయనం చేయాలనుకోకూడదు. గ్రాడ్యుయేషన్ లెవెల్ సబ్జెక్టుతో సంబంధం ఉన్న వీలైనన్ని చాప్టర్లను చదివే ప్రయత్నం చేయడం మంచిది.

- జువాలజీ గ్రాడ్యుయేషన్‌లో ఉన్నవారు పర్యావరణం, జంతువుల జీవక్రియలు, రోగ నిరోధక వ్యవస్థ, పునరుత్పత్తి, పౌష్టికత, మానవ జన్యు నిర్మాణం, ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన జంతు సంబంధ విషయాలపై దృష్టి పెట్టాలి.
- బోటనీ గ్రాడ్యుయేషన్‌లో ఉన్న అభ్యర్థులు వృక్షశాస్త్ర అంశాలు, అడవులు, పర్యావరణం, హార్టికల్చర్, సెరికల్చర్, ఆగ్రో ఫారెస్ట్రీ, సోషల్ ఫారెస్ట్రీ, పర్యావరణాలపై పట్టు సాధించాలి.
- ఫారెస్ట్రీ గ్రాడ్యుయేషన్‌లో ఉన్నవారు వృక్షశాస్త్ర బేసిక్స్, ఫారెస్ట్రీ, పర్యావరణం, సాయిల్ సైన్స్, సెరికల్చర్, ఆగ్రో ఫారెస్ట్రీ, సోషల్ ఫారెస్ట్రీ, కమ్యూనిటీ పార్టిసిపేషన్, ఫారెస్ట్ అడ్మినిస్ట్రేషన్‌లపై తొలుత పట్టు పెంచుకోవాలి.
- జియాలజీ గ్రాడ్యుయేషన్‌లో ఉన్నవారు పర్యావరణ అంశాలు, సాయిల్ సైన్స్, జల వనరుల నిర్వహణ, రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ కమ్యూనికేషన్, శిలాజ ఇంధనాలు, శిలాజేతర ఇంధనాలపై అవగాహన సంపాదించుకోవాలి.

గ్రాడ్యుయేషన్ సంబంధిత అంశాలపై పట్టు సాధించాక అనుకూలమైన ఇతర చాప్టర్లపై దృష్టి పెట్టడం మెయిన్స్‌కు క్వాలిఫై అవ్వడానికి ఉపకరిస్తుంది. గ్రాడ్యుయేషన్ సబ్జెక్టు ఏదైనా ఐదు అంశాలపై గట్టి పట్టు అవసరం.

1. శిలాజ, శిలాజేతర ఇంధనాలు- వాటి తాజా గణాంకాలు 2. పర్యావరణ శాస్త్ర అంశాలు. 3. రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ కమ్యూనికేషన్ 4. ఆగ్రో ఫారెస్ట్, సోషల్ ఫారెస్ట్రీ 5. జలవనరుల నిర్వహణ, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్.

ఈ విభాగాలన్నిట్లో సాధారణ పరిజ్ఞానంతో అడిగే ప్రశ్నలే ఎక్కువ. కాబట్టి పాఠశాల స్థాయి పుస్తకాలతో ప్రాథమిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటే స్క్రీనింగ్ పరీక్షలో మంచి మార్కులు సాధించవచ్చు. పార్ట్-బిలో చాలా ఎక్కువ సబ్జెక్టులున్నందున కొందరు గందరగోళానికి గురవుతూ ప్రేరణ కోల్పోయే ప్రమాదం ఉంది. కొన్ని అంశాలే ఎంచుకుని ఉమ్మడిగా చదవాల్సిన అంశాలపై దృష్టి పెడితే మంచి మార్కులు తెచ్చుకునే ఆస్కారం ఎక్కువ.



– కొడాలి భవానీ శంకర్

పరిమితి గ్రహించు.. పరిణతి ప్రదర్శించు!



రాజేష్ ఒక ప్రముఖ ఐటీ సంస్థలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా చేరి మొదటి మూడు నెలల్లోనే తనకు అసైన్ చేసిన ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. టీంలో గుర్తింపు తెచ్చుకున్నాడు. అయినప్పటికీ అతని త్రైమాసిక అప్రైజల్‌లో యావరేజ్ రేటింగ్ వచ్చింది. ఫలితంగా చిన్న ప్రాజెక్టులకే అతణ్ని పరిమితం చేసి, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను ఇతర టీం సభ్యులకు ఇచ్చారు. చాలా కష్టపడి పని చేస్తున్నప్పటికీ తనకెందుకు తగిన గుర్తింపు రాలేదోనని ఆలోచనలో పడ్డాడు.

కార్పొరేట్ సంస్థల్లో అప్రకటిత నియమాలు ఉంటాయనీ, వీటిని అర్థం చేసుకుని అనుసరించడం పెద్ద సవాల్ అనీ గ్రహించడానికి కొంత సమయం పట్టింది రాజేష్‌కి. ఇతడిలాంటి వారు గమనించాల్సిన అంశాలను తెలుసుకుందాం!

మీ పరిమితి దాటవద్దు: 'స్వేచ్ఛా సంస్కృతి' కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల వ్యవహార శైలిలో భాగమే. అయినప్పటికీ ఉద్యోగి ప్రవర్తన, మాట తీరు, పనితీరు ముఖ్యం. ఉన్నతాధికారులూ, సహోద్యోగులతో జరిపే సంభాషణల్లో తన పరిమితులు తెలుసుకుని మెలగాలి. ఉదా: నవీన్ బీకాం గ్రాడ్యుయేట్. హై ఎనర్జీ, కాన్ఫిడెన్స్‌తో ప్రముఖ కార్పొరేట్ సంస్థలో డైరెక్టర్ హెచ్ఆర్‌కు ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా చేరాడు. సంస్థలోని ఉద్యోగులు అతడితో స్నేహపూర్వకంగా మెలిగేవారు. దీన్ని అవకాశంగా తీసుకొని అధికారులను పేర్లతోనూ, 'హేయ్ బ్రో' అంటూ సంబోధించేవాడు. సీనియర్లతో జోక్స్ వేసేవాడు. అతని ప్రవర్తనతో అసౌకర్యానికి గురైన ఉద్యోగులు నవీన్ గురించి తమ అభిప్రాయాలను యాజమాన్యానికి తెలపడంతో అతణ్ని ఏమాత్రం ప్రాధాన్యం లేని మరో శాఖకు బదిలీ చేశారు.

సూక్ష్మ అంశాలపై దృష్టి- విశ్వసనీయత: కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం అంటే అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన అవగాహనతో పనిచేయాలి. ఇది ఉద్యోగి విశ్వసనీయతనూ, ఉద్యోగంలో అతని బాధ్యతనూ తెలుపుతుంది. మీలో నైపుణ్యం ఉన్నప్పటికీ మీరు ఎంత విశ్వసనీయతతో పనిచేస్తున్నారన్నది ముఖ్యం. ఈ ప్రవర్తన నియమాలు లిఖితపూర్వకంగా ఉండవు. కార్పొరేట్ సంస్థల్లో విజయవంతమైన ఉద్యోగ జీవితానికి కీలకమైన అప్రకటిత నియమాల్లో సూక్ష్మ అంశాలపై దృష్టి పెట్టడం ఒక ముఖ్యమైన అంశమే.

చిన్న విషయాలు విస్మరించవద్దు: గొప్ప లక్ష్యాల సాధనకు పనిచేస్తున్నప్పుడు కొన్ని అంశాలు మీ దృష్టికి వచ్చినప్పటికీ 'పెద్ద ప్రాజెక్టు చేస్తున్నాం కదా.. ఈ చిన్న విషయం పాటించకపోతే ఏమీ కాదులే' అని వాటిని విస్మరించవద్దు. పనిలో నాణ్యత, వృత్తిపరమైన నిర్ణయాలు తీసుకోవడం లాంటి విలువైన అంశాలు కార్పొరేట్ రంగంలో మీ పనిని ప్రభావితం చేస్తాయి. వీటిని గురించి ఆలోచించే క్రమంలో చిన్న చిన్న అంశాలు మరుగునపడిపోతాయి. కొన్నిసార్లు ఇలాంటి చిన్న చిన్న విషయాలు కెరియర్‌పై స్పష్టమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఉన్నత లక్ష్యాలతో కార్పొరేట్ వాతావరణంలో అడుగుపెట్టే యువ గ్రాడ్యుయేట్స్ దృష్టి గొప్ప లక్ష్యాలను సాధించడంపైనే ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని విషయాలు ప్రాధాన్యం లేనివిగా అనిపించవచ్చు.

ఉదా: అరవింద్ ఒక కార్పొరేట్ సంస్థలో టాలెంట్ అక్విజిషన్ శాఖలో ట్రెయినీగా చేరాడు, 100% టైమ్ లైన్స్ పాటిస్తూ, నిపుణుడైన ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే తన వ్యక్తిగత ప్రవర్తన, వ్యక్తిగత పరిశుభ్రతలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, డ్రెస్సింగ్ సెన్స్ లేకపోవడంతో కార్పొరేట్‌కు సూట్ కాలేకపోయాడు.

గోప్యత పాటించడం: సంస్థకు సంబంధించిన వ్యాపార లావాదేవీలు, క్లయింట్ల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవడం ఉద్యోగి బాధ్యత. స్నేహితులూ, బంధువుల దగ్గర సరదాగా జరిపే సంభాషణల్లో సంస్థ లోపలి వ్యవహారాలను ప్రస్తావిస్తే, అప్రయత్నంగా మీ నుంచి కొంత సమాచారం ఇతరులకు చేరే అవకాశం ఉంది. ఇది సంస్థ గోప్యతా నియమాలను ఉల్లంఘించినట్టే. కొన్నిసార్లు చట్టపరమైన చర్యలకూ బాధ్యులవుతారు. సున్నితమైన సమాచారాన్ని గోప్యంగా ఉంచగలిగిన వారికి కార్పొరేట్ సంస్థలు ప్రాధాన్యమిస్తాయి. అటువంటి అభ్యర్థులను తమ ఉద్యోగులుగా కార్పొరేట్ యాజమాన్యాలు కోరుకొంటాయి.

సెల్ఫ్ ప్రమోషన్ వ్యూహాత్మకంగా: గట్టి పోటీ ఉండే కార్పొరేట్ రంగంలో ఉద్యోగం సంపాదించి, ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రతిభ, నైపుణ్యాలను వ్యూహాత్మకంగా, వాస్తవాల ఆధారంగా, సమయోచితంగా తెలియచెప్పాలి. మీ బలాలు, ప్రత్యేకతలతో సంస్థకు ఎలాంటి విలువ చేకూర్చగలరో తెలుపగలగాలి. ఉదా: మేఘన మార్కెటింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్. తాను ఒక మార్కెటింగ్ ఈవెంట్‌కు హాజరై తనను తాను మార్కెటింగ్ వృత్తి నిపుణులకు పరిచయం చేసుకొని తన గురించి 'ఎలివేటర్ పిచ్' తయారు చేసుకుంది. స్పష్టంగా తక్కువ సమయంలో తన నైపుణ్యాలను మార్కెట్ చేసుకొంది. ఫలితంగా ఆమెకు ఒక కార్పొరేట్ సంస్థ మార్కెటింగ్ శాఖలో అవకాశం ఇచ్చింది.

ఫీడ్ బ్యాక్‌తో సరిదిద్దుకోవడం: వృత్తిలో అభివృద్ధి సాధించేందుకు 'ఫీడ్ బ్యాక్' ఒక ప్రాథమిక సాధనం. మీ పని పద్ధతులు, ప్రవర్తనలకు ఇతర ఉద్యోగులు ఎలా స్పందిస్తున్నారన్నది ముఖ్యం. మన ప్రవర్తనపై ఇతరుల ఫీడ్ బ్యాక్ సానుకూలంగా ఉండాలన్న నియమం లేదు. నిజానికి నెగటివ్ ఫీడ్ బ్యాక్‌ను సానుకూలంగా స్వీకరించి, సరిదిద్దుకోవడం ద్వారా మీరు అభివృద్ధి కోరుకొంటున్నారని మీ టీంకు తెలియజెప్పండి. మీ వృత్తిగత ప్రవర్తనలోని వివిధ అంశాలపై మీ సహోద్యోగుల, మిత్రుల నిర్మాణాత్మక ఫీడ్ బ్యాక్ స్వీకరించడమన్నది మీ ఎదుగుదల పట్ల మీకున్న నిబద్ధతను సూచిస్తుంది.

ఈ నియమాలు ఎక్కడా స్పష్టంగా తెలపరు. అయితే ఏ సంస్థలో చూసినా ఉద్యోగుల మధ్య మానవ సంబంధాలనూ, పని తీరునూ ప్రభావితం చేయడంలో ఇవే కీలకమైన పాత్ర పోషిస్తాయి. ఈ మార్గదర్శకాలను పాటిస్తే కార్పొరేట్ సంస్థలకు కావలసిన ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుంది.



దొరైరాజ్
ప్రముఖ కార్పొరేట్ సంస్థలో సీనియర్ జనరల్ మేనేజర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బీఓబీలో 330 పోస్టులు

గుజరాత్ రాష్ట్రం వడోదరలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల శాఖల్లో 330 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. డిప్యూటీ మేనేజర్: 22
2. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్-1: 8
3. అసిస్టెంట్ మేనేజర్: 300

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సిస్టమ్/ సైబర్ సెక్యూరిటీ రిస్క్/ ఫైనాన్స్/ రిస్క్ మేనేజ్‌మెంట్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/ సైబర్ సెక్యూరిటీ/ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్)తో పాటు పని అనుభవం.
వయసు: 23 ఏళ్ల నుంచి 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: అర్హతలు, అనుభవం ప్రకారం.
దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌కు రూ.850. ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎం/ మహిళలకు రూ.175.
ఎంపిక: ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలతో.

125 మేనేజర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన 125 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మేనేజర్: 23 ● సీనియర్ మేనేజర్: 85
- చీఫ్ మేనేజర్: 17

విభాగాలు: ఫారెక్స్ అక్విజిషన్ & రిలేషన్‌షిప్, క్రెడిట్ అనలిస్ట్, సీనియర్ మేనేజర్ - క్రెడిట్ అనలిస్ట్, ఎంఎస్ఎంఈ క్రెడిట్, ఇంటర్నల్ కంట్రోల్స్, బిజినెస్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఈఎస్‌జీ, రిస్క్ మేనేజ్‌మెంట్ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ (అనలిటిక్స్, డేటా సైన్స్, ఫైనాన్స్ లేదా అకౌంటింగ్)తో పాటు పని అనుభవం.
వయసు: 24 నుంచి 42 ఏళ్ల మధ్యలో ఉండాలి.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎం/ డీఈఎస్ఎం/మహిళలకు రూ.175; ఓబీసీ/జనరల్‌కు రూ.850.
ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఈ రెండు పోస్టులకూ....
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 19.08.2025.
వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో మేనేజర్లు

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 29 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఎలక్ట్రికల్): 04
2. మేనేజర్ (ఎలక్ట్రికల్): 07
3. డిప్యూటీ మేనేజర్ (మేనేజర్): 07
4. అసిస్టెంట్ మేనేజర్ (ఎలక్ట్రికల్): 11

అర్హత: పోస్టును అనుసరించి బీఈ/ బీటెక్ (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్), డిప్లొమాతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 48 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ, అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు.
వేతనం: నెలకు సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000, మేనేజర్‌కు రూ.50,000 - రూ.1,60,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 - రూ.1,40,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.30,000 - రూ.1,20,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీలకు రూ.400. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://rvnl.org/job

నిఫ్టెమ్ తంజావూరులో..

తంజావూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్ & మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఒప్పంద ప్రాతిపదికన 13 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ రిసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ): 01 ▸ సీనియర్ రిసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్): 05 ▸ యంగ్ ప్రొఫెషనల్: 05 ▸ కార్పొరేట్ రిలేషన్ మేనేజర్: 01 ▸ ఫుడ్ అనలిస్ట్: 01

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, ఎంటెక్/ పీహెచ్‌డీ, బీటెక్ లేదా బీఈతో పాటు పని అనుభవం.
వయసు: ఆర్ఏకు 40 నుంచి 45 ఏళ్లు, ఎస్ఆర్ఎఫ్‌కు 35 నుంచి 40 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్‌కు 45 ఏళ్లు, ఫుడ్ అనలిస్ట్‌కు 52 ఏళ్లు, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్‌కు 55 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెలకు కార్పొరేట్ రిలేషన్ మేనేజర్‌కు రూ.1,00,000, ఎస్ఆర్ఎఫ్‌కు రూ.42,000, యంగ్ ప్రొఫెషనల్, ఫుడ్ అనలిస్ట్‌లకు రూ.60,000, రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.61,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.08.2025
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://niftem-t.ac.in/

విశాఖపట్నం మెడికల్ కాలేజీలో..

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాలేజీ విశాఖపట్నం ఒప్పంద & ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 71 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్: 01 ▸ మెడికల్ ఫిజిసిస్ట్: 02
▸ రేడియో థెరపీ టెక్నీషియన్: 02 ▸ మౌల్డ్ రూమ్ టెక్నీషియన్: 01 ▸ అనస్తీషియా టెక్నీషియన్: 06 ▸ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్: 03 ▸ రిసెప్షనిస్ట్: 01 ▸ జనరల్ డ్యూటీ అటెండెంట్: 21 ▸ ఆఫీస్ సబార్డినేట్స్: 04 ▸ టైపిస్ట్/డీఈఓ/ కంప్యూటర్ ఆపరేటర్: 01 ▸ వార్డెన్స్ (ఫిమేల్): 03
▸ లైబ్రరీ అటెండెంట్: 02 ▸ క్లాస్ రూమ్ అటెండెంట్: 01
▸ ప్రొస్థెటిక్ & ఆర్థో టెక్నీషియన్: 05 ▸ కుక్స్: 04
▸ అంబులెన్స్ డ్రైవర్స్: 03 ▸ హాస్టల్ అటెండెంట్(ఫిమేల్): 03
▸ సీ-ఆర్మ్ టెక్నీషియన్: 01 ▸ ఈఈజీ టెక్నీషియన్: 01
▸ స్పీచ్ థెరపిస్ట్: 02

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ (బీఎస్సీ), డిప్లొమా, ఇంటర్, పదో తరగతి, పీజీ, ఎంఎస్/ఎండీ, పీజీడీఎంతో పాటు పని అనుభవం.
వయసు: పోస్టులను అనుసరించి జనరల్, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 42 ఏళ్ల నుంచి 52 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్, మెడికల్ ఫిజిసిస్ట్‌లకు రూ.61,960, టెక్నీషియన్‌కు రూ.32,670, జూనియర్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్, టైపిస్ట్/డీఈఓ/ కంప్యూటర్ ఆపరేటర్, వార్డెన్‌లకు రూ.18,500, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్స్, లైబ్రరీ అటెండెంట్, క్లాస్ రూమ్ అటెండెంట్‌లకు రూ.15,000, ప్రొస్థెటిక్ అండ్ ఆర్థో టెక్నీషియన్‌కు రూ.21,500.
ఆఫ్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 03.08.2025
చిరునామా: అడ్మిన్ బిల్డింగ్, ఆంధ్ర మెడికల్ కాలేజ్.
దరఖాస్తు ఫీజు: ఓసీలకు రూ.500, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎంకు రూ.350.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో .
వెబ్‌సైట్: https://amc.edu.in/recruitment/



వాక్-ఇన్స్


మనూలో కేర్‌టేకర్ కొలువులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) ఒప్పంద ప్రాతిపదికన 6 కేర్‌టేకర్ (పురుష) ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీతో పాటు కంప్యూటర్, ఉర్దూ పరిజ్ఞానం, ఉద్యోగ అనుభవం.
వయసు: 32 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.24,525.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 05.08.2025
వేదిక: కమిటీ రూమ్, యూనివర్సిటీ గెస్ట్ హౌస్, మనూ క్యాంపస్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ.
వెబ్‌సైట్: https://manuu.edu.in/notifications/Employment

ల్యాండ్ మ్యాపింగ్ కోర్సు చేయాలంటే?

ఇంటర్ (ఎంపీసీ) రెండో ఏడాదిలో ఉన్నాను. సర్వే ల్యాండింగ్, ల్యాండ్ మ్యాపింగ్ కోర్సు చేయాలనుంది. దీనికి ఎలాంటి అర్హతలు ఉండాలి? ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? – బి.మనోజ్

■ ల్యాండ్ మ్యాపింగ్ అంటే భూముల పరిమితులు, ఆకారాలు, ఉపయోగాలు, భౌగోళిక వివరాలను గుర్తించి మ్యాప్ రూపంలో చూపించే ప్రక్రియ. ముఖ్యంగా సర్వే ల్యాండ్ మ్యాపింగ్, డిజిటల్ మ్యాపింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్), రిమోట్ సెన్సింగ్, డ్రోన్ మ్యాపింగ్ వంటి పద్ధతుల ద్వారా దీన్ని రూపొందిస్తారు. ఎంపీసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) నేపథ్యం ఉన్న విద్యార్థులు సాంకేతికత నేర్చుకునే ఉత్సాహం ఉంటే ల్యాండ్ మ్యాపింగ్ రంగంలో మంచి భవిష్యత్తు ఉంది. ముఖ్యంగా డ్రోన్ లాండ్స్ సర్వే, క్యాడ్ /జీఐఎస్ అనలిస్ట్, ల్యాండ్ డాక్యుమెంటేషన్, రెవెన్యూ మ్యాపింగ్ వంటి పనుల్లో శిక్షణ పొందితే ఉద్యోగావకాశాలు ఉంటాయి.



ప్రభుత్వ రంగంలో.. రాష్ట్ర రెవెన్యూ శాఖలో, భూ సర్వే విభాగాల్లో, పురపాలక శాఖల్లో, గ్రామ పంచాయతీల్లో ల్యాండ్ మ్యాపింగ్ స్పెషలిస్టుల అవసరం ఉంటుంది. ప్రైవేటు రంగంలో రియల్ ఎస్టేట్ కంపెనీలు, అగ్రికల్చరల్ టెక్నాలజీ సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు నిర్వహించే సంస్థలు కూడా ల్యాండ్ మ్యాపింగ్ నిపుణులను నియమించుకుంటాయి. ఈ రంగంలో ప్రవేశించాలంటే ఐటీఐలో సర్వేయింగ్ కోర్సు కానీ, పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా కానీ, బీవొక్‌లో సర్వేయింగ్ కానీ చదివితే ఉపయోగకరం. తర్వాత డ్రోన్ మ్యాపింగ్ ట్రెయినింగ్, జీఐఎస్‌లో డిప్లొమా/ సర్టిఫికెట్/స్వల్పకాలిక టర్మ్ కోర్సులు కూడా చేయాలి. మంచి సంస్థ నుంచి సరైన శిక్షణ పొందితే ల్యాండ్ మ్యాపింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

రిక్రూట్‌మెంట్ కన్సల్టెంట్

సంస్థ: సేపియంట్ హంట్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్, రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.6,000-7,500
☛ https://shorturl.at/PKDg8

క్రియేటివ్ డిజైన్

సంస్థ: ఎలోక్ గ్లోబల్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/JXPgH

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: వాల్ స్ట్రీట్ మోజో
నైపుణ్యాలు: మార్కెటింగ్ స్ట్రాటజీ, సేల్స్. మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ, సపోర్ట్
స్టైపెండ్: రూ.10,000-55,000
☛ https://shorturl.at/8Y7z

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: హెచ్‌వైపీఆర్4 క్లౌడ్ టెక్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/GV9Ww

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: ఇన్నోవోన్ టెక్నాలజీస్ ప్రై.లి
నైపుణ్యాలు: ఏఐ, సీఎస్ఎస్, గిట్‌హబ్, హెచ్‌టీఎంఎల్, జావా, జావాస్క్రిప్ట్, మెషిన్ లెర్నింగ్, పైతాన్, రియాక్ట్, ఎస్క్యూఎల్
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://shorturl.at/495iB

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 15

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: సేఫ్టీ కనెక్ట్
నైపుణ్యాలు: డిజిటల్, కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 14
☛ https://shorturl.at/MueNA

టాలెంట్ అక్విజిషన్

సంస్థ: సైకం కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, అటెన్షన్ టు డీటెయిల్, కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, కోఆర్డినేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ఇంటర్వ్యూ కోఆర్డినేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, నెగోషియేషన్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమే స్క్రీనింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000-13,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
☛ https://shorturl.at/Fnghv

ఆంత్రప్రెన్యూర్ ఇన్ రెసిడెన్స్

సంస్థ: ఎస్ఎన్ఐటీ
నైపుణ్యాలు: ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.25,000-30,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 21
☛ https://shorturl.at/NNZiA

హైదరాబాద్‌లో

ఈవెంట్ హోస్ట్

సంస్థ: ఫాంటసీ ఫ్లోరా ఈవెంట్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.2,000-2,500
☛ https://shorturl.at/MyT2V

హ్యూమన్ రిసోర్స్ ట్రెయినీ

సంస్థ: 8 వ్యూస్ నైపుణ్యాలు: అడ్వాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, రిక్రూట్‌మెంట్ స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/zQMzj

రోబోటిక్స్ ట్రెయినర్

సంస్థ: లీప్ రోబోస్
నైపుణ్యాలు: అడ్వినో, సీ ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ సీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రాస్‌బెర్రీ పై, రోబోటిక్స్
స్టైపెండ్: రూ.10,000-12,000
☛ https://bit.ly/4lCkKLT

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 22

(c) eenadu

దేశాభివృద్ధిలో పట్టణాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి వృద్ధికి పునాదులుగా.. ఆర్థిక, రాజకీయ, పరిపాలనకు కేంద్రాలుగా ఉన్నాయి. పట్టణాలు, నగరాల్లో జనాభా నానాటికీ పెరిగిపోతోంది. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం, సౌకర్యాలు, ఆధునిక జీవనశైలి మొదలైనవన్నీ దీనికి దోహదం చేస్తున్నాయి. దీంతో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ వనరులు తగ్గి, జనాభా ఎక్కువవుతోంది. వసతుల కల్పన, ప్రజల అవసరాలను తీర్చడం ప్రభుత్వాలకు పెద్ద సవాలే. వీటిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీస్ మిషన్‌ను ప్రారంభించింది. దీని అమలు, లక్ష్యాలపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.



'స్మార్ట్' నగరాలతో.. సవాళ్లకు అడ్డుకట్ట!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

పట్టణ మౌలిక సదుపాయాలు - స్మార్ట్ సిటీస్ మిషన్

ప్రస్తుతం దేశ జనాభాతో పాటు జనాభాలో అక్షరాస్యుల సంఖ్య పెరుగుతోంది. దీంతో విద్య, ఉపాధి, ఉద్యోగం, ఆరోగ్యం, వివిధ సౌకర్యాల కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు ఎక్కువయ్యాయి. పట్టణాల్లోనే నివాసాలు ఏర్పరచుకోవడం పెరిగిపోయింది.

✦ 1991 జనాభా లెక్కల ప్రకారం.. పట్టణ ప్రాంతాలు అంటే కనీసం 5000 మంది జనాభా ఉండి, చదరపు కిలో మీటరుకు 400 మంది జనసాంద్రత ఉన్న మున్సిపల్ కార్పొరేషన్, కంటోన్మెంట్ బోర్డు, నోటిఫైడ్ పట్టణ ప్రాంతాలు. దేశ పట్టణీకరణను పరిశీలిస్తే 1901లో పట్టణ జనాభా 10% ఉండగా 1951లో 17.5%, 2001లో 27.8%, 2011లో 31%కి పెరిగింది. 2030 నాటికి 40% పైగా ఉంటుందని అంచనా.

స్మార్ట్ సిటీస్

పట్టణాలు, నగరాల్లో నివసించే జనాభాకు కావాల్సినంత నీటి సరఫరా, నిరంతర విద్యుత్, సరైన పారిశుద్ధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, సమర్థ పట్టణ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం స్మార్ట్ సిటీస్ ప్రధాన ఉద్దేశం.

▮ ఇప్పటికే ఉన్న పట్టణ/ నగరాల నివాసయోగ్యత, సామర్థ్యాలను మెరుగుపరచడం - ఆధునికీకరించడం; విస్తరిస్తున్న పట్టణ జనాభాకు అనుగుణంగా ఖాళీ ప్రదేశాల్లో స్మార్ట్ వాటర్, స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విద్యుత్, నీటి వినియోగానికి స్మార్ట్ మీటరింగ్, నిఘా, భద్రతా వ్యవస్థలను మెరుగుపరచడం లాంటివాటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది.

▮ ముఖ్యంగా పౌరులను భాగస్వాములను చేయడంతోపాటు.. ప్రభుత్వ పథకాలను స్మార్ట్ సిటీస్ మిషన్ మౌలిక సదుపాయాలతో అనుసంధానిస్తారు. అందరికీ గృహనిర్మాణం, స్వచ్ఛభారత్ మిషన్ లాంటి పథకాలను అమలు చేస్తారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పెట్టుబడులను ఆకర్షించి కొత్త కార్యక్రమాలు, ఆవిష్కరణలు చేపడతారు. సుస్థిరాభివృద్ధి కోసం పునరుత్పాదక ఇంధన వనరులు, ఇంధన సామర్థ్యం పెంచడం, నీటి సంరక్షణ, హరిత నిర్మాణాలు చేపట్టడం, ఇంటిగ్రేటెడ్, మల్టీమోడల్ రవాణా వ్యవస్థలు, స్మార్ట్ ట్రాఫిక్ నిర్వహణ లాంటి సౌకర్యాలను, మౌలిక సదుపాయాలను ప్రోత్సహించడం చేస్తారు.

స్మార్ట్ సిటీస్ మిషన్

ప్రధాని నరేంద్రమోదీ 2015, జూన్ 25న స్మార్ట్ సిటీస్ మిషన్‌ను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 100 నగరాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంతో పాటు సమర్థవంతమైన సేవలు, మౌలిక సదుపాయాల కల్పన దీని ప్రధాన లక్ష్యం.

❖ దీని ద్వారా ఇప్పటికే ప్రభుత్వం ఎంచుకున్న 100 నగరాల్లో గణనీయమైన పురోగతి నమోదైంది. ఈ మిషన్ ప్రారంభంలో రూ.1,64,404 కోట్ల విలువైన 8067 ప్రాజెక్టులు ప్రతిపాదించారు. 2025 మే 9 నాటికి వాటిలో రూ.1,51,361 కోట్ల విలువైన 7,555 ప్రాజెక్టులు (94%) పూర్తయ్యాయి. ఇంకా రూ.13,043 కోట్ల విలువైన 512 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి.

❖ స్మార్ట్ సిటీస్ మిషన్ కోసం కేంద్రం 2025-26 బడ్జెట్‌లో మొత్తం రూ.47,652 కోట్లు కేటాయించింది. 2025 మార్చి 31 నాటికి మొత్తం బడ్జెట్ వ్యయంలో 99.44% స్మార్ట్ సిటీస్ మిషన్‌లోని 100 నగరాలకు విడుదలైంది. కేంద్ర వాటాకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యాలు తమ వాటా నిధులను దీనికి జమ చేయాలి. దీంతో మొత్తం పెట్టుబడి విలువ 1.64 లక్షల కోట్లకు చేరింది.

అమలు విధానం

స్మార్ట్ సిటీస్ మిషన్‌ను ముఖ్యంగా రెండు విధానాల్లో అమలు చేస్తారు. అవి: 1. ఏరియా బేస్డ్ డెవలప్‌మెంట్ (ఏబీడీ) 2. పాన్ - సిటీ (PAN - City)

☛ ఏరియా బేస్డ్ డెవలప్‌మెంట్ (ఏబీడీ) విధానంలో పట్టణాల అభివృద్ధిలో ప్రజలను ఎక్కువగా భాగస్వాములను చేస్తారు. ఇందులో నగరంలోని కొన్ని ప్రాంతాలను ఎంపిక చేస్తారు. వాటిని ఇతర ప్రాంతాలకు ప్రతిరూప నమూనాలుగా అభివృద్ధి చేస్తున్నారు.

☛ పాన్ -సిటీ ప్రాజెక్టు ద్వారా పట్టణాల్లోని మౌలిక సదుపాయాలు, సాంకేతిక ఆధారిత పరిష్కారాల సేవలను మెరుగుపరుస్తారు.

ఉదా: చండీగఢ్ 310 డాకింగ్ స్టేషన్లు, 2500 కంటే ఎక్కువ సైకిళ్లతో భారతదేశంలోనే అతిపెద్ద, అత్యంత సాంద్రత కలిగిన పాన్ - సిటీ పబ్లిక్ సైకిల్ షేరింగ్ (పీబీఎస్) వ్యవస్థను అమలు చేస్తుంది. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు, ప్రజారోగ్యాన్ని ప్రోత్సహించడంలో దోహదపడింది.

సాధించిన విజయాలు (2025 మార్చి 31 నాటికి)

ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు (ఐసీసీసీ): మొత్తం 100 స్మార్ట్ సిటీల కార్యాచరణను ఐసీసీసీ అమలు చేస్తోంది. సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి ఉపయోగపడతాయి. కరోనా సమయంలో వార్ రూమ్స్‌లా ఇవి పనిచేశాయి. ఏఐ, ఇన్ఫర్మేషన్ అండ్ డిజిటల్ టెక్నాలజీ (ఐటీడీ), డేటా అనలిటిక్స్ లాంటి సాంకేతికతలను సముగ్రపరచడం ద్వారా రవాణా, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ లాంటి కార్యకలాపాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

ప్రజా రక్షణ, భద్రత: 100 స్మార్ట్ సిటీలలో 84,000 కంటే ఎక్కువ ప్రాంతాల్లో నేరాల పర్యవేక్షణ సహాయపడే సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదనంగా 1884 అత్యవసర కాల్ బాక్సెస్, 3000 పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్ ఫర్ రెడ్‌లైట్ వయొలేషన్స్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపులను నెలకొల్పడం ద్వారా ప్రజా భద్రతను పెంచారు.

నీటి సరఫరా: 28 నగరాల్లో రోజుకు 2,900 కంటే ఎక్కువ మిలియన్ లీటర్ల (Million Liters Per Day - MLD) తాగునీటి శుద్ధి సామర్థ్యాన్ని అభివృద్ధి చేశారు. Supervision Control and Data Acquisition (SCADA) ద్వారా 17026 కి.మీ. కంటే ఎక్కువ నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు. నాన్ రెవెన్యూ వాటర్, లీకేజీలను తగ్గిస్తున్నారు.

ఉత్సాహభరితమైన ప్రజా స్థలాలు (Vibrant Public Spaces): 84 స్మార్ట్ సిటీలలో పబ్లిక్ స్పేసెస్‌కు ప్రాధాన్యమిస్తూ 1320కి పైగా ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు. 62 స్మార్ట్ నగరాల్లో 318 కి.మీ. మేర జలతీరాలను అభివృద్ధి చేశారు. అదనంగా 55 స్మార్ట్ నగరాలు, 484 వారసత్వ కట్టడాల పరిరక్షణను పూర్తి చేశారు.

మురుగు నీటి నిర్వహణ: 27 నగరాలు ప్రతిరోజు 1370 మిలియన్ లీటర్ల మురుగునీటి శుద్ధి సామర్థ్యాన్ని సాధించాయి. వీటిలో 673 మిలియన్ లీటర్లను గార్డెనింగ్, పారిశ్రామిక అవసరాల కోసం తిరిగి ఉపయోగిస్తున్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ: 66కి పైగా నగరాలు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, రూట్ నిర్వహణ, సేకరణ సామర్థ్యం, రోజువారీ నిర్వహణను మెరుగుపరచడం ద్వారా ఘన వ్యర్థాలను నిర్వహిస్తున్నాయి.

◆ ఘన వ్యర్థాల నిర్వహణ సామర్థ్యాన్ని డిజిటలైజ్ చేయడానికి, మెరుగుపరచడానికి ఆటోమేటిక్ వెహికల్ లొకేషన్ (ఏవీఎల్) కోసం దాదాపు 9,194 వాహనాలకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ)ని ప్రారంభించారు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 727

Haggard

Telugu meaning: క్షీణించిన, అలసిపోయిన

English meaning: The word 'haggard' (హ్యాగర్డ్) is an adjective that describes someone looking tired, worn out, or exhausted, especially from worry or suffering.

Synonyms: Exhausted, Weary

Antonyms: Fresh, Energetic

Usage: **1.** After days without sleep, he appeared haggard and pale.

2. The refugees looked haggard after their long and dangerous journey.

Latest Updates

Security Assistant/Executive Posts

The Intelligence Bureau (IB), Ministry of Home Affairs, Government of India, invites online applications from Indian nationals for direct recruitment to Security Assistant/Executive (SA/Exe) posts across various Subsidiary Intelligence Bureaux (SIBs). The total no. of posts is 4987. The application fee is Rs.650. The last date for online applications is 17 August 2025.

Manager Posts

National Aluminium Company Limited (NALCO), Bhubaneswar, is inviting applications for the posts of Deputy Manager in various departments. The total no.of posts is 32. Eligible candidates can apply online before 11th August 2025.

Project Personnel Posts

CSIR-Central Electrochemical Research Institute, Karaikudi, Tamil Nadu State, is conducting interviews for the recruitment of personnel posts in projects in the relevant departments temporarily. The total no. of posts is 14. The interview date is 11 August 2025.

Did You Apply..?

Today (July 31) is the last date for the following jobs

☛ 30 Apprentice posts in IRCON. ***Eligibility:*** Degree.

☛ 80 posts in BOB Capital Markets Limited. ***Eligibility:*** Degree.


☛ 50 posts in Munitions India Limited.

☛ AIIMS Common Recruitment Examination (CRE) 2025

☛ UPSC Recruitment Notification 2025 - 24 Posts. ***Eligibility:*** M.Sc.

For more information and other notifications - scan QR code

సింధు నాగరికత - ప్రధాన నగరాలు



సింధు నాగరికతను తొలి భారతీయ, మూలభారతీయ నాగరికతగా పేర్కొంటారు. దీన్ని ద్రావిడులు నిర్మించారు. క్రీ.పూ.2500 నుంచి క్రీ.పూ.1750 కాలంలో ఇది విలసిల్లింది. 1921-22లో సింధు మైదానంలో జరిపిన తవ్వకాల్లో రెండు పురాతన మహా నగరాల శిథిలాలు బయటపడ్డాయి. వాటిలో ఒకటి మొహెంజొదారో, మరొకటి హరప్పా. ఈ రెండూ భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని మొదటి నగరాలు కూడా.

▮ పురావస్తు పరిశోధకుల తవ్వకాల్లో సింధు నది ఒడ్డున ఉన్న మొహెంజొదారో, దానికి ఎగువన హరప్పా బయటపడటం వల్ల ఈ రెండు పురాతన నగరాల నాగరికతను సింధు నాగరికతగా వ్యవహరించారు. ఈ రెండు నగరాల్లోనే కాకుండా సింధు నదీ లోయలోని మరికొన్ని స్థలాల్లోనూ ఇలాంటి నాగరికతే బయటపడటం వల్ల సింధునది నాగరికత అన్నారు. దీన్నే హరప్పా నాగరికతగానూ వ్యవహరిస్తున్నారు. మొహెంజొదారో, హరప్పా ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్నాయి.

స్టడీ - జోన్

▮ సింధు నాగరికత దాదాపు 1000 ప్రాంతాల్లో విస్తరించింది. ఇప్పటి ప్రాదేశిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకుంటే దాదాపు మొత్తం పంజాబ్ (భారత్, పాకిస్థాన్ దేశాల్లోని); హరియాణా; పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్; ఉత్తర రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు; సింధు; గుజరాత్; ఈశాన్య, దక్షిణ బెలూచిస్థాన్ ప్రాంతాల్లో సింధు నాగరికత విస్తరించింది. ఉప హిమాలయ పర్వత పాద ప్రాంతాలైన మాండా (జమ్మూ కశ్మీర్‌లోనిది), రూపార్, చండీగఢ్ వరకు ఈ నాగరికత విస్తరించింది.


సింధు నాగరికత కాలంలో బయటపడిన ప్రధాన నగరాలను పరిశీలిస్తే..

ప్రదేశం	ప్రస్తుత ప్రాంతం	తవ్వకం చేపట్టిన వ్యక్తి	సంవత్సరం
హరప్పా	మాంటిగోమరి (పాకిస్థాన్)	దయారాం సాహ్ని	1921
మొహెంజోదారో	సింధ్ - లార్కానా (పాకిస్థాన్)	ఆర్.డి.బెనర్జీ	1922
సుత్కాజెండర్	బెలూచిస్థాన్ (పాకిస్థాన్ - ఇరాన్ సరిహద్దు)	ఒ. స్టెయిన్	1927
చన్హుదారో	సింధ్ (పాకిస్థాన్)	ఎన్.జి.మజుందార్	1931
కాళీబంగన్	గంగానగర్ (రాజస్థాన్)	బి.బి.లాల్, ఎ.ఎన్.ఘోష్	1953
రంగపూర్	అహ్మదాబాద్ (గుజరాత్)	ఎం.ఎస్.వాట్స్	1953
కోట్‌దీజీ	సింధ్ (పాకిస్థాన్)	ఫజల్ అహ్మద్ ఖాన్	1955
రూపర్	పంజాబ్ (భారతదేశం)	యాగ్యాదత్ శర్మ	1955-56
లోథాల్	అహ్మదాబాద్ (గుజరాత్)	ఎస్.ఆర్.రావు	1957
మిట్టతల్	భివాని (హరాయాణా)	సూరజ్ ఖాన్	1968
సుర్కోటడా	కచ్ (గుజరాత్)	జగత్పతి జోషి	1972
బన్వాలీ	హిస్సార్ (హరియాణా)	ఆర్.ఎస్.విస్తా	1973-74

www.epratibha.net

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు - జలమార్గాలు



రవాణా మార్గాల్లో జలరవాణా కీలకపాత్ర పోషిస్తోంది. ఏళ్లుగా అంతర్జాతీయ వాణిజ్యం నీటిపైనే జరుగుతోంది. సరకు రవాణా, వాణిజ్యానికి ఇది అత్యంత అనుకూలం. ఆర్థికానికి ఊతంగా నిలుస్తుంది. సముద్రాలు, నదులు, కాలువల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. ఈ మార్గం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక పరిమాణంలో సరకు ఎగుమతి, దిగుమతులను నిర్వహించవచ్చు. దేశంలోని జలమార్గాలు, వాణిజ్యం, ప్రధాన ఓడరేవుల గురించి పోటీపరీక్షార్థులు తెలుసుకోవాలి.

రకాలు

జలమార్గాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..
1. అంతఃస్థలీయ జల మార్గాలు 2. జాతీయ జల మార్గాలు

జలమార్గ్ వికాస్ ప్రాజెక్టు

ఇది NW-1 సామర్థ్యాన్ని పెంచడానికి ఉద్దేశించింది.

✦ దీని అమలుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని వరల్డ్ బ్యాంక్ అందిస్తోంది.

సాగరమాల ప్రాజెక్టు

ఈ ప్రాజెక్టు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాలనలో ఉద్భవించింది. దీన్ని 2015లో ప్రారంభించారు.

పశ్చిమ తీర ఓడరేవులు

- ✦ కాండ్లా ఓడరేవు
- ✦ ముంబయి ఓడరేవు
- ✦ నవసేన ఓడరేవు
- ✦ మర్మగోవా ఓడరేవు
- ✦ న్యూమంగళూర్ ఓడరేవు
- ✦ కొచ్చిన్ ఓడరేవు

దేశంలోని జాతీయ జలమార్గాలు, హుగ్లీడాక్ అండ్ పోర్ట్ ఇంజనీర్స్ లిమిటెడ్, ప్రధాన ఓడరేవులు, తూర్పు తీర ప్రధాన ఓడరేవులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Renowned British Indian economist and House of Lords peer, Meghnad Desai, died on 29 July 2025 at the age of 85. Born in Vadodara in 1940, Desai completed his PhD in economics from the University of Pennsylvania in 1963.

▮ Desai was nominated to the House of Lords in 1991 as a Labour Party peer. He was also awarded the Padma Bhushan by the Indian government in 2008.



The Defence Research and Development Organisation (DRDO) successfully conducted consecutive test flights of the Pralay missile on 28 and 29 July 2025. The test was conducted at the Dr. A.P.J. Abdul Kalam island off the coast of Odisha. The flight tests were carried out as a part of User Evaluation Trials to validate the maximum and minimum range capability of the missile system.

India-born Shailesh Jejurikar was appointed as the Chief Executive Officer (CEO) of Procter & Gamble (P&G). Currently, Jejurikar is P&G's Chief Operating Officer (COO), will replace Jon Moeller as CEO from January 1, 2026.

▮ Jejurikar joined P&G in 1989 as an assistant brand manager after graduating in 1989 from the Indian Institute of Management (IIM) Lucknow.

The Indian Coast Guard's sixth indigenously built Fast Patrol Vessel (FPV), 'Atal', was launched today at Goa Shipyard Ltd (GSL), Goa on 29 July 2025. 'Atal' will enhance the Indian Coast Guard's operational capabilities in coastal security, anti-smuggling efforts, and maritime rescue operations.

For more Current Affairs: Scan QR code

Bank Exams — Reasoning

Statements - Assumtions

Directions (Qs. 1 - 8): *Each question below is given a statement followed by two assumptions numbered I and II. You must consider the statement and the following assumptions decide which of the assumptions is implicit in the statement. Mark your answer as..*

A) If only Assumption I is implicit.
B) If only Assumption II is implicit.
C) If either I or II is implicit.
D) If neither I nor II is implicit.
E) If both I and II are implicit.

1. Statement: The 'M' Cooperative Housing Society has put up a notice at its gate that sales persons are not allowed inside the society.

Assumptions:
I. All the sales persons will stay away from the 'M' Cooperative Housing Society.
II. The security guard posted at the gate may be able to stop the sales persons entering the society.

2. Statement: The head of the organization had decided to reward those employees who will help reducing expenditure substantially by suggesting innovative technique.

Assumptions:
I. The employees may be able to come out with innovative ideas.
II. The employees may be encouraged to apply their mind to earn the reward.

3. Statement: Bank 'A' has announced reduction of half percentage on the interest rate on retail lending with immediate effect.

Assumptions:
I. Other banks may also reduce that retail lending rates in competition.
II. The Bank 'A' may be able to attract more customers for availing retail loans.

4. Statement: The Union Government has decided to withdraw existing tax relief on various small savings schemes in a phased manner to augment its tax collection.

Assumptions:
I. People may still continue to keep money in small savings schemes and also pay taxes.
II. The total tax collection may increase substantially.

5. Statement: The government has decided to levy 2 percent surcharge on the tax amount payable for funding drought relief programmes.

Assumptions:
I. The government does not have sufficient money to fund drought relief programmes.
II. The amount collected by way of surcharge may to adequate to fund these drought relief programmes.

6. Statement: The 'X' Housing Finance Company has offered its services to search a suitable home at no extra cost for those who avail housing loan from it.

Assumptions:
I. The customers may prefer to take-housing loan from 'X' Housing Finance Company as they can save lot of their time and money in searching a suitable home.
II. No other Housing Finance Company has offered any such extra services along with housing loan.

7. Statement: World Health Organization has decided to double its assistance to various health programmes in India as per-capita expenditure on health in India is very low compared to many other countries.

Assumptions:
I. The enhanced assistance may substantially increase the per capita expenditure on health in India and bring it on par with other countries.
II. The government funding is less than adequate to provide basic medical facilities in India.

8. Statement: The managing committee is Galaxy Housing Society has requested all its members to segregate the bio-degradable garbage and put them in different containers.

Assumptions:
I. Other housing societies may follow the same practice as this will help conserve environmental equilibrium.
II. The members of Galaxy Housing Society may respond positively to the request made by the managing committee.

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

(c) eenadu

ఇండియన్ ఎకానమీ


ప్రాక్టీస్ బిట్లు

1. ప్రస్తుత జీఎస్టీ ఛైర్మన్ ఎవరు?
   1) అరుణ్ జైట్లీ
   2) నిర్మల్ కుమార్ సోరెన్
   3) నిర్మలా సీతారామన్
   4) అమితాబ్ కాంత్



2. జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సులు చేసిన అంశాలకు సంబంధించి, కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   1) జీఎస్టీలో విలీనం కానున్న పన్నులు.
   2) జీఎస్టీ నుంచి మినహాయించే పన్నులు.
   3) జీఎస్టీ పరిధిలోకి వచ్చే టర్నోవర్ పరిమితి.
   4) జీఎస్టీ పన్నులు వసూలు చేసి రాష్ట్రాలకు ఇవ్వడం.
3. కింది వాటిలో ఏ పన్నును జీఎస్టీ రద్దు చేసింది?
   1) ఆదాయపు పన్ను
   2) కార్పొరేట్ పన్ను
   3) సేవా పన్ను
   4) సంపద పన్ను
4. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గితే కేంద్రం మొదటి మూడేళ్లకు ఎంతమేర నష్టాన్ని భర్తీ చేస్తుంది?
   1) 75% 2) 50% 3) 100% 4) 25%
5. భారత్‌లో దేశవ్యాప్త జీఎస్టీ ఆలోచనను ఎవరు ప్రతిపాదించారు?
   1) బాసిల్ కమిటీ
   2) కేల్కర్ టాస్క్‌ఫోర్స్
   3) దేశాయ్ కమిటీ
   4) సి.రంగరాజన్ కమిటీ
6. జీఎస్టీ బిల్లును ఆమోదించిన మొదటి రాష్ట్రం?
   1) తమిళనాడు 2) గుజరాత్
   3) మధ్యప్రదేశ్ 4) అస్సాం
7. జీఎస్టీని అమలు చేసిన మొదటి దేశం?
   1) భారతదేశం 2) ఫ్రాన్స్
   3) యూఎస్ఏ 4) శ్రీలంక

సమాధానాలు: 1-3; 2-4; 3-3; 4-3; 5-2; 6-4; 7-2.

మాక్ కౌన్సెలింగ్ 2025

ఐసెట్
నీట్

జనరల్ స్టడీస్
విపత్తు నిర్వహణ

విధ్వంసాన్ని సృష్టించే అకస్మాత్తు ఆపదలు!

ప్రపంచంలో ఎప్పుడూ ఎక్కడో ఒక చోట విపత్తులు సంభవిస్తూనే ఉంటాయి. ఆస్తి, ప్రాణనష్టాలతో పాటు పర్యావరణాన్ని ఛిద్రం చేసే ఈ ఉపద్రవాలతో బాధిత ప్రాంతం, సమాజం తనంతట తానుగా కోలుకోలేదు. బయటి సహాయం అవసరమవుతుంది. రుతుపవన శీతోష్ణస్థితి, సుదీర్ఘ సముద్రతీరం లాంటి భౌగోళిక స్వభావాలకు తోడు అధిక జనాభా తదితర సామాజిక పరిస్థితుల వల్ల భారతదేశం తరచూ విపత్తులతో సతమతమవుతోంది. వరదలు, తుపాన్లు ఏటా అపార నష్టాలను మిగులుస్తున్నాయి. అనివార్యంగా మారిన ఈ ఆకస్మిక సంఘటనలకు సంబంధించిన ప్రాథమిక భావనలు, లక్షణాలు, నిర్వచనాలు, నివేదికలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. విపత్తుల రకాలు, వాటికి దారితీస్తున్న సహజ, మానవ కారకాలు, విపత్తు నిర్వహణ ప్రాముఖ్యత, నివారణ చర్యలను తెలుసుకోవాలి.



“ప్రజా జీవనానికి తీవ్రనష్టాన్ని కలగజేసి, ఒక సమాజ సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ఆ సమాజం సాధారణ కార్యకలాపాలకు అంతరాయాలను కలిగించేదే విపత్తు. ప్రజలను నిరాశ్రయులను చేసే ప్రకృతి పరమైన లేదా మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలు లేదా దుర్ఘటనలే విపత్తులు.”


కె.సి.పంత్

విపత్తుల నిర్వహణ - ప్రాముఖ్యత
(లక్షణాలు - నిర్వచనాలు)

విపత్తు నిర్వహణ అంటే విపత్తుల నుంచి ప్రజలను, ఆస్తులను రక్షించడానికి, సిద్ధం చేయడానికి, ప్రతిస్పందించడానికి, కోలుకోవడానికి సంబంధించిన కార్యకలాపాలు. విపత్తుల సమయంలో ముందు, తర్వాత తీసుకోవాల్సిన చర్యలు ఇందులో ఉంటాయి.

ముఖ్యాంశాలు:

నివారణ: విపత్తులు సంభవించే ప్రమాదాన్ని తగ్గించడానికి లేదా తొలగించడానికి చర్యలు తీసుకోవడం. **ఉదా:** వరదల నుంచి రక్షించడానికి డ్యామ్‌లను నిర్మించడం లేదా భూకంపాల నుంచి కాపాడటానికి భవనాలను బలోపేతం చేయడం.

సంసిద్ధత: విపత్తు సంభవించినప్పుడు సమర్థంగా స్పందించడానికి సిద్ధంగా ఉండటం. **ఉదా:** హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయడం, రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇవ్వడం, సహాయక సామగ్రిని సిద్ధంగా ఉంచడం.

స్పందన: విపత్తు సంభవించిన వెంటనే సహాయక చర్యలు చేపట్టడం. **ఉదా:** గాయపడిన వారిని రక్షించడం, ఆహారం, నీటిని పంపిణీ చేయడం, తాత్కాలిక ఆశ్రయం కల్పించడం.

పునరుద్ధరణ: విపత్తు నుంచి కోలుకోవడానికి, సాధారణ జీవనాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవడం. **ఉదా:** ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను మరమ్మతు చేయడం, ప్రజలకు మానసిక సాయం అందించడం.

విపత్తు నిర్వహణ ప్రాముఖ్యత: విపత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించడం, ముఖ్యంగా ప్రాణ నష్టాన్ని తగ్గించడం, ప్రజల ఆస్తులను రక్షించడం. * విపత్తు నుంచి త్వరగా కోలుకోవడానికి సాయపడటం. * సురక్షితమైన, స్థితి స్థాపక సమాజాలను నిర్మించడం. * విపత్తు నిర్వహణ అనేది ఒక బహుముఖ ప్రక్రియ. దీనికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు రంగం, సమాజ భాగస్వామ్యం అవసరం.

విపత్తు (డిజాస్టర్) అనే పదం మధ్య యుగాల నాటి ఒక ఫ్రెంచ్ పదం. దీనిని మూడు భాషా పదజాలాల నుంచి గ్రహించారు. అవి..1) డస్ (చెడు), ఆస్టర్ (నక్షత్రం) అనే గ్రీకు భాషాపదాలు. 2) డెస్, ఆస్ట్రే అనే ఫ్రెంచ్ భాషాపదాలు. 3) డిస్, ఆస్ట్రో అనే లాటిన్ భాషాపదాలు.

* గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే దుష్ట నక్షత్రం అని అర్థం.

విపత్తుల ముఖ్యలక్షణాలు: ➾ ఆకస్మికంగా, అతివేగంగా సంభవిస్తాయి. ➾ మానవ సమాజాల సామాజిక, సాంస్కృతిక, ఆర్థికపరమైన వనరులను ధ్వంసం చేస్తాయి.
➾ ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తాయి.
➾ పర్యావరణ వనరులను ధ్వంసం చేసి ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధిని ఆటంకపరుస్తాయి.

విపత్తు - నిర్వచనాలు

■ “ఏదైనా ఒక ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా లేదా మానవ కల్పిత కారణాలతో లేదా ప్రమాదవశాత్తు లేదా నిర్లక్ష్యం వల్ల జరిగి తనంతట తానుగా కోలుకోలేని ప్రాణ, ఆస్తి విధ్వంసానికి, పర్యావరణ నష్టానికి కారణమయ్యే ఉపద్రవం.”
– భారత విపత్తు నిర్వహణ చట్టం, 2005

■ “సమాజ సాధారణ కార్యకలాపాలకు అకస్మాత్తుగా లేదా తీవ్రంగా సంభవించే ఆపద.”
– ఐక్యరాజ్యసమితి

■ “ఏదైనా ప్రదేశంలోని సమూహానికి వెలుపల నుంచి సాయం పొందాల్సినంత తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టాన్ని; పర్యావరణ నష్టాన్ని, ఆర్థిక విధ్వంసాన్ని, ఆరోగ్య సమస్యలను కలగజేసే సంఘటన.”
– ప్రపంచ ఆరోగ్య సంస్థ

■ “సాధారణ జీవితానికి లేదా పర్యావరణ వ్యవస్థకు అంతరాయం కలిగినప్పుడు ప్రాణాలను లేదా పర్యావరణాన్ని రక్షించి, సంరక్షించడానికి అసాధారణ అత్యవసర చర్యలు అవసరమయ్యే ఉపద్రవ పరిస్థితి.”
– కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

క్రీస్తు పూర్వమే నమోదు మొదలు



ప్రపంచ వ్యాప్తంగా విపత్తుల నేపథ్యాన్ని పరిశీలిస్తే విపత్తుల నమోదు కార్యక్రమం క్రీ.పూ. 430లో ఏథెన్స్ నగరంలో టైఫస్ అనే వ్యాధి ప్రబలడంతో అక్కడ జరిగిన ధన, ప్రాణ నష్టాలను మొదటిసారిగా నమోదు చేయడంతో మొదలైనట్లు చరిత్రలో ఆధారాలు ఉన్నాయి. చరిత్రలో అత్యధిక ప్రాణనష్టం జరిగిన విపత్తు చైనాలో నమోదైంది. 1556, జనవరి 23న అక్కడి సాంక్సీ ప్రావిన్స్‌లో వచ్చిన భూకంపంతో దాదాపు 8,30,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 20వ శతాబ్దం రెండో అర్ధభాగం నుంచి ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా తీవ్రవిపత్తులు సంభవించగా, దాదాపు 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని అంచనా. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, అందులోనూ ఆసియా దేశాల్లో నష్ట తీవ్రత దాదాపు 20 రెట్లు అధికంగా ఉందని అంతర్జాతీయ సంస్థలు పేర్కొన్నాయి.
* ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ అండ్ రెడ్ క్రెసెంట్ సొసైటీస్ (ఐఎఫ్ఆర్‌సీ) నివేదిక (2010) ప్రకారం 2000-09 మధ్య ప్రపంచవ్యాప్తంగా విపత్తుల ప్రభావానికి గురైన వారిలో 85% ఆసియా, పసిఫిక్ ప్రాంతానికి చెందినవారే ఉన్నారు. * యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (యూఎన్ఐఎస్‌డీఆర్) నివేదిక (2011) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వరదలకు గురవుతున్న వారిలో 90% పైగా దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్ దేశాల్లోనే ఉంటున్నారు.* ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం 1995-2004 మధ్య ప్రపంచవ్యాప్త విపత్తుల స్వరూపం.. వరదలు-30%, తుపానులు-21%, కరవు- 5-19%, మహమ్మారి వ్యాధులు-15%, భూకంపాలు, సునామీలు-8%, భూపాతాలు-4%, హిమపాతాలు-1%, అగ్నిపర్వతాలు-1%, కీటకదాడులు-1%. * ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం భారతదేశంలో వివిధ విపత్తుల కారణంగా జాతీయాదాయంలో ఏటా 2.25% మేర నష్టం వాటిల్లుతోంది. భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి కారణంగా దాదాపు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు. సుమారుగా 4,800 కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం జరిగింది. * ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 1967-2006 మధ్య దేశంలో వివిధ విపత్తుల తీరు పరిశీలిస్తే వరదలు-52%, తుపానులు-23%, భూకంపాలు-11%, భూపాతాలు-11%, ఇతరాలు-3% సంభవించాయి. * 329 మి.హెక్టార్ల విస్తీర్ణం ఉన్న దేశంలోని 58% భూభాగంలో భూకంపాలు, 68%లో దుర్భిక్షం, 12%లో వరదలు, 8%లో తుపానులు, 15%లో భూపాతాలు సంభవిస్తున్నాయి. * ఇండియా డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టు ప్రకారం దేశంలో 25 ప్రదేశాలు విపత్తుభరిత ప్రాంతం కింద ఉన్నాయి. దీనికి కారణాలు- 1) దేశ భూభాగంలో విశిష్టమైన శీతోష్ణస్థితి. 2) అధిక జనాభా. 3) సుదీర్ఘమైన తీరరేఖ. 4) పట్టణీకరణ, పారిశ్రామికీకరణ. 5) ఖనిజోద్గ్రహణం 6) అటవీనిర్మూలన, భూతాప పరిస్థితులు.

విపత్తుల ప్రాథమిక భావనలు

1) వైపరీత్యాలు 2) దుర్బలత్వం 3) సామర్థ్యం 4) అపాయం లేదా విపత్కర స్థితి.

వైపరీత్యాలు: ఆస్తి నష్టం, ప్రాణనష్టం, పర్యావరణ విధ్వంసానికి కారణమయ్యేలా ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతంలో సంభవించే శక్తిమంతమైన ఆకస్మిక సంఘటనలు, దుర్ఘటనలే వైపరీత్యాలు. వైపరీత్యాన్ని ఇంగ్లిష్‌లో ‘హజార్డ్’ అంటారు. * ఒక ప్రాంతంలో సంభవించిన వైపరీత్యం వల్ల కలిగే నష్టతీవ్రత అక్కడి వనరుల పరిమాణం, మౌలిక వసతులు, స్థానిక సమాజంలో నివసించే ప్రజల జీవన నైపుణ్యాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.
ఉదా: ఎడారి ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 8 లేదా 9 తీవ్రత ఉన్న భూకంపం సంభవించినప్పటికీ ఎలాంటి నష్టం ఉండదు. అదే మురికివాడల లాంటి ప్రాంతాల్లో తక్కువ తీవ్రతతో భూకంపం వచ్చినా నష్టతీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ వైపరీత్యాలు మూడు రకాలుగా ఉన్నాయి.

ప్రకృతిపరమైన వైపరీత్యాలు: భూనిర్మితిలో వచ్చే మార్పులు, పర్యావరణ మార్పుల వల్ల సహజసిద్ధంగా ఏర్పడతాయి. **ఉదా:** భూకంపాలు, సునామీలు, తుపానులు, అగ్నిపర్వతాల విస్ఫోటం, కీటకాల వ్యాప్తి.

మానవప్రేరేపిత వైపరీత్యాలు: మానవ నిర్లక్ష్యం, అశ్రద్ధ, స్వార్థ చర్యలతో ఏర్పడతాయి. **ఉదా:** పరిశ్రమల్లో పేలుళ్లు, విషవాయువులు లీకు కావడం, కాలుష్యం, ఆనకట్టలు కూలిపోవడం, యుద్ధాలు, రోడ్డు, రైల్వే ప్రమాదాలు, ఉగ్రవాద చర్యలు, అగ్నిప్రమాదాలు.

సామాజిక-సహజ వైపరీత్యాలు: మానవ ప్రేరేపిత చర్యలతో పాటు ప్రకృతి కారకాల వల్ల జరుగుతాయి. **ఉదా:** భూపాతం, వరదలు, దుర్భిక్షం, భూకంపాలు.
* 1999లో విపత్తుల నిర్వహణపై కె.సి.పంత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ దేశవ్యాప్తంగా 31 రకాల వైపరీత్యాలను గుర్తించి, 5 ఉపవిభాగాలుగా విభజించింది. అవి- ఎ) భౌగోళిక వైపరీత్యాలు బి) జల, వాతావరణ (శీతోష్ణస్థితి) సంబంధిత వైపరీత్యాలు సి) రసాయన, పారిశ్రామిక, అణు సంబంధ వైపరీత్యాలు డి) ప్రమాదాలకు సంబంధించి వైపరీత్యాలు ఇ) జీవసంబంధ వైపరీత్యాలు.

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్య వేగం, ఆ ప్రాంతంపై దాని ప్రభావం ఎంతకాలం ఉంటుందనే ఆధారంగా రెండు రకాలుగా విభజించవచ్చు. 1) వేగంగా విస్తరించే వైపరీత్యం **ఉదా:** తుపానులు. 2) నెమ్మదిగా విస్తరించే వైపరీత్యం **ఉదా:** కరవు.



రచయిత: సక్కరి జయకర్

దొంగ స్వాములను పట్టించే కాలనేమి!

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారతదేశ పాస్‌పోర్టుపై వీసా లేకుండా పలు దేశాలకు ప్రయాణించే వీలున్నట్లు వెల్లడైంది. బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో కనీస ఓటింగ్ వయసును తగ్గించనున్నారు. కార్బన్ డయాక్సైడ్‌ను సుక్రోజ్‌గా మార్చే పద్ధతిని చైనాలో కనుక్కున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాల్లో ఇండోర్ వరుసగా మరోసారి విజేతగా నిలిచింది. జనావాసాలు, పంటపొలాలపై ఏనుగుల దాడులను ముందే కనిపెట్టి హెచ్చరించే విధంగా అస్సాం ప్రభుత్వం గజమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ విధంగా స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు రాజకీయ, ఆర్థిక, సైనిక, సాంకేతిక, సామాజిక అభివృద్ధి పరిణామాలు, వర్తమాన వ్యవహారాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకోవాలి. ఇటీవలి అంతర్జాతీయ సంస్థల ముఖ్య ప్రకటనలు, నివేదికలు, ప్రముఖ రచయితల పుస్తకాలు, ప్రతిష్ఠాత్మక అవార్డులు, వార్తల్లోని వ్యక్తులు, రాష్ట్రాల్లో కొత్త పథకాలు, ఆకట్టుకుంటున్న విధాన నిర్ణయాలను గుర్తుంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు


1. ఏ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల రక్షణ కోసం ‘శక్తి శ్రీ’ అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది?
   1) ఆంధ్రప్రదేశ్ 2) కేరళ
   3) రాజస్థాన్ 4) ఒడిశా

నోట్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అసెంబ్లీలో భగవద్గీత శ్లోకాల పారాయణం తప్పనిసరి చేస్తూ ఉత్తరాఖండ్ నిర్ణయం తీసుకుంది.

2. మహారాష్ట్రలోని సాంగ్లే జిల్లాలో ఉన్న ఇస్లాంపుర్ పేరును ఏ విధంగా మార్పు చేశారు?
   1) మోదీపుర్ 2) ఈశ్వర్‌పుర్
   3) శశికాంత్‌పుర్ 4) నందినిపుర్
3. అపాచీ హెలికాప్టర్లను భారత్ ఏ దేశం నుంచి దిగుమతి చేసుకుంది?
   1) రష్యా 2) జర్మనీ
   3) ఇటలీ 4) అమెరికా
4. ‘మిస్సింగ్ ఫ్రం ది హౌస్: ముస్లిం ఉమెన్ ఇన్ ది లోక్‌సభ’ పుస్తక రచయిత?
   1) రషీద్ కిద్వాయ్
   2) అంబర్ కుమార్ ఘోష్
   3) అభిషేక్ చౌదరి 4) 1, 2

నోట్: లోక్‌సభకు ఇప్పటివరకు 18 మంది ముస్లిం మహిళలు ప్రాతినిధ్యం వహించారని ఇందులో ఉంది.

5. ఐఎంఎఫ్ నుంచి గీతా గోపీనాథ్ వైదొలగుతున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఆమె ఏ సంవత్సరంలో ఐఎంఎఫ్ తొలి మహిళా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా చేరారు?
   1) 2022 2) 2019
   3) 2024 4) 2023
6. కింది వాటిలో సరైంది?



   ఎ) హెన్లీ పాస్‌పోర్టు సూచీ-2025లో భారత స్థానం 77.
   బి) ఈ జాబితాలో సింగపూర్ మొదటి స్థానంలో నిలిచింది.
   సి) జపాన్, దక్షిణ కొరియాలు రెండో స్థానంలో నిలిచాయి.
   డి) డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఐర్లాండ్, ఇటలీ, స్పెయిన్‌లు మూడో స్థానంలో ఉన్నాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) సి, డి 4) ఎ, బి, సి

నోట్: * ఈ జాబితాలో 77వ స్థానంలో ఉన్న భారత్ పాస్‌పోర్టుతో 59 దేశాలను వీసా లేకుండా ప్రయాణించవచ్చు.
* మలేసియా, ఇండోనేసియా, మాల్దీవులు, థాయ్‌లాండ్ దేశాలు వీసారహిత ప్రయాణాలకు అనుమతి ఇస్తున్నాయి.
* శ్రీలంక, మకావు, మయన్మార్‌లు ఆ దేశాలకు వెళ్లిన తర్వాత వీసాలు మంజూరు చేస్తున్నాయి.
* ఈ జాబితాలో అఫ్గానిస్థాన్ చివరి స్థానంలో నిలిచింది.

7. విఫా తుపాను ఇటీవల ఏ దేశంలో బీభత్సం సృష్టించింది?
   1) రష్యా 2) అమెరికా
   3) చైనా 4) జపాన్
8. కింది వాటిలో సరైంది?
   ఎ) పెన్ పింటర్ ప్రైజ్-2025 విజేత లైలా అబౌలెలా.
   బి) లైలా అబౌలెలా స్కాట్లాండ్‌కు చెందిన వారు.
   సి) ఈమె రచనలు ది ట్రాన్స్‌లేటర్ (1999), మినెరెట్ (2005), రివర్ స్పిరిట్ (2013).
   డి) భారత్ నుంచి ఈ అవార్డు 2024లో అరుంధతీరాయ్‌కి, 2014లో సల్మాన్ రష్దీకి వచ్చింది.
   ఇ) ఈ అవార్డును 2009లో ప్రారంభించారు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి


లైలా అబౌలెలా

9. కింది వాటిలో సరైంది?
   ఎ) స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 అవార్డుల్లో వరుసగా 8వసారి పరిశుభ్రమైన నగరాల్లో ఇండోర్ (మధ్యప్రదేశ్) మొదటి స్థానంలో నిలిచింది.
   బి) 2, 3, 4 స్థానాల్లో సూరత్, నవీ ముంబయి, విజయవాడ నిలిచాయి.
   సి) 3-10 లక్షల జనాభా ఉన్న నగరాల జాబితాలో నోయిడా అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలిచింది.
   డి) సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డుగా మొదటి స్థానంలో నిలిచింది.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి
10. కింది వాటిలో సరైంది?
   ఎ) సాధువులుగా వేషాలు వేసుకుని ప్రజలను తప్పుదారి పట్టించేవారిని గుర్తించి పట్టుకునేందుకు ‘ఆపరేషన్ కాలనేమి’ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ప్రారంభించారు.


పుష్కర్ సింగ్ ధామీ

   బి) ఏనుగుల నుంచి ప్రజలు, పంటలు, ఆస్తులను కాపాడుకోవడానికి ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లను ఏర్పాటుచేసి, దాని సాయంతో వాటి కదలికలను గుర్తించి, సమీప గ్రామాలను హెచ్చరించడానికి అస్సాం ప్రభుత్వం ‘గజమిత్ర’ అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది.
   సి) క్రూయిజ్ భారత్ మిషన్‌లో చేరిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. దేశంలో జల పర్యాటకంలో అవకాశాలను పెంపొందించడం దీని లక్ష్యం.
   డి) అస్సాంలోని సోనాపుర్‌లో దేశంలోనే మొదటి ఆక్వాటిక్ పార్కును సీఎం హిమంతబిశ్వ శర్మ ప్రారంభించారు. ఈ పార్కు చేపల పెంపకందారులు, ఆక్వాపోనిక్స్ బయోఫ్లాక్ లాంటి కొత్త టెక్నాలజీని తెలుసుకోవడానికి సాయపడుతుంది.
   ఇ) ఛత్తీస్‌గఢ్, బిలాస్‌పుర్‌లోని కోల్ ఇండియా అనుబంధ సంస్థ సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ దేశంలోనే మొదటిసారి మహిళలు నిర్వహించే డిస్పెన్సరీని ప్రారంభించింది.
   1) ఎ, బి, సి, ఇ 2) బి, సి, డి, ఇ
   3) ఎ, బి, సి, డి, ఇ 4) ఎ, బి, ఇ
11. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరాల్లో మొదటి మూడు వరుసగా? (జులియస్ బేర్ నివేదిక)
   1) సింగపూర్, లండన్, హాంకాంగ్
   2) జ్యూరిచ్, మొనాకో, మిలాన్
   3) మిలాన్, సింగపూర్, లండన్
   4) న్యూయార్క్, లండన్, మిలాన్
12. ఇటీవల మరణించిన వి.ఎస్.అచ్యుతానందన్ ఏ సంవత్సరాల్లో కేరళ సీఎంగా పనిచేశారు?
   1) 2010 - 2015 2) 2006 - 2011
   3) 2014 - 2018 4) 2003 - 2009

నోట్: 1965 నుంచి 2016 వరకు ఈయన పదిసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి 7 సార్లు గెలిచారు.


13. జగదీప్ ధన్‌ఖడ్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది?
   ఎ) ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ 2025, జులై 21న రాజీనామా చేశారు.
   బి) 2022, ఆగస్టు 11న జగదీప్ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.
   సి) ఈయన గుజరాత్‌కు చెందినవారు.
   డి) ధన్‌ఖడ్ భారతదేశ 14వ ఉపరాష్ట్రపతి.
   ఇ) 2019, జులై 30 నుంచి 2022, జులై 18 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పనిచేశారు.
   1) ఎ, బి, సి, డి, ఇ 2) ఎ, బి, డి, ఇ
   3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

నోట్: జగదీప్ ధన్‌ఖడ్ రాజస్థాన్‌కు చెందినవారు.

14. డబ్ల్యూహెచ్‌ఓ ఏ దేశాన్ని ఇటీవల ట్రకోమా రహిత దేశంగా ప్రకటించింది?
   1) సెనెగల్ 2) నైజీరియా
   3) ఫిజీ 4) కామెరూన్

నోట్: 1) ట్రకోమా వ్యాధి క్లామిడియా ట్రకోమాటిస్ అనే బ్యాక్టీరియా వల్ల కళ్లకు వస్తుంది.
2) 2024లో భారత్‌ను డబ్ల్యూహెచ్‌ఓ ట్రకోమా రహిత దేశంగా ప్రకటించింది.

15. ‘బిలీవర్స్ డైలమా వాజ్‌పేయీ అండ్ ది హిందూ రైట్స్ పాత్ టూ పవర్ 1977–2018’ పుస్తక రచయిత?
   1) కిరణ్ ధార్
   2) అభిషేక్ చౌదరి
   3) అమిత్ షా
   4) నిర్మలా సీతారామన్



16. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) 7వ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ కమిటీ సమావేశం 2025, జులై 15–17 తేదీల్లో ఏ దేశంలో జరిగింది?
   1) నేపాల్ 2) బంగ్లాదేశ్
   3) శ్రీలంక 4) మాల్దీవులు

నోట్: ఈ సమావేశం థీమ్: అడ్వాన్సింగ్ సోలార్ కో-ఆపరేషన్ ఎక్రాస్ ఏ రీజియన్ డైవర్సిటీ అండ్ ఆపర్చ్యునిటీ.

17. కార్బన్ డయాక్సైడ్‌ను సుక్రోజ్‌గా మార్చే పద్ధతిని ఏ దేశ శాస్త్రవేత్తలు కనుక్కున్నారు?
   1) రష్యా 2) చైనా
   3) ఇండియా 4) అమెరికా



18. 2024 సంవత్సరానికి ‘కళింగరత్న’ అవార్డు ఎవరికి వచ్చింది?
   1) అశ్వినీ వైష్ణవ్ 2) ధర్మేంద్ర ప్రధాన్
   3) నిర్మలా సీతారామన్ 4) రాజ్‌నాథ్ సింగ్
19. ఏ రాష్ట్రంలో ఉన్న లుంగ్‌పున్ రోపుయ్‌ను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ‘పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాల అవశేషాల చట్టం–1958’ కింద జాతీయ ప్రాముఖ్యత ఉన్న స్మారక చిహ్నంగా ప్రకటించింది?
   1) మేఘాలయ 2) అస్సాం
   3) మిజోరం 4) మణిపుర్
20. బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో కనీస ఓటింగ్ వయసు 18 ఏళ్ల నుంచి ఎన్ని సంవత్సరాలకు తగ్గించనున్నారు?
   1) 13 2) 12
   3) 15 4) 16
21. ప్రపంచ చదరంగ దినోత్సవాన్ని ఏ రోజు నిర్వహిస్తారు?
   1) జులై 12 2) జులై 15
   3) జులై 20 4) జులై 22
22. ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) ధోని 2) రామ్‌చరణ్
   3) యువరాజ్ సింగ్ 4) హృతిక్ రోషన్
23. భారత్ ఐదేళ్లపాటు ఏటా 3.1 మిలియన్ మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువును దిగుమతి చేసుకోవడానికి ఏ దేశంతో ఒప్పందం చేసుకుంది?
   1) బ్రిటన్
   2) అమెరికా
   3) యూఏఈ
   4) సౌదీ అరేబియా



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-4; 2-2; 3-4; 4-4; 5-2; 6-2; 7-3; 8-2; 9-1; 10-3; 11-1; 12-2; 13-2; 14-1; 15-2; 16-3; 17-2; 18-2; 19-3; 20-4; 21-3; 22-3; 23-4.

(c) eenadu

శ్రీవారి మెట్టు మార్గంలో ఏనుగులు

- భక్తులు జాగ్రత్తలు పాటించాలి
- తిరుపతి సబ్ డీఎఫ్‌వో సూచన

తిరుపతి (జీవకోన), చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీవారి మెట్టు మార్గం పరిధిలో ఏనుగుల గుంపు ఉందని, తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలని తిరుపతి సబ్ డీఎఫ్‌వో నాగభూషణం సూచించారు. భాకరాపేట ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్)తో కలిసి బుధవారం ఆయన శ్రీవారి మెట్టు మార్గంలో పర్యటించారు. రంగంపేట సమీపంలోని సత్యసాయి ఎస్‌ కాలనీ సమీపంలో మంగళవారం రాత్రి 10 ఏనుగుల గుంపు వచ్చినట్లు ఈటీఎఫ్ బృందం తెలుసుకుని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిందన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు శ్రీవారి మెట్టు మార్గాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు చెప్పారు. ఏనుగులను దారి మళ్లించిన అనంతరం 7 గంటలకు తిరిగి భక్తులను కాలినడక ద్వారా అనుమతించామన్నారు. శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలోనే వెళ్లాలని చెప్పారు.

పర్యాటక రంగంలో పెట్టుబడులకు సరైన అవకాశం

- ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం అనుకూల వాతావరణం కల్పించిందని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి తెలిపారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ఇండియన్ ఎగ్జిబిషన్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఐఈఐఏ) ఆధ్వర్యంలో 'దక్షిణ భారతదేశంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు అవకాశాలు' అనే అంశంపై బుధవారం చెన్నైలో నిర్వహించిన సదస్సులో ఆమ్రపాలి పాల్గొని ప్రసంగించారు. 'పర్యాటక రంగంలో మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాలు పర్యాటక గమ్యస్థానాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనూ పెట్టుబడులు పెట్టొచ్చు' అని ఆమ్రపాలి పేర్కొన్నారు. ఐఈఐఏ అధ్యక్షుడు సూరజ్ వన్, కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సుమన్ బిల్లా తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలశాఖ సంయుక్త కంట్రోలర్‌గా కృష్ణ చైతన్య

ఈనాడు, అమరావతి: తూనికలు, కొలతల శాఖ సంయుక్త కంట్రోలర్‌గా ఎ.కృష్ణచైతన్య నియమితులయ్యారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సౌరబ్‌గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి రాయపాటి శైలజ రాజీనామా

ఈనాడు, అమరావతి: పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి రాయపాటి శైలజ రాజీనామా చేశారు. ఆమె రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. దీంతో మే 13 న తన రాజీనామా లేఖ పంపగా ప్రభుత్వం ఆమోదించింది.

యోగివేమన వర్సిటీ వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ

ఈనాడు, అమరావతి: యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోనశశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ పి.జార్జ్‌విక్టర్, వర్సిటీ ఈసీ నామినీగా రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ఏపీ ప్రసాదరావు, యూజీసీ నామినీగా హిమాచల్‌ప్రదేశ్ విశ్వవిద్యాలయ జాగ్రఫీ విభాగం ప్రొఫెసర్ దేవ్ దత్‌శర్మను నియమించారు. సెర్చ్ కమిటీ సమావేశమై మూడు పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. ఈ కమిటీకి ప్రభుత్వ నామినీ ఛైర్మన్‌గా ఉంటారు.

పదోన్నతుల కమిటీ పునర్నియామకం

ఈనాడు, అమరావతి: కామన్ పూల్‌లో ఉన్న సెక్షన్ ఆఫీసర్లు, ప్రభుత్వ కార్యదర్శులకు ప్రైవేట్ సెక్రటరీలుగా ఉన్నవారికి పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాఖాపరమైన పదోన్నతుల కమిటీని పునర్నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేస్తుంది.

తురకా కిశోర్‌పై కేసుల వివరాలివ్వండి

- పల్నాడు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్‌పై ఇప్పటి వరకు ఎన్ని కేసులు నమోదయ్యాయి, పిర్యాదులు ఎప్పుడు అందాయి, ఎప్పుడు అరెస్టు చేశారు.. తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. గతేడాది ఏప్రిల్ 8న మఠపు చోటుచేసుకుంటే ఇప్పటి వరకు కేసు నమోదు చేయడమేంటని పోలీసులను ప్రశ్నించింది. వ్యాజ్యంపై విచారణను ఆగస్టు 4కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. గుంటూరు జైలు నుంచి విడుదలైన తన భర్త కిశోర్‌ను రెంటచింతల పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారంటూ ఆయన సతీమణి సురేఖ హైకోర్టులో అత్యవసరంగా హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పోలీసులు వరుస కేసులు నమోదు చేస్తూ ఒకదాంట్లో బెయిలొస్తే ఇంకో దాంట్లో అరెస్టు చేస్తున్నారు. ఇప్పటివరకు 12 కేసులు నమోదు చేశారు. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ హత్యాయత్నం కేసులో కిశోర్‌ను అరెస్టు చేశారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. కిశోర్‌పై ఫిర్యాదులు, కేసులు, అరెస్టు తదితర వివరాలను పట్టిక రూపంలో కోర్టు ముందుంచాలని ఎస్పీని ఆదేశించింది.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు ఏదీ ఆదరణ!

- స్పందన తక్కువగా ఉండడంపై ప్రభుత్వ అసంతృప్తి
- వేగం పెంచాలని జిల్లాలకు రెవెన్యూ శాఖ లేఖ

ఈనాడు, అమరావతి: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ పథకాన్ని జిల్లా అధికారులు నీరుగారుస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు వెలువడినా, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 32 వేలే ఉండటం.. ఇందులోనూ అర్హత ఉన్నవి తక్కువగానే ఉండడం ప్రభుత్వ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులు ప్రయోజనం పొందుతారని ప్రభుత్వం ఆశించగా.. దరఖాస్తులు తక్కువగా రావడంపై జరిపిన సమీక్షలో సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. అందువల్ల త్వరితగతిన పథకం అమలు కావాలంటూ జిల్లా అధికారులకు రాసిన లేఖలో రెవెన్యూ శాఖ అసంతృప్తి వ్యక్తంచేసింది. 151-300 గజాల వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15%, రిజిస్ట్రేషన్ ఫీజులో 50% చెల్లించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఇది వర్తిస్తుంది. ఎగువన ఉన్నవారికి మినహాయింపులు లేవు. 2019 అక్టోబరు 15 కంటే ముందు ఆక్రమించిన వారికే క్రమబద్ధీకరిస్తారు. కుటుంబసభ్యుల ఆదాయ పన్ను చెల్లింపుదారు అయి ఉండకూడదని, నాలుగు చక్రాల వాహనం ఉండకూడదని స్పష్టంచేసింది. టాక్సీ, ఆటో, ట్రాక్టరుకు మినహాయింపు ఇస్తామంది. ఇన్ని వెసులుబాట్లు కల్పించినా దరఖాస్తుల ఎందుకు రావట్లేదో అర్థం కావట్లేదని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. దరఖాస్తుల స్వీకరణ ఈ ఏడాది డిసెంబరు 31తో ముగియనుంది.

క్షేత్రస్థాయి పరిశీలన లేదు

తహసీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ/వార్డు సిబ్బంది ఆక్రమణలను పరిశీలించాలి. అర్హులైన లబ్ధిదారుల జాబితాను గ్రామ/వార్డు కార్యాలయాల్లో ప్రదర్శించాలి. కానీ.. జేడీఓ అంతగా జరుగుతున్న దాఖలాలు కనిపించడంలేదు. అర్హతల పరిశీలనకాక లబ్ధిదారులకు పట్టా కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు కల్పించాలి. ఈ చర్యల ద్వారా పేదలకు ప్రయోజనంతో పాటు ఖజానాకు ఆదాయం చేకూరుతుందని భావించారు. కానీ జిల్లాల్లోని పరిస్థితులు నిరాశను గురిచేస్తున్నాయి. మరోవంక.. ప్రభుత్వానికి ఆరకొరగా అందుతున్న దరఖాస్తుల్లో 150 గజాలలోపు స్థలాల క్రమబద్ధీకరణకు వచ్చినవే ఎక్కువ. వీటివల్ల ప్రభుత్వానికి ఆదాయం రాదు. వైకాపా ప్రభుత్వం నివాస స్థలాల క్రమబద్ధీకరణ చర్యలు తీసుకున్నా.. రుసుములు ఎక్కువగా ఉండటం, నిబంధనలవల్ల లోపాలతో అంతగా స్పందన రాలేదు. ఓ సమాచారం ప్రకారం.. గుంటూరు జిల్లాలో 11,614 ఆక్రమణలు ఉన్నాయని గుర్తించగా ప్రభుత్వానికి అందిన దరఖాస్తులు 5,766 మాత్రమే. తిరుపతి జిల్లాలో 5,248కు 2,255, విశాఖలో 5,410కు 3,561 చొప్పున వచ్చాయి. బాపట్ల జిల్లాలో 118, కోనసీమ-379, ప్రకాశం-221, నంద్యాల-123, శ్రీకాకుళంలో 303 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. గుర్తించిన ఆక్రమణల కన్నా తక్కువగా ఉండగా.. వచ్చిన దరఖాస్తులు తక్కువగా ఉండడంపై రెవెన్యూ వర్గాలు పెదవి విరుస్తున్నాయి.





మందాయ్ వైల్డ్ లైఫ్ సీఈఓ మైక్ బార్క్లేతో ముఖ్యమంత్రి చంద్రబాబు ★ టెమాసెక్ హోల్డింగ్స్ పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ విభాగం హెడ్ దినేశ్ ఖన్నాతో..



ఏవీఎం కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యానో టొమోకాజుతో భేటీ అయిన మంత్రి లోకేశ్

సింగపూర్‌లో బిజీబిజీగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



ఇన్ఫియన్ ప్రెసిడెంట్, ఎండీ సీఎస్ చువాతో సమావేశమైన మంత్రి లోకేశ్. చిత్రంలో ఆ సంస్థ ప్రతినిధులు, ఏపీ అధికారులు

సింగపూర్‌లో గత నాలుగు రోజులుగా పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు బిజీబిజీగా గడిపారు. బుధవారం కూడా వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఏపీలో ఉన్న సానుకూల అంశాలను వివరిస్తూ అక్కడ పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

–ఈనాడు, అమరావతి



ఐవీపీ సెమీకండక్టర్ ఫౌండర్ రాజా మాణిక్కంతో మంత్రి నారా లోకేశ్

రిజిస్ట్రేషన్‌తోపాటే దస్తావేజులూ సిద్ధం!

- 4 కార్యాలయాల్లో గంటన్నరలోపే అందజేత
- వాట్సప్‌నకు డాక్యుమెంట్ లింక్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆదాయం ఎక్కువగా ఉండే 4 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ జరిగిన గంటన్నరలోపే దస్తావేజులు అందజేస్తున్నారు. అలాగే.. మిగతా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్‌లు జరిగి, సబ్-రిజిస్ట్రార్ డిజిటల్ సంతకం పూర్తయిన వెంటనే దస్తావేజు సిద్ధమైనట్లు కొనుగోలుదారుల వాట్సప్‌నకు లింక్ పంపుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు కార్యాలయాల్లో గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పని తప్పుతోంది. విజయవాడ పటమట, విశాఖలోని ఆర్‌ఓ, గుంటూరు నగరం కొరిటెపాడు, తిరుపతి రూరల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన మార్పులతో త్వరగా డాక్యుమెంట్ చేతికందుతోంది. ఇందుకు ఈ కార్యాలయాల్లో అదనంగా నలుగురు ఉద్యోగులను నియమించారు. ఇతర కార్యాలయాల్లోనూ ఈ విధానం తీసుకురానున్నారు.

లింక్‌తో డౌన్‌లోడ్‌కూ అవకాశం

రిజిస్ట్రేషన్ జరిగిన రోజే దస్తావేజులు తీసుకోవడం చాలా చోట్ల సాధ్యపడటం లేదు. ఈ పరిస్థితుల్లో డాక్యుమెంట్ సిద్ధమైనట్లు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి కొనుగోలుదారులకు వాట్సప్ లింక్ వెళ్లడం ఊరటనిస్తోంది. ఈ లింక్ నుంచి దస్తావేజు డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. కూటమి ప్రభుత్వం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే పలు మార్పులు తెచ్చింది. స్లాట్ బుకింగ్ విధానంతో క్రయ, విక్రయదారుల సమయం ఆదా చేసింది. ఆ కార్యాలయాల్లో సంప్రదాయంగా వస్తున్న రాచరిక వ్యవస్థ (ఎరుపు బల్లలు)ను తొలగించింది. ఆగస్టు 1 నుంచి 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే 'ఆస్తి పన్ను చెల్లింపు యజమాని పేరు' (ఆటో మ్యుటేషన్)కూడా మార్చనుంది.

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు సందిగ్ధమే!

గ్రామ సచివాలయాల్లో వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్‌లు చేయడంపై సందిగ్ధత నెలకొంది. సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్స్ అర్హతలు, సామర్థ్యం, సదుపాయాలు, సాంకేతిక సమస్యలపై ఉన్నత స్థాయిలో తర్జనభర్జన నెలకొంది. దీంతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లను కొనసాగిస్తే సరిపోతుందని అధికారులు ఓ అవగాహనకు వచ్చినట్లు తెలిసింది.

'లులు'కు భూ కేటాయింపుపై హైకోర్టు విచారణ

తాజా జీవోపై సవరణ పిటిషన్ వేసేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు

ఈనాడు, అమరావతి: లులు సంస్థకు విశాఖపట్నం, విజయవాడలలో భూ కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవోను సవాలు చేస్తూ సవరణ పిటిషన్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు హైకోర్టు వెసులుబాటు ఇచ్చింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. విశాఖలో షాపింగ్ మాల్ ఏర్పాటుకు లులు గ్రూప్ ఇంటర్నేషనల్ సంస్థకు ప్రభుత్వం నామమాత్రపు ధరతో 13.83 ఎకరాలను కేటాయించబోతోందంటూ న్యాయవాది పాక సత్యనారాయణ పిల్ వేసిన విషయం తెలిసిందే. బుధవారం న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపిస్తూ.. 'లులు గ్రూప్‌నకు విశాఖలో ఓసారి భూములు కేటాయించి, రద్దు చేశారు. ఆ సంస్థ ఛైర్మన్ లేఖ రాశారనే కారణంతో బిడ్‌లను ఆహ్వానించకుండానే ప్రభుత్వం మళ్లీ భూములు కేటాయించబోతోంది. తాజాగా విజయవాడలోనూ భూ కేటాయింపునకు అంగీకరిస్తూ జీవో ఇచ్చింది. ఆ జీవోను సవాలు చేస్తూ సవరణ పిటిషన్ వేసేందుకు అనుమతి ఇవ్వాలి' అని కోరగా ధర్మాసనం అంగీకరించింది.

బయట నుంచి ఆహారానికి చెవిరెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: బయట నుంచి ఆహారం తెప్పించుకునేందుకు అనుమతి ఇవ్వాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఏసీబీ కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని జైలు, సిట్ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది.

- మద్యం కేసులో నిందితులైన చాణక్య, దిలీప్‌లు దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు బుధవారం కౌంటర్ దాఖలు చేశారు. దీనిపై విచారణ నిమిత్తం వచ్చే నెల 4వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

పదో తరగతి ప్రశ్నపత్రం వెయిటేజీలో మార్పులు

- 'పరాఖ్' విధానంలో ప్రశ్నపత్రాల రూపకల్పన

ఈనాడు, అమరావతి: పదో తరగతి ప్రశ్నపత్రాల్లో ప్రభుత్వ పరీక్షల విభాగం మార్పులు చేసింది. ఇప్పటి వరకు అకడమిక్ ప్రమాణాల ప్రకారం ప్రశ్నలు ఇస్తుండగా.. ఇప్పుడు ఆరు లక్ష్యాలతో పరాఖ్ విధానంలో ప్రశ్నలు ఇవ్వనున్నారు. ఈ మేరకు కొత్త ప్రశ్నపత్రాల బ్లూప్రింట్లను పరీక్షల విభాగం బుధవారం విడుదల చేసింది. నూతన విద్యా విధానం ప్రకారం సమగ్ర అభివృద్ధి కోసం జ్ఞానం, పనితీరు అంచనా, సమీక్ష, విశ్లేషణ(పరాఖ్) ఆధారంగా ఈ ప్రశ్నపత్రాలను రూపొందించారు. భాషేతర సబ్జెక్టుల్లో నాలెడ్జ్‌కు 20%, అవగాహనకు 25%, అన్వయానికి 20%, విశ్లేషణకు 15%, మూల్యాంకనానికి 10%, సృజనాత్మకతకు 10% చొప్పున వెయిటేజీ ఇచ్చారు. ప్రశ్నపత్రాల డిజైన్‌లో ఎలాంటి మార్పు చేయలేదు. గతంలోలానే ఒక్క మార్కు ప్రశ్నలు 12, రెండు మార్కులవి 8, నాలుగు మార్కులవి 8, 8 మార్కులవి 5 ప్రశ్నలు ఇస్తారు.

- భాషా సబ్జెక్టులకు వచ్చేసరికి అవగాహన-ప్రతిస్పందనకు 24%, వ్యక్తీకరణ-సృజనాత్మకతకు 44%, భాషాంశాలకు 32% వెయిటేజీ ఇస్తారు. ఎనిమిది మార్కుల వ్యాసరూప ప్రశ్నలు 7, నాలుగు మార్కుల లఘుప్రశ్నలు 3, రెండు మార్కుల అతిలఘు ప్రశ్నలు 9, ఒక్క మార్కు లక్ష్యాత్మక ప్రశ్నలు 14 ఇస్తారు.
- 6-9 తరగతులకు సంబంధించి ప్రశ్నపత్రాల డిజైన్‌లో మార్పులు చేశారు. 80 మార్కులకు రాత పరీక్ష, 20 అంతర్గత మార్కులు ఉంటాయి.

మానవ అక్రమ రవాణాపై '112'కు తెలియజేయండి

- డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నట్టు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా తెలిపారు. మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని 112 నంబర్‌కు ఫోన్ చేయడం, శక్తి యాప్‌లో 'ఇల్లీగల్ యాక్టివిటీస్ బటన్' ప్రెస్ చేయడం, శక్తి వాట్సప్ నంబర్ 79934 85111ల ద్వారా తెలియజేయాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాల్ని గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తన కార్యాలయంలో 'మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరం-దోపిడీని అంతం చేయండి' అన్న నినాదంతో రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. బాధితుల హక్కుల పరిరక్షణకు ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్‌లో ఓ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీజీపీ ఎన్ మధుసూదన్‌రెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్‌ఛార్జి రాజకుమారి, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ శ్రీదేవిరావు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, ఉన్నతాధికారులు మధుసూదన్‌రెడ్డి, రాజకుమారి తదితరులు

మహిళా ప్రయాణికురాలి బ్యాగులో రూ.40 కోట్ల విలువైన గంజాయి

బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు రవాణా



శంషాబాద్, న్యూస్‌టుడే: విదేశీ యాత్రల మాటున గంజాయి వ్యాపారం చేస్తున్న ఓ మహిళను నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం అరెస్టు చేశారు. ఆమె సామగ్రిలో రూ.40 కోట్ల విలువైన 40 కిలోల నిషేధిత హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మహిళ కొంతకాలంగా బ్యాంకాక్ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు గుర్తించారు. భద్రతాధికారులకు అనుమానం రాకుండా బ్యాంకాక్ నుంచి నేరుగా కాకుండా దుబాయ్ మీదుగా దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో దిగుతూ ఆమె గంజాయి తెస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు కూడా ఆమె బ్యాంకాక్ నుంచి వయా దుబాయ్ విమానం ఎక్కి శంషాబాద్‌లో దిగింది. పక్కా సమాచారం అందుకున్న అధికారులు ఆమెను అదుపులోకి తీసుకొని సామగ్రిని తనిఖీ చేయగా గుట్టురట్టయింది.

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం నుంచి 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం రాత్రి 7 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 2,82,124 క్యూసెక్కుల వరద జలాశయానికి వస్తోంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8,144, ఎడమ కాలువ ద్వారా 7,272, ప్రధాన విద్యుత్తు కేంద్రం ద్వారా 28,826, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాలువ ద్వారా 300, డ్యాం 26 గేట్లలో 16 గేట్లను 5 అడుగులు, 10 గేట్లను 10 అడుగులు ఎత్తి 2,65,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 586 అడుగుల మేర ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 300.3200 టీఎంసీల వద్ద ఉంది.



26 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

మహిళలపై వైకాపా నేతల దుర్భాషలు లైంగికదాడులతో సమానం

- కించపరిచేలా మాట్లాడుతున్నవారిపై చర్యలకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- లోక్‌సభలో తెదేపా ఎంపీ బైరెడ్డి శబరి డిమాండ్



లోక్‌సభలో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

ఈనాడు, దిల్లీ: తెలుగుదేశం మహిళా నాయకురాళ్ల గౌరవ మర్యాదలను కించపరిచేలా ఇటీవలి కాలంలో వైకాపా నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు కేవలం దుర్భాషలుగా కాకుండా వాటిని లైంగిక దాడితో సమానంగా చూడాలని డిమాండ్ చేశారు. మహిళలు రాజకీయాల్లోకి వచ్చింది దేశ నిర్మాణం కోసం తప్పితే దురహంకార పురుషులతో అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయించుకోవడానికి కాదని పేర్కొన్నారు. ఇలాంటి వారి వ్యాఖ్యల వల్ల మహిళలు ప్రజాజీవితాన్ని శిక్షగా భావించే పరిస్థితి రాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాసేవలో ఉండే మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఆమె బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. 'తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళా నాయకురాళ్ల గౌరవ, మర్యాదలను కించపరిచేలా వైకాపా వారు అభ్యంతరకర భాష వాడుతున్నారు. భౌతికబలం మహిళలకు తక్కువగా ఉండొచ్చు కానీ నైతిక స్థైర్యం విషయంలో పురుషులకంటే ఎంతో బలంగా ఉంటారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుల నేతృత్వంలో ప్రస్తుతం 33% మహిళా రిజర్వేషన్ల అమలు, మహిళా కేంద్రీకృత అభివృద్ధి గురించి మాట్లాడుకుంటున్న తరుణంలో మహిళలపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం. ఇప్పుడు వైకాపా నాయకులు మాట్లాడిన మాటలు కేవలం దుర్భాషలేకాదు.. అది లైంగికదాడితో సమానం. నేనిక్కడ కేవలం మహిళా ప్రతినిధిగా కాకుండా ఒక కూతురుగా, సోదరిగా, భార్యగా మాట్లాడుతున్నా. ఇలాంటి దుర్భాషల విషయంలో ఇక ఎంతమాత్రం చూస్తూ ఊరుకోరాదు. ప్రజాసేవలో ఉన్న మహిళల గౌరవ మర్యాదలు కాపాడేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఇకపై ఇలాంటి దూషణలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని.. దీన్ని సాధారణంగా తీసుకొనే పరిస్థితి ఉండదని.. బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం జరగదన్న సందేశాన్ని పంపాలి' అని ఆమె కోరారు.

ఏపీ ఎలక్ట్రానిక్ క్లస్టర్లలో రూ.6,421 కోట్ల పెట్టుబడికి 62 కంపెనీల సుముఖత: లోక్‌సభలో కేంద్ర మంత్రి జితిన్‌ప్రసాద వెల్లడి

ఏపీలోని నాలుగు ఎలక్ట్రానిక్ క్లస్టర్లలో రూ.6,421 కోట్ల పెట్టుబడికి 62 సంస్థలు సుముఖత వ్యక్తం చేశాయని, దీనివల్ల అదనంగా 59,694 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంటుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్‌ప్రసాద తెలిపారు. వీటిలో చిత్తూరు జిల్లా సత్యవేడు మండలంలోని చెరివి, ఏర్పేడు మండలంలోని విక్రుతమాల, రేణిగుంట, వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి వైకాపా ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు.

విశాఖ ఉక్కుకు బొగ్గు కొరత లేదు

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు కొరత లేదని, ఆ సంస్థ అవసరాలకు సరిపడా సరఫరా చేస్తున్నామని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభలో అరకు వైకాపా ఎంపీ గుమ్మ తనూజారాణి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు.

2,817 ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, రెయిన్ గేజ్‌లు

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 1,618 ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు, 1,199 రెయిన్ గేజ్‌లు ఉన్నట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాలశాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. విజయనగరం తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. విశాఖ, మచిలీపట్నంలలో డాప్లర్ వెదర్ రాడార్లు, శ్రీహరికోట ఇస్రోలో మరో రాడార్ ఉన్నట్లు వెల్లడించారు.

ఏపీ ఫైబర్‌నెట్‌కు రూ.1,289 కోట్లు

భారత్‌నెట్-2 పథకం కింద ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ సంస్థకు ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.1,289.19 కోట్ల నిధులు ఇచ్చినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 2021-22లో రూ.100 కోట్లు, 2022-23లో రూ.597.88 కోట్లు, 2023-24లో రూ.265.54 కోట్లు, 2024-25లో రూ.98.65 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. కర్నూలు తెదేపా ఎంపీ బస్తిపాటి నాగరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

- పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఏపీలో 294 స్థలాలున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వాటిలో 200 స్థలాల్లో నిర్మాణాలున్నాయని, 94 ఖాళీగా ఉన్నాయని వివరించారు.
- మోసపూరిత డాక్యుమెంట్ల ద్వారా తీసుకున్న 82 లక్షల టెలిఫోన్ కనెక్షన్లు రద్దు చేసినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తెదేపా సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జీఎం హరీష్ బాలయోగిలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు.

వేలానికి 68 ఎఫ్‌ఎం ఛానళ్లు

రాష్ట్రంలోని 23 పట్టణాలు/నగరాల్లో వేలానికి 68 ప్రైవేటు ఎఫ్‌ఎం ఛానళ్లు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖల సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. అనకాపల్లి భాజపా సభ్యుడు సీఎం రమేష్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయాలి: ఎంపీ లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్‌లో చేనేతపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 3.5 లక్షల మంది చేనేత కార్మికులను ఆదుకొనేందుకు వీలుగా చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా చేనేత రంగం నిలబడటం కష్టం. అందువల్ల చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించాలి. నకిలీ పవర్‌లూమ్ ఉత్పత్తులపై చర్యలు తీసుకోవాలి. ఆధునిక యంత్రాలపై సబ్సిడీ ఇవ్వాలి' అని ఎంపీ కోరారు.

ఏపీలో రూ.44వేల కోట్లతో 1,980 కి.మీ. రహదారుల నిర్మాణం: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రూ.44,536 కోట్లతో 1,980 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతున్నట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బుధవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.12,152 కోట్ల విలువైన వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇది కాకుండా పంపిన మరో రెండు ప్రతిపాదనల్లో ఎన్‌హెచ్-216పైన గూడవల్లి డ్రెయిన్‌పై రూ.18.09 కోట్లతో వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఎన్‌హెచ్-716 సెక్షన్‌లో ముద్దనూరు-కడపల మధ్య 4 వరుసల రహదారి నిర్మాణం కోసం పంపిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 1,980 కిలోమీటర్ల 96 రహదారుల నిర్మాణాలు 2027 ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు.

ఏపీలో 2020 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లోని 2,037 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో 2,020 సంఘాల కంప్యూటరీకరణ పూర్తయినట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ కంప్యూటరీకరణ కోసం రాష్ట్రానికి గత నాలుగేళ్లలో రూ.33.21 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

(c) eenadu

అవసరం లేదన్నారు.. అంచనాలు పెంచి ఇచ్చేశారు!

- జగన్ సర్కార్‌లో 'మహేంద్ర' జాలం
- ఇందూ ప్రాజెక్ట్స్‌కు ఒప్పందం రద్దుచేసి సాయం
- ఆపై అంచనాలు పెంచి మరొకరికి పట్టం
- కట్ట నిర్మాణంలో నాణ్యత లోపాలు
- పని చేసినట్లు రికార్డుల్లో నమోదు
- తుది బిల్లుల చెల్లింపులకూ ఒత్తిళ్లు

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వ జమానాలో అవసరమైన వారికి సాయం చేసేందుకు ముందూవెనకా చూడకుండానే ఉత్తర్వులు ఇచ్చేసేవారు. అవసరం లేదంటూ ఉత్తర్వులు ఇచ్చేదీ వారే.. అబ్బే కాదు కాదు అవసరమే అంటూ మళ్లీ అంచనాలు పెంచేసి ఆదేశాలు జారీచేసేదీ వారే! మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఇందుకు అచ్చమైన ఉదాహరణ. 2020 జులైలో ఈ ప్రాజెక్ట్ మరో ఐదేళ్ల వరకూ అక్కర్లేదని తన అనుయాయ గుత్తేదారు ఇందూ ప్రాజెక్ట్స్ ఒప్పందాన్ని జగన్ సర్కార్ రద్దుచేసింది. చిత్రంగా మళ్లీ 2022 సెప్టెంబరులో ఈ ప్రాజెక్ట్ ఎంతో అవసరమంటూ ఉత్తర్వులిచ్చి, అంచనాలను రూ.852 కోట్లకు పెంచేసి టెండరు పిలిచింది. ఇందూ ప్రాజెక్ట్ రిజర్వాయర్ కట్ట నిర్మాణంలో చేయాల్సిన పనులు పూర్తిస్థాయిలో చేయకపోయినా చేసినట్లు రికార్డుల్లో నమోదుచేసి బిల్లుల చెల్లింపులకూ ఏర్పాట్లు చేసేశారు. అనక నాణ్యత నియంత్రణ విభాగం తనిఖీల్లో ఈ పనులు సరిగా జరగలేదని తేల్చిచెప్పారు. ఇప్పుడు ఆ గుత్తేదారుకు తుది బిల్లులు చెల్లించాలని ఒత్తిళ్లు వస్తున్నాయి.

★ మహేంద్రతనయ నదిపై శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం చాప్రా వద్ద 2.108 టీఎంసీల నిల్వతో ప్రాజెక్ట్ నిర్మాణ ప్రతిపాదన. వరద కాలువ, ఆపై రిజర్వాయర్ నుంచి కాలువల తవ్వకం. 24,600 ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలన్నది ఉద్దేశం.

★ 2007లో రూ.127 కోట్లకు పాలనామోదం. టెండరు పిలిచి ఎస్ఈడబ్ల్యూ- ఇందూ కాంట్రాక్టు సంస్థలకు సంయుక్తంగా అప్పగింత. 2018లో రూ.471.85 కోట్లకు అంచనాల సవరణ. జగన్ ప్రభుత్వంలో ఇందూ ప్రాజెక్ట్స్ సంస్థ తమ ఒప్పందాన్ని ముందస్తుగానే ముగించాలని, ఎలాంటి జరిమానా విధించవద్దని ప్రభుత్వానికి విన్నవించింది. భూసేకరణ వంటి సమస్యలున్నాయని పేర్కొంది. 2020 జులైలో ఈ ఒప్పందాన్ని ముందుగా రద్దుచేసి బ్యాంకు గ్యారంటీలూ వగైరా తిరిగిచ్చేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఆ సమయంలో ఐదేళ్ల వరకు ఈ ప్రాజెక్ట్ చేపట్టనక్కర్లేదని తేల్చిచెప్పారు.

★ చిత్రం ఏమిటంటే 2022 సెప్టెంబరులో మళ్లీ ఈ ప్రాజెక్ట్ అంచనా విలువను రూ.852.44 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. మళ్లీ టెండరు పిలిచి వేరే గుత్తేదారుకు పనులు అప్పగించారు.

కట్ట నిర్మాణంలోనూ లోపాలు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ 2.4 కి.మీ. మేర కట్ట నిర్మించారు. ఇన్‌స్ట్రుమెంట్ పిల్లర్లు వేయకుండానే పని పూర్తిచేశారు. అప్పట్లో అధికారులు, ఇందూ ప్రాజెక్ట్స్ సంస్థ ఆ పని చేసినట్లు నమోదు చేసేశారు. ఈ విషయం ఆ తర్వాత నాణ్యత నియంత్రణ విభాగం తనిఖీల్లో బయటపడింది. ఆ గుత్తేదారు సంస్థ నుంచి దాదాపు రూ.కోటి వరకు రికవరీ చేయాలి. ఆ పనులపై నాణ్యత నియంత్రణ విభాగం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదు. తుది బిల్లుల చెల్లింపులు పెండింగులో ఉన్నాయి. జగన్‌కు సన్నిహితులైన ఈ గుత్తేదారుడికి తుది బిల్లులు చెల్లించేందుకు ఉత్తరాంధ్రకు చెందిన ఒక తెదేపా కీలక నాయకుడు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

'నైసార్' విజయంపై గవర్నర్, సీఎం హర్షం

ఈనాడు, అమరావతి: నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడాన్ని భారత అంతరిక్ష చరిత్రలో ఒక మైలు రాయి అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభివర్ణించారు. నాసాతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రయోగం విజయంతో ఇస్రో కీర్తి మరింతగా పెరిగిందన్నారు. నైసార్ ఉపగ్రహం ప్రయోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. శాస్త్రవేత్తలకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. షార్ నుంచి చేసిన ఈ ప్రయోగం తెలుగువారికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇస్రోకు మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు.

ఇస్రో బృందానికి అభినందనలు: మాజీ సీఎం జగన్

'జీఎస్ఎల్‌వీ-ఎఫ్16 విజయవంతంగా ప్రయోగించి, నైసార్‌ను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టినందుకు ఇస్రోకు అభినందనలు. ఈ అద్భుత విజయంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలందరికీ శుభాకాంక్షలు' అని మాజీ సీఎం జగన్ తెలిపారు.

డీఎంఈకి నర్సింగ్ స్కూళ్ల ఎన్‌వోసీ అధికారం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) పాఠశాలల ఏర్పాటుకు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేసే అధికారాన్ని ప్రభుత్వం వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ)కి అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ జనరల్ నర్సు ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్ నిబంధనలను సవరించి.. ఇప్పటివరకు ప్రభుత్వానికి మాత్రమే ఉన్న అధికారాన్ని డీఎంఈకి బదిలీ చేసింది. నర్సింగ్ స్కూళ్లు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్లినికల్ అటాచ్‌మెంట్ పొందాలంటే ఇకపై డీఎంఈ అనుమతి తప్పనిసరి. ఈ మేరకు వైద్య ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

విశాఖ కేంద్రంగానే సరోగసీ ముసుగులో శిశు విక్రయాలు

కీలకంగా వ్యవహరించిన సృష్టి మేనేజర్ కల్యాణి

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసం ఘటనలో విశాఖపట్నం కేంద్రంగానే సరోగసీ ముసుగులో దంపతులకు శిశువులను అప్పగించినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఈ ఉదంతంపై కేసు నమోదు చేసిన సికింద్రాబాద్ గోపాలపురం పోలీసులు... ఈ వ్యవహారంలో ఏ3 నిందితురాలు కల్యాణి(40) కీలకంగా వ్యవహరించినట్టు తేల్చారు. అరెస్టయిన 8 మంది నిందితుల్లో వైద్యురాలు నమ్రతకు ఆమె నమ్మిన బంటుగా వ్యవహరించినట్టు రిమాండ్ రిపోర్టుల్లో పోలీసులు పేర్కొన్నారు. కల్యాణి సొంతూరు ఏపీలోని ఉమ్మడి విజయనగరం జిల్లా బలిఘట్టం. ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసింది. విశాఖలోని ఒక ఆసుపత్రిలో కొన్నాళ్లు పనిచేశాక.. అక్కడే సృష్టి ఆసుపత్రిలో ఏఎన్ఎంగా చేరింది. ఆమె పనితీరు నమ్రతకు నచ్చడంతో ఆమెను విశాఖపట్నంలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు మేనేజర్‌గా నియమించింది. విజయవాడ, రాజమహేంద్రవరం, భువనేశ్వర్, కోల్‌కతాలోని బ్రాంచీల అజమాయిషీ అప్పగించింది. వచ్చే ఆదాయంలో లాభం ఇస్తాననీ చెప్పింది. విశాఖలో ఉన్న తన ఫ్లాట్‌ను ఉపయోగించుకునే అవకాశమూ ఇచ్చింది. సరోగసీ కోసం వివిధ ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చిన దంపతులకు 100 శాతం సక్సెస్ రేట్ ఉంటుందని కల్యాణి నమ్మించేది. ఏజెంట్ల ద్వారా తీసుకొచ్చిన పిల్లలను.. సరోగసీ ద్వారా పుట్టారని చెప్పి అందజేయడంలో కీలకంగా వ్యవహరించేది. సరోగసీ పేరిట దంపతులతో నకిలీ ఒప్పంద పత్రాలు రూపొందించినట్టు దర్యాప్తులో తేలడంతో ఈ నెల 26న కల్యాణిని విశాఖలో పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పీ4 మెమోలపై వాస్తవాలు వివరించాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: పీ4 పేరుతో టీచర్లు, సచివాలయ ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఇచ్చిన మెమోలపై వాస్తవాలు వివరించాలని కోరుతూ స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ ఛైర్మన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. 'రాష్ట్రంలో పీ4 పేరుతో పేదరికాన్ని నిర్మూలిస్తామని, సంపన్నులు మార్గదర్శకులుగా ఉండి 20 లక్షల బంగారు కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టింది. కార్పొరేట్లు, సంపన్నుల నుంచి తగినంత స్పందన రాకపోవడంతో ఆ భారాన్ని ఉద్యోగులపై మోపేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. దీనికి సంబంధించి జులై 25న ఏలూరు డీఈవో, విజయనగరం జిల్లా సాలూరు పురపాలక సంఘం కమిషనర్ మెమోలు సైతం జారీ చేశారు. కానీ, మీరు మాత్రం ఏ జిల్లా అధికారి కూడా మెమోలు ఇవ్వలేదని, పీ4 పథకం స్వచ్ఛందమని చెబుతున్నారు. ఆ మెమోలు తప్పుడువైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోండి' అని పేర్కొన్నారు.

ఇక ఏపీపీఎస్సీ ఉద్యోగాల్లో చాలావాటికి ఒక్క పరీక్షే!

200 రెట్లు దాటి దరఖాస్తులు వస్తేనే ప్రిలిమ్స్, మెయిన్స్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల విధానంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఇకపై ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 200 రెట్లు దాటి దరఖాస్తులు వస్తేనే ప్రిలిమ్స్ నిర్వహిస్తారు. ఉదాహరణకు 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు దరఖాస్తులు 20,000 (200 రెట్లు) దాటితేనే ప్రిలిమ్స్, మెయిన్స్ ఎగ్జామ్ పెడతారు. ప్రస్తుతం ఉద్యోగాల సంఖ్యతో నిమిత్తం లేకుండా 25 వేలు దాటి దరఖాస్తులు వచ్చినప్పుడు ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల విలువైన సమయం వృథా అవుతోంది. ఖర్చు కూడా ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో ఖాళీల సంఖ్య కంటే దరఖాస్తు చేసిన అభ్యర్థుల సంఖ్య 200 రెట్లు మించినప్పుడే ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అనుమతినివ్వాలని ఏపీపీఎస్సీ ప్రభుత్వాన్ని కోరింది. దీనిని ప్రభుత్వం ఆమోదించడం ద్వారా ఏపీపీఎస్సీ భర్తీ చేసే ఉద్యోగాల్లో చాలా వాటికి ఒక్క పరీక్ష మాత్రమే ఉండే అవకాశం ఉంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ పూర్వ ఉత్తర్వులను బుధవారం సవరించింది.



మదుపును ఇలా ప్రారంభించండి

✦ చిన్న మొత్తంతో మదుపును మొదలుపెట్టండి. ✦ మదుపును ఓ అలవాటుగా మార్చుకోండి. ✦ ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని పెట్టుబడికి కేటాయించండి. ✦ వేతనంలోనుంచి ఆ మొత్తం నేరుగా మదుపు ఖాతాలోకి వెళ్లేలా ఏర్పాటు చేసుకోండి. ✦ మీ సంపాదన పెరిగేకొద్దీ మదుపు మొత్తాన్నీ పెంచండి.

– జాన్ హెన్రీ, ఇన్వెస్ట్‌మెంట్ కోచ్

ఈ ఏడాది 6 వేలకు పైగా తరగతి గదుల నిర్మాణం

- 10 వేల బడుల్లో 10 రకాల మౌలిక సదుపాయాల కల్పన
- విద్యార్థుల అవసరాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం
- పనుల పూర్తికి రూ.960 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో 'మన బడి-మన భవిష్యత్తు' కింద పనులు చేపట్టేందుకు పాఠశాల విద్య మౌలికసదుపాయాల కల్పన విభాగం చర్యలు చేపట్టింది. 2025-26 సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల ఆధారంగా అవసరమైన చోట్ల మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టనుంది. ఇందుకోసం జాబితాను రూపొందించింది. పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా మౌలికసదుపాయాల అవసరాలు మారాయి. గత ప్రభుత్వంలో 3,4,5 తరగతులను 3,692 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మార్చారు. అందుకోసం అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. అయితే, వైకాపా ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు 3,4,5 తరగతులను చాలా చోట్ల మళ్లీ వెనక్కి తీసుకొచ్చారు. దాంతో ఆయా తరగతి గదుల అవసరాలు మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా 294 హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్మీడియట్ కోసం ఒక్కోచోట మూడు తరగతి గదుల చొప్పున ప్రతిపాదించారు. వీటిల్లో ప్రవేశాలు తక్కువగా ఉండటంతో ప్రతిపాదించిన గదులన్నీ అవసరమయ్యే పరిస్థితి లేదు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని బడులకు తరగతి గదులు అవసరం? ఫర్నీచర్, మరుగుదొడ్లు వంటి వసతులు ఎన్నిచోట్ల కావాలనే వివరాలను పాఠశాల విద్య మౌలికసదుపాయాల కల్పన విభాగం సేకరించింది.

అవసరమైతే కొత్తవీ చేపడతారు..

ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 6 వేలకు పైగా తరగతి గదులు నిర్మించనున్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేయడంతో పాటు ఇంకా అవసరమైతే కొత్తగా నిర్మాణాలు చేపడతారు. మొత్తంగా రాష్ట్రంలో 2,745 బడుల్లో 6,756 అదనపు తరగతి గదులు అవసరం కానున్నట్లు అంచనా వేశారు. దీనికి సుమారు రూ.600 కోట్ల వరకు వ్యయం కానున్నట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే మరో 10 వేల పాఠశాలల్లో మరుగుదొడ్లు, రక్షిత మంచినీరు, ఫ్యాన్లు, బెంచీలు వంటి 10 రకాల మౌలికసదుపాయాలు కల్పించనున్నారు. ఇందుకు రూ.360 కోట్ల వ్యయం కానున్నట్లు అంచనా వేశారు. ఎక్కువగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, కొన్ని ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల అవసరం ఉంది.

ఎంఈఓ-1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ప్రకారమే భర్తీ చేయాలి: ఫ్యాప్టో

ఈనాడు, అమరావతి: మండల విద్యాధికారి (ఎంఈఓ)-1 పోస్టులను ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యాల ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, చిరంజీవి డిమాండ్ చేశారు. జోన్-2 పరిధిలో ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లతో ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి వివరాలు సేకరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉమ్మడి సర్వీసు నియమాలకు సంబంధించిన జీఓలు అమలు చేయకుండా ప్రభుత్వ అధికారులు పక్షపాత వైఖరితో వ్యవహరించడం సరి కాదని విమర్శించారు.

సాగునీటిని బంధువుల కంపెనీలకు మళ్లించారు

జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజం



ఈనాడు, అమరావతి: పులివెందుల నియోజకవర్గంలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్ నుంచి ఒక్క రైతు పొలానికి కూడా నీరివ్వకుండా తన సొంత ప్రయోజనాల కోసం వాటిని మాజీ సీఎం జగన్ మళ్లించారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అక్కడి నుంచి భారతి సిమెంట్స్‌కు, తన మేనమామ చీనీ తోటలకు నీరిచ్చారని దుయ్యబట్టారు. ఫసల్ బీమా యోజనకు మూడేళ్లు రాష్ట్రం వాటా ఇవ్వకుండా అప్పటి వైకాపా ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని లోక్‌సభ సాక్షిగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఎండగట్టారని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద రూ.3,138 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడానికి జగనే కారణమని మండిపడ్డారు.

పారిశ్రామికవేత్తలకు సమాచారం అందుబాటులోకి తేవాలి

- ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను రూపొందించాలి
- ఎంఎస్ఎంఈ పథకాలపై మంత్రి కొండపల్లి సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రాథమిక సమాచారాన్ని సులువుగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను రూపొందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పథకాల అమలుపై మంగళగిరిలోని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలి. రంగాలవారీగా అవసరాలను గుర్తించి నైపుణ్యాలను అందించాలి. సాధారణ విధానాలతో ఫలితాలు రావు. ఎంఎస్ఎంఈ-సీడీపీ పథకం కింద ప్రతిపాదించిన కామన్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. వాటి ఏర్పాటులో ఉండే ఇబ్బందులను వెంటనే అధిగమించాలి. ర్యాంప్ పథకం అమలును కలెక్టర్లు నేరుగా పర్యవేక్షించాలి' అని పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మతో పాటు పీఎం ఉపాధి కల్పన కార్యక్రమాల (పీఎంఈజీపీ) అమలును మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, సీఈఓ విశ్వ మనోహర్ పాల్గొన్నారు.

ఓబుళాపురం గనుల సర్వేపై విచారణ 2 వారాలకు వాయిదా

ఈనాడు, దిల్లీ: అనంతపురం జిల్లాలోని వివాదాస్పద ఓబుళాపురం గనుల లీజులు, రక్షిత అటవీప్రాంతంపై సర్వే చేపట్టి సరిహద్దులను నిర్ధారించడానికి మరో రెండు వారాల సమయం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడంతో సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఓబుళాపురం గనుల సరిహద్దులు, రక్షిత అటవీప్రాంత సరిహద్దులను ఎలా ఖరారు చేయాలి, అందుకు సంబంధించిన బృందంలో సభ్యులుగా ఎవరెవరు ఉండాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనే నిర్ణయం తుదిదశకు వచ్చిందని, అందువల్ల రెండు వారాల సమయం ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్‌న్యాయవాది సిద్ధార్థలూథ్రా విజ్ఞప్తి చేశారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 12వ తేదీకి వాయిదావేసింది.

మీ వల్ల జైలుకు వెళ్లిన వారిని పరామర్శించరేం?

- నెల్లూరుకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు?
- జగన్‌పై ధ్వజమెత్తిన మాజీ మంత్రి సోమిరెడ్డి



ఈనాడు, నెల్లూరు: 'రాష్ట్రంలో రూ.3,700 కోట్ల మద్యం కుంభకోణంలో 12 మంది జైలుకు వెళ్లడానికి మాజీ సీఎం జగన్ అత్యాశే కారణం. జైల్లో ఉన్న వారిని, వారి కుటుంబాల్ని జగన్ ఎందుకు పరామర్శించడం లేదు? వారి వద్దకు వెళ్తే నిలదీస్తారని భయమా?' అని తెదేపా నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మద్యం కుంభకోణంతోపాటు గనులు, ఇసుక, భూముల్లో దోచిన సొమ్మును ఏ ప్యాలెస్‌లో పెట్టారు? తాడేపల్లిలోనా... పులివెందులలోనా.. ఇడుపులపాయలోనా? ఆ పాపపు డబ్బును ఏం చేసుకుంటారు?' అని ప్రశ్నించారు. 'ఘోరాలు, నేరాలు చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, మహిళా ఎమ్మెల్యే గురించి నీచంగా మాట్లాడిన ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించడానికి.. ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు జగన్‌రెడ్డీ?' అని నిలదీశారు. నెల్లూరులో బుధవారం చంద్రమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణంలో వైకాపా నేతల పాత్ర ఆధారాలు సహా బయటపడింది. దోచిన డబ్బంతా కావలి లాంటి నియోజకవర్గాలకు ఎలా తరలించారో తెలిసింది. తాజాగా హైదరాబాద్‌లో అట్టపెట్టెల్లో రూ.11 కోట్లు బయటపడ్డాయి. రూ.3,700 కోట్లు తరలించడానికి 4 వేల అట్టపెట్టెలు, 20 లారీలు అవసరం' అని ఆయన అన్నారు.

జన్నారం అడ్డాగా.. సైబర్ మోసాల దందా

- ప్రాథమిక దశలోనే గుట్టురట్టు చేసిన పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్టు, పరారీలో ఒకరు



సైబర్ మోసాలకు వినియోగిస్తున్న పరికరాలు

మంచిర్యాల నేర విభాగం, న్యూస్‌టుడే: తెలంగాణలోని మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంగా సాగుతున్న సైబర్ నేరాల దందా గుట్టును ప్రాథమిక దశలోనే రట్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. జన్నారంలోని వొడాఫోన్ ఐడియా సెల్‌టవర్ పరిధిలో కొద్ది రోజులుగా అనుమానాస్పద సిమ్‌కార్డుల నుంచి వేల ఫోన్‌కాల్స్ వెళ్తున్నాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్ విభాగం గుర్తించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) అధికారులకు సమాచారం అందించింది. దీంతో టీజీసీఎస్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, రామగుండం కమిషనరేట్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు.

అద్దె ఇల్లు తీసుకోవాలని..

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బావు బాపయ్యకు 2024లో కంబోడియాలో రెస్టారెంట్‌లో పనిచేస్తున్న సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వేదాంతపురానికి చెందిన పాలవలసల సాయికృష్ణ అలియాస్ జాక్‌తో పరిచయం ఏర్పడింది. బాపయ్య స్వదేశానికి తిరిగి రాగా... కొద్దిరోజుల క్రితం జాక్ వాట్సప్‌లో సంప్రదించి జన్నారంలో ఓ అద్దె ఇల్లు తీసుకోవాలని అక్కడికి కొన్ని పరికరాలు పంపించానని వాటిని ఆ ఇంట్లో అమర్చాలని సూచించాడు. బాపయ్య తన సోదరుడు మధుకర్, బావ రాజేశ్‌లతో కలిసి అద్దె ఇల్లు తీసుకుని పరికరాలను అమర్చారు. సైబర్ మోసాలు చేయాలని ముగ్గురికి నెలకు ఒక్కొక్కరికి రూ.30 వేలతో పాటు వచ్చిన మొత్తంలో వాటా ఇస్తానని జాక్ వారికి చెప్పాడు. వీరికి ఏపీలోని మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన యాంగ్రపు కామేశ్ జత కలిశాడు. నలుగురు కలిసి సైబర్ నేరాలు ప్రారంభించారు. వీరంతా 256 సిమ్ కార్డులను వినియోగిస్తూ రోజుకు సుమారు 40 వేల మందికి రికార్డెడ్ కాల్స్ చేసి ఉంటారని అనుమానిస్తున్నట్లు డీసీపీ వివరించారు. నలుగురిని అరెస్టు చేశామని.. ప్రస్తుతం జాక్ పరారీలో ఉన్నాడని, లోతైన విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

అక్రమ కేసులు బనాయించి 13 ఎకరాలు కాజేయాలని చూస్తున్నారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: స్థానిక వైకాపా నాయకులు తన కుటుంబంపై అక్రమ కేసులు బనాయించి 13 ఎకరాల భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని గుంటూరు జిల్లా వడ్లమూడికి చెందిన పి.లక్ష్మి వాపోయారు. ఇదేంటని ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్‌కుమార్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా భీమావారిపాలానికి చెందిన సుభాషిణి ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నేడు సుప్రీంకోర్టు తీర్పు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారాస, దాని కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్‌లు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించనుంది. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్దిష్ట గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ పిటిషనర్లు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే స్పీకర్‌కు గడువు విధించే అధికారం కోర్టుకు లేదంటూ శాసనసభాపతి తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ రెండు అంశాలపై స్పష్టతనిస్తూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించే అవకాశముంది.

రూ.378 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: బెంగళూరు నగరంలోని బెళ్లందూరులో క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ సంస్థ వ్యాలెట్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.378 కోట్లు లూటీ చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆ సంస్థ ఉపాధ్యక్షుడు హదీప్ సింగ్ స్థానిక వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కంపెనీ ఉద్యోగికి చెందిన ల్యాప్‌టాప్ ద్వారా వ్యాలెట్‌ను హ్యాక్ చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఉద్యోగే సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి, లూటీ చేసి ఉంటారని సంయుక్త పోలీసు కమిషనర్ రమేష్ బానూత్ అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అటవీ భూమి ఆక్రమణపై హైకోర్టులో పిల్

సుచి అల్లాయ్స్, సింగపూర్ టౌన్‌షిప్ తదితరులకు నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా మామిళ్లపల్లి అటవీ భూమిని ఆక్రమించి 'సుచి అల్లాయ్స్, కండక్టర్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్' మరికొన్ని సంస్థలు నిర్మాణాలు చేశాయని పేర్కొంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. సుచి అల్లాయ్స్‌తో పాటు సింగపూర్ టౌన్‌షిప్, వివిధ ప్రభుత్వ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 10కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. మామిళ్లపల్లి బీట్ అటవీ భూములను ఆక్రమించి వివిధ కంపెనీలు, సంస్థలు నిర్మాణాలు చేపట్టడాన్ని సవాలు చేస్తూ మాజీ ప్రత్యేక పీపీ, న్యాయవాది తమ్మినేని జయరాం పిల్ వేశారు.

ఒక్క గజం భూమినీ సంరక్షించాలన్న ఉద్దేశం లేదు!

- భూదాన్ బోర్డు తీరుపై తెలంగాణ హైకోర్టు వ్యాఖ్య
- రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూముల వివరాలివ్వాలని ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని భూదాన్ భూములకు సంబంధించి ఒక్క గజాన్నీ సంరక్షించాలన్న ఉద్దేశం భూదాన్ బోర్డుకు కనిపించడంలేదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. భూదాన్ భూముల వివాదం ఉన్న నాగారం, శంషాబాద్‌లకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూదాన్ భూముల వివరాలు సమర్పించాలని బోర్డుకు ఆదేశాలు జారీచేసింది. దాతలు ఇచ్చినవి.. పంపిణీ చేయగా మిగిలిన భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను సమర్పించాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నం.181, 182, 194, 195ల్లోని భూదాన్ భూముల్లో అవకతవకలు జరిగాయని.. వీటిపై సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని.. విచారణ కమిషన్ వేయాలంటూ ఇచ్చిన వినతిపత్రంపై నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్‌ల తరఫు న్యాయవాదులు.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టంలోని సెక్షన్3కి సంబంధించి సుప్రీంకోర్టు, కేరళ, తెలంగాణ హైకోర్టులిచ్చిన తీర్పులను సమర్పించారు. కమిషన్ వేసే అధికారం ప్రభుత్వానికి ఉందని అయితే వ్యక్తిగత వివాదాలకు సంబంధించిన చిన్న విషయాలపై కాదని పేర్కొన్నారు. భూదాన్ బోర్డు తరఫు న్యాయవాది కిరణ్ వాదనలు వినిపిస్తూ.. నాగారంలోని సర్వే నం. 181, 182ల్లోని 50 ఎకరాల భూమి భూదాన్ బోర్డుకు ఉందన్నారు. మహేశ్వరం మండలంలో ఉన్న భూదాన్ భూముల వివరాలన్నీ సమర్పించినట్లు తెలిపారు. ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారానికి సంబంధించి విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఇది కేవలం ప్రైవేటు వివాదమని.. అయితే రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూములపై విచారణ జరపాలని కోర్టు ఆదేశిస్తే ప్రభుత్వం చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సర్వే నం.194, 195ల్లో భూదాన్ భూములు లేవని ప్రభుత్వం, భూదాన్ బోర్డు తేల్చిచెప్పాయని, అందువల్ల ఈ సర్వే నంబర్లలో లావాదేవీలు నిర్వహించరాదన్న మధ్యంతర ఉత్తర్వులను సవరించాలన్న ఐఏఎస్, ఐపీఎస్ తరఫు న్యాయవాదుల అభ్యర్థనను గురువారం పరిశీలిస్తామంటూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. బుధవారం ఈ కేసు జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చినప్పుడు తమ తరఫున వాదనలు వినిపించాల్సిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరుకాలేక పోతున్నందున విచారణను వాయిదా వేయాలని సంజయ్ తరఫు న్యాయవాది కోరారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ ఈ కేసు విచారణ మొదలైన నాటి నుంచి వారు ఏదో ఒక కారణంతో వాయిదా కోరుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 23న విచారణకు వచ్చినప్పుడు కోర్టు ఆదేశించినట్లుగా ఇదివరకు సంజయ్ హయాంలో జరిగిన ఒప్పందాలు, ఇన్వాయిస్‌లు దాఖలు చేశామని చెప్పారు. తదుపరి విచారణ సమయంలో తమ వాదనలు వినిపిస్తామని కపిల్‌సిబల్ నాడు చెప్పారని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసు విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నామని, ప్రతివాది తరఫున కపిల్ సిబల్ హాజరుకాకపోతే ప్రత్యామ్నాయం చూసుకోవాలని సంజయ్ తరఫు న్యాయవాదులకు సూచించింది.

(c) eenadu